


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 205

గురువారం 16-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

అహ్మదాబాద్‌లో కామన్వెల్త్ గేమ్స్



ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడలకు భారత దేశం రెండోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. 2030లో జరిగే క్రీడలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదిక కావడం దాదాపుగా ఖాయమైంది. నవంబర్ 26న జరిగే బోర్డు సమావేశంలో వేదిక పేరును ప్రకటిస్తారు. 2010లో తొలిసారి న్యూఢిల్లీలో భారత్ కామన్వెల్త్ క్రీడలను నిర్వహించింది. -16లో

సార్‌ను కాదు.. మీ సోదరుడిని



మహిళా శక్తే దేశానికి బలం, రక్షణ కవచం అని ప్రధాని మోదీ చెప్పారు. తనను సార్ అని పిలవొద్దని మహిళా కార్యకర్తకు సూచించారు. వివరాలు 6లో ▸

...ప్రభుత్వం మారదా?



మరణ శిక్ష పడ్డవారికి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా శిక్ష అమలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడం లేదని సుప్రీం ఆక్షేపించింది. వివరాలు 6లో ▸

పాక్-అఫ్గాన్ మధ్య మళ్లీ ఘర్షణ



పాక్, అఫ్గాన్ కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. కాందహార్‌లో పాక్ సైన్యం, తాలిబన్ ఫైటర్ల మధ్య కాల్పులు జరిగాయి. వివరాలు 6లో ▸

ఒడిన్గా అస్తమయం



కెన్యా రాజకీయాలపై తనదైన చెరగని ముద్ర వేసిన దిగ్గజ విపక్ష నేత, మాజీ ప్రధానమంత్రి రైలా ఒడిన్గా తుదిశ్వాస విడిచారు. వివరాలు 6లో ▸



గాన సరస్వతి ఇక లేరు

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తొలి నేపథ్య గాయనిగా చరిత్రలో నిలిచిపోయిన రావు బాలసరస్వతీ దేవి బుధవారం ఉదయం 8 గంటలకు కన్నుమూశారు.

ఆ దివ్య తోటలోనికి ఆమె తరలి వెళ్లింది

అజరామర స్వరం

వివరాలు 15లో ▸

నిన్న మల్లోజుల.. నేడు ఆశన్న

ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట లొంగిపోనున్న కేంద్ర కమిటీ సభ్యుడు వాసుదేవరావు



ఆశన్న (ఫైల్)

- ఆయనతోపాటు జనజీవన స్రవంతిలోకి 60 మంది
- ఉమ్మడి ఏపీలో కీలక ఆపరేషన్లలో ఆశన్న పాత్ర
- బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోనే 78 మంది లొంగుబాటు
- వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ నేత రాజమన్


సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ హైదరాబాద్

మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఆ పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట బుధవారం లొంగిపోగా... అదే బాటలో మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న సైతం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ముందు లొంగిపోనున్నట్లు తెలిసింది. ఆయనతో పాటు దాదాపు 60 మంది వరకు లొంగిపోతారని సమాచారం. వీరంతా ఇప్పటికే జగదల్‌పూర్‌కు చేరుకున్నట్లు చెబుతున్నారు. కీలక మహిళా మావోయిస్టు రణిత కూడా లొంగిపోయే వారిలో ఉన్నట్టు తెలుస్తోంది. తమ ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించి వీరంతా జనజీవన స్రవంతిలో కలవనున్నారు. మరోవైపు బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని వేర్వేరు జిల్లాల్లో మొత్తం 78 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లాలో 27 మంది లొంగిపోగా, ఇందులో పది మంది మహిళా మావోలు ఉన్నారు. కాంకేర్ జిల్లాలో 32 మంది మహిళా మావోయిస్టులతో కలిపి మొత్తంగా 50 మంది అజ్ఞాతం వీడారు. ఇందులో మావోయిస్టు పార్టీలో కీలకమైన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన రాజమన్ మండావి అలియాస్ రాజ్‌మోహన్, రాజు సలామ్ అలియాస్ శివప్రసాద్ కూడా ఉన్నారు. 50 మంది మావోయిస్టుల బృందాన్ని

మిగతా 2వ పేజీలో ▶



తుపాకీ చేతబూని మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో మల్లోజుల కరచాలనం



తుపాకీ స్థానంలో రాజ్యాంగ ప్రతితో మల్లోజుల

ఆయుధాలు వీడి..

మహారాష్ట్ర సీఎం సమక్షంలో లొంగిపోయిన మల్లోజుల

- లొంగిపోయిన వారిలో డీకేఎస్‌జెడ్సీ అగ్రనేతలు సరోజ, మోహన్‌రెడ్డి.. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు స్వయంగా తుపాకులు అప్పగింత
- మావోయిస్టులు సైద్ధాంతిక పోరాటంలో ఓడిపోయారు
- ఉద్యమం అంతానికి మల్లోజుల లొంగుబాటే నాంది అని వ్యాఖ్యానించిన ఫడ్నవీస్
- ఇకపై రాజ్యాంగం పరిధిలో పనిచేస్తామన్న మల్లోజుల
- లొంగిపోయిన మావోయిస్టులకు ఉద్యోగాలిస్తామని వెల్లడించిన లాయిడ్స్ మెటల్స్

2లో

'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిని ప్రశ్నిస్తున్న పోలీసులు



'సాక్షి'పై కుతంత్రం

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకు.. అక్రమ కేసులతో బాబు సర్కారు వేధింపులు

- నకిలీ మద్యం మాఫియా ఆగడాలను బయటపెడుతున్నందుకే కక్ష సాధింపులు..
- హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో రోజంతా పోలీసుల హల్‌చల్
- నోటీసుల పేరుతో ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి వేధింపులు
- 4 రోజుల వ్యవధిలో మూడు రోజులు సాక్షి కార్యాలయాల్లో హల్‌చల్
- పత్రికా స్వేచ్ఛపై ముప్పేట దాడి... రాజ్యాంగ హక్కుల అణచివేత
- ప్రభుత్వ పెద్దలదే కుట్ర... పోలీసు బాస్‌ల పర్యవేక్షణ

7లో

'సాక్షి' గొంతు నొక్కేందుకు మరో ప్రయత్నం

- ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి పోలీసుల నోటీసులు
- ఒక వార్తా కథనానికి సంబంధించి ఆధారాలు ఇవ్వాలని నిర్దేశం..
- తద్వారా 'న్యూస్‌సోర్స్'పై ఉన్నత న్యాయస్థానాల రూలింగ్‌లను తుంగలోతొక్కిన వైనం

7లో

విదేశాలకు తెలంగాణ టీచర్లు

బోధనపై అధ్యయనానికి 160 మంది

వియత్నాం, ఫిన్లాండ్, జపాన్‌లో పర్యటన

త్వరలో దరఖాస్తుల స్వీకరణ

జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ఎంపిక కమిటీలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పాఠశాల విద్యలో ప్రమాణాలు మెరుగుపర్చాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని కోసం తెలంగాణ విద్యా విధానం రూపొందించే యోచనలో ఉంది. దీనికోసం వేర్వేరు దేశాల్లో బోధన, సిలబస్‌లో కాలానుగుణంగా వస్తున్న మార్పులను పరిశీలించడం కీలకమని భావిస్తోంది. ఇందులో భాగంగానే ఆయా దేశాల్లో విద్యాబోధన విధానాలను అధ్యయనం చేయడానికి రాష్ట్రానికి చెందిన ఉపాధ్యాయులను విదేశాలకు పంపనుంది. అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి, ఐదు రోజులపాటు విదేశాలకు పంపాలని నిర్ణయించింది. దీనికి 'ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ అండ్ విజిట్ ఎడ్యుకేషన్ ఎక్స్ఛేంజ్ ఫర్ టీచర్స్' అని పేరు పెట్టింది. వచ్చే వారం దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే వీలుంది.

ఆ మూడు దేశాలకే..

అధ్యయానికి వియత్నాం, ఫిన్లాండ్, జపాన్ దేశాలను విద్యాశాఖ ఎంపిక చేసింది. వియత్నాం విద్యావ్యవస్థకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. వియత్నాంలో విద్యతోపాటు సామాజిక కళలు, శారీరక విద్య, ఇంగ్లిష్‌పై పట్టు ఎక్కువ ఉంటుంది. ఇక్కడ సంప్రదాయ పద్ధతిలో బోధన ఉంటుంది. ఈ మధ్య కాలంలో యాక్టివ్ లెర్నింగ్ విధానాలు అనుసరిస్తున్నారు. ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్‌మెంట్ (పీఐఎస్‌ఏ) పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ దేశం విద్యార్థులు సింగపూర్, జపాన్ దేశాలతో పోటీ పడుతున్నారు. జపాన్‌లో ప్రాథమిక పాఠశాల స్థాయిలో బేసిక్ రీడింగ్, రైటింగ్, గణితంతోపాటు నైతిక విలువలు నేర్పిస్తారు. మధ్య పాఠశాల వ్యవస్థ (జూనియర్ హైస్కూల్)లో టీమ్ వర్క్, టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. ఉన్నత విద్య (సీనియర్ హైస్కూల్) స్థాయిలో వృత్తి విద్యాకోర్సులు ఉంటాయి. ఆధునిక రోబోటిక్ టెక్నాలజీని ప్రాథమిక విద్య నుంచే అందిస్తున్నారు.

ఎవరెవరిని పంపుతారు?

రాష్ట్రవ్యాప్తంగా 160 మంది టీచర్లను విదేశీ విద్య అధ్యయనానికి పంపుతారు. ప్రతీ జిల్లా నుంచి కనీసం ముగ్గురు టీచర్లు (ఒక ఎస్‌జీటీ, ఒక స్కూల్ అసిస్టెంట్, ఒక హెచ్‌ఎం) ఉండేలా చూస్తున్నారు. ఆసక్తి గల టీచర్ల నుంచి త్వరలో దరఖాస్తులు తీసుకోనున్నారు. బోధనలో పదేళ్లకు తక్కువ కాకుండా అనుభవం ఉండాలి. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉండకూడదు. వయసు 55 ఏళ్లలోపు ఉండాలి. ప్రతీ జిల్లాలోనూ కలెక్టర్ అధ్యక్షతన ఎంపిక కమిటీని ఏర్పాటు చేస్తారు. విదేశీ పర్యటనకయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది.

ఏం చేయాలి?

టీచర్లు ఆయా దేశాల్లో ఎంపిక చేసిన పాఠశాలలను సందర్శిస్తారు. అక్కడి విద్యార్థులు, టీచర్లు, విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకుంటారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలు తీరు, బోధనలో డిజిటల్ విధానాల మేళవింపు, విద్యార్థులు అనుసరిస్తున్న టెక్నాలజీ, స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను టీచర్ల బృందాలు పరిశీలిస్తాయి. ఆయా దేశాలతోపాటు, అంతర్జాతీయంగా విద్యార్థులకు ఉండే పరిజ్ఞానాన్ని పరిశీలిస్తారు. కుటుంబ వ్యవస్థ, వారి నుంచి పిల్లలకు అందుతున్న ప్రోత్సాహం, హాజరు శాతం పెరగడానికి అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తారు.

డిసెంబర్‌లో వెళ్తారు..



విదేశాలకు ఉపాధ్యాయులను పంపించే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు టీచర్లను ఎంపిక చేయాలని లేఖలు కూడా రాశాం. ఇతర దేశాల్లో విద్యలో తీసుకొస్తున్న మార్పులను గుర్తించి, వాటిల్లో అత్యుత్తమమైనవి రాష్ట్రంలో అమలు చేయాలన్నది లక్ష్యం. డిసెంబర్‌లో మన ఉపాధ్యాయులు విదేశాలకు వెళ్లే అవకాశం ఉంది.

– డాక్టర్ నవీన్ నికోలస్ (పాఠశాల విద్య డైరెక్టర్)

ఆహ్వానించదగ్గ పరిణామం



బోధనలో మంచి ఫలితాలు సాధిస్తున్న దేశాల స్కూళ్లపై అధ్యయనం చేయించాలనే నిర్ణయం ఆహ్వానించదగ్గదే. అయితే, అక్కడ అనుసరించే మంచి విధానాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు కృషి జరగాలి. ఆయా దేశాల్లోని బోధన సరళిని రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ అవగాహన కల్పించాలి. ముఖ్యంగా ఆధునిక టెక్నాలజీ బోధనలో రాష్ట్ర టీచర్లను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ అధ్యయనం దోహదపడుతుందని ఆశిస్తున్నాం.

– పింగిలి శ్రీపాల్ రెడ్డి (టీచర్స్ ఎమ్మెల్సీ)

నిన్న మల్లోజుల.. నేడు ఆశన్న

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక బస్సులో కాంకేర్ తరలించి అక్కడ లొంగుబాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ 7 ఏకే 47లతో పాటు మరో 17 ఇతర ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. కొండగావ్ జిల్లాలో మహిళా మావోయిస్టు లొంగిపోయింది.

మల్లోజుల మార్గంలో..

శాంతిచర్చలపై ముందుగా అభయ్ పేరుతో మల్లోజుల వేణుగోపాల్ రాసిన లేఖ మార్చి 28న వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత నార్త్ వెస్ట్ సబ్‌జోనల్ బ్యూరో ఇన్‌చార్జిగా రూపేశ్ అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవరావు నుంచి వరుసగా 3లేఖలు విడుదలయ్యాయి. అంతేకాక ఒక యూట్యూబర్‌కు వీడియో ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. అన్ని లేఖల్లోనూ 'శాంతి చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొందాం. తుపాకీ కంటే చర్చల ద్వారానే సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుంది'అనే అభిప్రాయాన్నే ఆశన్న వ్యక్తం చేశారు. దీంతో మల్లోజుల, ఆశన్న ఒకేదారిలో ఉన్నారనే అభిప్రాయం ఏర్పడింది. అందుకు తగ్గట్టే మల్లోజుల లొంగుబాటును అధికారికంగా ప్రకటించిన మరుసటి రోజే ఆశన్న సైతం లొంగిపోతుండటం గమనార్హం.

యాక్షన్లలో దిట్ట

తక్కళ్లపల్లి వాసుదేవరావు స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేట. హనుమకొండలో పాలిటెక్నిక్ చదువుతూ రాడికల్ ఉద్యమాల వైపు ఆకర్షితుడై 1989లో అజ్ఞాతంలోకి వెళ్లారు. పీపుల్స్‌వార్ గ్రూప్ చేపట్టిన పలు కీలక యాక్షన్లలో సభ్యుడిగా ఉన్నారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ చౌరస్తాలో 1999 సెప్టెంబర్ 4న ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్రను దారికాచి కాల్చి చంపిన ఘటన, ఆ తర్వాత 2000 మార్చి 7న అప్పటి ఉమ్మడి ఏపీ హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డిని బాంబు పేల్చి చంపిన టీమ్‌లోనూ ఆశన్న ఉన్నారు. అంతేకాక 2003 అక్టోబర్‌లో అలిపిరి దగ్గర సీఎం నారా చంద్రబాబునాయుడిని లక్ష్యంగా చేసుకుని క్లైమోర్ మైన్స్ పేల్చిన తొమ్మిది మంది సభ్యుల బృందానికి ఆశన్నే నాయకత్వం వహించారు.

వేర్వేరు లొంగుబాట్లు.. ప్లాన్‌లో భాగమే

దేశవ్యాప్తంగా మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీనపడిందనే అభిప్రాయం కలిగించడానికే అగ్రనేతల లొంగుబాటు కార్యక్రమాలను వేర్వేరు ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిందనే ప్రచారం జరుగుతోంది. ఏటీబీలో వరుస ఎన్‌కౌంటర్లలో చలపతి, గాజర్ల గణేశ్, మోడెం బాలకృష్ణ వంటి కేంద్ర కమిటీ సభ్యులతో పాటు చైతే వంటి మహిళా అగ్రనేతలు చనిపోయారు. ఇక ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్, మైలారపు అడేళ్లు చనిపోయారు. జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ప్రయాగ్ మాంఝీ, అంజు సోరేన్ మృతి చెందారు. దీంతో దండకారణ్యం అందునా అబూజ్‌మడ్, దక్షిణ బస్తర్‌కే మావోయిస్టు పార్టీ పరిమితమైంది. ఇక్కడ కూడా ఆ పార్టీ పట్టు కోల్పోయిందనే విషయం ప్రపంచానికి చాటేందుకే అబూజ్‌మడ్‌లో మహారాష్ట్ర కేడర్‌కు చెందిన మావోలంతా మల్లోజుల వెంట లొంగిపోయినట్లు తెలుస్తోంది. ఇదే మడ్ ఏరియాలో ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన మావోయిస్టులంతా ఆశన్నతో కలిసి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ ఎదుట లొంగిపోయేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అంతకు మూడు రోజుల ముందు దక్షిణ బస్తర్‌కుచెందిన ముగ్గురు అగ్రనేతలు హైదరాబాద్‌లో లొంగిపోయారు. ప్రస్తుతం మావోయిస్టు కీలక నేతలంతా మడ్ అడవుల్లోనే తలదాచుకున్నారు. సురక్షితంగా లొంగిపోవాలంటే వారి ముందున్న ప్రత్యామ్నాయాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మాత్రమేనని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

అంతా మార్చిన ఆ లేఖ!



గడ్చిరోలి: మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ లొంగిపోవటానికి మాజీ మావోయిస్టు ఒకరు రాసిన ఓ లేఖ కారణమని పోలీసులు తెలిపారు. మల్లోజులతో పాటు మరికొందరితో సన్నిహితంగా పని చేసిన అనిల్ అనే మావోయిస్టు గత ఏడాది సెప్టెంబర్ 15న పోలీసులకు లొంగి పోయారు. లొంగిపోయిన తర్వాత ప్రశాంత జీవనం గడుపుతున్నానని పేర్కొంటూ ఇటీవల ఆయన మల్లోజులకు లేఖ రాశారు. ఆ తర్వాతే మల్లోజుల కూడా లొంగి పోవాలని నిర్ణయించుకున్నట్లు పోలీ సులు తెలిపారు. 'గౌరవనీయులైన కామ్రేడ్ సోను దాదా.. జోహార్! ప్రస్తుత కఠిన పరిస్థితుల్లో కూడా మీరు సురక్షితంగా ఉన్నారని భావిస్తున్నాను. నేను, అంజు నాగపూర్‌లో 2024 సెప్టెంబర్ 15న లొంగిపోయాం. ప్రస్తుతం మేము గడ్చిరోలిలో ఉన్నాం. పోలీసుల నుంచి మాకు మంచి సహకారం అందింది. నేను ఉద్యోగం కూడా సంపాదించుకు న్నాను. గడ్చిరోలిలో ఇల్లు కూడా కట్టుకోవా లని ప్రయత్నాలు చేస్తున్నాం. తారక్క (మల్లోజు భార్య) కూడా మాతోపాటే ఉంది. ఇక్కడ మనవాళ్లంతా దాదాపు 60–70 మందిమి కలిశాం. తార దీదీ బాగున్నారు. ఆమె అనారోగ్యానికి గురైతే మేమే ఆస్పత్రికి తీసుకెళ్లాం. ఆమె కుటుంబ సభ్యులు కూడా తరచూ వచ్చి చూసి వెళ్తున్నారు' అని లేఖలో అనిల్ పేర్కొన్నాడు.

ఆయుధాలు వీడి..

మహారాష్ట్ర సీఎం సమక్షంలో లొంగుబాటు



సీఎం ఫడ్నవీస్, పోలీస్ ఉన్నతాధికారులతో మల్లోజుల. చిత్రంలో రాజ్యాంగ ప్రతులతో లొంగిపోయిన మావోలు

బెల్లంపల్లి/గడ్చిరోలి/ సాక్షి ముంబై: మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి అలియాస్ సోను తన సాయుధ పోరాటాన్ని ముగించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో గడ్చిరోలిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మల్లోజులతోపాటు మరో 60 మంది మావో యిస్టులు లొంగిపోయారు. వీరంతా మూడురోజుల క్రితమే గడ్చిరోలి పోలీసుల అదుపులోకి వెళ్లారు. బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం ఫడ్నవీస్‌కు స్వయంగా తమ ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. మల్లోజుల తలపై రూ.6 కోట్ల రివార్డు ఉంది. వీరి వద్ద నుంచి 54 ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పలువురు మావోయిస్టులకు ప్రకటించిన రివార్డులను సీఎం పంపిణీ చేశారు.ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన మల్లోజుల వేణుగోపాల్ భార్య తారక్క సిడామ్‌తోపాటు మొత్తం 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. జూన్ 6న స్వప్నక్క, బుచ్చయ్య చౌదరితోపాటు మొత్తం 12 మంది దేవేంద్ర ఫడ్నవీస్ ముందు లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటుకు కృషిచేసిన గడ్చిరోలి జిల్లా పోలీసులకు సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రూ.1 కోటి బహుమతి ప్రకటించారు. కాగా, ఇకపై రాజ్యాంగం పరిధిలో పనిచేస్తామని మల్లోజుల వేణుగోపాల్ ప్రకటించారు. లొంగిపోయిన సమయంలో ఆయన చేతిలో భారత రాజ్యాంగం మరాఠీ ప్రతి కనిపించడం విశేషం. లొంగిపోయినవారిలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీ సలాకుల సరోజ అలియాస్ లత అలియాస్ దీప అలియాస్ స్వాతితోపాటు ఆమె భర్త దండకారణ్యం డీకేఎస్‌జడ్‌సీఎం ఇన్‌చార్జి ఇర్రి మోహన్‌రెడ్డి అలియాస్ వివేక్ కూడా ఉన్నారు. సరోజపై రూ.50 లక్షల రివార్డు ఉంది. ఆమె 1984లో అజ్ఞాతంలోకి వెళ్లారు.

మావోయిస్టు ఉద్యమ అంతానికి ఇదే ఆరంభం

మహారాష్ట్రలో మావోయిస్టు ఉద్యమం అంతానికి మల్లోజుల లొంగుబాటే ఆరంభమని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. మల్లోజుల, ఇతర మావోయిస్టుల లొంగుబాటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు పార్టీలో ఇక మిగిలింది అతికొద్దిమంది మాత్రమేనని, వారు కూడా లొంగిపోవాలని.. లేదంటే పోలీస్ యాక్షన్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి గడ్చిరోలి నాయకత్వం వహిస్తోందని కొనియాడారు. 'సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోయామన్న విషయాన్ని మావోయిస్టులు గుర్తించాలి. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధించటం భారత రాజ్యాంగ పరిధికి లోబడి జనజీవన స్రవంతిలో కలిస్తేనే సాధ్యమవుతుంది'అని స్పష్టంచేశారు. అతి త్వరలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో మరో 100 మంది మావోయిస్టులు లొంగిపోనున్నారని చెప్పారు.

లొంగిపోయిన నక్సల్స్‌కు ఉద్యోగాలిస్తాం: లాయిడ్స్ మెటల్స్

గడ్చిరోలిలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోయిన నక్సల్స్‌కు ఉద్యోగాలు ఇచ్చేందుకు లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ (ఎల్ఎంఈఎల్) సంస్థ ముందుకొచ్చింది. తగిన శిక్షణ ఇచ్చి గడ్చిరోలి జిల్లాలోనే ఉపాధి కల్పిస్తామని ఎల్ఎంఈఎల్ ఎండీ బీ ప్రభాకరన్ బుధవారం ప్రకటించారు. 'వారు ఏం పని చేయగలరో, ఎక్కడ వారికి పని కల్పించాలో ఆలోచిస్తున్నాం. ఒక సిద్ధాంతంతో 30 ఏళ్లపాటు అడవిలో జీవించిన ఒక వ్యక్తి ఇప్పుడు జనజీవన స్రవంతిలో కలిశారు. మిగిలిన నక్సల్స్ కూడా అదే బాటలో పయనించేలా చేసేందుకు ఆ వ్యక్తి (మల్లోజుల వేణుగోపాల్) మనకు చక్కటి అంబాసిడర్‌గా ఉపయోగపడుతారు'అని ప్రభాకరన్ పేర్కొన్నారు. గడ్చిరోలి జిల్లాలో ఎల్ఎంఈఎల్ సంస్థ సూరజ్‌గఢ్ ఇనుప గనులను నిర్వహిస్తోంది. ఒక డీఆర్ఐ ప్లాంటును, మరో పెల్లెట్ యూనిట్‌ను కూడా నిర్వహిస్తోంది. యువతకు ఉపాధి కల్పించేందుకు లాయిడ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎల్‌టీ గోండ్వానా స్కిల్ హబ్ అనే శిక్షణ కేంద్రాలను నడుపుతోంది. గడ్చిరోలిలో 75 ఏళ్ల క్రితం మొట్టమొదట పరిశ్రమ ఏర్పాటుచేసింది తమ సంస్థేనని, అందువల్ల ఇతర కంపెనీలకు మార్గదర్శకత్వం వహించాల్సిన బాధ్యత తమపై ఉందని ప్రభాకరన్ తెలిపారు. స్థానికులు ఎప్పటికీ కార్మికులుగానే మిగిలిపోకుండా వారికి తగిన శిక్షణ ఇచ్చి మేనేజర్లుగా, సీనియర్ కార్యనిర్వహణ అధికారులుగా ఎదిగేందుకు 100 శాతం ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే తమ కంపెనీ 68 మంది లొంగిపోయిన నక్సలైట్లకు, నక్సల్స్ వల్ల నష్టపోయిన 14 కుటుంబాలకు కలిపి 82 మందికి ఉద్యోగాలు ఇచ్చిందని ఎల్ఎంఈఎల్ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది.

పుంజు పుంజుకో గూడు!



అశ్వారావుపేట రూరల్: సంక్రాంతి పండుగ వేళ పలు ప్రాంతాల్లో కోడి పందేలు హోరాహోరీగా జరుగుతాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పండువారిగూడెంలో ఓ రైతు పలు రకాల కోడి పుంజులను విక్రయానికి పెంచుతున్నాడు. ఖాళీగా ఉన్న వ్యవసాయ క్షేత్రంలో వందల సంఖ్యలో పందెం పుంజులు పెంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషం. పొలం చుట్టూ కంచెకు గ్రీన్‌షీట్‌తో చాటు కట్టి.. ఇనుప కడ్డీలతో చేసిన గంపల కింద పుంజులను కాపాడుతున్నాడు. ఎండ, వాన తగలకుండా తాటి ఆకులను రక్షణగా పెట్టాడు.

వాగు కష్టాలు తీరేదెన్నడో..?



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి వద్ద మూడేళ్ల కిందట భారీ వరదకు బ్రిడ్జి కూలిపోయిన విషయం తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు కొండాయి, మల్యాల, ఐలాపురం, గోవిందరాజుల కాలనీవాసులు వర్షా కాలం, మిగతా కాలాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటుకుంటూ అవసరాలను తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. బుధవారం కొండాయి వద్ద ఓ బాలింత తన చంటిపిల్లాన్ని ఎత్తుకొని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటింది. బ్రిడ్జి ఎప్పుడు కడతారో.. మా వాగు కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని ఆయా గ్రామాలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– ఏటూరునాగారం

అమ్మ ఆనందం కోసం..



మెట్‌పల్లి రూరల్: అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధురాలికి సంతోషం కలిగించడానికి ఆమె కుటుంబ సభ్యులు వినూత్నంగా వ్యవహరించారు. వేంపేట గ్రామానికి చెందిన శ్రీరాముల నర్సమ్మ (90) వృద్ధాప్యంతో కొంతకాలంగా మంచానికే పరిమితమైంది. కుమారుడు, కోడలు, మనువళ్లు సపర్యలు చేస్తున్నారు. అడుగు కూడా వేయలేని ఆమెకు ఊరంతా చూపించాలని నిర్ణయించుకున్న కుటుంబసభ్యులు.. తోపుడు బండిపై గ్రామమంతా తిప్పారు. బంధువుల ఇళ్లకు తీసుకెళ్లారు. గ్రామంలోనే ఉంటున్న కూతురి ఇంటికి ఆమెను తీసుకెళ్లి.. అక్కడ భోజనం చేయించి తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబసభ్యుల ప్రేమకు ఆమె ఎంతగానో పరవశించింది.



45 ఏళ్ల క్రితం బస్తర్‌లోకి..

తొలినాళ్లలో స్థానికుల నుంచి మావోయిస్టులకు నిరాదరణ

- 'ఫారెస్టు ప్రజాకోర్టుల'తో జనాల్లో అభిమానం
- కేరళ రాష్ట్రాన్ని మించిన విస్తీర్ణంలో 'దండకారణ్యం' ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భవిష్యత్ అవసరాల రీత్యా బస్తర్‌లో షెల్టర్ జోన్ ఏర్పాటు చేసుకోవాలని అప్పటి పీపుల్స్‌వార్ నేత కొండపల్లి సీతారామయ్య నిర్ణయించారు. దీంతో 49 మంది నక్సలైట్లు ఏడు బృందాలుగా ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణ స్థలం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని భద్రకాళి ప్రాంతానికి 1980 ఏప్రిల్‌లో అడుగు పెట్టాయి. బీజాపూర్ జిల్లాలో తార్లగూడెం, భూపాలపట్నం, మద్దేడుతోపాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆసరెల్లి, అంకీస, సిరొంచ ప్రాంతాలకు అప్పట్లో దళాలు వెళ్లాయి.

దోపిడీ దొంగలుగా భావించి..

తెలంగాణ సాయుధ పోరాట సమయాన విప్లవకారులకు బస్తర్ ప్రాంతం ఆశ్రయం ఇచ్చినా.. అక్కడ గెరిల్లా జోన్ ఏర్పాటు చేయడం క్లిష్టమైన పనిగా మారింది. దీంతో బస్తర్ అడవుల్లో గిరిజన తెగలు ఎన్ని ఉన్నాయి..వారి ప్రవర్తన ఎలా ఉంటుంది.. వారితో ఎలా మసలుకోవాలనే అంశాలపై పరిశోధనల ఆధారంగా.. బ్రిటిష్ రచయిత సర్ విల్‌ఫ్రిడ్ గిగ్సన్ రాసిన 'ది మారియా గోండ్స్ ఆఫ్ బస్తర్'పుస్తకాన్ని అప్పటి నక్సలైట్లు అధ్యయనం చేశారు. స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు అప్పటి యువ విప్లవకారులు చేసిన ప్రయత్నాలు తొలుత సఫలం కాలేదు. యవ్వనంలో పంచెలు కట్టుకున్న వ్యక్తులను అక్కడి స్థానికులు నమ్మలేదు. ఓ భూస్వామికి సంబంధించిన వివరాలు ఆరా తీస్తుండగా, ఆయన అనుచరులు ఓ నక్సలైట్‌ను పట్టుకున్నారు. దీంతో పిస్టల్ చూపించి అక్కడి నుంచి పారిపోవాల్సి వచ్చింది. మరోవైపు దోపిడీ దొంగలు గ్రామాల్లోకి ప్రవేశించారని, వారు ఆస్తులను దోచుకోవడంతోపాటు మహిళలను చెరబడుతున్నారంటూ పోలీసులు ప్రచారం ఉధృతం చేశారు. ఈ క్రమాన పోలీసులు–నక్సలైట్లకు మధ్య మోమిన్‌పేట దగ్గర చోటుచేసుకున్న కాల్పుల్లో ఒక నక్సలైట్ చనిపోయాడు. దీంతో స్థానిక గ్రామాల నుంచి కనీస సహకారం కరువైంది. దళం కనబడితే చాలు దాడి చేసే పరిస్థితి ఎదురైంది. రోజుల తరబడి తిండి దొరకని పరిస్థితి ఏర్పడింది. చివరకు ఉద్యమ విస్తరణ ప్రయత్నాలు మానుకొని తిరిగి తెలంగాణలోకి రావాలని దళాలు నిర్ణయించుకున్నాయి. ఈ ప్రయత్నంలోనే గోదావరి తీరంలో ఉన్న చివరి సరిహద్దు గ్రామంలో చిట్టచివరి ఇంటికి చెందిన ఓ మహిళ వీరికి ఆశ్రయమిచ్చి అన్నం పెట్టడంతో పరిస్థితి మారిపోయింది.



దండకారణ్యంలో మావోయిస్టులు చేపట్టిన నిర్మాణం (ఫైల్)

తునికాకు రేట్లతో

తునికాకు రేట్లు పెంచే ఉద్యమం నక్సలైట్లకు తొలి విజయాన్ని అందించింది. ఈ ఉద్యమం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి విస్తరించే సమయంలోనే స్థానిక గిరిజనులపై అటవీ అధికారుల దాష్టీకాలు నక్సలైట్ల దృష్టికి వచ్చాయి. దీంతో తొలిసారి ఫారెస్టు అధికారుల దుర్మార్గపు చర్యలపై ప్రజాకోర్టు నిర్వహించారు. అక్కడికక్కడే అటవీ అధికారులను శిక్షించడం స్థానికుల్లో నక్సలైట్లపై క్రేజ్ పెరగడానికి కారణమైంది. నక్సలైట్ ఉద్యమం తీవ్రం కావడంతో అడవుల్లో ఉన్న ఫారెస్ట్ ఆఫీసులు సమీప పట్టణాలు, రోడ్ల దగ్గరకు మార్చడం మొదలైంది. అటవీ అధికారులు వదిలేసిన ప్రాంతమంతా క్రమంగా నక్సలైట్ల అధీనంలోకి రావడం మొదలైంది. ఇదే సమయాన 1981 –83లో ఇంద్రావతి నేషనల్ పార్క్, పామేడు వన్యప్రాణి అభయారణ్యం పేరుతో వందకు పైగా ఊర్లను అడవి నుంచి ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నం మావోయిస్టులకు సామాన్యులతోపాటు భూస్వామ్య వర్గాల నుంచి కూడా మద్దతు తెచ్చిపెట్టింది.

దండకారణ్యం

2000 నాటికి దక్షిణాన గోదావరి, తూర్పున విశాఖ సముద్రతీరం, పశ్చిమాన న్యూఢిల్లీ–చెన్నై రైల్వేట్రాక్ (చంద్రాపూర్), ఉత్తరాన ముంబై–కోల్‌కతా (రైల్వేట్రాక్) వరకు మధ్య గల ప్రాంతమంతా మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న దండకారణ్య జోన్‌గా మారింది. ఆ తర్వాత 1996లో జనతన సర్కార్ పేరుతో నక్సలైట్ల సమాంతర పాలన ప్రారంభమైంది. మరో పదేళ్లు గడిచే సరికి పశుపతి టు తిరుపతి పేరుతో రెడ్‌కారిడార్ విస్తరణకు దండకారణ్యం కేంద్ర బిందువైంది. దీంతో మావోయిస్టు అణచివేత చర్యలను కేంద్రం చేపట్టింది. ఈ క్రమంలో బస్తర్‌లో పార్టీ విస్తరణకు బీజం వేసిన తొలితరం నేతల్లో ఒకరైన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా ఇటీవల ఎన్‌కౌంటర్‌లో చనిపోగా మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను లొంగిపోయారు. అంతేకాక చాలామంది వివిధ ఎన్‌కౌంటర్లలో మరణించారు.

సాక్షి, హైదరాబాద్: హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) ప్రాజెక్టులో భాగంగా పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి శుక్రవారం టెండర్ నోటిఫికేషన్ విడుదల కానుంది. మొదటిదశలో 17 ప్యాకేజీల కింద 96 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 2,162 రహదారులు (7,449.50 కిలోమీటర్ల పొడవుతో) నిర్మించనున్నారు.

రేపు 'హ్యామ్' టెండర్లు



ఏర్పాట్లు పూర్తి చేసిన పంచాయతీరాజ్ శాఖ • మొదటిదశలో 7,449 కి.మీ. రోడ్ల నిర్మాణం

హ్యామ్ ప్రాజెక్టుల కోసం.. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. 17 ప్యాకేజీలకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రారంభించేందుకు పీఆర్ ఈఎన్సీ జోగారెడ్డి ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారమే నోటీసు ద్వారా టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి..టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. హ్యామ్ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ రహదారులు కొత్త దశలోకి ప్రవేశిస్తాయని, జాతీయ, అంతర్జాతీయ రహదారి నిర్మాణ సంస్థలు ఈ ప్రాజెక్టు టెండర్లలో పాల్గొనాలని సీతక్క కోరారు. ఈ ప్రాజెక్ట్ అమలుతో గ్రామీణ రహదారి సదుపాయాలు మరింత పటిష్టమై గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ఈ విధానం ద్వారా గ్రామీణ రహదారుల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, రవాణా సౌకర్యాలు విస్తృతంగా మెరుగుపడతాయని తెలిపారు.











మనమందరం మురికి కాలువలోనే ఉన్నాం.
కానీ మనలో కొందరు నక్షత్రాలను చూస్తున్నారు.
– ఆస్కార్ వైల్డ్

సాక్షి
గురువారం, 16 అక్టోబర్ 2025

ప్రశ్నలు రేపిన మరణాలు

వారం రోజుల వ్యవధిలో హరియాణా పోలీస్ విభాగంలో జరిగిన రెండు ఆత్మహత్యలు ఆ రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇందులో ఒకరు ఈ నెల 7న ఆత్మహత్య చేసుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళిత ఐపీఎస్ అధికారి, అదనపు డీజీపీ వై. పూరన్‌కుమార్ కాగా, ఏఎస్ఐ సందీప్ లాథర్ మంగళవారం ప్రాణం తీసుకున్నారు. ఈ రెండు ఆత్మహత్యలూ పోలీస్ విభాగంలో నిలువెల్లా నెలకొన్న అవ్యవస్థకు అద్దం పడుతున్నాయి. పూరన్ తనకెదురవుతున్న కులవివక్ష గురించి ఆత్మహత్యకు ముందు తొమ్మిది పేజీల లేఖ రాశారు. అయితే మూడు పేజీల లేఖతో పాటు వీడియో విడుదల చేసి మరణించిన సందీప్, అదనపు డీజీపీ పూరన్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ, 'నిజాన్ని' బట్టబయలు చేయటానికి ప్రాణత్యాగం చేస్తున్నాననటం, ఈ కేసులో బదిలీ అయిన ఒక ఎస్పీ మంచివారంటూ చెప్పటం ఆశ్చర్యం కలిగించింది. సందీప్ సమర్థుడిగా పేరు తెచ్చుకున్నవారే. పూరన్‌పై దర్యాప్తుచేస్తున్న బృందంలో సభ్యుడు. పూరన్ అవినీతిపరుడైతే పకడ్బందీ దర్యాప్తుతో ఆ సంగతిని బట్టబయలు చేయాలి తప్ప అందుకోసం ప్రాణత్యాగం ఎందుకు?

సమాజాన్ని పట్టి పీడిస్తున్న కులజాడ్యం విద్యాసంస్థలూ, ప్రభుత్వ విభాగాలూ మొదలుకొని సమస్త వ్యవస్థల్లోనూ వేళ్లూనుకున్నదని తరచూ జరుగుతున్న ఉదంతాలు నిరూపిస్తున్నాయి. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ప్రాంతీయ వివక్ష వంటివి సరేసరి. చిత్రమేమంటే అన్ని వ్యవస్థలూ ఇవేమీ లేనట్టు నటిస్తుంటాయి. అందుకే కావొచ్చు... ఈ జాడ్యాలు నిక్షేపంలా కొనసాగుతున్నాయి. 2016లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల, 2019లో ముంబైలోని ఒక వైద్య కళాశాలలో పీజీ చేస్తున్న డాక్టర్ పాయల్ తాడ్వి బలవన్మరణాలైనా, వివిధ ఐఐటీల్లో ఆత్మహత్యలు చేసుకున్న ఇతర దళిత విద్యార్థులైనా తమ బలిదానాల ద్వారా ఈ సమస్య తీవ్రతను ప్రభుత్వాల దృష్టికీ, సమాజం దృష్టికీ తీసుకొచ్చారు. కానీ పాలకుల నుంచి ప్రతిస్పందనలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి.

హరియాణా కేడర్ ఐపీఎస్ అయిన పూరన్ ఉన్నత విద్యావంతుడు. కంప్యూటర్ సైన్స్‌లో పట్టభద్రుడై, అహ్మదాబాద్ ఐఐఎంలో ఎంబీఏ చేశారు. వివిధ జిల్లాల్లో ఎస్పీగా, అంబాలా ఐజీగా శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన కృషినీ, పోలీస్ విభాగాన్ని ఆధునికీకరించటంలో ఆయన పాత్రనూ అందరూ గుర్తుచేసుకుంటున్నారు. పాలనాపరమైన బాధ్యతల్లోనూ, కీలకమైన కేసుల దర్యాప్తులోనూ సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారు. గత నెలలో రోహ్‌తక్ నుంచి ఒక పోలీస్ శిక్షణ కేంద్రానికి బదిలీ చేసేవరకూ ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. కానీ అక్కడి నుంచి నిష్క్రమించాక రోహ్‌తక్‌లో ఆయన దగ్గర పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ అవినీతి ఆరోపణలపై అరెస్టు కావటం అనుమానాలకు తావిస్తోంది.

అవినీతికి పాల్పడినవారిని రక్షించాలని ఎవరూ కోరరు. కానీ ప్రశ్నలు లేవనెత్తే పూరన్ వంటి దళిత అధికారిని ఆ మాదిరి కేసుల్లో ఇరికించే అవకాశం లేదా? ఆయన పని చేసినచోటల్లా ఈ మాదిరే ఆరోపణలొస్తే వేరే విషయం. ఐఏఎస్ అధికారిణి అయిన ఆయన భార్య అమ్నీత్ కుమార్‌కు సైతం సర్వీసులో మంచి పేరుంది. కుమార్ ఆత్మహత్య చేసుకున్న సమయానికి ఆమె సీఎం నయబ్‌సింగ్ సైనీ వెంట జపాన్ వెళ్లిన అధికార బృందంలో ఉన్నారు. హరియాణా మాఫియా ముఠాలకు నిలయం. మీడియాలో మార్మోగే లారెన్స్ బిష్ణోయ్ ముఠా మొదలుకొని ఎన్నో గ్యాంగ్‌లున్నాయి. పూరన్ అంటే గిట్టని వారు మరో గ్యాంగ్‌స్టర్ ఇందర్‌జిత్‌ను అడ్డంపెట్టుకుని కక్ష తీర్చుకునే ప్రయత్నం చేశారా?

ఏపీలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన 16 మంది సీనియర్ ఐపీఎస్‌లకు ఏడాదిపైగా కాలం నుంచి పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధిస్తున్న వైనం కళ్ల ముందే కనబడుతోంది. వీరిలో అత్యధికులు దళిత వర్గాలవారు. వీరి పేర్లు 'రెడ్‌బుక్'లో ఉండటం తప్ప వేరే కారణం కనబడదు. దేశవ్యాప్తంగా ఇలా బాహాటంగా కులవివక్ష రాజ్యమేలుతుంటే పూరన్ వంటివారు ఆత్మహత్య తప్ప గత్యంతరం లేదనుకోవటంలో వింతేముంది? ఈ కేసులో పారదర్శకంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపించి హరియాణా ప్రభుత్వం తన తటస్థతను నిరూపించుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.దశమి ప.1.40 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఆశ్లేష సా.4.29 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** తె.4.35 నుండి 6.12 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.37 వరకు, తదుపరి ప.2.30 నుండి 3.17 వరకు, **అమృత ఘడియలు:** ప.2.55 నుండి 4.30 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

మనతోనే ఉన్నట్లు!



ఆత్మీయులను కోల్పోయినప్పుడు జీవితం శూన్యంగా అనిపిస్తుంది. కానీ వారి ఆత్మశాంతి కోసం అయినా మనం కోలుకోవాలి. వారు ఏర్పరిచి వెళ్లిన లక్ష్యంతో ముందడుగు వేయటానికి శక్తిని కూడగట్టుకోవాలి. అప్పుడు వారు వెళ్లిపోయినట్లు ఉండదు. మనతోనే ఉన్నట్లు అనిపిస్తుంది.

– మన్నారా చోప్రా, నటి–మోడల్

ప్రేరణకు శక్తి



నా అభిమానులు గెలుపు కోసం నన్ను ఒత్తిడి చెయ్యకూడదని అనుకుంటారు. నిజాయతీగా చెప్పాలంటే వారు నాపై అధిక అంచనాలను కలిగి ఉండనిదే నేను నా శక్తికి మించి పని చేయలేను. వారు నాతో కఠినంగా ఉండటమే నన్ను విజయానికి ప్రేరేపిస్తుంది.

– యుకీ సునోడా, జపాన్ ఎఫ్1 డ్రైవర్

మహిళలే ఆధారం



గ్రామీణ కుటుంబాలకు మహిళలే వెన్నెముక. ఆర్థిక వ్యవస్థను నడిపించటం, ఆహార భద్రతను పెంపొందించటం, స్థిరమైన అభివృద్ధిని సాధించటం... వీటన్నిటికీ కూడా మహిళా సాధికారతే మూలస్తంభం. మహిళా సంక్షేమం ఎంతగా ఉంటే, అంతగా దేశాభివృద్ధి ఉంటుంది.

– నవీన్ పట్నాయక్, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి

చేయగలిగింది



మీకు తెలుసా? నేను సరదా మనిషిని కాదు. కానీ నాకు స్టాండ్–అప్ కామెడీ అంటే చాలా ఇష్టం కాబట్టి దానిని చేయాలనుకున్నాను. నా జీవితంలో నేను చేయగలనని గ్రహించిన వాటిలో ఇదొకటి. ప్రతి మనిషికీ చేయగలిగింది ఒకటి ఉంటుంది. అదేమిటో తెలుసుకోగలగాలంతే!

– బిల్ బర్, స్టాండ్–అప్ కమెడియన్

ఒకే పైకప్పు



ప్రతి స్త్రీ తన భర్త, పిల్లలతో ఒకే పైకప్పు కింద జీవితం గురించి కలలు కంటుంది. కానీ, కొన్నిసార్లు జీవితం అందుకు భిన్నంగా ఉంటుంది. ప్రతిఘటించటానికి వీలు లేకపోతే, పరిస్థితులకు తలొగ్గటం ఒక్కటే మార్గంగా కనిపిస్తుంది.

– హేమ మాలిని, ఎంపీ – నటి

లిమిటెడ్ ఎడిషన్



నిజం... ఈ సృష్టిలో మీరొక అద్భుతం. మీరు 'లిమిటెడ్ ఎడిషన్'. మిమ్మల్ని చేజిక్కించుకోవలసిన అవసరం ప్రపంచానిది. మిమ్మల్ని మిస్ చేసుకుంటే ఇక ఎప్పటికీ లభ్యం కారని తెలియజేయండి. మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటేనే ఇది సాధ్యం.

– అక్షయా శ్రీనివాసన్, కార్పొరేట్ లాయర్

నష్టం తక్కువ... లాభం ఎక్కువ

విశ్లేషణ



హ్యాపీమాన్ జాకబ్

2021 ఆగస్టులో అధికారాన్ని చేపట్టిన తర్వాత మొదటిసారి, తాలిబాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీకి న్యూఢిల్లీలో భారత్ ఆతిథ్యం ఇచ్చింది. తాలిబాన్‌ను అఫ్గానిస్తాన్ అధికారిక ప్రభుత్వంగా గుర్తించకుండానే, దానితో చర్చలు సాగించే విధానాన్ని ఇన్నాళ్లూ భారత్ అనుసరిస్తూ వచ్చింది. ఆ మాటకొస్తే, రష్యా మాత్రమే కొద్ది నెలల క్రితం ఆ ప్రభుత్వాన్ని గుర్తించింది.

ముత్తాకీ న్యూఢిల్లీ రావడం, ఆయన్ని అఫ్గానిస్తాన్ విదేశాంగ మంత్రిగా భారత్ ప్రస్తావించడంతో, తాలిబన్‌ను అఫ్గానిస్తాన్ అధికారిక ప్రభుత్వంగా గుర్తించే దిశగా భారత్ మరో అడుగు వేసినట్లయింది. అలా చేస్తే, ఎదురుకాగల ఇబ్బందులు తక్కువ, ఒనగూడగల వ్యూహాత్మక ప్రయోజనాలు ఎక్కువ.

మూడు ముఖ్య అభ్యంతరాలు

అవాంఛనీయ విలువలను ప్రబోధిస్తూ, తన జనాభాలో సగం మందికి వ్యతిరేకంగా వివక్షాయుత విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాన్ని భారత్ గుర్తించకూడదన్నది ఒక వాదన. దీనిలో సహేతుకత ఉంది. అయితే, మనం ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. (క్రూరమైన పనులను నాజూకుగా చేస్తున్నంత మాత్రాన) అన్ని ప్రభుత్వాలూ నైతికంగా ఆమోదయోగ్యమైనవి కావు. అంగీకారయోగ్యం కాని విలువలతో కూడిన ప్రభుత్వాన్ని గుర్తించినంత మాత్రాన, ఆ విలువలను మనం ఆమోదిస్తున్నట్లు కాదు. అంతర్జాతీయ రాజకీయాలు అంతకు మించి జటిలమైనవి. వ్యక్తిగత స్నేహానికి ఎంచుకొనే ప్రమాణాలను, ప్రభుత్వాల విధాన నిర్ణయాలకు వర్తింపజేయలేం.

అఫ్గానిస్తాన్ చట్టబద్ధమైన పాలకులుగా తాలిబాన్‌ను గుర్తించడం వల్ల, ఈ ప్రాంతంలో శుద్ధాచారవాదం పెరిగేందుకు దోహదపడినట్లు అవుతుందనేది రెండో అభ్యంతరం. కానీ, తాలిబాన్‌ను గుర్తించడం ద్వారా వారు ప్రధాన జీవన స్రవంతిలోకి రావడానికీ, సామాజికంగా మెరుగైన ప్రవర్తనను అలవరచుకోవడానికీ బాటలు పరచినట్లు అవుతుంది. 1996 నాటి తాలిబాన్ వేరు, 2025 తాలిబాన్ వేరు. వారు మరికాస్త మధ్యేవాదులుగా మారారు, ఆధునిక మార్గాలను అనుసరించేందుకు మరింత సుముఖంగా ఉన్నారు. స్త్రీ–పురుష వివక్ష చూపడంపై విమర్శలను ఎదుర్కొన్న తర్వాత, భారతీయ మహిళా జర్నలిస్టులను ఆహ్వానించడం ద్వారా, తాలిబాన్ తన తప్పును సరిదిద్దుకుంది. కొన్నిసార్లు మార్పు, ఏకపక్షంగా దూరం పెట్టడం కన్నా, నలుగురితో కలవడం, ఒత్తిడిని చవిచూడటం వల్ల వస్తుంది. వారి మత విశ్వాసాలు, విధానాలతో ఏకీభవించనంత మాత్రాన పొరుగు దేశాన్ని దూరంపెట్టడం గొప్ప రాజ్య లక్షణం అనిపించుకోదు.

తాలిబాన్‌కు దగ్గరైతే పాకిస్తాన్‌తో మన సంబంధాలు మరింత క్షీణిస్తాయనేది మూడో అభ్యంతరం. వాస్తవం ఏమిటంటే, భారత్–పాక్ సంబంధాలు ఇప్పటికే అట్టడుగుకు చేరాయి. ఈ చర్య వల్ల ఇప్పుడు ఆ గతిశీలతలో గణనీయంగా రాబోయే మార్పు ఏమీ లేదు.



అఫ్గానిస్తాన్(తాలిబాన్) విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీతో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్

◆ రష్యాను అనుసరిస్తూ మిగిలిన దేశాలూ తాలిబాన్‌ను అఫ్గానిస్తాన్ అధికారిక ప్రభుత్వంగా గుర్తించడానికి ఎంతో కాలం పట్టదు. మిగిలిన దేశాలు గుర్తించేంత వరకు భారత్ వేచి చూసి, ఆ తర్వాత గుర్తిస్తే, దౌత్యపరంగా దానికి ఇపుడున్నంత ప్రాధాన్యం ఉండదు.

నాలుగు ప్రధాన ప్రయోజనాలు

ఐ.సి.814 విమాన హైజాక్ ఉదంతాన్ని పక్కన పెడితే, సాధారణంగా భారత్ పట్ల తాలిబాన్ వైఖరి సానుకూలంగానే ఉంది. ఆ హైజాక్ సూత్రధారి పాకిస్తాన్ సైనిక గూఢచారి సంస్థ. ఆ ఘటనలో తాలిబాన్ కన్నా ఐఎస్ఐ పాత్ర ఎక్కువ. తాలిబాన్ 2021 ఆగస్టులో అధికారం చేపట్టిన నాటి నుంచీ భారత్‌తో సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తోంది. కశ్మీర్‌ను భారత్ – పాక్ మధ్య ద్వైపాక్షిక అంశంగా చూడటం ద్వారా, అది భారత్ వైఖరిని సమర్థిస్తోంది.

రెండు – రష్యాను అనుసరిస్తూ మిగిలిన దేశాలూ తాలిబాన్ ప్రభుత్వాన్ని గుర్తించడానికి ఎంతో కాలం పట్టదు. తాలిబాన్‌పై పశ్చిమ దేశాల ఒత్తిడీ తగ్గింది. చైనా, పాకిస్తాన్ కూడా రష్యాను అనుసరించే అవకాశం ఉంది. మిగిలిన దేశాలు గుర్తించేంత వరకు భారత్ వేచి చూసి, ఆ తర్వాత గుర్తిస్తే, దౌత్యపరంగా దానికి ఇపుడున్నంత ప్రాధాన్యం ఉండదు. పైగా, త్వరగా గుర్తించడం వల్ల, వ్యూహాత్మకంగా మొదటి మిత్రుని సానుకూలత లభిస్తుంది. అఫ్గానిస్తాన్ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహించే అవకాశం దక్కుతుంది.

మూడు – తాలిబాన్ నేతృత్వంలోని అఫ్గానిస్తాన్‌తో సన్నిహిత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం మనకే మంచిది. ఈ ప్రాంతంలోని దేశాలను భారత్‌కు దూరం చేయాలని చైనా – పాకిస్తాన్ వేస్తున్న పథకాలను అడ్డుకునేందుకు వీలవుతుంది. కాబూల్‌తో చైనా సాన్నిహిత్యం కూడా పెరుగుతోంది. దానితో వీలైనంత మేరకు సమతూకం సాధించేందుకు ఇది తోడ్పడుతుంది. కాబూల్‌లో ఎవరు అధికారంలో ఉన్నారనేదానితో ప్రమేయం లేకుండా, అఫ్గానిస్తాన్ చాలావరకు, భారతదేశానికి ముఖ్యమైన భాగస్వామిగా కొనసాగుతూ వస్తోంది. కాబూల్‌లో అనంగీకార ప్రభుత్వం ఉందని, ఆ భాగస్వామ్యాన్ని పాడుచేసుకోకూడదు.

'అఫ్గానిస్తాన్ సార్వభౌమత్వానికీ, ప్రాంతీయ సమగ్రతకూ, స్వాతంత్ర్యానికీ' భారత్ పూర్తిగా కట్టుబడి ఉంది'' అని ముత్తాకీ పర్యటన సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేసిన ప్రకటన ప్రధానంగా పాకిస్తాన్‌ను ఉద్దేశించినదిగానే కనిపిస్తోంది. అఫ్గాన్ ప్రభుత్వంతో క్రియాశీలంగా వ్యవహరించడంలోని వ్యూహాత్మక విలువను న్యూఢిల్లీ గుర్తించిందనీ, ఈ ప్రాంతంలో పాకిస్తాన్ ప్రాబల్యాన్ని కట్టడి చేసేందుకు ఒక మార్గంగా దాన్ని భావిస్తోందనీ ఆ ప్రకటన సూచిస్తోంది.

అంతిమంగా, భారత్ నుంచి దౌత్యపరమైన గుర్తింపు లభించడం అంతర్జాతీయంగా గుర్తింపు కోసం తహతహలాడుతున్న తాలిబాన్‌కు ఎంతో ఊతాన్ని ఇస్తుంది. ప్రాంతీయంగా అ–మిత్ర వాతావరణం పెరుగుతున్న నేపథ్యంలో, ఈ చర్య ద్వారా, మధ్య ఆసియాలో వ్యూహాత్మక భాగస్వామ్యాలు, స్నేహపూర్వక ఉనికితో భారత్ లబ్ధి పొందనుంది.

వ్యాసకర్త 'కౌన్సిల్ ఫర్ స్ట్రేటజిక్ డిఫెన్స్ అండ్ రిసెర్చ్' వ్యవస్థాపక డైరెక్టర్
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సింపుల్‌గా....

మన మందులకు ఏమైంది?

మామూలు దగ్గు, జలుబు బారినపడి, వైద్యులు సిఫార్సు చేసిన దగ్గుమందుతో చిన్నారులు చనిపోతే ఏమనాలి? మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లా పరాసియా, తదితర గ్రామాల్లో జరిగింది అదే. అభం శుభం తెలియని 22 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఔషధ తయారీ నుంచి వినియోగం దాకా వివిధ రాష్ట్రాలతో ముడిపడిన ఈ విషతుల్య ఔషధాల వ్యవహారం వ్యవస్థాగత వైఫల్యమని నిందిస్తూ కథ సుప్రీం కోర్టు దాకా వెళ్ళింది. దీనిపై కోర్టు దేశవ్యాప్త నియంత్రణకు ఆదేశాలిచ్చింది. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ మన దేశంలో తయారైన 3 రకాల దగ్గుమందులు నాసిరకమైనవనీ, సురక్షితం కాదనీ ప్రపంచవ్యాప్త అప్రమత్తత జారీ చేయడం గమనార్హం.

ఏం జరిగింది?

మధ్యప్రదేశ్‌లో చిన్నారుల మరణాలకు కారణమైన దగ్గుమందు 'కోల్డ్‌రిఫ్' తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో శ్రేసన్ అనే సంస్థ తయారుచేసినది. మందు నమూనాల్ని పరీక్షించినప్పుడు విషతుల్య పారిశ్రామిక ద్రావణం డై ఇథలీన్ గ్లైకాల్ (డీఈజీ) ప్రమాదకర స్థాయిలో ఉన్నట్టు వెల్లడైంది. చిన్నారుల మరణాలతో రచ్చ రేగేసరికి, మధ్యప్రదేశ్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి, సదరు మందును సిఫార్సు చేసిన డాక్టర్‌ను అరెస్టు చేసింది. ఇక, ఆ మందును ఉత్పత్తి చేసిన శ్రేసన్ సంస్థకు తమిళనాడు ప్రభుత్వం తాళాలు వేసి, యజమానిని జైలుకు పంపింది. ఆ మందు విక్రయాలపై నిషేధం విధించింది.

గతంలోనూ... ఇలాగే!

ఔషధ తయారీ రంగానికి పేరుబడ్డ భారత్‌కు చెడ్డపేరు రావడం ఇదే తొలిసారి కాదు. 2022లోనూ ఇలానే జరిగింది. గాంబియా, ఉజ్బెకిస్తాన్, కామెరూన్‌లలో భారత తయారీ దగ్గుమందుల వాడకం వల్ల 140 మందికి పైగా చిన్నారులు మరణించినట్టు వివాదం రేగింది. అప్పట్లోనూ ఈ విషతుల్య పదార్థమే ఎక్కువుంది. వెనక్కెళితే... 1986లో, 2020లోనూ మన దగ్గు మందులు చాలా వాటిల్లో డీఈజీ ఉండవలసినదాని కన్నా ఎక్కువుంది. ఇంకా చెప్పాలంటే, భారత తయారీ దగ్గు మందుల వల్ల 1972 నుంచి 9 సార్లు ఇలాంటి దుర్ఘటనలు జరిగాయి. తాజా ఘటన గత అయిదేళ్ళలో అయిదోది.



ఔషధాల్లో లోపమేంటి?

దగ్గు మందుల్లో డీఈజీ ఎక్కువై, దగ్గు మందులు విషతుల్యం కావడం వల్ల కిడ్నీ దెబ్బ తింటుంది. నిజానికి, దగ్గు మందుల తయారీకి కావాల్సిన ఔషధాల్ని కరిగించడానికి ప్రొపిలీన్ గ్లైకాల్ (పీజీ) అనే పారిశ్రామిక ద్రావణాన్ని వాడతారు. అయితే, అందులో 0.1 శాతం మించి డీఈజీ అవశేషాలేవీ కనిపించరాదు. దగ్గు మందు తయారుచేసే ముందు పరీక్షించి, ఆ సంగతి నిర్ధారించుకోవాలి. కానీ, మన ఔషధ తయారీ సంస్థలు ఆ జాగ్రత్తను గాలికొదిలేసి, పరీక్ష చేయని పీజీని వ్యాపారుల నుంచి కొనేస్తుంటాయి. మరికొందరు బ్రేక్ ఫ్లూయిడ్స్, పెయింట్ల తయారీకి వాడే డీఈజీ చౌక గనక పీజీ బదులు దాన్ని వాడేస్తుంటారు. నిరోధించాల్సిన ప్రభుత్వ సంస్థలేమో ఆ పని చేయట్లేదు. మూడేళ్ళ క్రితం 2022లో గాంబియాలో దుర్ఘటన జరిగినప్పుడు భారత డ్రగ్ కంట్రోలర్ జనరల్ మేకపోతు గాంభీర్యం చూపింది కానీ, ఆచరణలో జరిగింది శూన్యం. తాజా ఘటనలోనూ మన దగ్గు మందుల్లో డీఈజీ లేనే లేదని కేంద్ర ఆరోగ్య శాఖ హడావిడిగా ప్రకటించింది. తీరా ఇటు తమిళనాడులోనూ, అటు మధ్యప్రదేశ్‌లోనూ చేసిన పరీక్షల్లో ఈ మందులు కలుషితమని తేలింది. ఛింద్వారాలో చేసిన పరీక్షల్లో కోల్డ్‌రిఫ్‌లో పరిమితి కన్నా 480 రెట్లు ఎక్కువగా డీఈజీ ఉన్నట్టు వెల్లడైంది.

సరిదిద్దుకోవాల్సిన సవాలక్ష లోపాలు

నియంత్రణ వ్యవస్థలోని తీవ్రమైన లోపాలకు ఇది ఉదాహరణ. నిజానికి, ఔషధ నియంత్రణకు దేశంలో 37 వేర్వేరు సంస్థలున్నా, సమన్వయం శూన్యం. దేశం నలుమూలల నుంచి కలుషిత ఔషధాలను తప్పని సరిగా వెనక్కి పిలిపించే పటిష్ఠ చట్టవ్యవస్థ ఏదీ ఇవాళ్టికీ మనకు లేదు. దేశంలో 7 కేంద్ర ఔషధ పరీక్షా శాలలే ఉన్నాయి. దేశవ్యాప్తంగా అవసరమైన 3–4 వేలమంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యలో సగం మంది లేరు. మరోపక్క రాజకీయాలకూ, ఔషధ రంగానికీ మధ్య ఆర్థిక బంధాలూ అపారం. నాసిరకం ఔషధాలు తయారు చేసినా సరే, అలాంటి కొన్ని నేరాలకు కఠిన శిక్షలు లేకుండా ఆరోగ్యశాఖ చేసిందంటే అర్థం చేసుకోవచ్చు. ఏమైనా, తరచూ సంభవిస్తున్న ఈ దగ్గుమందు మరణాలు ప్రపంచానికి ఫార్మసీగా పేరున్న మన దేశానికి మాయని మచ్చ. శీతకాలం విజృంభించి, దగ్గు మందుల విక్రయం, వినియోగం పెరగనున్న వేళ ప్రభుత్వం కళ్ళు తెరుస్తుందా?

ఛిద్రమవుతున్న బాల్యం

అభిప్రాయం



తదకమళ్ళ మురళీధర్

18 ఏళ్ల లోపు బాలబాలికలను లైంగిక నేరాల నుండి రక్షించడానికి రూపొందించిన పోక్సో చట్టం 2012 నవంబర్ 14 నుండి అమల్లోకి వచ్చింది. నేరస్థుడు పురుషుడు, మహిళ లేదా మూడవ జెండర్ కూడా కావచ్చు. కేంద్ర న్యాయ శాఖ వెబ్‌సైట్ ప్రకారం దేశంలో 725 కోర్టులు ఈ కేసులను విచారిస్తున్నాయి, 2 లక్షల పైగా కేసులు పెండింగులో ఉన్నాయి, ఇప్పటి వరకూ 3,34,213 కేసులు పరిష్కారమైనాయి. బంధువులు, పొరుగింటివారు, యజమానులు, బాగా పరిచయమున్నవారు కూడా బాలలపై లైంగిక నేరాలకు పాల్పడుతున్నారని జరుగుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని పోలీసుల దాకా వెళ్ళకుండా నిందితులతో రాజీ చేసుకునే కేసులు, నిందితులకు భయపడి మౌనంగా ఉండే కేసులు ఎన్నో ఉంటాయి. ఈ నేరాన్ని ప్రేరేపించిన వారు కూడా నిందితులు అవుతారు. నేరం రుజువైతే జీవిత ఖైదు, మరణ శిక్షతో పాటు జరిమానాకు అర్హులు.

ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో ప్రత్యేక సెషన్స్ కోర్టుల ముందు 'ఇన్ కెమెరా' పద్ధతిలో విచారణ జరుగుతుంది. నేర అభియోగపత్రం రిజిస్టరైన తేదీ నుండి ఏడాది లోపులో తీర్పు వెలువరించాలని చట్టం చెప్తోంది. ఎగతాళి, సామాజిక బహిష్కరణ, వేధింపుల నుండి నివారణ కోసం లైంగిక వేధింపులకు గురైన బాలల పేరు, చిరునామా, ఫొటోలను బహిర్గతం చేయరాదు. బహిర్గతం చేసినట్లయితే ఏడాది పాటు శిక్షకు గురవుతారు. అంతెందుకు, విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం, అప్పిలేటు న్యాయస్థానం కూడా తమ తీర్పుల్లో బాధిత బాలుడు లేదా బాధిత బాలికగానే పేర్కొనాలి తప్ప పేరును బహిర్గతం చేయకూడదు. సాక్ష్యాలను నమోదు చేసే సమయంలో బాధిత బాలలు నిందితుడికి కనిపించకుండా ప్రత్యేక కోర్టు చర్యలు తీసుకోవాలి. వీడియో కాన్ఫరెన్సింగ్, సింగిల్ విజిబిలిటీ మిర్రర్లు, పరదా లేదా ఏదైనా ఇతర పరికరాన్ని ఉపయోగించి, భయాందోళనలకు గురి కాకుండా స్నేహపూర్వక వాతావరణం కల్పించి పిల్లల వాఙ్మూలాన్ని రికార్డ్ చేయాలి. అదే సమయంలో నిందితుడు బాధిత బాలల వాఙ్మూలాన్ని వినగలిగే, అతని న్యాయవాదితో సంభాషించగలిగే స్థితిలో ఉండాలి. ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో నేరం చేయలేదని రుజువు చేసుకోవాల్సిన భారం నిందితుడి మీదే ఉండటం గమనార్హం.

పిల్లలు, టీనేజర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్న వెబ్‌సైట్ల సంఖ్య పెరుగుతోంది. వీటి దుష్ప్రభావాల నుంచి రక్షించడంలో భాగంగా పదహారేళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా ఆస్ట్రేలియా ప్రభుత్వం చట్టం తెచ్చింది. అలాంటిది తేవడానికి అవకాశం ఉందేమో మన ప్రభుత్వాలూ పరిశీలించాలి. చికిత్సకు ముందే వ్యాధి నివారణకై ఆలోచించటం ఉత్తమం.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి

డేటా పాయింట్

అమెరికాలో 11 సార్లు షట్‌డౌన్



అత్యధిక రోజులు షట్‌డౌన్ జరిగిన సందర్భాలు

ఎప్పుడు ప్రారంభం	ఎన్ని రోజులు
05-10-1990	3
13-11-1995	5
15-12-1995	21
30-09-2013	16
21-12-2018	34

అమెరికా సెనేట్‌లో స్టాప్‌గ్యాప్ ఫండింగ్ బిల్లును డెమోక్రాట్లు తిరస్కరించడంతో... అత్యవసరం కాని ప్రభుత్వ సేవలన్నీ ఈ అక్టోబరు 1న నిలిపేశారు. 1976 నుంచి చూస్తే ఇది 11వ షట్‌డౌన్. ట్రంప్ గత పదవీ కాలంలోనే అత్యధిక రోజులు షట్‌డౌన్ ఉంది.

ఆధారం: యూఎస్ఏ ఫ్యాక్ట్స్

శ్రేష్ఠ యాచన

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

'మైవ కంచన యాచస్వ యది త్వంయాచసే పునః పరేశమేవ యాచస్వ కృపాబ్ధి ముపమన్యువత్'... నీవు ఇతరులనెవ్వరినీ యాచించవద్దు. యాచించదలచుకుంటే **'ఉపమన్యు'** వలె పరమేశ్వరునే యాచించు అని అర్థం.

యాచన మహా చెడ్డది. అది మనిషిని దిగజార్చుతుంది. ఎంత సద్గుణుడైనా, ఎంత మహాపండితుడైనా, ఎంత గొప్ప బతుకు బతికినా ఒక్కసారి ఎదుటివాడి ముందు చేయి చాస్తే, అతడు నీళ్ళ కంటే పలుచన అవుతాడు. దూది కంటే తేలికగా చూడబడతాడు. అందుకే మానధనులైన వారు ఇతరులను యాచించరు. జీవితం గడవకపోతే పస్తులుంటారు తప్ప 'దేహీ' అనరు. అందుకనే అభిమానవంతులు **'వినా దైన్యేన జీవనం'** కావాలని కోరుకుంటారు. సింహానికి ఆకలి వేస్తే వేటాడి తింటుంది కానీ ఇతర జంతువులు వేటాడినదాన్ని కోరదు. సింహం నుంచి ఆ గుణాన్ని నేర్చుకోమంటాడు చాణక్యుడు.

విధిలేని దశలో, ఇతరులను యాచించకపోతే కుదిరేటట్లు లేదనుకోండి... అప్పుడు కూడా కనబడిన ప్రతివాడినీ యాచించకూడదు. గుణవంతుడైన గొప్పవాడినే యాచించటం మంచిది. గుణవంతుడికి యాచకుని స్థితి అర్థమవుతుంది, సానుభూతి ఉంటుంది. అదే నీచుడైతే యాచకుణ్ణి హీనంగా చూస్తాడు. **'యాచా మోఘా వరమధిగుణే నాధమే లబ్ధ కామా'** అంటాడు కాళిదాస కవి. ఉత్తముడైన గుణవంతుని యాచించినపుడు అతడేమీ ఇవ్వకపోయినా అధముడు ఇచ్చిన దానికంటే శ్రేష్ఠమని అర్థం.

కనుక ఎట్టి పరిస్థితిలోనూ యాచించనే కూడదు. తప్పనిసరైతే గుణవంతుణ్ణి యాచించటం మంచిది. నిజం చెప్పాలంటే ఎవరినీ యాచించకూడదు. దయాళువైన ఆ పరమేశ్వరుడినే యాచించాలి. భగవంతుడిని మించిన కృపాళువెవరున్నారు?

మందులు నాసి.. ప్రాణాలు తీసి!



- 2020 నుంచి పెరుగుతున్న 'నాసిరకం' లిస్ట్
- నాణ్యత లేని మందులు బెంగాల్‌లో ఎక్కువ
- ఈ ఏడాది 8 నెలల్లో 1,184 ఔషధాలు విఫలం

ఎన్ఎస్‌క్యూడీ పరీక్షల్లో వెల్లడైన వాస్తవాలు

విషపూరిత దగ్గు మందు సేవించి మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో పిల్లల మరణాలు సంభవించిన ఘటనతో నాణ్యత లేని మందుల గురించి దేశవ్యాప్తంగా చర్చ తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈ ఏడాది జనవరి - ఆగస్టు మధ్య నిర్వహించిన నాన్‌-స్టాండర్డ్ క్వాలిటీ డ్రగ్స్ (ఎన్ఎస్‌క్యూడీ) పరీక్షల్లో 1,184 మందులు నాణ్యత లేనివిగా తేలింది. వీటిలో ట్యాబ్లెట్స్ 51%, ఇంజెక్షన్లు 18%, సిరప్స్ 11% ఉన్నాయి. నియంత్రణ సంస్థలు నిర్దేశించినట్టుగా నాణ్యత, భద్రత, సామర్థ్య ప్రమాణాలు లేని ఔషధాలను ఎన్ఎస్‌క్యూడీగా పరిగణిస్తారు. 2019తో పోలిస్తే ఎన్ఎస్‌క్యూడీ పరీక్షల్లో నాసిరకమైనవని తేలిన ఔషధాల సంఖ్య దాదాపు మూడింతలు కావడం ఆందోళన కలిగించే అంశం. మనదేశంలో తయారైన దగ్గు సిరప్స్ 2023లో గాంబియాలో డజన్ల కొద్దీ పిల్లల మరణాలకు కారణమై వివాదానికి దారితీసింది. - సాక్షి, స్పెషల్ డెస్క్

కేంద్ర ప్రభుత్వం ఈ ఆగస్టులో లోక్‌సభలో వెల్లడించిన వివరాల ప్రకారం.. గత 5 ఏళ్లలో నాణ్యత లేని ఔషధాల సంఖ్య పెరుగుతోంది. 2024–25లో మొత్తం 1.16 లక్షలకుపైగా ఔషధాల శాంపిళ్లు పరీక్షించగా.. 3,104 నాణ్యత లేనివిగా తేలాయి. నకిలీ / కల్తీగా గుర్తించినవి 245. కల్తీ మందులపై పెడుతున్న కేసులు కూడా ఏటా పెరుగుతున్నాయి. నకిలీ మందులను అరికట్టడానికి.. కేంద్ర ప్రభుత్వం బార్ కోడ్ / క్యూఆర్ కోడ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది. ఔషధాల లేబుళ్ల లేదా వీలున్న చోట బార్ కోడ్ ద్వారా.. ఆ ఔషధానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలి.

సంవత్సరం	పరీక్షించిన శాంపిళ్లు	నాణ్యత లేనివి	నకిలీ / కల్తీవి	పెట్టిన కేసులు
2020-21	84,874	2,652	263	236
2021-22	88,844	2,545	379	592
2022-23	96,713	3,053	424	663
2023-24	1,06,150	2,988	282	604
2024-25	1,16,323	3,104	245	961

పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువ

కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) నివేదిక ప్రకారం.. గత మూడేళ్లలో నాణ్యత లేని మందులకు సంబంధించి కేసులు అత్యధికంగా నమోదవుతున్న రాష్ట్రం పశ్చిమబెంగాల్. అత్యధిక కేసులు (శాతాల్లో) నమోదైన రాష్ట్రాలు..

రాష్ట్రం	2023	2024	2025
పశ్చిమ బెంగాల్	46.3	34.0	21.8
కర్ణాటక	-	1.4	11.2
మహారాష్ట్ర	7.0	8.0	8.1
తమిళనాడు	2.6	8.4	7.7
పంజాబ్	-	-	7.2
తెలంగాణ	4.5	6.6	6.8
అస్సాం	21.6	15.2	6.5



క్లుప్తంగా...

బనకచర్ల డీపీఆర్‌పై వివరణ ఇవ్వండి

- ఏపీకి కృష్ణా బోర్డు లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారీకి ఏపీ ప్రభుత్వం టెండర్లను నిర్వహించడంపై కేంద్ర జలసంఘానికి(సీడబ్ల్యూసీ) తెలంగాణ చేసిన ఫిర్యాదుపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) స్పందించింది. ఈ విషయంలో వాస్తవ పరిస్థితులను వారంలోగా తెలియజేయాలని ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీకి కృష్ణా బోర్డు ఈ నెల 14న లేఖ రాసింది. రాష్ట్ర పునర్విభజన చట్టంతో పాటు గోదావరి ట్రిబ్యునల్ తీర్పులకు విరుద్ధంగా పోలవరం–బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించిందని గతంలో చేసిన ఫిర్యాదులో తెలంగాణ ఆక్షేపణ తెలిపింది. సీడబ్ల్యూసీ 2010, 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 75 శాతం నీటి లభ్యత ఆధారంగానే కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, దీనికి విరుద్ధంగా వరద జలాల ఆధారంగా ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు అనుమతులను ఏ ప్రాతిపదికన జారీ చేస్తారని ప్రశ్నించింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సీడబ్ల్యూసీ, గోదావరి యాజమాన్య బోర్డు, కేఆర్ఎంబీతో పాటు ప్రభావిత రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేసింది. ఏపీ సమర్పించిన పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను పరిశీలించరాదని తెలంగాణ కేంద్రాన్ని కోరింది.

మేడిగడ్డ డిజైన్లకి గడువు వారం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్లతో పాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ను తెలపడానికి బుధవారంతో గడువు ముగియగా, నీటిపారుదల శాఖ మరో వారం రోజుల పాటు పొడిగించింది. ఈఓఐను ఆహ్వానిస్తూ ఈ నెల 1న నీటిపారుదల శాఖ ప్రకటన జారీ చేయగా, దేశంలోని ప్రతిష్టాత్మకమైన పలు ఐఐటీలతో పాటు విదేశీ సంస్థలూ ముందుకొచ్చాయి. రూర్కీ, మద్రాస్, హైదరాబాద్ ఐఐటీలతో పాటు నిప్పాన్, ఆర్వీ అసోసియేట్స్, స్పెయిన్‌కు చెందిన మరో సంస్థ ఈ మేరకు ఆసక్తి వ్యక్తీకరణలో పాల్గొనేందుకు ఆసక్తి ప్రదర్శించాయి. అయితే, బిడ్లు వేసేందుకు మరో 15 రోజులు గడువు పొడిగించాలని పలు సంస్థలు ప్రీబిడ్ సమావేశంలో విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు గడువు పొడిగిస్తూ నీటిపారుదల శాఖ నిర్ణయం తీసుకుంది.

బాలసదనంలో ఘటనలపై ఎస్సీపీసీఆర్ విచారణ

సాక్షి, హైదరాబాద్: సైదాబాద్‌లోని బాలసదనంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(టీఎస్సీపీసీఆర్) బృందం సదన్‌ను సందర్శించింది. బాలసదనంలోని ఐదుగురు బాలురపైన లైంగికదాడికి సంబంధించి విచారణ చేపట్టింది. కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి, సభ్యులు అపర్ణ, చందన, వచన్ కుమార్ బాలసదనం సిబ్బంది, అక్కడ నివసిస్తున్న పిల్లలతో మాట్లాడారు. వారి నివాస పరిస్థితులు, సంక్షేమం, భద్రతపై ఆరా తీశారు. అదేవిధంగా గృహంలోని సదుపాయాలను పరిశీలించారు. ఈ విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని కమిషన్ వర్గాలు తెలిపాయి.

తండ్రిని ఇంటినుంచి గెంటేసిన కొడుకు

- రైతు వేదికలో తలదాచుకున్న వృద్ధుడు
- చలికి తట్టుకోలేక తెల్లారేసరికి మృతి



పోచయ్య మృతదేహం వద్ద కుటుంబీకులు

సిద్దిపేట రూరల్: కన్నతండ్రిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కొడుకులు అవసాన దశలో ఉన్న తండ్రిని పోషించలేక ఇంటి నుంచి వెళ్లగొట్టారు. ఎటుపోవాలో తెలియక రైతు వేదికలో సేద తీరుదామనుకున్న వృద్ధుడు తెల్లారేసరికి విగత జీవిగా కనిపించాడు. ఈ సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గౌడుగు పోచయ్య (67) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు యాదగిరి, రమేశ్, ఓ కుమార్తె ఉన్నారు. ఇరువురికీ గతంలోనే పెళ్లిళ్లు అయ్యాయి. పెద్దకుమారుడు గ్రామంలో, చిన్నకుమారుడు బండచర్లపల్లికి ఇల్లరికం వెళ్లాడు. పోచయ్యకు ఉన్న అర ఎకరం పొలం పంపకం విషయంలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అతను అనారోగ్యం బారినపడ్డాడు. భార్య, కుమార్తె ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించినప్పటికీ ఫలితం లేదు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో గ్రామంలోని పెద్దకుమారుడి ఇంటి వద్ద గదిలో ఉంచారు. దీంతో పోచయ్య ఆరోగ్యం మరింత క్షీణించింది. తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కుమారుడు బయటకు గెంటేశాడు. కుమార్తె జ్యోతి తండ్రిని గ్రామంలోని వడ్ల బీట్ వద్దకు తీసుకెళ్లగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్టాండ్‌లో తలదాచుకునేందుకు వెళ్లారు. గమనించిన స్థానికులు రైతు వేదికలో ఉండేందుకు అవకాశం కల్పించారు. అయితే చలి కారణంగా పోచయ్య రాత్రి మృతి చెందాడు. బుధవారం గ్రామస్తుల సాయంతో భార్య యాదవ్వనే అంత్యక్రియలు నిర్వహించింది.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- ఈసారి 80 ఎల్ఎంటీ ధాన్యం కొనుగోళ్లకు రూ.23 వేల కోట్ల వ్యయ అంచనా
- సచివాలయంలో మంత్రి తుమ్మలతో కలసి సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్ల కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కొనుగోళ్ల నుంచి చెల్లింపుల వరకు అంతా పారదర్శకంగా సాగాలని అధికారులను ఆదేశించారు. వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై బుధవారం ఆయన సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, రవాణాశాఖ కమిషనర్ రఘునందన్ రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాలని మంత్రి ఉత్తమ్ కలెక్టర్లకు సూచించారు. దేశంలోనే 148 ఎల్ఎంటీ వరి దిగుబడితో ఈసారి రాష్ట్రం కొత్త రికార్డు సాధించబోతోందని, 29 రాష్ట్రాలలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇంతటి దిగుబడి రాలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఈ సారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం కూడా మరో రికార్డుగా ఆయన పేర్కొన్నారు. ఇందు కోసం రూ.23 వేల కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుందని ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, నల్లగొండ జిల్లాల్లో 1,205 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు తరలించేందుకు పూర్తి స్థాయిలో రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు నమోదు అయి న 48 గంటల వ్యవధిలో చెల్లింపులు ఉంటాయన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్ సైతం అందించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అత్యవసరం అనిపిస్తే అదనపు ఖర్చులకు వెనుకాడకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు తలెత్తితే 1800–425–00333/1967 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారానే మక్కల కొనుగోలు

- మార్కెట్‌లో మద్దతు ధర కన్నా తక్కువ రేటు
- ఎంఎస్‌పీ రూ. 2,400 ఉంటే, రూ. 2,100 లోపే కొంటున్న వ్యాపారులు
- ఈసారి రాష్ట్రంలో అత్యధికంగా 6.45 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం తప్పనిసరి చేయడంతో దేశవ్యాప్తంగా మొక్కజొన్నలకు డిమాండ్ పెరిగింది. అలాగే రాష్ట్రంలో భారీ పరిశ్రమగా వెలుగొందుతున్న పౌల్ట్రీ మొక్కజొన్నల డిమాండ్ అధికంగా ఉంది. కానీ, మొక్కజొన్న పండించిన రైతులకు మాత్రం గిట్టుబాటు ధర దక్కని పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం మక్కలకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 2,400 ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 2,100 కూడా పలకడం లేదు. ఇథనాల్ కంపెనీలు, పౌల్ట్రీ పరిశ్రమకు చెందిన వ్యాపారులు తక్కువ ధరకు మక్కలను కొనుగోలు చేయాలని భావించడమే ఇందుకు కారణం. గత సంవత్సరం మక్కల మద్దతు ధర రూ.2,225 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో 2,300 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఈసారి మాత్రం ఎంఎస్‌పీ కన్నా తక్కువకే కొనుగోలు చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. పోటీ ఉంటే తప్ప దళారులు, వ్యాపారులు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వరనే ఉద్దేశంలో ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను కొనుగోలు చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.

మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ద్వారా...

గత మూడేళ్లుగా మార్క్‌ఫెడ్ ఆయా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ... ఇథనాల్ కంపెనీలు, పౌల్ట్రీ పరిశ్రమకు సంబంధించిన వ్యాపారులు, దళారులు ఎంఎస్‌పీ కన్నా అధిక ధరను ఆఫర్ చేసి కొనుగోళ్లు జరిపారు. దాంతో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయాలు జరపలేదు. ఈసారి మాత్రం పంటల దిగుబడి వచ్చినప్పటికీ, ప్రభుత్వ పరంగా కొనుగోళ్లపై ఎలాంటి ప్రకటన రాకపోవడంతో దళారులు రైతుల నుంచి క్వింటాల్ మక్కలను రూ. 2,000కు అటు ఇటుగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో మక్కలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశించారు. దీంతో మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగింది. ఈసారి రాష్ట్రంలో 6.45 లక్షల ఎకరాల్లో మక్కలను సాగు చేశారు. ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు మక్కల దిగుబడి ఉండగా, ప్రైవేటు విక్రయాలు, ఇతర వినియోగం పోను మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలకు 5లక్షల మెట్రిక్ టన్నుల వరకు రావచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం జిల్లాల అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ (డీఎల్‌పీసీ)లనూ ఏర్పాటు చేశారు. ఆయా జిల్లాల్లో సాగైన మక్కల విస్తీర్ణాన్ని బట్టి ఒకటి రెండు రోజుల్లో ఏ జిల్లాలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలో డీఎల్‌పీసీలు నిర్ణయిస్తాయి.

కామారెడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- రాంగ్‌రూట్‌లో దూసుకొచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్



తండ్రి కిషన్‌తో జాస్లీన్



జోయెల్



జాడ్సన్

భిక్కనూరు/బోనకల్: రాంగ్ రూట్‌లో దూసుకొచ్చిన టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మృతుల్లో తల్లితో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ హృదయ విదారక ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామం వద్ద ఎన్‌హెచ్ 44పై బుధవారం చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కరడ్‌పల్లికి చెందిన మెరుగు కిషన్ (54) ఆదిలాబాద్ జిల్లా రణదీవ్‌నగర్‌లో చర్చి పాస్టర్‌గా పనిచేస్తుండగా, ఆయన తల్లిదండ్రులు కామారెడ్డిలో ఉంటున్నారు. కిషన్ తన కుమార్తె జాస్లీన్ (30)ను ఐదేళ్ల క్రితం ఖమ్మం జిల్లా ముష్టికుంటకు చెందిన ఆగ మని ప్రకాశ్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ప్రకాశ్ చింతకాని మండలం చిన్న మండవలో పాస్టర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు జోయెల్ ప్రకాశ్ (4), జాడ్సన్ (3 నెలలు). కామారెడ్డిలో ఉంటున్న తన నానమ్మ, తాతయ్య వద్దకు జాస్లీన్ తన ఇద్దరు కుమారులతో కలిసి కొద్ది రోజుల క్రితం వచ్చింది. కిషన్ సైతం తన తల్లి దండ్రుల వద్దకు వచ్చాడు. జాస్లీన్ తన చిన్న కుమారుడు జాడ్సన్‌కు టీకా వేయించేందుకు భిక్కనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న తమ బంధువు వద్దకు తండ్రి, పెద్ద కుమారుడితో కలిసి ఎలక్ట్రిక్ స్కూటర్‌పై బయల్దేరింది. వారి వాహనం జంగంపల్లి వద్దకు చేరుకోగానే రాంగ్‌రూట్‌లో అతివేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. దీంతో నలుగురు రోడ్డుపై పడిపోయారు. కిషన్, జాస్లీన్ అక్కడికక్కడే మృతి చెందగా, చిన్నారులు జోయెల్ ప్రకాశ్, జాడ్సన్‌ను కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ రాజిరెడ్డిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

సచివాలయ సర్వీసుల్లో ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్

- హెచ్ఓడీల్లోని ఉద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ విభాగాధిపతుల (హెచ్ఓడీలు) కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులను సచివాలయ సర్వీసుల్లోకి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో హెచ్ఓడీలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ (ఎస్ఏ) కేడర్ ఉద్యోగిని సచివాలయ సర్వీసులో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) కేడర్‌లోకి అనుమతించేవారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ మేరకు ఉద్యోగుల సర్వీసు బదిలీలు దాదాపు దశాబ్దంన్నర క్రితం చేశారు. ఆ తర్వాత ఇలాంటి సర్వీసు బదిలీల ప్రక్రియ జరగలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఏ కేడర్ ఉద్యోగి.. సచివాలయ సర్వీసులో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) కేడర్‌కు, అదే విధంగా సూపరింటెండెంట్.. సెక్షన్ ఆఫీసర్ (ఎస్ఓ) కేడర్‌కు వెళ్లేలా అవకాశం కల్పించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెనహర్ మహేశ్ దత్ ఎక్కా ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్ఓడీల్లో పనిచేస్తున్న ఎస్ఏ, సూపరింటెండెంట్ కేడర్ ఉద్యోగులు సర్వీసు బదిలీకి ఆసక్తి ఉంటే సంబంధిత హెచ్ఓడీ ద్వారా జీఏడీకి ఆర్జీలు పెట్టుకోవాలని సూచించారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

ధరణి లావాదేవీలపై విచారణ షురూ

- సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేరళ సంస్థ ఫోరెన్సిక్ ఆడిటింగ్
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూరికార్డుల మార్పిడిపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా జరిగిన భూరికార్డుల మార్పిడిపై పైలట్ ప్రాజెక్టు కింద సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిటింగ్ షురూ అయింది. కేరళకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ కేరళ సెక్యూరిటీ ఆడిట్ అండ్ అష్యూరెన్స్ సెంటర్ (కేఎస్ఏఏసీ)కు ఈ ఆడిటింగ్ బాధ్యతలు అప్పగించగా, ఇటీవలే ఆ రెండు జిల్లాల్లో ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ వర్గాల సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన నాటికి ఉన్న భూరికార్డులు, భూరికార్డుల ప్రక్షాళన జరిగిన తర్వాత అమల్లోకి వచ్చిన రికార్డులు, ఈ రికార్డుల ఆధారంగా జరిగిన లావాదేవీలు, యాజమాన్య హక్కుల బదిలీ, ధరణి పోర్టల్‌లో లావాదేవీలు నిర్వహించిన సమయం, నిషేధిత జాబితా నుంచి ఎత్తివేసిన సర్వే నంబర్లు.. తదితర అంశాలను డిజిటల్ పోస్టుమార్టం చేస్తున్నట్టు తెలిసింది.

వచ్చే నెల మొదటి వారంలోగా నివేదిక!

ప్రభుత్వ, దేవాదాయ, భూదాన్, అసైన్డ్, సీలింగ్, అటవీ, వక్ఫ్, ఇనాం భూముల రికార్డుల మార్పిడిపై కూడా ఈ ఆడిటింగ్ దృష్టి పెడుతుందని, సమగ్ర పరిశీలన అనంతరం డిజిటల్ ఫుట్ ప్రింట్స్ ఆధారంగా నివేదికను ప్రభుత్వానికి అందిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెపుతున్నాయి. కాగా ఈ రెండు జిల్లాలకు సంబంధించిన నివేదిక ఈ నెలాఖరుకు లేదంటే వచ్చే నెల మొదటి వారంలో ప్రభుత్వానికి అందే అవకాశముందని తెలుస్తోంది.

మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ పనులను రద్దు చేయాలి

గద్వాల జిల్లా కలెక్టర్‌కు అలంపూర్ ఎమ్మెల్యే లేఖ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులు, పనుల ఎంపిక జోగుళాంబ గద్వాల జిల్లాలో వివాదానికి దారి తీసింది. తనకు తెలియకుండానే 13 రకాల అభివృద్ధి పనులను తన నియోజకవర్గానికి కేటాయించడంపై అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అసంతృప్తి వ్యక్తం చేస్తూ కలెక్టర్ సంతోష్‌కు లేఖ రాయడం ఆలస్యంగా వెలుగుచూడగా.. చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే, డీఎంఎఫ్‌టీ సభ్యుడిగా ఉన్న తనకు సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించారా? అసలు సమావేశం ఎప్పుడు జరిగిందోనని తెలపకుండానే ఏకపక్షంగా పనులు మంజూరు చేయడంపై ఆయన ప్రశ్నించారు. మీటింగ్ మినిట్స్ కూడా తనకు అందలేదని, వెంటనే ఆ పనులను రద్దు చేయాలని విజయుడు లేఖలో పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

- జిన్నింగ్ సెంటర్లను నోటిఫై చేయాలి
- మక్కలు, సోయాబీన్ కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి
- వివిధ కార్పొరేషన్ల ఎండీలతో మంత్రి తుమ్మల సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, హాకా, గ్రామీణ నీటిపారుదల సంస్థ ఎండీలతో ఆయన సమీక్షించారు. వివిధ పంటల కోతలు మొదలైన నేపథ్యంలో వాటి సేకరణ, మార్కెటింగ్ విభాగం ద్వారా ధాన్యం సేకరణలో అవసరమయ్యే క్లీనర్లు, టార్పలిన్లు, ఇతర పరికరాలు సమకూర్చడం వంటి అంశాలపై చర్చించారు. తొలిదశ పత్తి ఏరే (పికింగ్) కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైందని, దళారులు రంగ ప్రవేశం చేయకముందే సీసీఐ కొనుగోళ్లను ప్రారంభించాలని ఆదేశించారు. సీసీఐ టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిన నేపథ్యంలో కలెక్టర్లు జిన్నింగ్ సెంటర్లను గురువారంలోగా నోటిఫై చేయాలన్నారు. పత్తి సేకరణకు ఏ–1, ఏ–2 కింద ఎంపికయ్యే మిల్లులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పత్తిని విక్రయించాలని చెప్పారు. మొక్కజొన్న కొనడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని, అయినా, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సీఎం ఆదేశం మేరకు గురువారం నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఆరంభిస్తున్నట్టు తెలిపారు. సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఒక ఉన్నతాధికారిని అన్ని పంటల కొనుగోళ్లకు సమన్వయ అధికారిగా నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, హాకా ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలకు స్పెషల్ అధికారులు వీరే	
నిజామాబాద్	గిడ్డంగుల శాఖ మేనేజింగ్ డైరెక్టర్
వరంగల్	ఉద్యానవన శాఖ డైరెక్టర్
నల్లగొండ	వ్యవసాయ శాఖ డైరెక్టర్
మహబూబ్‌నగర్	హాకా ఎండీ
ఖమ్మం	మార్కెటింగ్ డైరెక్టర్
ఆదిలాబాద్	సీడ్ సర్టిఫికేషన్ డైరెక్టర్
కరీంనగర్	ఆగ్రోస్ ఎండీ
మెదక్	మార్క్‌ఫెడ్ ఎండీ
రంగారెడ్డి	ఆయిల్‌ఫెడ్ ఎండీ

రూ.1.3 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి మాలేగావ్‌కు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ వెల్లడి




పోలీసుల అదుపులో నిందితులు

మునిపల్లి (అందోల్): సంగారెడ్డి జిల్లాలోని మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేశారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు భారీ ఎత్తున గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో బుదేరా పోలీసులు మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో తనిఖీలు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేయగా రెండు వాహనాల్లో 130 ప్యాకెట్లలో సుమారు 260 కిలోల ఎండుగంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఓ వాహనంలో ఉన్న ఇద్దరు పారిపోవడా నికి ప్రయత్నించగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు నిందితులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసు కున్న ఎండుగంజాయి విలువ సుమారు రూ.1.3 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఒడిశాకు చెందిన పిటారా పరిచ్చా (25), సంజీవ్ కుమా ర్ పరిచ్చా (35), ధరంచంద్‌పైక్ (30) డేవిడ్‌పాల్ (23) అంతర్రాష్ట్ర ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వీరు ఒడిశాలోని చంద్రగిరి, గంజామ్ జిల్లా నుంచి ఈ ఎండుగంజాయిని మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిసింది. కాగా, ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తే ఎస్–న్యాబ్ ఫోన్ 87126 56777 లో సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు.

కాలం మారుతున్నా ప్రభుత్వం మారదా?

మరణ శిక్ష అమలు విధానాన్ని మార్చలేరా?
- కేంద్రంపై సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం
- ఉరిశిక్ష రద్దుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం



న్యూఢిల్లీ: దేశంలో మరణ శిక్ష అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మరణ శిక్ష పడిన దోషులకు ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా శిక్ష అమలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడం లేదని ఆక్షేపించింది. కాలానుగుణంగా మారడానికి సిద్ధంగా లేదని తప్పుపట్టింది. దోషులకు ఉరిశిక్ష విధించడాన్ని రద్దు చేయాలని, ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా మరణ శిక్ష అమలు చేయాలని కోరుతూ సీనియర్ అడ్వొకేట్ రిషీ మల్హోత్రా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. మరణ శిక్ష ఎలా అమలు చేయాలన్న సంగతి దోషికే వదిలివేయాలని పిటిషనర్ వాదించారు. ఉరిశిక్షా? లేక ప్రాణాంతక ఇంజెక్షనా?.. రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకొనే అవకాశం దోషికి ఇవ్వాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ప్రాణాంతక ఇంజెక్షనే సరైన విధానమని పేర్కొన్నారు. అమెరికాలో 50 రాష్ట్రాలు ఉండగా, 49 రాష్ట్రాల్లో ఇంజెక్షన్ ద్వారా మరణ శిక్ష అమలు చేస్తున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఉరిశిక్ష అత్యంత క్రూరమైనది, అనాగరికమైనదని, దోషి ప్రాణం పూర్తిగా పోవడానికి మృతదేహాన్ని దాదాపు 40 నిమిషాలపాటు ఉరికొయ్యకు వేలాడదీస్తారని చెప్పారు. ఉరిశిక్షతో పోలిస్తే ఇంజెక్షన్ విధానంలో ప్రాణం త్వరగా పోతుందని, ఇది మానవీయంగా, గౌరవంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

అది ప్రభుత్వ విధాన నిర్ణయం

మరణ శిక్ష అమలు చేసే విషయంలో అడ్వొకేట్ రిషీ మల్హోత్రా సూచనను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాదికి జస్టిస్ సందీప్ మెహతా స్పష్టంచేశారు. సదరు న్యాయవాది స్పందిస్తూ... శిక్ష విషయంలో దోషికి ఆప్షన్ ఇవ్వడం సాధ్యం కాదని కోర్టుకు ఇప్పటికే సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టంచేశామని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ మెహతా తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. కాలం మారుతున్నా ప్రభుత్వం మారదా? అని ప్రశ్నించారు. కాలానుగుణంగా ప్రభుత్వం మారకపోవడమే అసలు సమస్య అని అన్నారు. దోషికి ఉరి ద్వారా మరణ శిక్ష అమలు చేయడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని అఫిడవిట్‌లో ప్రస్తావించామని న్యాయవాది గుర్తుచేశారు. ఈ విషయంలో 2023 మే నెలలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వును ప్రస్తావించారు. మరణశిక్ష ఎలా అమలు చేయాలన్నదానిపై సమీక్ష కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి పేర్కొన్నట్లు ఆ ఉత్తర్వులో కోర్టు వెల్లడించింది. కమిటీ ఏర్పాటు అంశం ఏమైందన్న సంగతిని ప్రభుత్వం వద్ద ఆరా తీస్తానని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పారు. దాంతో తదుపరి విచారణను ధర్మాసనం నవంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది.


ప్రభుత్వాన్ని ఆదేశించలేం

అడ్వొకేట్ రిషీ మల్హోత్రా 2017లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉరిశిక్ష రద్దుకు లా కమిషన్ మొగ్గుచూపిందని పేర్కొన్నారు. 187వ నివేదికలో ఇదే అంశాన్ని ప్రస్తావించిందని తెలిపారు. ఇప్పుడున్నర ఉరిశిక్ష స్థానంలో తక్కువ నొప్పితో కూడిన శిక్ష విధానాలను అమల్లోకి తీసుకురావాలని వాదించారు. ప్రాణాంతక ఇంజెక్షన్ లేదా తుపాకీతో కాల్చడం లేదా విద్యుత్ షాక్ ఇవ్వడం లేదా గ్యాస్ చాంబర్‌లోకి పంపించడం విధానాలను సూచించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అఫిడవిట్ సమర్పించింది. ఉరిశిక్షను రద్దు చేయలేమని తేల్చిచెప్పింది. ఈ కేసులో తాజాగా మరోసారి విచారణ జరిగింది. మరణశిక్షను అమలు చేసే విషయంలో ఒక కచ్చితమైన విధానం పాటించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించలేమని ధర్మాసనం వెల్లడించింది.

సార్‌ను కాదు.. మీ సోదరుడిని

బీజేపీ మహిళా కార్యకర్తకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన
- బిహార్ కార్యకర్తలతో వర్చువల్‌గా సంభాషణ
- అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తమదేనని ధీమా
- నవంబర్ 14న మరో దీపావళి వస్తుందని వెల్లడి

న్యూఢిల్లీ: మహిళా శక్తే దేశానికి బలం, రక్షణ కవచం, స్ఫూర్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. తనను సార్ అని పిలవొద్దని, సోదరుడిగా సంబోధించాలని బిహార్‌కు చెందిన బీజేపీ బూత్ స్థాయి మహిళా కార్యకర్తకు సూచించారు. బిహార్‌లో నవంబర్ 14న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వస్తాయని, అదేరోజు ప్రజలు మరో దీపావళి నిర్వహించుకోబోతున్నారని స్పష్టంచేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. తమ కూటమి విజయంలో మహిళలే కీలకపాత్ర పోషించబోతున్నారని తెలిపారు. బిహార్ బీజేపీ కార్యకర్తలతో ప్రధాని మోదీ బుధవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఢిల్లీ నుంచి నమో యాప్ ద్వారా వారితో సంభాషించారు. ప్రజాస్వామ్య వేడుకలో మహిళలంతా ఉత్సాహంగా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ గుంపులుగా వెళ్లి ఓటు వేయాలని, పాటలు పాడుతూ, థాలీలు(గిన్నెలు) మోగిస్తూ పండుగ జరుపుకోవాలని సూచించారు. బిహార్ ప్రజలకు ఈసారి డబుల్ దీపావళి వస్తోందని వ్యాఖ్యానించారు. సోదరీమణులు, ఆడబిడ్డల ఆశీస్సులతో మరోసారి అధికారంలోకి రాబోతున్నామని స్పష్టంచేశారు.



నా తరఫున గ్యారంటీ ఇవ్వండి

భాయి దూజ్ పండుగ సందర్భంగా ఈ నెల 23న సోదరీమణుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. లఖ్‌పతీ దీదీలను, డ్రోన్ దీదీలను గౌరవించుకోవాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని, వారికి అవగాహన కల్పించాలని కోరారు. 'ఏక్ జుట్ ఎన్డీఏ, ఏక్‌జుట్ బిహార్(ఐక్య ఎన్డీఏ, ఐక్య బిహార్)–ఇసే బనేగీ సుశాసన్ కీ సర్కార్' అనే నినాదాన్ని ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చారు. మరోసారి సుపరిపాలన అందిస్తామన్నారు. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ఎన్నికల్లో కచ్చితంగా విజయం లభిస్తుందన్నారు. ప్రతి బూత్ స్థాయి కార్యకర్త ఒక మోదీయేనని తేల్చిచెప్పారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి తన తరఫున ప్రజలకు గ్యారంటీ ఇవ్వాలని సూచించారు. పథకాలకు సంబంధించిన వీడియోలను అందరికీ చూపించాలన్నారు. బిహార్‌లో గతంలో జంగిల్‌రాజ్ రాజ్యమేలిందని, అప్పటి పరిస్థితుల గురించి నేటి యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్జేడీ పాలనపై విరుచుకుపడ్డారు. బిహార్‌లో ఆర్జేడీ అధికారంలో ఉన్నప్పుడు నక్సలైట్లు ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారని ప్రధానమంత్రి ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని మళ్లీ నక్సలైట్ల చేతికి అప్పగించవద్దని ప్రజలను కోరారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల నుంచి బిహార్‌ను రక్షించుకొనే బాధ్యత ప్రజలపైనే ఉందని మోదీ ఉద్ఘాటించారు. బిహార్‌లో నవంబర్ 6, 11న అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఇక నేనే అధ్యక్షుడిని

మడగాస్కర్ సైనిక నేత మైఖేల్ వెల్లడి


అంటనానారివో: తూర్పు ఆఫ్రికా ద్వీపదేశమైన మడగాస్కర్‌లో అధ్యక్షుడు ఆంద్రీ రాజోలీనా సారథ్యంలోని ప్రభుత్వాన్ని కూలదోసిన మిలటరీ కమాండర్, కల్నల్ మైఖేల్ ర్యాండ్రియానిరినా బుధవారం తన మనసులోని మాట బయటపెట్టారు. త్వరలో దేశాధ్యక్షునిగా పగ్గాలు చేపట్టబోతున్నట్లు అంతర్జాతీయ మీడియాకు చెప్పారు. జెన్ జెడ్ యువత నేతృత్వంలో మొదలైన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం ఉప్పెనలా మారడంతో ప్రాణభయంతో అధ్యక్షుడు రాజోలీనా విదేశానికి పారిపోయారు. రాజోలీనా లేకపోవడంతో దేశ అత్యున్నత రాజ్యాంగ కోర్టు ఆహ్వానం మేరకు త్వరలో తాను దేశ పరిపాలనా బాధ్యతలు తీసుకోబోతున్నట్లు మైఖేల్ చెప్పారు. మైఖేల్ సారథ్యంలోని నిపుణులైన క్యాప్‌శాట్ సైనిక బృందం తిరుగుబాటు చేపట్టడంతో రాజోలీనా చేతులెత్తేయడం తెల్సిందే. ''నిన్ననే మేం వాస్తవానికి బాధ్యతలు తీసుకోవాల్సింది. దేశంలో అధ్యక్షుడు లేడు. సెనేట్‌లోనూ అధ్యక్షుడి జాడ లేదు. అసలు ప్రభుత్వమే లేదు. అందుకే త్వరలో మేం నూతన ప్రధానికి నియమిస్తాం''అని మైఖేల్ వ్యాఖ్యానించారు. అయితే ఎప్పటికల్లా నూతన ప్రభుత్వ ఏర్పాటు ఉంటుందనే మైఖేల్ స్పష్టంచేయలేదు. సెనేట్, న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం అధికారులను తొలగిస్తున్నట్లు మైఖేల్ ఇప్పటికే జాతీయరేడియోలో ప్రకటించడం తెల్సిందే. 1960లో ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందాక మడగాస్కర్ ఎన్నో తిరుగుబాట్ల పాలిటపడింది. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెచ్చరిల్లడం, ప్రజల జీవన వ్యయాలు పెరగడం, నీటికొరత, విద్యుత్ సంక్షోభం, అమాంతం పెరిగిన అవినీతితో జెన్‌జెడ్ యువత విసిగిపోయి ఉద్యమబాట పట్టడం, దీనికి సైనిక తిరుగుబాటు తోడవడంతో రాజోలీనా ప్రభుత్వం కూలిపోయింది.

నిందితుల విచారణ వేళ లాయర్ ఉండాలా?

పోలీసులు ప్రశ్నించే వేళ న్యాయవాది ఉండటం సబబేనా?
- మీ స్పందనేంటో తెలపండి
- కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలను ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: నేరారోపణలు ఎదుర్కొంటున్న పిటిషనర్‌పై పోలీసులు, ఇతర దర్యాప్తు సంస్థలు కేసు విచారణలో భాగంగా ప్రశ్నల వర్షం కురిపించే వేళ పిటిషనర్ తరఫు న్యాయవాదులు అక్కడే ఉండొచ్చా? అనే ప్రశ్నకు సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమాధానం రాబట్టదల్చుకుంది. ఇందుకోసం ఈ అంశంలో మీ స్పందన తెలపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రాజ్యాంగంలోని 20(3), 21, 22 అధికరణాల ప్రకారం సంక్రమించిన హక్కులమేరకు కేసుల విచారణ సందర్భంలో వ్యక్తులు తమ న్యాయవాదులను పోలీసులు, ఇంటరాగేషన్ అధికారుల సమక్షంలో హాజరుపర్చవచ్చని, ఈ మేరకు అనుమతి మంజూరుచేయాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం న్యాయవాది షరీఫ్ మధార్ వేశారు. ఈ పిల్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. లాయర్ మధార్ తరఫున సీనియర్ మహిళా న్యాయవాది మేనకా గురుస్వామిని ఈ సందర్భంగా జస్టిస్ చంద్రన్ ప్రశ్నించారు. ''పోలీసులు, దర్యాప్తు సంస్థలు ప్రశ్నించేటప్పుడు నేరారోపణలు ఎదుర్కొంటున్న పిటిషనర్లు భౌతికంగా హింసకు గురైన ఘటనలు ఉన్నాయా? దర్యాప్తు వేళ లాయర్లు తప్పనిసరిగా ఉండాలా?''అని ప్రశ్నించారు. దీంతో లాయర్ 'ఇండియా: హింసా సంబంధ 2019 వార్షిక నివేదిక'ను గుర్తుచేశారు. ''పోలీస్, దర్యాప్తు సంస్థల కస్టడీలో ఉన్నప్పుడు పిటిషనర్లు ఎదుర్కొంటున్న ఒత్తిడి, వేదన అంశాలను నివేదిక సవివరంగా వివరించింది. నేరాన్ని ఒప్పుకునేలా చేసేలా ప్రశ్నలు వేస్తే వాటిని లాయర్ సాయంతో పిటిషనర్ గుర్తించేందుకు, చేయని నేరాన్ని పొరపాటున ఒప్పుకున్నట్లు సమాధానాలు ఇచ్చే ప్రమాదకర స్థితిని లాయర్ తప్పించగలరు. ప్రస్తుతం లాయర్లను చాలా వరకు విచారణవేళ నిరాకరిస్తున్నారు. ఒకవేళ అనుమతించినా దూరంగా కూర్చోబెడుతున్నారు. తమ పిటిషనర్‌ను ఎలాంటి ప్రశ్నలను అడుగుతున్నారనేది లాయర్ వినిపించట్లేదు. పోలీసులు చేసే స్వీయ నేరాంగీకార ప్రయత్నాన్ని అడ్డుకునేలా పౌరులకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 20(3) ద్వారా సంక్రమించిన హక్కు ఉల్లంఘనకు గురవుతోంది. ఆర్టికల్ 22(1) ప్రకారం తన లాయర్ ద్వారా తనను తాను రక్షించుకునే, లాయర్ సలహాలు తీసుకునే హక్కులూ ఉల్లంఘనకు గురవుతున్నాయి''అని లాయర్ వాదించారు.

కెన్యా రాజకీయ దిగ్గజం ఒడిన్గా అస్తమయం



కేరళ ఆయుర్వేద ఆస్పత్రిలో వాకింగ్ చేస్తుండగా గుండెపోటుతో కన్నుమూత
- ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న సంతాపాలు
- పుష్కరకాలంగా విపక్షనేతగా సేవలందిస్తున్న మాజీ ప్రధాని

నైరోబీ: కెన్యా రాజకీయాలపై తనదైన చెరగని ముద్రవేసిన దిగ్గజ విపక్ష నేత, మాజీ ప్రధానమంత్రి రైలా ఒడిన్గా తుదిశ్వాస విడిచారు. 80 ఏళ్ల వయసులో ఆయుర్వేద చికిత్స కోసం ఇటీవల ఆయన భారత్‌కు విచ్చేశారు. కేరళలోని కొత్తట్టుకులంలోని దేవమాత ఆస్పత్రిలో చేరారు. బుధవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఉదయపు నడకకు ఒడిన్గా బయల్దేరగా గుండెపోటుతో కుప్పకూలారు. అక్కడే ఉన్న ఆయన కుమార్తె, సోదరి, వ్యక్తిగత వైద్యుడు, భారత, కెన్యా భద్రతాధికారులు హుటాహుటిన ఆయనను ఆస్పత్రిలోకి తీసుకెళ్లగా అప్పటికే ఆయన కన్నుమూశారని వైద్యులు ధ్రువీకరించారు. గత 12 సంవత్సరాలుగా కెన్యా పార్లమెంట్‌లో విపక్షనేతగా కొనసాగుతున్న ఒడిన్గా దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. అజీమియోలా ఉమోజా(వన్ కెన్యా) కూటమి పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. ఒడిన్గా మరణ వార్త తెల్సి కెన్యా ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. దేశ ప్రజాస్వామ్యాన్ని పటిష్టంచేసేందుకు అవిశ్రాంతంగా పోరాడిన తమ నేత లేడన్న వార్త తెలిసి నైరోబీలోని ఆయన సొంతింటికి జనం పోటెత్తారు. కెన్యా అధ్యక్షుడు విలియం రూటో సైతం ఒడిన్గా నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మరణం పట్ల భారత ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ''నిలువెత్తు దార్శనికుడు నేలకొరిగారు''అని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. కెన్యా ప్రజాస్వామ్యం కోసం పాటుపడిన గొప్పనేత ఒడిన్గా అంటూ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, టాంజానియా అధ్యక్షుడు సమియా సులుహూ సహా పలువురు ప్రపంచనేతలు తమ సంతాప సందేశాల్లో పేర్కొన్నారు. కెన్నెత్ మతిబా తర్వాత బహుళ రాజకీయపార్టీల కెన్యా ప్రజాస్వామ్యంలో ఒడిన్గాను మరో జాతిపితగా పలువురు కొనియాడతారు.

అత్యంత ప్రజాదరణ నేతగా పేరు

ఇటీవలి దశాబ్దాల్లో ఒడిన్గా కెన్యా రాజకీయాల్లో ముఖ్యనేతగా ఎదిగారు. కెన్యా స్వాతంత్ర్యం సాధించాక తొలి ఉపాధ్యక్షుడిగా సేవలందించిన జరమోగు అజుమా ఒడిన్గా కుమారుడే ఈ ఒడిన్గా. కెన్యాలోని కిసుము నగరంలో 1945 జనవరి 7న జన్మించారు. రాజకీయ కుటుంబంలో జన్మించిన ఈయన చిన్నతనం నుంచే రాజకీయాలపై ఆకర్షితులయ్యారు. జర్మనీలో ఇంజనీరింగ్ చదివారు. రాజకీయాల్లోకి రాకముందు కెన్యా నాణ్యతా ప్రమాణాల సంస్థకు మేనేజర్‌గా పనిచేశారు. తర్వాత డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. అయితే కేంద్ర ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నించాడన్న ఆరోపణలపై అరెస్టయి జైలు జీవితం గడిపారు. 1997లో తొలిసారిగా దేశాధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలయ్యారు. తర్వాత దేశబహిష్కరణకు గురై యూరప్‌లో గడిపారు. 1992లో స్వదేశానికి తిరిగొచ్చారు. తర్వాత సైతం నాలుగుసార్లు ఎన్నికల్లో గట్టిపోటీ ఇచ్చినా అధ్యక్ష పగ్గాలు చేపట్టలేకపోయారు. 2007లో స్వల్ప తేడాలో పదవి దక్కకపోవడంతో దేశవ్యాప్తంగా అల్లర్లు చెలరేగాయి. రోజుల తరబడి జరిగిన హింసాత్మక ఘటనల్లో వందల మంది చనిపోయారు. కానీ ఈయనపై ఎలాంటి ఆరోపణలు రాకపోవడం విశేషం. ఘర్షణలు సద్దుమణిగాక 2008 నుంచి 2013దాకా కూటమి ప్రభుత్వంలో ఆయన ప్రధానమంత్రిగా సేవలందించారు. యువకునిగా ఉన్నప్పుడు నైరోబీలోని గోర్ మహియా ఫుట్‌బాల్ క్లబ్ తరఫున కొంతకాలం ఫుట్‌బాల్ సైతం ఆడారు.

ఎన్నికల్లో పోటీచేయను

జన్‌సురాజ్ పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తా
- ఆ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ప్రకటన
- బిహార్‌కు తదుపరి సీఎం కావాలన్న కోరిక లేదని వెల్లడి
- అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఓటమి ఖాయం



పట్నా: వచ్చే నెలలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయటం లేదని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తానని తెలిపారు. పార్టీ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. బుధవారం ఆయన పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. 'నేను ఎన్నికల్లో పోటీ చేయకూడదని పార్టీ నిర్ణయించింది. తేజస్వీ యాదవ్‌పై ఇప్పటికీ మరో అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. నేను ఎన్నికల్లో పోటీ చేస్తే పార్టీకి అత్యవసరమైన సంస్థాగత పనుల నుంచి దూరం కావాల్సి వస్తుంది' అని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో 150 సీట్ల కంటే తక్కువ గెలిస్తే మేం ఓడిపోయినట్లే. బిహార్ ఎన్నికల్లో జన్‌సురాజ్ పార్టీ గెలిస్తే అది దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతుంది. జాతీయ రాజకీయాలు మరో మలుపు తిరుగుతాయి' అని పేర్కొన్నారు.

ఎన్డీయే ఓటమి ఖాయం

బిహార్ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఓడిపోబోతోందని ప్రశాంత్‌కిషోర్ తెలిపారు. సీట్ల పంపకాల్లో, అభ్యర్థుల ఎంపికలో గందరగోళమే ఆ కూటమి ఓటమికి కారణం కాబోతోందని పేర్కొన్నారు. 'రాష్ట్రంలో ఎన్డీయే కచ్చితంగా అధికారం కోల్పోతుంది. నితీశ్‌కుమార్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే లేదు. జేడీయూ ఎందుకు ఓడిపోతుందో చెప్పటానికి రాజకీయ విశ్లేషకులు అవసరం లేదు. ఎన్డీయే కూటమిలో తీవ్రమైన గందరగోళం ఉంది. బీజేపీ ఎక్కడెక్కడ పోటీ చేస్తుందో ఇప్పటికీ తెలియదు. జేడీయూ ఎక్కడెక్కడ అభ్యర్థులను నిలబెట్టాలని అనుకుంటుందో కూడా తెలియదు. ఇండియా కూటమిలో కూడా పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య ఎడతెగని కొట్లాట జరుగుతోంది. మాజీ మంత్రి ముఖేశ్ సహానీకి చెందిన వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ ఎవరికి మద్దతిస్తుందో ఎవరికీ తెలియదు'అని విమర్శించారు. రాష్ట్రంలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకుండా హంగ్ ఏర్పడితే ఎన్డీయే, ఇండియా కూటముల్లో ఎవరికైనా మద్దతిచ్చే అవకాశం ఉందా అని ప్రశ్నించగా, హంగ్ వచ్చే అవకాశమే లేదని స్పష్టంచేశారు. 'మేం బాగా పనిచేసినట్లయితే బిహార్‌ను పూర్తిగా మార్చివేసే తీర్పు వస్తుంది. అప్పుడు దేశంలోని మొదటి పది రాష్ట్రాల్లో బిహార్ నిలుస్తుంది. ఒకవేళ మేము బాగా పనిచేయకపోయి ఉంటే ప్రజలకు మామీద నమ్మకం కలగలేదని భావిస్తాం. అయినా సమాజం కోసం మా రాజకీయాలు కొనసాగుతూనే ఉంటాయి'అని స్పష్టంచేశారు.

మాకు అధికారమిస్తే అవినీతిని అంతం చేస్తాం

జన్‌సురాజ్ పార్టీకి ప్రజలు అధికారం అప్పగిస్తే మొదటి నెలలోనే రాష్ట్రంలోని అత్యంత అవినీతిపరులైన 100 మంది రాజకీయ నేతలు, ఉన్నతాధికారులను శిక్షించి, వారి ఆస్తులను ప్రభుత్వపరం చేస్తామని ప్రశాంత్‌కిషోర్ హామీ ఇచ్చారు. 'ఆర్జేడీ నేతలు లాలూప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌పై ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో అభియోగాలు మోపటం పెద్ద వార్తేమీ కాదు. అది ఇప్పటికే మురికిగా మారిన వస్త్రంపై మరో మరకలాంటిదే'అని పేర్కొన్నారు. బిహార్‌కు తదుపరి ముఖ్యమంత్రి కావాలన్న కోరిక తనకు ఏమీ లేదని తెలిపారు.

పోటీకి ముందే ఓటమి ఒప్పుకున్నారు

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయటం లేదన్న ప్రశాంత్ కిషోర్ ప్రకటనపై బీజేపీ, ఆర్జేడీ, జేడీయూ విమర్శలు గుప్పించాయి. పరిస్థితి అనుకూలంగా లేదని గ్రహించే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. 'ఎన్నికల్లో జన్‌సురాజ్ పార్టీ దారుణంగా ఓడిపోబోతోందని గ్రహించే ఆయన ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. యుద్ధరంగంలోకి రావటానికి ముందే ఓటమి ఒప్పుకున్నారు'అని ఆర్జేడీ నేత మృత్యుంజయ్ తివారీ ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందే కిషోర్ బుడగ పేలిపోయిందని బీజేపీ ప్రతినిధి నిరాజ్‌కుమార్ వ్యాఖ్యానించారు. కిషోర్ నిర్ణయం ఆయన పార్టీ కార్యకర్తలను అవమానించటమేనని జేడీయూ ప్రతినిధి నీరజ్‌కుమార్ విమర్శించారు. యుద్ధానికి ముందే ఆయన పారిపోయారని ఎద్దేవా చేశారు.

పోస్టుకార్డులతో గిన్నిస్ బుక్ రికార్డు

ప్రధాని మోదీకి 1.11 కోట్ల లేఖలు

అహ్మదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ గుజరాత్ సహకార రంగానికి సంబంధించిన ప్రజలు ఏకంగా 1.11 కోట్లకుపైగా లేఖలు రాశారు. పోస్టుకార్డులు పంపించారు. ఒకేసారి ఒకే వ్యక్తికి భారీసంఖ్యలో పోస్టుకార్డులు రాయడం గిన్నిస్ బుక్ ప్రపంచ రికార్డులోకి చేరిందని అధికారులు బుధవారం చెప్పారు. జీఎస్టీ సంస్కరణతోపాటు ఇతర చర్యలు చేపట్టినందుకు మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,11,75,000 పోస్టుకార్డులు పంపించడం గమనార్హం. ఈ అరుదైన ఘట్టాన్ని గిన్నిస్‌బుక్ ప్రపంచ రికార్డు ప్రతినిధులు గుర్తించారు. ఆయా పోస్టుకార్డులను లెక్కించారు. ప్రపంచ రికార్డు సృష్టించినట్లుగా సంబంధిత ధ్రువపత్రాన్ని మంగళవారం అధికారులకు అందజేశారు. ఇప్పటిదాకా 6,666 పోస్టుకార్డులే అతిపెద్ద రికార్డు. గతంలో స్విట్జర్లాండ్‌లో ఈ ఘనత సాధించారు. ఈ రికార్డును గుజరాత్ ప్రజలు తిరగరాశారు.

పాక్, అఫ్గాన్ మధ్య మళ్లీ ఘర్షణ

15 మంది పౌరులు మృతి.. 100 మందికి గాయాలు
- పాక్ సైన్యం కాల్పుల్లో 50 మంది తాలిబన్లు బలి!
- పెద్ద సంఖ్యలో పాక్ జవాన్లు హతమయ్యారని తాలిబన్ల ప్రకటన

ఇస్లామాబాద్: ఒకప్పటి సన్నిహిత మిత్రదేశాలైన పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. ఇరుదేశాల సరిహద్దుల్లో మళ్లీ ఘర్షణ జరిగింది. కాందహార్ ప్రావిన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి పాక్ సైన్యం, తాలిబన్ ఫైటర్ల మధ్య కాల్పులు జరిగాయి. తర్వాత ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో 15 మంది సాధారణ పౌరులు మరణించారు. 100 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో 80 మందికిపైగా మహిళలు, చిన్నారులే ఉన్నారు. పాక్ దాడిలో దాదాపు 50 మంది తాలిబన్లు మరణించినట్లు సమాచారం. సరిహద్దుల్లో ఘర్షణ నానాటికీ ముదురుతుండడంతో పాక్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఖతార్, సౌదీ అరేబియా ప్రభుత్వాలను ఫోన్‌లో సంప్రదించింది. అఫ్గాన్ సరిహద్దుల్లో శాంతి నెలకొనేలా మధ్యవర్తులుగా వ్యవహరించాలని, వెంటనే జోక్యం చేసుకొని తాలిబన్లను ఒప్పించాలని కోరింది.

పరస్పరం నిందలు

పాక్, అఫ్గాన్ మధ్య గతవారం హింసాకాండ మొదలైంది. కాబూల్‌లోని తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) క్యాంపులపై పాక్ సైన్యం వైమానిక దాడులకు దిగింది. దాంతో తాలిబన్లు సైతం ఎదురుదాడి ప్రారంభించారు. డురాండ్ లైన్‌లో 58 మంది పాక్ సైనికులను హతమార్చారు. 20 పాక్ సెక్యూరిటీ ఔట్‌పోస్టులను ధ్వంసం చేశారు. 2021లో అఫ్గానిస్తాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్న తర్వాత పాక్‌తో ఇదే అతిపెద్ద ఘర్షణ కావడం గమనార్హం. అఫ్గాన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలోనే పాక్ సైన్యం తాలిబన్లపై గురిపెట్టింది. మంగళవారం రాత్రి తొలుత పాక్ జవాన్లే కాల్పులు జరిపారని, భారీ ఆయుధాలు ప్రయోగించారని తాలిబన్ అధికార ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ ఆరోపించారు. తమ ఎదురుకాల్పుల్లో పెద్ద సంఖ్యలో పాక్ జవాన్లు హతమయ్యారని, పాక్ ఆయుధాలను, యుద్ధ ట్యాంక్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. అయితే, రెండు సరిహద్దు పోస్టులు సహా మొత్తం నాలుగుచోట్ల తాలిబన్లు మొదట కాల్పులు జరిపారని, దాంతో తాము ప్రతిస్పందించాల్సి వచ్చిందని పాకిస్తాన్ సైన్యం తెలియజేసింది. ఎదురుకాల్పుల్లో 30 మంది తాలిబన్ ఫైటర్లు మరణించారని స్పష్టంచేసింది. స్పిన్ బోల్డాక్‌లో మరో 20 మంది మృతిచెందారని వివరించింది. తాలిబన్లకు సంబంధించిన 8 సైనిక పోస్టులు, 6 యుద్ధ ట్యాంకులు ధ్వంసమైనట్లు పేర్కొంది. తాలిబన్ల దాడిలో చమన్ జిల్లాలో నలుగురు సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారని పాక్ వెల్లడించింది. ఒరాక్‌జాయ్ జిల్లాలో ఆరుగురు పాక్ పారామిలటరీ సిబ్బంది మృతిచెందినట్లు తెలిసింది. ఇరువర్గాల కాల్పుల నేపథ్యంలో సరిహద్దుల నుంచి వేలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. గత పది రోజులుగా సరిహద్దు మార్గాలను అధికారులు మూసివేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలు నానాటికీ క్షీణిస్తున్నాయి. పాక్ రక్షణ శాఖ మంత్రి, ఐఎస్ఐ అధినేత, ఇద్దరు సైనికాధికారులకు వీసాలు ఇవ్వడానికి తాలిబన్ ప్రభుత్వం నిరాకరించింది. వారిని తమ దేశంలోకి అనుమతించబోమని తేల్చిచెప్పింది. దాంతో అఫ్గాన్‌తో అన్ని రకాల సంబంధాలను తెంచేసుకుంటున్నట్లు పాక్ ప్రభుత్వం సంకేతాలిచ్చింది. మరోవైపు భారత్, అఫ్గానిస్తాన్ మధ్య సంబంధాలు బలపడుతుండడాన్ని పాక్ జీర్ణించుకోలేకపోతోంది. కాబూల్‌లో రాయబార కార్యాలయం ప్రారంభిస్తామని భారత ప్రభుత్వం ప్రకటించడం పాకిస్తాన్‌కు కంటగింపుగా మారింది.

48 గంటల కాల్పుల విరమణ

అఫ్గానిస్తాన్‌తో 48 గంటలపాటు తాత్కాలిక కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరినట్లు పాకిస్తాన్ ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. తాలిబన్ల విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయానికి వచ్చినట్లు వెల్లడించింది. పాకిస్తాన్ కోరుకోవడం వల్లనే కాల్పుల విరమణకు తాము అంగీకరించినట్లు తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తెలియజేశారు. ఒప్పందాన్ని తాము గౌరవిస్తామని అన్నారు. ఒకవేళ పాకిస్తాన్ సైన్యం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే తగిన రీతిలో బదులిస్తామని స్పష్టంచేశారు.

భారత పాస్‌పోర్టుకు 85వ ర్యాంకు

గత ఏడాది కంటే పడిపోయిన స్థానం

సింగపూర్: భారత పాస్‌పోర్టు స్థానం గత ఏడాదితో పోలిస్తే పడిపోయింది. 2025 హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్‌లో 85వ ర్యాంకు దక్కించుకుంది. భారత పాస్‌పోర్టుతో 57 దేశాలకు వీసా లేకుండా వెళ్లే సౌలభ్యం ఉంది. గత ఏడాది ఇదే ఇండెక్స్‌లో 80వ ర్యాంకు లభించింది. అప్పట్లో 62 దేశాలకు వీసా లేకుండా వెళ్లే సౌకర్యం ఉండేది. ఏడాది కాలంలో 5 స్థానాలు పడిపోయినట్లు స్పష్టమవుతోంది. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుగా సింగపూర్ పాస్‌పోర్టు తన స్థానాన్ని కాపాడుకుంది. ఈ పాస్‌పోర్టు ఉంటే 193 దేశాలకు వీసా లేకుండా వెళ్లొచ్చు. ఈ జాబితాలో దక్షిణ కొరియా పాస్‌పోర్టుకు రెండో ర్యాంకు దక్కింది. దీంతో 190 దేశాలకు వీసాతో నిమిత్తం లేకుండా వెళ్లే వీలుంది. మూడో స్థానంలో ఉన్న జపాన్ పాస్‌పోర్టుతో 189 దేశాలకు వీసా లేకుండా వెళ్లొచ్చు. జర్మనీ, ఇటలీ, లగ్జెంబర్గ్, స్పెయిన్, స్విట్జర్లాండ్ పాస్‌పోర్టులు నాలుగో ర్యాంకు దక్కించుకున్నాయి. వీటితో 188 దేశాలకు వీసా–ఫ్రీ సౌలభ్యం ఉంది.

సాక్షి గొంతు నొక్కేందుకు మరో ప్రయత్నం

సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి పోలీసుల నోటీసులు

వార్తా కథనానికి సంబంధించి సోర్స్ వెల్లడించాలి

వార్త ప్రిపరేషన్, ఎడిటింగ్, పబ్లికేషన్‌లతో సంబంధమున్న సిబ్బంది సమాచారం ఇవ్వాలి

వార్తా కథనానికి ఆధారాలు సమర్పించాలి.. పబ్లికేషన్ ఆథరైజేషన్ ఆమోదాల సమాచారమూ ఇవ్వాలి

నోటీసుల్లో స్పష్టం చేసిన నెల్లూరు జిల్లా పోలీసులు..

తద్వారా 'న్యూస్‌సోర్స్'పై ఉన్నత న్యాయస్థానాల రూలింగ్‌లను తుంగలోతొక్కిన వైనం


సాక్షి ఎడిటర్ ఆర్ ధనంజయరెడ్డిని ప్రశ్నిస్తున్న ఏపీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ప్రజల హక్కుల కోసం, ప్రజా ప్రయోజనాల కోసం పోరాడుతున్న 'సాక్షి' గొంతుక నొక్కడానికి కూటమి ప్రభుత్వం మరోసారి పోలీసులను ప్రయోగించింది. సాక్షి ఎడిటర్ ఆర్ ధనంజయ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ పోలీసులు బీఎన్ఎస్ఎస్ 179 (1), 94 సెక్షన్ల కింద బుధవారం రెండు వేర్వేరు నోటీసులు జారీ చేశారు. 'నకిలీ మద్యానికి నలుగురు బలి' శీర్షికన 2025 అక్టోబర్ 8వ తేదీన సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన వార్తకు సంబంధించి దాఖలైన రెండు అక్రమ కేసుల్లో నెల్లూర్ రూరల్ పోలీస్ స్టేషన్, కలిగిరి పోలీస్ స్టేషన్‌లకు చెందిన ఎస్ఐలు బుధవారం హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో ఎడిటర్ ధనంజయరెడ్డికి చెరో రెండు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులకు సంబంధించి పోలీసులు కేవలం గత మూడు రోజుల వ్యవధిలో మూడు సార్లు సాక్షి కార్యాలయానికి రావడాన్ని పరిశీలిస్తే, వారిమీద అధికార పెద్దల ఒత్తిడి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

అసమంజస ఆదేశాలు

వార్తా కథనానికి సంబంధించి బీఎన్ఎస్ఎస్ 94 సెక్షన్ ప్రకారం పలు డాక్యుమెంట్లు సమర్పించాలని ఎడిటర్‌ను పోలీసులు నిర్దేశించారు. వార్తకు సంబంధించి ఎడిటోరియల్ ఫైల్.. ఒరిజనల్ డ్రాఫ్ట్ కాపీ (ప్రింట్ అండ్ డిజిటల్) ఇవ్వాలని కోరారు. దీనితోపాటు వార్తా కథనానికి సంబంధించి ప్రిపరేషన్, ఎడిటింగ్, పబ్లికేషన్‌లతో సంబంధమున్న రిపోర్టర్‌లు, కరస్పాండెంట్లు, ఎడిటోరియల్ సిబ్బంది పేర్లు, హోదాలు, ఫోన్ నంబర్‌లు ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. ఈ వార్తా కథనానికి ఆధారాలకు సంబంధించిన మెటీరియల్, నోట్స్, ఫొటోలు, వీడియో ఫుటేజ్, స్టేట్‌మెంట్లు, ఈ-మెయిల్, మెసేజ్‌లు వంటి ఇతర ఆధారాలు ఏమున్నా సమర్పించాలని సూచించారు. పబ్లికేషన్ ఆథరైజేషన్ ఆమోదాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందించాలని స్పష్టం చేశారు. తద్వారా పత్రిక, మీడియాకు సంబంధించి సోర్స్ బయటకు వెల్లడించాల్సిన పనిలేదని ఆర్నాబ్ గోస్వామి కేసుతోసహా పలు సందర్భాల్లో ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పును పోలీసులు పూర్తిగా ఉల్లంఘించారు.

కేవలం 12 గంటల గడువు: కాగా, పోలీసులకు ఎడిటర్ పూర్తి స్థాయిలో సహకరించినప్పటికీ, ''తాము నిర్దేశించిన సమయంలో అందుబాటులో లేరు'' అంటూ నోటీసుల్లో పేర్కొన్న పోలీసులు తాము కోరిన సమాచారాన్ని అంతా కేవలం 12 గంటల లోపు అంటే.. 16వ తేదీన 2:30 గంటలకల్లా హైదరాబాద్ సాక్షి ప్రధాన కార్యాలయంలోకానీ లేదా ఆయా పోలీస్ స్టేషన్‌లలో కానీ (నెల్లూర్ రూరల్ పోలీస్ స్టేషన్, కలిగిరి పోలీస్ స్టేషన్)లలో సమర్పించాలని స్పష్టం చేశారు. అలాగే ''నిర్దేశించిన సమయంలో అందుబాటులో లేని కారణంగా'' 16వ తేదీ 10.30 గంటలకు తమ విచారణకు సాక్షి కార్యాలయంలో అందుబాటులో ఉండాలని నెల్లూర్ రూరల్ పోలీసులు 179 (1) నోటీసుల్లో పేర్కొనగా, ఈ సమయాన్ని 2.30 గంటలుగా కలిగిరి పోలీసులు నిర్దేశించడం గమనార్హం.

ఈ ప్రశ్నలకు బదులేది?

? ఒక వార్తా కథనానికి సంబంధించి ఎడిటర్‌ను సోర్స్ (ఆధారం) వెల్లడించమని పోలీసులు డిమాండ్ చేయడం, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కింద పత్రికా స్వేచ్ఛను నేరుగా ఉల్లంఘించడం కాదా?

? బీఎన్ఎస్ఎస్ 94 కింద డాక్యుమెంట్లు, ఎడిటోరియల్ ఫైళ్లు, రిపోర్టర్‌ల పేర్లు, ఫోన్ నంబర్లు ఇవ్వమని పోలీసుల ఆదేశం పత్రికా స్వేచ్ఛను అణిచివేసే చర్య కాదా?

? కేవలం 12 గంటల గడువులో 'అంతా సమర్పించాలని' అంటూ డిమాండ్ చేయడం, సహజ న్యాయ సూత్రమైన 'సమంజస సమయం ఇవ్వాలి' అనే నిబంధనను ఉల్లంఘించడం కాదా?

? సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్త ప్రజా ప్రయోజనాలతో ముడిపడి, ప్రజా అవగాహన కోసం ప్రచురితమైనది కాబట్టి, దానిని ఆధారంగా తీసుకుని కేసులు నమోదు చేయడం ప్రజా ప్రయోజన జర్నలిజాన్ని అణిచివేయడం కదా?

? వార్తా కథనానికి సంబంధించి రెండు వేర్వేరు పోలీస్ స్టేషన్లు (నెల్లూరు రూరల్, కలిగిరి) ఒకే రోజున వేర్వేరు నోటీసులు జారీ చేయడం, ద్వంద్వ విచారణ (డబుల్ జియోపార్డీ) లేదా అధికార దుర్వినియోగం కిందకు రాదా?

? ఉన్నత న్యాయస్థానాలు పలు తీర్పుల్లో పత్రికా సోర్స్‌ను వెల్లడించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసినప్పటికీ, ఏపీ పోలీసుల చర్య ఆ తీర్పులను తుంగలో తొక్కడం కాదా?

? ఈ చర్య మొత్తం జర్నలిస్టుల స్వేచ్ఛను హరించి భయపెట్టి, లొంగదీసుకునే చర్యగా ఎందుకు పరిగణించకూడదు?

మంత్రి శ్రీధర్‌బాబుకు అరుదైన గౌరవం

'ఆస్ బయోటెక్' ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించే అవకాశం


శ్రీధర్‌బాబును ఆహ్వానిస్తున్న ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ

సాక్షి, హైదరాబాద్: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. లైఫ్ సైన్సెస్ రంగంలో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా పరిగణించే 'ఆస్ బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్-2025'లో కీలకోపన్యాసం చేసే అవకాశం లభించింది. ఈనెల 21 నుంచి 24 వరకు ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ ఆస్ బయోటెక్, విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త నిర్వహణలో మెల్‌బోర్న్‌లో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక సదస్సులో భారత్ నుంచి ప్రసంగించే అవకాశం శ్రీధర్‌బాబుకు మాత్రమే దక్కింది. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలపై ఆయన ప్రసంగించనున్నారు. ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ బుధవారం శ్రీధర్‌బాబును ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. 'ఈ ఆహ్వానం లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ సాధించిన పురోగతికి అంతర్జాతీయ స్థాయిలో దక్కిన గౌరవం. ఈ రంగంలో కొత్తగా రూ.63 వేల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చాం. ఆస్ట్రేలియా, తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

వీలైనంత త్వరగా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలి: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: వీలైనంత త్వరగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డు లను జారీ చేయాలని, ఈనెల చివరి నాటికి పాలసీ విధివిధానాలు తీసుకురావా లని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధి కారులను ఆదేశించారు. జర్నలిస్టుల గౌరవాన్ని కాపా డేందుకు శాస్త్రీయ పద్ధతిలో అక్రెడిటేషన్ పాలసీ ఉండాలని సూచించారు. బుధవారం తెలంగాణ సచివాలయంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, సీపీ ఆర్‌వో మల్సూర్‌తో కలిసి అక్రెడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయ కత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. పాత్రి కేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, అర్హులైన జర్నలి స్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని వెల్లడించారు.

పంచాయతీ కార్యదర్శులకు డిప్యుటేషన్లు

సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు అనుగుణంగా డిప్యుటేషన్లపై పనిచేసేందుకు సుముఖంగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల వివరాలను తమకు సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారులకు (డీపీవో) పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ జి.సృజన సూచించారు. ఉద్యోగుల తుది కేటాయింపు ప్రక్రియ సందర్భంగా.. గతంలో పనిచేస్తున్న చోట్ల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శుల 'ఇంటర్ లోకల్ కేడర్ టెంపరరీ ట్రాన్స్‌ఫర్స్/ డిప్యుటేషన్ల'కు సంబంధించి మార్గదర్శకాలు పంపించినట్టు ఆమె తెలిపారు. 2021 డిసెంబర్‌లో జీవో 317 అమలు సందర్భంగా బదిలీ, ఆ తర్వాత 2022 ఫిబ్రవరి, 2024 సెప్టెంబర్‌లలో ఇచ్చిన రీ అలాట్‌మెంట్ల సందర్భంగా ప్రయోజనం లభించని వారిని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డీపీవోలకు ఓ మెమో ద్వారా పీఆర్ శాఖ సమాచారం పంపించింది. జీవో 317 వల్ల నష్టపోయిన కార్యదర్శులకు జీవో 190కి అనుగుణంగా డిప్యుటేషన్లు కల్పించాలని పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ డా.జి.సృజనకు వినతిపత్రం సమర్పించినట్టు తెలంగాణ పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్ (టీపీఎస్ఏ) అధ్యక్షుడు పి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. తమ విజ్ఞప్తిపై స్పందించిన డైరెక్టర్ అన్ని జిల్లాలకు మెమో జారీ చేస్తూ పంచాయతీ కార్యదర్శుల వివరాలను పంపించాలని డీపీవోలను ఆదేశించినట్టు వెల్లడించారు.

క్లుప్తంగా...

బాల సరస్వతి మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం



సాక్షి, అమరావతి: తెలుగు సంగీత ప్రపంచంలో తన అద్భుత గాత్రంతో ప్రత్యేక ముద్ర వేసిన తొలి సినీ నేపథ్య గాయని రావు బాలసరస్వతీ దేవి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని దేవు డిని ప్రార్థిస్తూ.. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు వైఎస్ జగన్ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఎయిమ్స్ డైరెక్టర్‌గా అమితా అగర్వాల్

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ నూతన డైరెక్టర్‌గా అమితా అగర్వాల్ నియామకమయ్యారు. గతంలో డైరెక్టర్‌గా ఉన్న వికాస్‌భాటియా మే నెలలో బదిలీపై వెళ్లగా రెగ్యులర్ డైరెక్టర్ నియామకం జరగలేదు. ఐదు నెలలుగా ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ అహెంతా శాంతాసింగ్ బీబీనగర్ ఎయిమ్స్‌కు ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా కొనసాగుతూ వస్తున్నారు. లక్నోలోని సంజయ్‌గాంధీ పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న అమితా అగర్వాల్‌ను బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్‌గా కేంద్రం నియమించింది. దీంతో ఇన్‌చార్జ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి శాంతాసింగ్ రిలీవ్ అయ్యారు. నూతన డైరెక్టర్ ఈనెల 23న బాధ్యతలు స్వీకరించనున్నారు.

నాచారం డీపీఎస్‌లో ర్యాగింగ్ ఘటనపై నివేదిక ఇవ్వండి

20 రోజుల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఎన్‌సీపీసీఆర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో గత నెలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి పుట్టినరోజు సందర్భంగా తోటి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడటం, ఇష్టారీతిన కొట్టడం, సదరు విద్యార్థి ప్రైవేట్ భాగాలపై దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగిన అంశం.. పాఠశాల యాజమాన్యం నిర్ల క్ష్యం వహించిన తీరుపై జాతీయ బాలల హక్కు ల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) తీవ్రంగా స్పందించింది. ఈ అంశంపై న్యాయవాది కారుపోతుల రేవంత్ ఎన్‌సీపీసీఆర్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనను పరిశీలించిన ఎన్‌సీపీసీఆర్ పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధితులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను 20 రోజుల్లోగా ఎన్‌సీపీసీఆర్‌కు సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

టీచర్ల బదిలీలు, డిప్యుటేషన్లకు దరఖాస్తుల స్వీకరణ

జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు ఊరట

సాక్షి, హైదరాబాద్: తాత్కాలిక బదిలీలు, డిప్యుటేషన్ల కోసం 317 జీవో బాధిత ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 317 జీవో కారణంగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని పలువురు టీచర్లు కొన్నేళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అంశంపై పరిశీలనకు ప్రభుత్వం కేబినెట్ ఉప సంఘం ఏర్పాటు చేసింది. ఈ సంఘం సిఫార్సు మేరకు గత నెలలో వారికి సొంత జిల్లాలకు బదిలీకి అవకాశం ఇస్తూ మార్గదర్శకాలు విడుదల చేశారు. దీని ప్రకారం ఈనెల 17 నుంచి 24 వరకు దరఖా స్తులు స్వీకరించనున్నట్టు నికోలస్ తెలిపారు.

'సాక్షి'పై కుతంత్రం

నకిలీ మద్యం మాఫియా ఆగడాలను బయటపెడుతున్నందుకే కక్ష సాధింపులు..

హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో రోజంతా పోలీసుల హల్‌చల్

నోటీసుల పేరుతో ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి వేధింపులు

4 రోజుల వ్యవధిలో మూడు రోజులు సాక్షి కార్యాలయాల్లో హల్‌చల్

పత్రికా స్వేచ్ఛపై ముప్పేట దాడి... రాజ్యాంగ హక్కుల అణచివేత

ప్రభుత్వ పెద్దలదే కుట్ర.. పోలీసు బాస్‌ల పర్యవేక్షణ

సాక్షి, అమరావతి: టీడీపీ సిండికేట్ నకిలీ మద్యం దోపిడీని కప్పిపుచ్చేందుకు చంద్రబాబు సర్కారు పోలీసు జులుంతో బరి తెగిస్తోంది! రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు తెగబడుతోంది. నకిలీ మద్యం దారుణాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి' పత్రికపై కక్ష సాధింపు చర్యలు తెగిస్తోంది. మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ మద్యం మాఫియాపై పోరాడుతున్న 'సాక్షి'పై అధికార మదంతో విరుచుకుపడుతోంది. నకిలీ మద్యం రాకెట్ దారుణాలను వెలుగులోకి తేకుండా కట్టడి చేయాలనే పన్నాగంతో బరితెగిస్తోంది. ఆర్టికల్ 19 (1) కింద రాజ్యాంగం ప్రసాదించిన పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన హక్కులను పాశవికంగా కాలరాస్తూ కుతంత్రాలకు తెగబడుతోంది. హైదరాబాద్‌లోని సాక్షి పత్రిక ప్రధాన కార్యాలయంలో ఏపీ పోలీసులు బుధవారం ఏకంగా 8 గంటలపాటు హల్‌చల్ చేయడం... ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిని విచారణ పేరుతో వేధించడం ప్రభుత్వ కుతంత్రానికి తార్కాణం. ఇక ఎస్వీఎస్ఆర్ నెల్లూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్‌ను కూడా వారం రోజులుగా వేధిస్తుండటం సర్కారు కుట్రలను బహిర్గతం చేస్తోంది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, దోపిడీని బట్టబయలు చేస్తున్న సాక్షి మీడియా గొంతు నొక్కేందుకు కూటమి ప్రభుత్వం సాగిస్తున్న కుట్రలు ఇలా ఉన్నాయి..

నకిలీ మద్యం దారుణాలను బట్టబయలు చేస్తున్నందునే

రాష్ట్రంలో నకిలీ మద్యం మాఫియా యథేచ్ఛగా సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా సాక్షి మీడియా పోరాడుతోంది. మద్య ప్రియుల ప్రాణాలకు పెనుముప్పు కలిగిస్తున్న నకిలీ మద్యం బాగోతాన్ని పూర్తి ఆధారాలతో వెలుగులోకి తెస్తూ ప్రజలను చైతన్య పరుస్తోంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు, తాజాగా అన్నమయ్య జిల్లా ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలలో నకిలీ మద్యం మాఫియా దారుణాలను సవివరంగా వెల్లడించింది. రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛ హక్కుతో 'సాక్షి' బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రభుత్వ పెద్దలకు కంటగింపుగా మారింది. నకిలీ మద్యం తాగిన అనంతరం సందేహాస్పద రీతిలో నలుగురు మృతి చెందడం రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. ఆ వాస్తవాన్ని సాక్షి పత్రిక ప్రచురించటాన్ని కూటమి ప్రభుత్వ పెద్దలు సహించలేకపోయారు. నకిలీ మద్యం దందాను అరికట్టడంపై కాకుండా.. వాటిని వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలకు తెగబడ్డారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఎస్వీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో నెల్లూరు రూరల్, కలిగిరి, పల్నాడు జిల్లా నరసరావుపేటలో అక్రమంగా క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పత్రికలు ప్రచురించే కథనాలపై ఏదైనా అభ్యంతరం ఉంటే అధికారికంగా వివరణ (రిజాయిండర్) పంపించవచ్చు. ఇంకా కావాలనుకుంటే పరువు నష్టం దావా వేయవచ్చు. అందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. దీనిపై న్యాయస్థానం తుది తీర్పును వెల్లడిస్తుంది. కానీ కూటమి ప్రభుత్వం రాజ్యాంగపరమైన నిబంధనలను పాటించాలన్న ఆలోచనే లేనట్లుగా కక్ష సాధింపు చర్యలకు తెగబడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా సాక్షిపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది.

ఐదు రోజులుగా వేధింపులు..

అనంతరం ప్రభుత్వం పోలీసులను నేరుగా రంగంలోకి దింపింది. ఈ క్రమంలో పోలీసులు ఐదు రోజులుగా నోటీసుల పేరుతో సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఎస్వీఎస్ఆర్ నెల్లూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్‌ను వేధిస్తున్నారు. ఈ నెల 12న తెల్లవారుజామునే విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి కార్యాలయానికి పోలీసులు చేరుకుని హడావుడి చేశారు. కార్యాలయం తాళాలు తెరవకముందే అక్కడకు వచ్చి నోటీసులు తీసుకోవాలని సిబ్బందిని వేధించారు. ఎడిటర్ హైదరాబాద్ కార్యాలయంలో ఉంటారని చెప్పినా వినిపించుకోకుండా సంబంధం లేని ప్రశ్నలతో బెదిరించేందుకు యత్నించారు. ఇక ఎస్వీఎస్ఆర్ నెల్లూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డి నివాసానికి వెళ్లిన పోలీసులు భయానక వాతావరణం సృష్టించారు. ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు నెల్లూరు రూరల్ పోలీసులు, రాత్రి 8.30 గంటలకు కలిగిరి పోలీసులు వెళ్లి నోటీసుల పేరుతో హడావుడి చేశారు. అంతేకాదు.. 12వ తేదీ తెల్లవారు జామునే మరోసారి ఆయన నివాసంలో సోదాల పేరుతో పోలీసులు హల్‌చల్ చేశారు. వెంటనే విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు రావాలని ఒత్తిడి చేశారు. ఆరోగ్య సమస్యలతో డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉన్నందున విచారణకు హాజరయ్యేందుకు పది రోజుల సమయం కావాలని ఆయన కోరారు. సరేనని వెళ్లిన పోలీసులు మళ్లీ అదే రోజు అర్ధరాత్రి మళ్లీ మస్తాన్‌రెడ్డి నివాసానికి రావడం గమనార్హం. రాత్రి 11.15 గంటలకు నెల్లూరు రూరల్ పోలీసులు, అర్ధరాత్రి 1.20 గంటలకు కలిగిరి పోలీసులు ఆయన నివాసానికి వచ్చి రాద్ధాంతం చేశారు. పది రోజుల సమయం ఇవ్వడం కుదరదని.. మర్నాడే అంటే 13వతేదీ ఉదయమే విచారణకు రావాలని మళ్లీ నోటీసులు ఇచ్చారు. 13న ఉదయం 10.30 నుంచి 2.30 గంటల వరకు నెల్లూరు రూరల్ పోలీసులు ఆయన్ను విచారించారు. ఏమాత్రం సంబంధం లేని 62 ప్రశ్నలు అడిగారు. ఇక సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కలిగిరి పోలీసులు విచారించారు. 67 ప్రశ్నలు అడగటం గమనార్హం. అంతటితో పోలీసులు శాంతించలేదు. ఈ నెల 17న మళ్లీ విచారణకు రావాలని బుధవారం సమాచారం ఇచ్చారు.

హైదరాబాద్‌లో ఏపీ పోలీసుల హల్‌చల్...

మరోవైపు హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంపై పోలీసులు దాడి చేసినంత పని చేశారు. ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి వాట్సాప్‌లో ముందుగా నోటీసులు పంపారు. అసలు వాట్సాప్‌లో నోటీసులు పంపవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించినా, దాన్ని నిర్భీతిగా ఉల్లంఘించి మరీ వాట్సాప్‌లో నోటీసులు పంపించారు. నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసులు బుధవారం హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కార్యాలయంలో హడావుడి చేసి పాత్రికేయులను బెదిరించే రీతిలో వ్యవహరించారు. అంటే సాక్షి పత్రిక గొంతు నొక్కేందుకు కూటమి ప్రభుత్వం ఎంత కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నది స్పష్టమవుతోంది. ఈ క్రమంలో బుధవారం నోటీసుల జారీ, విచారణ పేరుతో సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిని వేధించారు. ప్రచురించిన వార్తా కథనానికి సంబంధించి అన్ని ఆధారాలు ఇవ్వాలని, న్యూస్ సోర్స్ చెప్పాలని, మరింత సమాచారం కోసం రేపు విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. 12 గంటల సమయం ఇచ్చి రేపు హాజరు కావాలన్నారు. పోలీసుల ప్రశ్నావళికి సమాధానం చెప్పేందుకు తమకు పది రోజుల సమయం కావాలని ఎడిటర్ ధనంజయరెడ్డి వారితో పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో విచారణకు వచ్చేందుకు ఈ నెల 29 వరకు గడువు కోరారు.

ప్రభుత్వ పెద్దల కుట్రే.. పోలీస్ బాస్‌ల పర్యవేక్షణ

సాక్షి పత్రిక, ఎడిటర్, పాత్రికేయులపై అక్రమ కేసుల కుట్రను ప్రభుత్వ పెద్దలే నడిపిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. ఉన్నత స్థాయి ఆదేశాలు, ఒత్తిడితోనే పోలీసులు ఐదు రోజులుగా వేధింపులకు పాల్పడుతున్నారు. హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో సోదాలు, విచారణకు వచ్చిన పోలీసులకు ఎస్వీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజండ్ల ఏకంగా 30 సార్లు ఫోన్ కాల్స్ చేసినట్లు తెలుస్తోంది. అంటే పోలీసు వేధింపులను ఉన్నత స్థాయిలో ఎంత నిశితంగా పర్యవేక్షిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. అంటే సాక్షి పత్రిక, ఎడిటర్, పాత్రికేయులపై అక్రమ కేసుల కుట్ర అంతా ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే సాగుతోందన్నది తేటతెల్లమవుతోంది.

కేసులు నమోదు పద్ధతి కాదు..



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి పత్రిక ఎడిటర్‌పై వరుసగా కేసులు నమోదుచేయడం ఆక్షేపణీయం. ఏదైనా వార్త, కథనంలో తప్పున్నట్లైతే అందుకు సంబంధించిన వివరణ ఇవ్వాలని, లేదా ఎడిటర్స్ గిల్డ్, ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలి. కానీ, ఎడిటర్‌ను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదుచేయడం పద్ధతికాదు. సాక్షి ప్రసారాలను నిలిపివేసిన అంశంపై సుప్రీంకోర్టు మంగళవారం ఘాటు వ్యాఖ్యలు చేసినప్పటికీ.. ప్రభుత్వం తీరు మారకుండా నకిలీ మద్యం వార్తలపై కేసులు నమోదుచేసి, నోటీసులు జారీచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. రాజకీయ కక్షను మీడియా మీద చూపించడం కూటమి ప్రభుత్వానికి తగదు. ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– తెలకపల్లి రవి, సీనియర్ సంపాదకులు

'సాక్షి' ఎడిటర్‌పై కేసులు పత్రికా స్వేచ్ఛను హరించడమే..



పత్రికలో ఒక వార్త ప్రచురిస్తే ఆ వార్తకు సంబంధించి 'న్యూస్ సోర్స్'ను వెల్లడించాలని పోలీసులు బలవంతం చేయలేరు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) ప్రకారం పత్రికా స్వేచ్ఛకు స్పష్టమైన హామీ ఉంది. ఈ స్వేచ్ఛకు మూలాల రక్షణ ఒక ప్రాథమిక షరతు అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అయితే, ఏపీలోని టీడీపీ కూటమి సర్కారు 'సాక్షి' పత్రికపై కక్షపూరితంగా వ్యవహరించడమేకాక, ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వరుసగా కేసులు నమోదుచేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. వార్తపై అభ్యంతరం ఉంటే.. వివరణ, ఖండన ఇవ్వడం, ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలే తప్ప ఇష్టానుసారం కేసులు నమోదుచేయడం సరికాదు. ఒక జర్నలిస్టు వార్త ప్రచురించినందుకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్-194 కేసు పెట్టడం దారుణం. 194 అనేది దౌర్జన్యం (Affray) గురించి వివరిస్తుంది. పత్రికా స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులను కూటమి సర్కారు ఉల్లంఘించడం దారుణం.

– డాక్టర్ పి. విజయబాబు, సీనియర్ సంపాదకులు

మాపై సీఎం రేవంత్ కుట్ర

మంత్రి ఉత్తమ్, వేం నరేందర్ కూడా..

మా అమ్మ అరెస్టుకు యత్నాలు

మంత్రి సురేఖ కుమార్తె సుస్మిత ఆరోపణ


తమ ఇంటికి వచ్చిన వ్యక్తితో సుస్మిత వాగ్వాదం

బంజారాహిల్స్ (హైదరాబాద్): తమ కుటుంబంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత సంచలన ఆరోపణలు చేశారు. రెడ్లందరూ కలసి తమ కుటుంబంపై పగబట్టారని విమర్శించారు. బుధవారం రాత్రి మంత్రి కొండా సురేఖ నివాసం వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ ఎంపీ ఎమ్మెల్యే కాలనీ లోని కొండా సురేఖ నివాసం వద్దకు నలుగురు వ్యక్తులు వచ్చి సురేఖ ఓఎస్డీ సుమంత్ గురించి ఆరాతీశారు. సుమంత్‌ను అరెస్టు చేసేందుకే వారు వచ్చినట్లు తెలుసుకున్న సుస్మిత బయటకు వచ్చి.. 'ఎవరి కోసం వచ్చారు?.. ఎందుకొచ్చారు'అని ప్రశ్నించారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో మీడియా చేరుకుంది. దీంతో ఆ నలుగురు వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రాజకీయంగా అణగదొక్కేందుకే..: ఈ వ్యవహారంపై కొండా సుస్మిత ఓ మీడియా చానల్‌తో మాట్లాడుతూ.. బీసీ మంత్రి అయిన తన తల్లిని రాజకీయంగా అణగతొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 'ఈరోజు సుమంత్‌పై కేసు పెట్టి, అర్ధరాత్రి ఇంటికి పోలీసులను పంపి మా అమ్మను అరెస్ట్ చేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి విశ్వాసపాత్రులుగా ఉండటమే మేం చేసిన తప్పా?. రేవంత్‌రెడ్డి మా కుటుంబంపై ఎందుకు పడ్డాడు? రేవంత్‌రెడ్డి అన్నదమ్ములైన తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి పార్టీకి ఏం చేశారని గన్‌మెన్లను ఇచ్చారు?' అని ఆమె విరుచుకుపడ్డారు. కాగా, జూబ్లీహిల్స్ పోలీసులు మంత్రి సురేఖ ఇంటికి చేరుకుని మఫ్టీలో వచ్చిన వారి గురించి ఆరా తీస్తున్నారు. ఆ సమయంలో సురేఖ ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం.

గవ్వలసరి.. జలసిరి



చందంపేట: ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరైన నల్లగొండ జిల్లా చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలోని గవ్వలసరి ప్రాంతంలో ఎత్తయిన గుట్టల నుంచి జాలువారుతున్న జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో ఎత్తయిన ప్రదేశం నుంచి జలాలు కిందికి జాలువారుతు న్నాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు వేర్వేరు ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలివస్తున్నారు.


కొలనును తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాల

కొలను కాదు.. ప్రభుత్వ పాఠశాలే

భారీ వర్షానికి జలమయమైన బడి

మణుగూరు రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధి అరుంధతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం ఈత కొలనును తలపిస్తోంది. మండల వ్యాప్తంగా మంగళవారం కురిసిన భారీ వర్షానికి పాఠశాల ఆవరణలోకి వరద చేరింది. దీంతో బుధవారం విద్యార్థులు లోపలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉపాధ్యాయులు పాఠశాల బయటే చెట్టు కింద తరగతులు బోధించారు. కాగా, ఈ పాఠశాల.. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాసానికి సమీపానే ఉండటం గమనార్హం. అయితే, విద్యార్థులకు ఆరు బయట బోధిస్తున్నారని తెలిసి తల్లిదండ్రులు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అనంతరం మణుగూరు ఎంఈవో స్వర్ణజ్యోతి, పంచాయతీ కార్యదర్శి చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

విలువలతో కూడిన శిక్షణ ఇస్తున్నాం.. అయినా!

- ఇక్కడ బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయి పరిస్థితుల్లో కొందరు మారుతున్నారని వెల్లడి
- రేపు పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొననున్న 174 మంది ఐపీఎస్‌లు, 16 మంది విదేశీ అధికారులు

యువ ఐపీఎస్‌లపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్ వ్యాఖ్య



బ్యాచ్ టాపర్లుగా నిలిచిన ట్రైనీ ఐపీఎస్‌లతో నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్. చిత్రంలో సీనియర్ ఐపీఎస్‌లు శ్రీనివాసవర్మ, అజిత్ ప్రతాప్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: 'యువ ఐపీఎస్ అధికారులకు నేషనల్ పోలీస్ అకాడమీలో అత్యుత్తమ విలువలతో కూడిన శిక్షణ ఇస్తున్నాం. అయితే క్షేత్రస్థాయి విధుల్లోకి వెళ్లిన తర్వాత వాటిని పాటించడం అనేది వారి ఇష్టం. అయితే, అవినీతి కేసుల్లో ఉంటే ఎదురయ్యే పరిణామాలపై కూడా ఎప్పటికప్పుడు ట్రైనీ ఐపీఎస్‌లకు వివరిస్తూనే ఉన్నాం'అని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీ ఎన్‌పీఏ) డైరెక్టర్ అమిత్‌గార్గ్ వ్యాఖ్యానించారు. శిక్షణ తర్వాత విధుల్లో చేరుతున్న యువ ఐపీఎస్ అధికారులపై ఇటీవల అవినీతి ఆరోపణలు పెరిగాయన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు సమాధానంగా అమిత్‌గార్గ్ ఈ మేరకు పేర్కొన్నారు. కొందరు యువ ఐపీఎస్‌ల ప్రవర్తనపై ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసుకొని అకాడమీ నుంచి బయటకు వెళ్లిన కొంతమంది ఐపీఎస్‌లు విలువలు మర్చిపోతున్నారన్నారు. అయితే, శిక్షణలో భాగంగా అత్యుత్తమ విలువలు నేర్పేందుకు ప్రత్యేకంగా 11 అంశాలతో కూడిన ఒక మాడ్యుల్ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్-2024) బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం అమిత్ గార్గ్ మీడియాతో మాట్లాడారు. పరేడ్‌కు ముఖ్యఅతిథిగా బీఎస్ఎఫ్ డైరెక్టర్ దల్జీత్‌సింగ్ చౌదరి హాజరవుతారన్నారు. 77 ఆర్ఆర్ బ్యాచ్‌లో మొత్తం 174 మంది ట్రైనీ ఐపీఎస్ (ఇండియన్ పోలీస్ సరీ్వస్)లు, 16 మంది నేపాల్, రాయల్ భూటాన్, మాల్దీవ్‌లకు చెందిన విదేశీ పోలీస్ అధికారులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 65 మంది మహిళా అధికారులు ఉన్నారని చెప్పారు. శిక్షణలో భాగంగా మొదటిదశలో 29 వారాలపాటు అకాడమీలో, ఆ తర్వాత 29 వారాలపాటు వారికి కేటాయించిన రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి శిక్షణ, ఆ తర్వాత రెండో దశలో మరో 9 వారాలపాటు ఇండోర్, ఔట్‌డోర్ అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. నూతన చట్టాలపై అవగాహన, సైబర్ నేరాల నియంత్రణ, పోలీస్ ప్రవర్తన, నైతిక విలువలు, మానవహక్కులకు సంబంధించి నిపుణులతో ప్రత్యేక తరగతులు ఇప్పించామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీపై స్పెషల్ ట్రైనింగ్ ఇచ్చామన్నారు. సైబర్ క్రైమ్, వైట్ కాలర్ అఫెన్సెస్‌తోపాటు చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులను నివారించేందుకు పోక్సో చట్టం, కొత్త చట్టాలు అమలుపై నిపుణులతో తరగతులు నిర్వహించామని తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థల అటాచ్‌మెంట్‌లోనూ ట్రైనీ ఐపీఎస్‌లు సుశిక్షితులయ్యారన్నారు.

పెరిగిన మహిళా ఐపీఎస్‌ల సంఖ్య

గత బ్యాచ్‌లతో పోలిస్తే 77 ఆర్ఆర్ బ్యాచ్‌లో మహిళా ఐపీఎస్‌ల సంఖ్య పెరిగింది. ఈ బ్యాచ్‌లో 65 మహిళా ఐపీఎస్‌లు శిక్షణ పూర్తి చేశారు. 76 బ్యాచ్‌లో 54 మంది, 75వ బ్యాచ్‌లో 32 మంది, 74వ బ్యాచ్‌లో 37 మంది, 73వ బ్యాచ్‌లో 25 మంది మహిళా ఐపీఎస్‌లు శిక్షణ పూర్తి చేశారు.

తెలంగాణ, ఏపీ కేడర్‌కు నలుగురు చొప్పున..

ఈ బ్యాచ్ ఐపీఎస్‌లలో తెలంగాణ కేడర్‌కు ఆయోషా ఫాతిమా (మధ్యప్రదేశ్), మంధరె సోనం సునీల్ (మహారాష్ట్ర), మనీషానెహ్రా (రాజస్తాన్), రాహుల్ కంట్ (జార్ఖండ్)లను కేటాయించగా, ఏపీ కేడర్‌కు అశ్విన్ మనిదీప్ కకుమను (ఆంధ్రప్రదేశ్), జాదవ్‌రావు నిరంజన్ మహేంద్రసిన్హ్ (మహారాష్ట్ర), జయశర్మ (ఢిల్లీ), తరుణ్ (హరియాణా)లు కేటాయించారు.

'ఓటుకు కోట్లు'పై నేడు సుప్రీం తీర్పు



- రేవంత్‌రెడ్డిపై దాఖలైన కేసు చెల్లుబాటు కాదు: ముకుల్ రోహత్గీ
- అప్పట్లో రేవంత్ మా ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నించారు: ఆర్యమ సుందరం
- విచారణ నేటికి వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గతంలో దాఖలైన 'ఓటుకు కోట్లు'కేసులో గురువారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించనుంది. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియమావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 2021 జూలై 22న రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలాగే ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ అంతకుముందు ఏప్రిల్ 13న సండ్ర వెంకట వీరయ్య కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ రెండు పిటిషన్లపై తాజాగా బుధవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ కేసు విచారణను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని గతంలో బీఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించి వారి తరపు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం తొలుత వాదనలు వినిపించారు. అనంతరం రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహిత్గీ సుమారు గంటకుపైగా వాదనలు వినిపించారు.

ఏసీబీ కేసు అక్రమం: ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గతంలో దాఖలైన కేసు చెల్లుబాటు కాదని రోహత్గీ వాదించారు. ఈ కేసులో ముందుగా రేవంత్‌రెడ్డిని ట్రాప్ చేసిన తర్వాతే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసిందని చెప్పారు. ఏసీబీ ట్రాప్ అక్రమమని పేర్కొన్నారు. 2015లో అమలుల్లో ఉన్న అవినీతి నిరోధక చట్టాలను అనుసరించి లంచం ఇవ్వడం నేరం కూడా కాదన్నారు. తమ కేసు 2015లో దాఖలైనందున, ఆనాటి చట్టాలే వర్తిస్తాయని చెప్పారు. మరోవైపు.. అప్పట్లో తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన రేవంత్ ఇప్పుడు సీఎంగా ఉన్నారు కాబట్టి మరోసారి తమ వైపు వాదనలు వినాలని బీఆర్ఎస్ నేత జగదీశ్వర్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం ధర్మాసనాన్ని కోరారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. గురువారం వాదనల అనంతరం తీర్పును వెలువరించనుంది.

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు నిధులివ్వండి

ప్రధాని మోదీకి సీఎం రేవంత్, ఎంపీ మల్లు రవి లేఖలు

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.800 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి ప్రధాని మోదీకి లేఖలు రాశారు. ఈ రెండు లేఖలను బుధవారం మల్లు రవి ప్రధాని కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, 'మన్ననూర్ నుంచి శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌తోపాటు ఎంపీల బృందం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశాం. అదే విషయమై ప్రధానికి లేఖలు రాశాం. అలాగే రెండు తెలుగు రాష్ట్రాలను కలిపేలా కృష్ణా నదిపై వంతెనను మంజూరు చేయాలని కోరాం. ఇంటర్ స్టేట్ కనెక్టివిటీ స్కీమ్ కింద ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశాం. దీనితోపాటు దళిత ఐపీఎస్ అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా నేను రాసిన లేఖను ప్రధాని కార్యాలయంలో అందజేశా. ప్రధాని ఈ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అలాగే పూరణ్‌కుమార్ ఆత్మహత్యపై చర్యలు తీసుకోవాలని నేను రాసిన లేఖలను జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌లకు పంపిస్తా'నని మల్లు రవి తెలిపారు.

క్లుప్తంగా...

ఎంపీవోల సర్టిఫికెట్ల ధ్రువీకరణ

సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో మండల పంచాయతీ ఆఫీసర్లుగా (ఎంపీవో) ఎంపికైన 126 మంది ధ్రువ పత్రాల పరిశీలన బుధవారం జరిగింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌కార్యాలయంలో.. ఎంపీవోలుగా ఎంపికైన వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. గ్రూప్-2లో మొత్తం 126 మంది ఎంపికవగా.. ఇందులో 120 మంది సర్టిఫికెట్లతనిఖీ పూర్తయ్యింది. మల్టీజోన్-1లో 70 మంది ఎంపికవగా.. 67 మంది, మల్టీజోన్-2లో 56 మందికి 53 మంది ధ్రువపత్రాలను సరిచూశారు. దీని నిమిత్తం పీఆర్‌కమిషనరేట్‌లో ఆరు కౌంటర్లను ఏర్పాటు చేశారు. పీఆర్, ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ జీ.సృజన పర్యవేక్షణలో పంచాయతీరాజ్‌ఆఫీసర్లు కృష్ణమూర్తి, కిషన్ సింగ్, విఠల్‌బాబు, నాగరాజు, క్రాంతి కిరణ్, విశాలాక్షి ఈ పత్రాలను పరిశీలించారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. అభ్యర్థులకు శనివారం మాదాపూర్‌లోని శిల్పాకళా వేదికలో జరగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలను అందజేయనున్నారు.

స్నేహితురాలిగా పిటిషనర్ హోదా అస్పష్టం

హెబియస్ కార్పస్‌ను అనుమతించలేమన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి నుంచి రెస్క్యూ ఆపరేషన్ సమయంలో రక్షించిన ఇద్దరు బాధితులను విడిపించాలని జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం కింద పిటిషనర్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను అనుమతించలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. బాధితురాలి స్నేహితురాలినని పిటిషనర్ చెబుతున్నా.. ఆమె హోదా కొంత అస్పష్టంగా ఉందని అభిప్రాయపడింది. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. యూసుఫ్‌గూడలోని స్టేట్ హోమ్‌లో బాధితులను అక్రమంగా నిర్బంధించారని ఫిర్యాదు చేస్తూ యాదగిరిగుట్టకు చెందిన అంజలి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టి.. బుధవారం తీర్పునిచ్చింది. స్నేహితురాలిగా ఆమె హోదా అస్పష్టంగా ఉందని, ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను సమర్థించలేమన్న స్పెషల్ జీపీ స్వరూప్ ఊరిల్ల వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కొట్టివేసింది.

రాడార్ కేంద్రం ఏర్పాటుపై వివరాలివ్వండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్‌లో దామగుండం రిజర్వు అటవీ ప్రాంతంలోని 2,900 ఎకరాలను రాడార్ కేంద్రం ఏర్పాటుకు అప్పగించడంపై వివరాలు సమర్పించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. అలాగే బయోడైవర్సిటీ చట్టం కింద నిపుణుల కమిటీ కొనసాగుతుందో.. లేదో తెలపాలని కేంద్రానికి స్పష్టం చేసింది. జీవవైవిధ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరణ ఇవ్వాలంటూ, తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 13కు వాయిదా వేసింది. రాడార్ కేంద్రం ఏర్పాటు కోసం దామగుండం అటవీ భూములను బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది వివేక్ జైన్ వాదనలు వినిపిస్తూ.. పిల్ దాఖలై ఐదేళ్లు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ వేయలేదని, కేంద్రం దాఖలు చేసినా పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణ లాంటి వివరాలు ప్రస్తావించలేదని పేర్కొన్నారు. అదనపు అఫిడవిట్ సమర్పణకు కేంద్రం గడువు కోరడంతో ధర్మాసనం.. విచారణ వాయిదా వేసింది.

మొదటి ప్రాధాన్యం ఆ 8 వైద్య కళాశాలలే!

ఈ నెలలో రూ.500 కోట్లు విడుదల

- మార్చి వరకు ప్రతినెలా రూ.340 కోట్లు
- 100 పడకలు దాటిన ఆస్పత్రి నిర్వహణ బాధ్యత గ్రూప్-1 అధికారులకు



మంచిర్యాలలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 70 శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయిన ఎనిమిది వైద్య కళాశాలలను తొలుత అందుబాటులోకి తెచ్చేందుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కళాశాలలకు చెందిన 30 ఎకరాల ఆవరణ లో వైద్య విద్యార్థులకు హాస్టళ్లు, పారా మెడికల్ కాలేజీ, బోధనాస్పత్రి, ఎంసీహెచ్‌తోపాటు కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెలలో రూ. 500 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించింది. నవంబర్ నుంచి 2026 మార్చి వరకు ప్రతినెలా రూ. 340 కోట్లు కేటాయిస్తారు. ఈ మేర కు సీఎం ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలలో విడుదల కానున్న రూ. 500 కోట్ల నుంచి తొలిదశలో చేపట్టిన 8 వైద్య కళాశాలల నిర్మాణానికి సంబంధించిన బకాయిల చెల్లింపు, మిగిలిపోయిన పనుల పూర్తికి వెచ్చిస్తారు.

మొదటి దశ కాలేజీలే ముందుగా...

రాష్ట్రంలో 2021 వరకు 9 మెడికల్ కాలేజీలు మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉండగా, ఆ ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వం 8 కొత్త కాలేజీలను ప్రకటించింది. సంగారెడ్డి, మహబూబాబాద్, జగిత్యాల, వనపర్తి, మంచిర్యాల, కొత్తగూడెం, నాగర్‌కర్నూలు, రామగుండంలోని 8 మెడికల్ కాలేజీల్లో 2022 నుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయి. అయితే తాత్కాలికంగా వేర్వేరు చోట్ల కళాశాలలను ఏర్పాటు చేసి, జిల్లా ఆస్పత్రులను అనుబంధ ఆస్పత్రులుగా మార్చి ఎంబీబీఎస్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలల నిర్మాణ పనులు దాదాపు 70 శాతానికి పైగా పూర్తయ్యాయి.

ఆస్పత్రుల్లో సూపరింటెండెంట్ల విధి వైద్యమే...

వైద్య సంబంధమైన అంశాలపై సూపరింటెండెంట్లు దృష్టి పెట్టడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతల నుంచి సూపరింటెండెంట్లను తప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆస్పత్రుల్లో వైద్యం, వైద్యేతర అంశాలను విడివిడిగా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా 100 పడకలు దాటిన ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలను గ్రూప్-1 స్థాయి అధికారులకు అప్పగించాలని సీఎం రేవంత్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర అధికారులతో మంగళవారం రాత్రి జరిగిన సమీక్ష సమావేశంలో స్పష్టం చేశారు. కొత్తగా నియమితులైన గ్రూప్-1 స్థాయి అధికారుల్లో తొలుత 20 మందిని ప్రధాన ఆస్పత్రులు, బోధనాస్పత్రులకు కేటాయించాలని ఆదేశించినట్టు సమాచారం.

- జోన్-1లో 65 ఏఓ పోస్టులు ఖాళీగా ఉండగా, జోన్-2లో 49 పోస్టులు వేకెంట్‌గా ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయడం ద్వారా సూపరింటెండెంట్లకు పనిభారం తగ్గించనున్నారు.

హైలోడ్.. మీటర్ మటాష్

- రాజధాని పరిసర ప్రాంతాల్లో గరిష్టంగా.. రోజూ కాలిపోతున్న విద్యుత్ మీటర్లు 3 వేలు
- లోడ్‌కు తగ్గ సామర్థ్యం లేకపోవడమే కారణం



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ పంపిణీ సంస్థల లెక్కల ప్రకారం ప్రతీ రోజూ సగటున 3 వేల విద్యుత్ మీటర్లు కాలిపోతున్నాయి.విద్యుత్ డిమాండ్ పెరగడం ఒక కారణమైతే, మీటర్లు, వాటిల్లో వాడే నాసిరకం సామగ్రి మరో కారణంగా భావిస్తున్నారు. ఈ పరిస్థితిపై డిస్కంలు నిపుణుల కమిటీలను నియమించాయి. సాంకేతిక కారణాలపై అధ్యయనం చేస్తున్నాయి. చెడిపోయిన మీటర్లను రిపేరు చేసేప్పుడు తనిఖీ వ్యవస్థ సరిగా లేదని అధికారులు భావిస్తున్నారు. కొన్ని కాంట్రాక్టు సంస్థలతో అధికారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

హైదరాబాద్ పరిసరాల్లోనే ఎక్కువ

విద్యుత్ వర్గాల గణాంకాల ప్రకారం 2023-24లో 7,05,820 విద్యుత్ మీటర్లు పని చేయకుండా ఆగిపోయాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో ఏకంగా 3.5 లక్షల మీటర్లు పనిచేయకపోతే మార్చాల్సి వచ్చింది. ఇందులో 2 లక్షలకుపైగా మీటర్లు కాలిపోయినట్టు గుర్తించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కాలిపోతున్న మీటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. మీటర్లతోపాటు సర్వీస్ వైర్లు, కండెన్సర్లు కూడా కాలిపోతున్నాయి. గత ఏడాది దక్షిణ డిస్కం పరిధిలో 1.63 లక్షల వరకూ మీటర్లు కాలిపోయాయి. దాదాపు 200 ఇళ్లల్లో వైరింగ్ కాలిపోయిన కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదులు రాని కేసులు ఇంతకన్నా ఎక్కువే ఉండొచ్చు. మెదక్ జిల్లాలో 37 వేలు, నల్లగొండ జిల్లాలో 31 వేల మీటర్లు, వైరింగ్ కాలిపోయాయి. అత్యధికంగా విద్యుత్ వాడకం ఉండే బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలో 8 వేల వరకూ కాలిపోయినట్టు దక్షిణ మధ్య విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు తెలిపారు.

అత్యధిక లోడ్

ఈ మధ్య కాలంలో గృహోపకరణాలన్నీ అత్యధిక విద్యుత్ సామర్థ్యంతో ఉంటున్నాయి. సాధారణ టీవీ కన్నా ఎల్ఈడీలు రెండు రెట్లు ఎక్కువ కరెంట్‌ను వాడతాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఏసీలు కూడా 1.5 టన్నువే కొంటున్నారు. వాషింగ్ మెషీన్లు లేటెస్ట్ టెక్నాలజీతో తీసుకుంటున్నారు. దీంతో విద్యుత్ డిమాండ్ భారీగా ఉంటోంది. ఇప్పటికే రాష్ట్రంలో ఏడాదికి 96,596 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంది. 2024-25లో గరిష్ట విద్యుత్ డిమాండ్ 16 వేల మెగావాట్లుగా గుర్తించారు. ఈ ఏడాది మార్చిలో గరిష్టంగా 17,162 మెగావాట్లకు చేరింది. డిమాండ్‌ను తట్టుకోవడానికి విద్యుత్ సంస్థలు భారీ మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. కొత్తగా 400 కిలోవాట్ల సామర్థ్యం గల తొమ్మిది సబ్‌స్టేషన్లు, 200 కేవీ సబ్‌స్టేషన్లు 34, 132 కేవీ సబ్ స్టేషన్లు 75 అందుబాటులోకి తేవాలి. దీనికి తగ్గట్టు విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) లైన్లు, సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంచాలి.ఈ దిశగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

వ్యక్తి స్వేచ్ఛకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

బెయిల్ పిటిషన్‌పై విచారణ దాని సొంత మెరిట్స్ ఆధారంగా జరగాలి

- ఒకరి కేసుతో మరొకరికి ముడిపెట్టడం తగదు
- ట్రయల్ కోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం నిర్దేశాలు
- ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై అసహనం
- మద్యం అక్రమ కేసులో 4 నెలలుగా నిర్బంధంలో ఉన్న చెవిరెడ్డి
- ఏసీబీ ప్రత్యేక కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు
- అదే కేసులో మరో నిందితుడికి బెయిల్ మంజూరు చేయడాన్ని హైకోర్టులో సవాలు చేసిన సర్కార్... దీంతో తుది తీర్పు వచ్చే వరకు ఇతర బెయిల్ పిటిషన్ల విచారణ నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: వ్యక్తి స్వేచ్ఛకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు హైకోర్టు, ట్రయల్ కోర్టులకు మరోసారి స్పష్టం చేసింది. బెయిల్ పిటిషన్‌ల విచారణ ప్రతి కేసు విషయంలో దాని స్వంత మెరిట్స్ ఆధారంగా జరగాలని, ఒకరి కేసుతో మరొకరి కేసును ముడిపెట్టడం సరికాదని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, ట్రయల్ కోర్టులు బెయిల్ అంశంలో వ్యక్తి హక్కులు, స్వేచ్ఛలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అత్యున్నత న్యాయస్థానం తాజా ఆదేశాలతో మద్యం అక్రమ కేసులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి భారీ ఊరట లభించింది.

కేసు నేపథ్యం ఏమిటంటే..

మద్యం అక్రమ కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఇదే కేసులో నాల్గవ నిందితునికి ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతున్న హైకోర్టు, బెయిల్ రద్దు పిటిషన్‌పై తాము తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ కేసుకు సంబంధించిన ఇతర బెయిల్ పిటిషన్ల విచారణను నిలిపివేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ నిరవధికంగా నిలిచిపోయింది. తనకు సంబంధం లేని కేసు కారణంగా తన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరగకపోవడం తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొంటూ భాస్కర్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే

సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్ రెడ్డి వాదనలు

భాస్కర్ రెడ్డి పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ జె.బి.పార్దీవాలా ధర్మాసనం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టింది. పిటిషనర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, 'గత నాలుగు నెలలుగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జైలులో ఉన్నారు. ఆయన బెయిల్ పిటిషన్‌కు, హైకోర్టులో నడుస్తున్న మరో నిందితుడి బెయిల్ రద్దు పిటిషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. అయినా విచారణ నిలిపివేయడం అన్యాయం. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం హామీ ఇచ్చిన వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును హరించడమే'అని వాదించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలతో బెంచ్ ఏకీభవించలేదు.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను తక్షణం విచారించాలి: సుప్రీం ఆదేశాలు

సుదీర్ఘ వాదనల అనంతరం ధర్మాసనం ఈ పిటిషన్‌పై స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. 'ట్రయల్ కోర్టులో బెయిల్ విచారణను నిలిపివేస్తూ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఆమోదించలేదు. ఈ కేసులో ఇతర నిందితుల బెయిల్ రద్దు పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన, చెవిరెడ్డి బెయిల్ విచారణను ఆపడం సరికాదు. ఒకరి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశం ప్రమేయం ఉన్నప్పుడు, సంబంధించి బెయిల్ పిటిషన్ విచారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ట్రయల్ కోర్టు విచారణను నిలిపివేయాలని ఆదేశించడానికి హైకోర్టుకు ఎలాంటి బలమైన కారణాలు కనిపించడం లేదు. వేర్వేరు దరఖాస్తులను ఒకే గాటన కట్టడం సరికాదు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు తక్షణమే విచారించాలి. ఇతర కేసులతో సంబంధం లేకుండా, కేసు మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి. మరో నిందితుడి బెయిల్ రద్దుపై హైకోర్టులో విచారణ దాని స్వంత మెరిట్‌పై కొనసాగవచ్చు. ఆ విచారణలోని అంశాలు గానీ, పరిశీలనలు గానీ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి ప్రభావం చూపకూడదు''అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ఇరుపక్షాల వాదనలను ఆయా కోర్టుల ముందు ఉంచవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలతో పిటిషన్‌ను పరిష్కరిస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

గ్రూప్-1పై విచారణ నవంబర్ 18కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1పై దాఖలైన అప్పీళ్లలో విచారణను హైకోర్టు సీజే ధర్మాసనం నవంబర్ 18కి వాయిదా వేసింది. అప్పీళ్లపై లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు సమయం కావాలని ప్రతివాదులు (ఎంపిక కాని అభ్యర్థులు) కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అప్పటివరకు సింగిల్ జడ్జి తీర్పుపై స్టేను పొడిగించింది. గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేటకు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. మార్చి 10న వెలువరించిన తుది మార్కుల జాబితా, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను రద్దు చేశారు. గ్రూప్-1 మెయిన్స్ అన్ని సమాధాన పత్రాలను తిరిగి మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని కమిషన్‌ను ఆదేశించారు. దీన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్ ధర్మాసనం.. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే ఇచ్చింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తాజాగా బుధవారం విచారణ చేపట్టగా.. టీజీపీఎస్సీ తరపున వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏజీ చెప్పారు. అయితే ప్రతివాదులు సమయం కోరడంతో ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

రెవెన్యూ శాఖలో పదోన్నతులు

- నలుగురు ఎస్‌జీడీసీలకు అదనపు కలెక్టర్ల హోదా
- 13 మంది డిప్యూటీ కలెక్టర్లకు ఎస్‌జీడీసీలుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న 13 మందికి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌జీడీసీ)గా, ఎస్‌జీడీసీలు నలుగురికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న కె.శ్రీనివాస్, ఎం.వంశీమోహన్, బోయపాటి చెన్నయ్య, ఎం.సూర్యప్రకాశ్, సీహెచ్ వెంకటేశ్వర్లు, వి.రమాదేవి, కె.చంద్రకళ, జుబేదున్నీసా బేగం, డి.నాగరాజమ్మ, ఎస్.రాజేశ్వరి, ఎం.వాసుచంద్ర, కె.వెంకట ఉపేందర్‌రెడ్డి, సముద్రాల మాలతిలకు ఎస్‌జీడీసీలుగా పదోన్నతి లభించింది. ఎస్‌జీడీసీలుగా పనిచేస్తున్న అబ్దుల్ హమీద్, ఎ.వెంకట్ రెడ్డి, ఎ.పద్మశ్రీ, రాజ్యలక్ష్మిలకు అదనపు కలెక్టర్ల హోదా లభించింది. కాగా, ఎస్‌జీడీసీలుగా పదోన్నతి పొందిన 13 మంది డిప్యూటీ కలెక్టర్లు బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా గ్రామగ్రామాన రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసేందుకు పనిచేయాలని పిలుపునిచ్చారు. ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు కె.చంద్రమోహన్ తదితరులు మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో ఉన్నారు.

బెల్టు దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

తెలంగాణ రైతుసంఘం ఆందోళన



రిలే దీక్ష చేస్తున్న తెలంగాణ రైతుసంఘం నాయకులు

జడ్చర్ల టౌన్: చాలా వరకు బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని నిరసనలు వ్యక్తం చేయడం చూస్తాం. ఇక్కడ మాత్రం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం గమనార్హం. బెల్టు దుకాణాల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఎమ్మార్పీకే విక్రయించేలా చూడాలంటూ బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు.



ఏపీకే..ఆచితూచి చూశాకే..
ఏపీకే ఫైళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వాటిని క్లిక్ చేస్తే సైబర్‌నేరగాళ్లు మిమ్మల్ని నిండా ముంచేస్తారని పేర్కొంటున్నారు. -12లో



ఫ్యాషన్ టు డైరెక్షన్
ఫ్యాషన్ డిజైనర్లు ఇప్పుడు సినిమా డైరెక్టర్‌గా కొత్త అవతారం ఎత్తుతున్నారు. తమలోని ప్రతిభకు పదును పెడుతూ సినిమాలను అవలీలగా రూపొందిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/22.0

వాతావరణం
నగరంలో గురువారం ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటిపూట పొడి వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 31, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

నేతలు వెంట రాగా..



మాజీ మంత్రులు తలసాని, పద్మారావు గౌడ్‌లతో కలిసి నామినేషన్ వేసిన సునీత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత బుధవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అగ్రనేతలతో పాటు స్థానిక నేతలు కూడా నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. దీంతో షేక్‌పేటలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సందడి నెలకొంది. మొదట మాగంటి సునీత జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన తర్వాత తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అనంతరం ఆమె మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్‌లతో పాటు కార్పొరేటర్ దేదీప్యారావు, రావుల శ్రీధర్‌రెడ్డిలతో కలిసి మొదటి సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితర నేతలతో కలిసి రెండో సెట్ నామినేషన్ కూడా ఆమె దాఖలు చేశారు.

మాగంటి సునీత ఆస్తులివే..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీత బుధవారం నామినేషన్ దాఖలు చేయగా..తన ఆస్తుల వివరాలు అఫిడవిట్లో పొందుపరిచారు. ఈ మేరకు ఆమె వద్ద 4097 గ్రాముల బంగారం ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే చేతిలో నగదు 38,800 రూపాయల నగదు ఉండగా మూడు బ్యాంకు ఖాతాల్లో కలిసి సుమారు 32 లక్షలు, బాండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బంగారు వెండి ఆభరణాలు మొత్తం కలిపి 6,18,54,274 రూపాయలు ఉన్నట్టు పేర్కొన్నారు. ముగ్గురు పిల్లల పేరిట షేర్లు, ఆభరణాల విలువ సుమారు రూ.4.62 కోట్లుగా పేర్కొన్నారు. సిరాస్తులు జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 34 లో ఓ ప్లాటు, గోపనపల్లిలో ఓ ప్లాటు ఉన్నట్లు, వీటి మొత్తం విలువ 6.11 కోట్ల రూపాయలు, పిల్లల పేరిట 8 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా సునీత పేరిట రూ.4.44 కోట్లు అప్పు ఉండగా, పిల్లల పేరుపై ఆరు కోట్ల రూపాయల అప్పు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆమెపై ఎన్నికల నియామావళి ఉల్లంఘించినందుకు గతవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఓ కేసు నమోదైనట్లు పేర్కొన్నారు.

రూ.21.21 లక్షలు విడుదల చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ



సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద స్వాధీనం చేసుకున్న రూ.21.21 లక్షలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ బుధవారం విడుదల చేసింది. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ కె.మంగతాయారు అధ్యక్షతన గల కమిటీ జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో విచారణలు నిర్వహించింది. మొత్తం 5 కేసులకు సంబంధించి సాక్ష్యాధారాలు పరిశీలించింది. ఎన్నికలకు సంబంధం లేని నగదు అని రూఢీ చేసుకున్న తర్వాత స్వాధీనం చేసుకున్న రూ.21,21,600 నగదును విడుదల చేసింది. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి, సభ్యులు వసుంధర, శరత్ చంద్ర పాల్గొన్నారు.



- నామినేషన్లకు సిద్ధమవుతున్న ట్రిపుల్ ఆర్, ఫార్మాసిటీ, లగచర్ల బాధితులు, గ్రూప్–1 అభ్యర్థులు, నిరుద్యోగులు, మాలలు
- ఇప్పటికే 30 మంది నామినేషన్లు.. 120కి పైగా నామినేషన్ ఫారాల సేకరణ
- ఈవీఎంలకు అనుసంధానించే సదుపాయం ఉన్నా ఎక్కువ మందితో తప్పని ఇబ్బందులు

భారీగా బరిలో..!

జూబ్లీహిల్స్ కేంద్రంగా అసంతుష్టుల సమర భేరి

సాక్షి, సిటీబ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..!

ఇప్పటికే పలు రకాలుగా ప్రాధాన్యతను సంతరించుకుంది. అన్ని రాజకీయ పార్టీలకు ఈ ఎన్నిక ఫలితం భవిష్యత్ సూచిక అనే అభిప్రాయాలున్నాయి. అందుకే వేటికవిగా అన్నివిధాలుగా శక్తియుక్తులు ఒడ్డుతున్నాయి. అధికార యంత్రాంగానికి సైతం ఈ ఉపఎన్నిక పెనుసవాల్‌గా మారింది. సాధారణంగా ఏ ఎన్నికలో అయినా పది మందో, ఇరవై మందో పోటీలో ఉంటారు. కానీ.. ప్రభుత్వంపై వ్యతిరేకతతో వివిధ వర్గాల వారు, అసంతుష్టులు ఈ ఉపఎన్నికతో తమ సత్తా చాటాలని భావిస్తున్నారు. భారీ సంఖ్యలో నామినేషన్లు వేసి ఇండిపెండెంట్లుగా పోటీ చేయడం ద్వారా ప్రజలకు తమ వేదన వెల్లడించడంతో పాటు ప్రభుత్వానికి సెగ తగిలేలా చేయాలనుకుంటున్నారు. ట్రిపుల్‌ఆర్, ఫార్మాసిటీ, లగచర్ల ప్రాజెక్టుల భూసేకరణ బాధితులు, గ్రూప్–1 అభ్యర్థులు, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు, ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించి మాలలు, తదితర వర్గాలు, గ్రూపులకు చెందిన వారు భారీ సంఖ్యలో ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేసేందుకు 'జూబ్లీహిల్స్'ను వేదిక చేసుకోవాలనుకుంటున్నారు. ఇప్పటికే బుధవారం వరకు 30 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు వేసేందుకు మరో 120 మందికి పైగా నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు సమయముంది. ఆలోగా ఇంకెంతమంది నామినేషన్లు వేయనున్నారో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి నెలకొంది.

అధికారులకు ఇరకాటం

బ్యాలెట్ పేపర్ల కాలం ముగిశాక ఈవీఎంల ద్వారా పోలింగ్ జరుగుతుండటం తెలిసిందే. ఒక ఈవీఎంలో గరిష్ఠంగా 16 మంది అభ్యర్థులు, గుర్తులకు అవకాశం ఉంది. వీటిల్లో ఒకటి నోటాకు పోను 15 మంది అభ్యర్థులుంటారు. ఎక్కువమంది అభ్యర్థులు బరిలో ఉంటే గతంలో ఒక కంట్రోల్ యూనిట్‌కు నాలుగు బ్యాలెట్ యూనిట్లు జత చేసేవారు. తద్వారా నోటా పోను 63 మంది అభ్యర్థులకు అవకాశం ఉండేది. 2013 తర్వాత నుంచి ఎం3 ఈవీఎంలను వినియోగిస్తున్నారు. వీటిని ఒక కంట్రోల్ యూనిట్‌కు గరిష్ఠంగా 24 బ్యాలెట్ యూనిట్లను కనెక్ట్ చేయవచ్చు. నోటా పోను 383 మంది అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. అంతకుమించి అభ్యర్థులు బరిలో మిగిలితే సంప్రదాయ పద్ధతిలో బ్యాలెట్ విధానానికి వెళ్లాల్సి వస్తుంది.

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లు సిద్ధం చేసుకున్నారు. రెండు బ్యాలెట్ యూనిట్లు మించి అవసరం రాకపోవచ్చునని అంచనా వేశారు. కానీ నామినేషన్లు పెరిగితే అదనపు యూనిట్లు సమకూర్చుకోవడం, ర్యాండమైజేషన్ వంటివి చేయాల్సి వస్తుంది. ఓటరు తాను వేసిన ఓటు సరిగ్గా పడిందో లేదో తెలుసుకునే వీవీప్యాట్‌లను కూడా అదనంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. గతంలో 1996లో నల్లగొండ పార్లమెంట్‌కు 470 మందికి పైగా ఇండిపెండెంట్లు, ఈవీఎంలు వచ్చాక గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి దాదాపు 185 మంది పోటీలో ఉండటం తెలిసిందే.

ఎగ్జిట్ పోల్స్ నిషేధం



జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్
- నవంబర్ 6 నుంచి 11 వరకు ఆదేశాలు అమలు

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ, ప్రచురణ, ప్రచారం నవంబర్ 6 నుంచి 11 వరకు నిషేధిస్తున్నట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ వెల్లడించారు. ఈ నెల 13న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్ మేరకు నవంబర్ 6వ తేదీ ఉదయం 7 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదు, ప్రచురించరాదు, ఎలాంటి మాధ్యమంలోనూ ప్రచారం చేయరాదని పేర్కొన్నారు. ఈ నిషేధం టెలివిజన్, రేడియో, వార్తాపత్రికలు, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు వంటి అన్ని సమాచార మాధ్యమాలకు వర్తిస్తుంది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి ప్రజాప్రతినిధుల చట్టం, 1951లోని 126ఏ సెక్షన్ ప్రకారం రెండు సంవత్సరాల వరకు జైలుశిక్ష, లేదా జరిమానా, లేదా రెండూ విధించవచ్చు. అలాగే, పోలింగ్ ముగిసే ముందు 48 గంటల వ్యవధిలో ఎటువంటి ఎన్నికల సంబంధిత విషయాలు, సర్వేలు, అభిప్రాయ సేకరణ ఫలితాలు ఎలక్ట్రానిక్ మీడియా లేదా ఇతర మాధ్యమాల్లో ప్రదర్శించరాదు. మీడియా సంస్థలు, రాజకీయ పార్టీలు, సోషల్ మీడియా వినియోగదారులు, ఎన్నికల సంబంధిత అన్ని వర్గాలు ఈ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, స్వేచ్ఛా, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో భాగస్వాములుగా నిలవాలని జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ విజ్ఞప్తి చేశారు.

బుమ్రుక్ ఉద్ దౌలా చెరువు ప్రారంభానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ప్రకటించిన హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని బుమ్రుక్ ఉద్ దౌలా చెరువు ప్రారంభోత్సవానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు హైడ్రా బుధవారం ప్రకటించింది. ఈ చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో తమ స్థలాలు ఉన్నాయని, అభివృద్ధి పనుల్ని ఆపాలని స్థానికులు కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. పనులు కొనసాగించవచ్చని, పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవానికి అనుమతిచ్చినట్లు హైడ్రా పేర్కొంది. చెరువు పునరుద్ధరణ, సుందరీకణ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, ఈ దశలో ఆ పనులు ఆపలేమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి తీర్పు చెప్పారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇంటి స్థలాలు ఉంటే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ద్వారా నష్ట పరిహారానికి ప్రయత్నించాలని ఆయన సూచించారు. హైడ్రా తరపున అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. ఈ చెరువుకు ఎంతో చారిత్రక నేపథ్యం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు పూర్తయిన అభివృద్ధి పనులు, చెరువులో ఉన్న నీటిమట్టానికి సంబంధించిన ఫొటోలను కోర్టుకు సమర్పించారు. పాతబస్తీలో చెరువు ఆవశ్యకతను కోర్టుకు విన్నవించారు. వీటిని పరిగణలోకి తీసుకున్న కోర్టు చెరువుల పునరుద్ధరణ ఆహ్వానించదగ్గ పరిణామమని జస్టిస్ విజయసేన్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు హైడ్రా తెలిపింది.

ల్యాండింగ్ అవుతుండగా..

విమానానికి లేజర్ కాంతులు తగిలాయా?



శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో లేజర్ కాంతులు వేయడం నిషేధం అయినప్పటికీ ఓ విమానం రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మంగళవారం రాత్రి తిరుపతి నుంచి బయలుదేరి విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాత్రి 9.30 సమయానికి చేరుకుంది. రన్‌వే 09ఆర్ వద్ద ల్యాండ్ అవుతున్న సమయంలో ఎయిర్‌పోర్టుకు ఎడమ వైపు బయటి ప్రాంతం నుంచి ఆకుపచ్చని రంగులోని లేజర్ కాంతులు విమానంపై పడినట్లు సమాచారం అందింది. దీనిపై అప్రమత్తమైన అధికారులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం. అయితే దీనిపై ఎయిర్‌లైన్స్ వర్గాలు కానీ, ఎయిర్‌పోర్టు అధికారులు కానీ తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు సీఐ కనకయ్య 'సాక్షి'కి తెలిపారు. సుమారు ఆరేళ్ల కిందట రషీద్‌గూడలో కొందరు యువకులు బర్త్‌డే పార్టీ చేసుకున్న సమయంలో డీజేతో పాటు లేజర్ లైట్లు ఉపయోగించడంతో విమానాన్ని ల్యాండ్ చేస్తున్న సందర్భంలో పైలట్ కంగారు పడి ఎయిర్‌పోర్టు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన అప్పట్లో కలకలం రేపింది. తాజాగా వచ్చిన సమాచారం ఎయిర్‌పోర్టు ప్రిడెక్టివ్ ఆపరేషన్ కేంద్రానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇది ఏఐ జనరేటెడ్ కావడంతో దీనిని ధ్రువీకరించుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అందరికీ సవాలే!

రసవత్తరంగా మారిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

- వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపునకు బాటలు వేయనుందని మూడు పార్టీల అంచనా
- గెలుపుపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ధీమా...

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గెలుపు మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఎవరు గెలిచినా చరిత్రే అవుతుంది. జూబ్లీహిల్స్ గెలుపు రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ప్రధాన అస్త్రంగా మారుతుంది. దీంతో గెలుపు కోసం మూడు పార్టీలు తీవ్రంగా శ్రమిస్తూ గెలుపు కోసం ప్రయత్నిస్తున్నాయి. ఇంట గెలిచి రచ్చ గెలవాలనే సామెత లాగా జూబ్లీహిల్స్ గెలుపు రానున్న రోజుల్లో రచ్చ గెలిచేలా చేస్తుందని భావిస్తున్నాయి.

కాంగ్రెస్: విజయం కోసం ప్రణాళికలు



అధికార కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గెలుపు సవాలుగా మారింది. స్థానిక యువనేత, అనుభవం ఉన్న నవీన్‌యాదవ్‌కు టికెట్‌ను ఖరారు చేసింది. ముగ్గురు మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర నాయకులను ఇక్కడ ప్రచారంలో దింపి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారాన్ని చేపట్టినా గ్రేటర్‌లో మాత్రం ఒక్క సీటు గెలవలేదు. దీంతో ఇక్కడ గెలిస్తే రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు దారి మరింత సులువు అవుతుందని భావిస్తోంది. అధికారంలో ఉన్నా గ్రేటర్ పరిధిలో ఒక్క అసెంబ్లీ సీటు లేకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. గ్రేటర్‌లో పాగా వేస్తే వచ్చే స్థానిక, అసెంబ్లీ ఎన్నికలకు మరింత బలం చేకూరుతుందని ప్రణాళికలు చేపడుతుంది.

బీఆర్‌ఎస్: పట్టు నిలుపుకునే యత్నం

బీఆర్‌ఎస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవి చూసినా గ్రేటర్‌లో మాత్రం తన పట్టును కోల్పోలేదు. అన్ని అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకొని గ్రేటర్‌లో అన్నివర్గాలు తమవైపే ఉన్నాయని చూపించింది. మాగంటి గోపీనాథ్ మరణం తర్వాత జరుగుతున్న ఉపఎన్నికల్లో మాగంటి సతీమణి సునీతకు సీటు కేటాయించి సెంటిమెంట్‌తో పాటు ఇక్కడ ఉన్న బీఆర్‌ఎస్ క్షేత్రస్థాయి బలంతో మరోసారి పాగా వేయాలని చూస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావులు తప్పక విజయం సాధించాలనే తపనతో ఇక్కడ ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు రోజూ ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. జూబ్లీహిల్స్‌లో గెలిస్తే జీహెచ్‌ఎంసీ పీఠం తప్పక కైవసం చేసుకోవచ్చని అంచనా వేస్తోంది. గ్రేటర్ పీఠాన్ని కొట్టి అన్ని ఎన్నికల్లో బలాన్ని మరింత పెంచుకొని అసెంబ్లీ ఎన్నికల నాటికి రాటుదేలి మూడోసారి తెలంగాణలో అధికారాన్ని పొందాలని చూస్తుంది.

బీజేపీ: వ్యూహం మారింది..

లేటుగా అయినా లేటెస్ట్ అంటూ..బీజేపీ జూబ్లీహిల్స్‌లో మరోసారి లంకల దీపక్‌రెడ్డికి ఛాన్స్ ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన దీపక్ రెడ్డి 26 వేల ఓట్లను సాధించారు. దీంతో బీజేపీ ఇప్పుడు తన వ్యూహాలను మార్చింది. మైనార్టీలు ఎక్కువగా ఉన్న జూబ్లీహిల్స్‌లో ఓ వర్గం ఓట్లు రెండు పార్టీలు పంచుకుంటాయని, మరో వర్గం, సెటిలర్లు, కాలనీ, కమ్యూనిటీ ఓట్లు తప్పక వస్తాయని, అనూహ్యంగా రేసులో ముందుండి గెలుస్తామని ధీమాగా ఉంది. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అనుకోకుండా గట్టి పోటీతో 48 డివిజన్లను కైవసం చేసుకుంది. ఇక్కడ గెలిస్తే గ్రేటర్ పీఠం తప్పక తమదేనని బీజేపీ కూడా భావిస్తోంది. పార్టీ అధ్యక్షుడు రాంచంద్రరావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తమ వ్యూహాలను ఎవరికీ తెలియకుండా గుంభనంగా ఉంటూ ముందుకు సాగుతున్నారు.

పాతబస్తీ మహిళకు పాతికేళ్ల జైలు

గత వారం విధించిన దుబాయ్ న్యాయస్థానం

- గంజాయి అక్రమ రవాణా చేసిన నేరం నిరూపణ
- ప్రభుత్వ సహాయం కోరుతున్న ఆమె కుటుంబీకులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పాతబస్తీకి చెందిన ఓ మహిళకు దుబాయ్ కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. గంజాయి అక్రమ రవాణా చేస్తూ అక్కడి విమానాశ్రయంలో చిక్కడంతో ఈ మేరకు తీర్పు ఇచ్చింది. బహదూర్‌పురలోని ఆమె కుటుంబీకులు బ్యాంకాక్‌కు చెందిన ట్రావెల్ ఏజెంట్‌పై ఆరోపణలు చేస్తున్నారు. మహిళకు న్యాయం చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బహదూర్‌పురకు చెందిన ఓ మహిళ బ్యూటీషియన్ కోర్సు చేశారు. ఈమెకు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. తండ్రి పక్షవాతంతో మంచం పట్టగా...తల్లి గృహిణి కావడంతో కుటుంబ పోషణ భారం మహిళ పైనే పడింది. దీంతో కుమారుడిని తల్లిదండ్రుల వద్ద వదిలి దుబాయ్ వెళ్లి బ్యూటీషియన్ ఉద్యోగం చేయాలని భావించింది. దీనికోసం ఓ ఏజెంట్ ద్వారా వీసా ప్రాసెసింగ్ చేయించుకుంది. అతగాడు ఈ మహిళను బ్యాంకాక్ మీదుగా దుబాయ్ పంపాడు. బ్యాంకాక్‌లో సదరు ఏజెంట్‌కు సంబంధించిన వ్యక్తి ఈ మహిళకు ఓ ప్యాకెట్ ఇచ్చాడు. దాన్ని దుబాయ్‌లో తమ మనిషి వచ్చి తీసుకుంటారని చెప్పారు. ఈ ప్యాకెట్‌తో మహిళ ఈ ఏడాది మే 18న దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగింది. అక్కడ తనిఖీలు చేపట్టిన అధికారులు మహిళ తీసుకువచ్చిన ప్యాకెట్‌లో గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసును విచారించిన దుబాయ్ కోర్టు ఈ నెల 6న నేరం నిరూపణ అయినట్లు ప్రకటించింది. మహిళకు 25 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. రెండు రోజుల క్రితం దుబాయ్ నుంచి సదరు మహిళ వీడియో కాల్ ద్వారా నగరంలోని తల్లితో మాట్లాడింది. తీవ్రంగా రోదిస్తూ తాను కేవలం పది నిమిషాలే మాట్లాడగలనని, ఒక్కసారి తన కుమారుడిని చూపించాలంటూ తల్లిని కోరింది. న్యాయసహాయం చేస్తే నిర్దోషిగా బయటపడతాననే నమ్మకం ఉందని చెప్పింది. దీంతో మహిళ తల్లి పాతబస్తీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులకు విషయం తెలిపింది. వీరి ద్వారా విషయం తెలుసుకున్న విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి ఎస్.జయశంకర్ అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. దీంతో దుబాయ్‌లో ఉన్న ఇండియన్ కాన్సులేట్ జనరల్ (సీజీఐ) స్పందించారు. యువతికి అవసరమైన న్యాయసహాయం అందిస్తామని హామీ ఇచ్చి బహదూర్‌పురలోని ఆమె కుటుంబీకులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

ఇక మిగిలింది మూడు రోజులే!

ఉమ్మడి జిల్లాలో 514 మద్యం షాపులకు..3,173 దరఖాస్తులే..

- లిక్కర్ షాపుల టెండర్లకు స్పందన అంతంతే..
- ఆశించిన స్థాయిలో ముందుకు రాని వ్యాపారులు

ఎక్సైజ్ జిల్లాల వారీగా మంగళవారం నాటికి వచ్చిన దరఖాస్తులు ఇలా..

ఎక్సైజ్ జిల్లా	లిక్కర్ షాపులు	2023–25	2025–27
సరూర్‌నగర్	138	10,994	622
శంషాబాద్	111	10,621	1090
మేడ్చల్	118	7,519	693
మల్కాజ్‌గిరి	88	6,722	650
వికారాబాద్	59	2,637	118

సాక్షి, రంగారెడ్డి జిల్లా: లిక్కర్ షాపులకు టెండర్ దరఖాస్తుల గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఒకవైపు గడువు సమీపిస్తుండటం ..మరో వైపు ఆశించిన స్థాయిలో వ్యాపారులు ముందుకు రాకపోవడంతో అబ్కారీ శాఖలో ఆందోళన మొదలైంది. 2023–25 సంవత్సరంలో 495 మద్యం షాపులకు నిర్వహించిన టెండర్లలో ఉమ్మడి జిల్లా నుంచి 38,493 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వానికి అప్పట్లో రూ.769.86 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ప్రస్తుతం దరఖాస్తు (ఫీజు రూ.3 లక్షలకు పెంచింది)లతో పాటు ఆదాయం కూడా మరింత పెరుగుతుందని ఆశించింది. కానీ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్ని ఆర్థిక మాంద్యానికి తోడు.. రియల్ ఎస్టేట్ పడిపోవడం..స్థానిక సంస్థల ఎన్నికల గడువు సమీపించడం..ఆశావహులు తమ వద్ద ఉన్న డబ్బులను ఖర్చు చేసేందుకు వెనుకాడుతుండటం..మద్యం దరఖాస్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 514 షాపులకు టెండర్లు ఆహ్వానించగా, ఇప్పటి వరకు 31,73 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కేవలం దరఖాస్తుల ద్వారానే రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుందని భావించినప్పటికీ ఇప్పటి వరకు రూ.వంద కోట్లు కూడా దాటకపోవడాన్ని ఎక్సైజ్ శాఖ జీర్ణించుకోలేక పోతోంది. వ్యాపారులను ఎలాగైనా ఒప్పించి, రప్పించాలని ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తుంది. టార్గెట్‌ను చేదించేందుకు పలువురు ఎక్సైజ్ అధికారులు తమకు తెలిసిన వ్యాపారులకు ఫోన్లు చేసి, టెండర్ వేసుకోవాల్సిందిగా అభ్యర్థిస్తున్నారని తెలిసింది. ఇదిలా ఉంటే నిర్వహణ ఖర్చులు పెరగడం, గుడ్‌విల్ పేరుతో ప్రతినెలా అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించాల్సి వస్తుండటం కూడా ఔత్సాహికులు ముందుకు రాకపోవడానికి మరో కారణమని తెలిసింది. ఇదిలా ఉంటే, మెజార్టీ వ్యాపారులు వారం, తిథి, ముహూర్తం చూసుకుని టెండర్లు దాఖలు చేస్తుంటారని, ఆఖరి రోజుల్లో దరఖాస్తుల సంఖ్య అనూహ్యంగా పెరగనుందని శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఎస్.కృష్ణన్ ప్రియా స్పష్టం చేశారు.



మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తికి ఘన నివాళి


విజయలక్ష్మికి నివాళులర్పిస్తున్న సీఎం, తదితరులు

సాక్షి, సిటీ బ్యూరో: మేఘా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి మాతృమూర్తి పురిటిపాటి విజయలక్ష్మికి పలువురు నివాళులు అర్పించారు. బుధవారం హైటెక్స్‌లో జరిగిన సంస్మరణ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, వివిధ రంగాలకు చెందిన అధికార, అనధికార ప్రముఖులు మేఘా సంస్థ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. తొలుత వారి కుటుంబ సభ్యులు హైటెక్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విజయలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నివాళులు అర్పించిన ప్రముఖుల్లో కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వాయిదా

సిటీ కోర్టులు: రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ బుధవారం నాంపల్లి కోర్టులో జరిగింది. నాంపల్లిలోని 14 అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగిన ఈ కేసు విచారణకు ఇప్పటికే బెయిల్ పై బయటికి వచ్చిన ఆరుగురు (ప్రభాకర్‌రావు , ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్, శ్రవణ్‌కుమార్) నిందితులు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఈ కేసులో పోలీసులు సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంది. ఈ విచారణలో జడ్జి సెలవులో వెళ్లడంతో తదుపరి విచారణ డిసెంబర్ 4కు వాయదా పడింది.

నాగార్జున పరువునష్టం కేసు 30కి వాయిదా


మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జున, ప్రతివాది కొండా సురేఖ గైర్హాజరయ్యారు. దీంతో వారి తరుపునా న్యాయవాదులు పిటిషన్లను దాఖలు చేశారు. మంత్రి కొండా సురేఖను క్రాస్‌ఎగ్జామినేషన్ చేయాల్సి ఉండగా ఆమె గైర్హాజరు కావడంతో విచారణను కోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది.

పురాణ,ఇతిహాస గ్రంథాలను యువత చదవాలి

బంజారాహిల్స్: విజ్ఞానగని వ్యాస మహర్షి లాంటి రుషులు, మునులు రాసిన మన పురాణ, ఇతిహాస గ్రంథాలను యువత చదవాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రచురించి, మన దేశ ఆధ్యాత్మికతను, దేశ, విదేశాల్లో చాటుతున్న 'శ్రీ సువర్చల ఛారిటబుల్ ట్రస్ట్' ప్రతినిధులు బుధవారం వెంకయ్యనాయుడి క్యాంప్ కార్యాలయంలో ట్రస్ట్ ప్రచురించి గ్రంథాలను ఆయనకు బహూకరించారు. చైర్మన్ సి.రామకృష్ణ, ఎండీ రవీంద్ర, ట్రస్ట్ అంతర్జాతీయ సంధాన కర్త, సంస్కృతి రత్న డాక్టర్ కే ధర్మారావులు పాలొగన్నారు.

డీఎంఈ, డీహెచ్ కార్యాలయాల్లో అంధకారం

- రూ.లక్షల్లో విద్యుత్ బకాయిలు
- సరఫరా నిలిపివేసిన అధికారులు



కోఠిలోని డీఎంఈ కార్యాలయం...

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలోనే వైద్య ఆరోగ్యశాఖకు కేంద్ర బిందువుగా ఉన్న హెచ్‌ఓడీ కార్యాలయాలు అయిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయాల్లో అంధకారం నెలకొంది. రూ. లక్షల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఆయా కార్యాలయాల్లో విద్యుత్ కట్ చేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రెండు కార్యాలయాల్లో అంధకారం నెలకొంది. కంప్యూటర్లు పనిచేయకపోవడంతో ఉద్యోగులు ఖాళీగా కూర్చున్నారు.

సామాన్యుల అవస్థలు

రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వైద్య ఆరోగ్యశాఖకు ప్రధాన కార్యాలయమైన డీఎంఈ, డీహెచ్ కార్యాలయాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ప్రతి నిత్యం వైద్య ఆరోగ్యశాఖలోని వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మెడికల్ బిల్లుల కోసం వచ్చే సీనియర్ సిటిజన్లు కరెంటు కోతతో లిఫ్ట్ పని చేయకపోవడంతో ఇతరుల సహాయంతో మెడికల్ బిల్ సెక్షన్‌కు మెట్లు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో బుధవారం వివిధ ప్రమోషన్ల ఆర్డర్స్ ఇవ్వాల్సి ఉండగా కరెంట్ కట్‌తో అవి వాయిదా పడడంతో ఉద్యోగులు, అధికారులు నిరాశగా వెనుతిరిగారు. బుధవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాను నిలిపి వేయడంతో ఉద్యోగులు ఏ పని లేక కార్యాలయాల పరిసరాలలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.


విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఖాళీగా కూర్చున్న ఉద్యోగులు

పేరుకు పోయిన బకాయిలు

- డీఎంఈ కార్యాలయంలో గత కొంత కాలంగా విద్యుత్ బకాయిలు సుమారు రూ.6 లక్ష వరకు ఉండడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటి వరకు నాలుగుసార్లు కరెంటు కట్ చేశారు. అయినా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో బుధవారం డీఎంఈ కార్యాలయానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.
- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో రూ.4.50 లక్షల వరకు విద్యుత్ బకాయాలు ఉండడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా అధికారులు స్పందించకపోవడంతో బుధవారం సదరు కార్యాలయంలో సైతం విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

దేశ అభ్యున్నతిలో టీచర్ల పాత్ర కీలకం



గన్‌ఫౌండ్రీ: సమాజ అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో లీడ్ ఇండియా ఫౌండేషన్, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులకు డాక్టర్ కలాం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని.. విద్యార్థుల గుణగణాలను మార్చగలిగే అద్భుతమైన శక్తి వారిలో ఇమిడి ఉంటుందన్నారు. దేశ అభివృద్ధి ఉపాధ్యాయుల చేతుల్లోనే ప్రారంభమవుతుందని వెల్లడించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పరివర్తన కోసం ఉపాధ్యాయులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని భారతదేశాన్ని లీడ్ చేయాలనే ఆలోచనను యువతలో కలుగజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌కు నగర బహిష్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, దాడులు, బెదిరింపులు, అల్లర్లకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఓ రౌడీ షీటర్‌కు ఆరు నెలల పాటు నగర బహిష్కరణ విధిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ బుధవారం తెలిపారు. పలు క్రిమినల్ కేసులతో పాటు నేర చరిత్ర కలిగిన కొడుదుల నవీన్‌రెడ్డి(32) ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, ఇతనిపై సాక్ష్యం చెప్పేందుకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు జనం భయపడుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు నవీన్‌రెడ్డికి నగర బహిష్కరణ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారం రోజుల్లోపు సమాధానం చెప్పాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హీరోయిన్ల పేరిట నకిలీ ఓటరు కార్డులు



వెంగళరావునగర్ : ప్రముఖ హీరోయిన్ల పేర్లు, ఫొటోలు ఉన్న నకిలీ ఓటరు కార్డులు వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిల్లో వెలిశాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు తమ ఫోన్లలో వచ్చిన ఆయా కార్డులను చూసి విస్తుపోతున్నారు. ప్రముఖ హీరోయిన్లయిన రకుల్ ప్రీత్‌సింగ్, సమంత రూత్ ప్రభు, తమన్నా భాటియాలు వీరంతా ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్నారు. వారు నిజంగా మా ప్రాంతాల్లో ఉన్నారా అంటూ ఆరా తీస్తున్నారు. ఈ ఓటరు కార్డులు వైరల్ కావడంతో అటుతిరిగి ఇటు తిరిగి అధికారుల దృష్టికి వెళ్ళింది. దాంతో వాటిని పరిశీలించిన ఎన్నికల అధికారులు ఆయా కార్డులు నకిలీవంటూ తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సర్కిల్-19 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్డులు ముద్రించి ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శభాష్ శివకుమార్

బస్సు కింద పడ్డ వ్యక్తిని కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్



సుభాష్‌నగర్: బస్సు రూపంలో మృత్యు ఒడిలోకి వెళ్తున్న ఓ వాహనదారుడిని రెప్పపాటులో ట్రాఫిక్ పోలీస్ కాపాడిన ఘటన సూరారం చౌరస్తాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బుధవారం ఉదయం బాలానగర్ నుండి మెదక్ వైపు ఆర్టీసీ బస్సు వెళుతోంది. ఈ క్రమంలో బస్సు పక్క నుండి ఓ ద్విచక్ర వాహనదారుడు వెళ్తుండగా ఒక్కసారిగా బస్సు కింద మధ్యలో పడిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ మార్షల్ కట్టబోయిన శివకుమార్ క్షణాల్లో పరిగెత్తి అతన్ని బస్సు కింద నుండి లాగడంతో సదరు వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. క్షణం ఆలస్యం అయితే బస్సు వెనుక చక్రాలు ద్విచక్ర వాహనదారుడు పైనుంచి వెళ్లేవి. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. అతనిని కాపాడిన దృశ్యాలు పక్కనే ఉన్న షాప్ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అ దృశ్యాలు స్థానికంగా వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో వందలాదిమంది శివకుమార్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

అనుమతి లేకుండా వేలం ఎలా వేస్తారు?

445.10 గ్రాములు బంగారు ఆభరణాల వేలం

- ఆగ్రహం వ్యక్తం చేసిన రంగారెడ్డి వినియోగదారుల కమిషన్
- ఫిర్యాదుదారుడికి రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వండి
- కోర్టు ఖర్చులకు మరో రూ.10 వేలు ఇవ్వండి
- ఇండియన్ బ్యాంకును ఆదేశించిన కమిషన్

సిటీ కోర్టులు : ఫిర్యాదుదారుడికి సమాచారం ఇవ్వకుండా తన 445.10 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలను వేలం వేయడం సమంజసం కాదని, అనంతరం తాను చెల్లించాల్సిన బకాయిలను చెల్లించినా.. ఆభరణాలను వేలం వేయడం ముమ్మాటికీ బ్యాంకు వారి తప్పేనని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు పూర్తిగా బ్యాంకు యాజమాన్యం బాధ్యత వహిస్తూ ఫిర్యాదుదారుడికి రూ.5 లక్షల నష్టపరిహారం, రూ.10 వేల కోర్టు ఖర్చులు చెల్లించాలని, ఈ మొత్తాన్ని 45 రోజుల్లోపు చెల్లించాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ సి.లతాకుమారి మెంబర్లు పివిటిఆర్.జవహర్‌బాబు, ఎస్.మాధవితో కలిసిన బెంచ్ బ్యాంకు యాజమన్యాన్ని ఆదేశించిన కమిషన్ బుధవారం ఉత్తర్వులు ఇస్తూ కేసును కొట్టివేసింది.

ఎలాంటి నోటీసు ఇవ్వలేదు..

దిల్‌సుక్‌నగర్‌కు చెందిన టి.జగదీశ్‌కుమార్ బోడుప్పల్‌లోని పీర్జాదిగూడలో ఉన్న ఇండియన్ బ్యాంకులో 445.10 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలను సెప్టెంబర్ 2021లో పెట్టి రూ.9,50,000 రుణం పొందాడు. రుణం పొందిన తర్వాత ప్రతీ నెల వడ్డీతోపాటు అప్పు మొత్తాన్ని ఎప్పటికప్పుడు చెల్లించినట్లు పేర్కొన్నారు. అయితే సెప్టెంబర్ 2023లో ఫిర్యాదుదారుడికి బ్యాంకు నుంచి నోటీసు వచ్చింది. రూ.11,34,741 చెల్లించాల్సి ఉందని, 2022లోనే ఫిర్యాదుదారుడు డబ్బులు చెల్లించనందుకు తన అకౌంట్ ఎన్‌పీఏలో పడిందని, ఈ మొత్తాన్ని ఏడు రోజుల్లోపు చెల్లించాలని లేదంటే ఆభరణాలను వేలంలో విక్రయిస్తామని ప్రతివాదులు నోటీసులో పేర్కొనడంతోపాటు పేపర్ ప్రచురణ కూడా జారీ చేశారు. డిసెంబర్ 2023లో బ్యాంకు అధికారులు ఆభరణాలను వేలం వేస్తున్నారు. ఫిర్యాదుదారుడు రూ.3,95,000 చెల్లిస్తే వేలాన్ని నిలిపివేస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారు. దీంతో ఫిర్యాదుదారుడు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి కేసు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు ఫిర్యాదుదారుడికి హామీ ఇచ్చి బ్యాంకు అధికారులు తన ఆభరణాలను వేలం వేయడం సరైందికాదని హెచ్చరించారు. ఫిర్యాదుదారుడి ఆభరణాలను వేలం వేసినందుకు బ్యాంకు యాజమాన్యం ఫిర్యాదుదారుడికి నష్టపరిహారం అందజేయాలని ఈ మొత్తాన్ని 45 రోజుల్లో చెల్లించకపోతే ఏడాదికి 9 శాతం వడ్డీతో మొత్తం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

స్వీట్ షాపుల్లోనూ పరిస్థితులు చేదే..



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆహార పదార్థాలు విక్రయించే, సరఫరా చేసే, వడ్డించే ప్రాంతాల్లో ఎక్కడ తనిఖీలు చేసినా నిబంధనలు బేఖాతరు. పరిశుభ్రతపై తీవ్ర నిర్లక్ష్యం, ఈగలు, క్రిములు ముసురుతున్నా పట్టింపులేని తనం, కల్తీ సరుకుల వినియోగం. గడువు తేదీలు పట్టించుకోని వైనం. దీపావళి పండుగ సందర్భంగా ఎక్కువమంది స్వీట్లను వినియోగించడం, ఆప్తులకు పంపిణీ చేయడం తెలిసిందే.ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు.. బుధవారం 43 స్వీట్ షాపుల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.అన్ని దుకాణాల్లోనూ క్రిమికీటకాల నివారణ చర్యలు లేవు. వంటలకు వాడుతున్న నీటిలో నిర్లక్ష్యం. టిఫిన్ సెక్షన్లలో నేలకు పగుళ్లు. కార్మికుల హెల్త్ రికార్డుల్లేవు. స్వీట్ల ప్రదర్శన స్థలాల్లో ముసురుకున్న ఈగలు. అపరిశుభ్రంగా ఓవెన్. సరఫరా చేసేవారికి హెయిర్‌నెట్స్, గ్లవ్స్ లేవు.చెత్తడబ్బాలకు మూతల్లేవు. ఇవన్నీ సర్వసాధారణమన్నట్లుగా దర్శనమిచ్చాయి. లోపాలు సరిచేసుకోవాల్సిందిగా నోటీసులు జారీ చేశామని, తీవ్ర ఉల్లంఘనలు గుర్తించిన నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోనున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

యువతి మృతి ఘటనపై వైద్యాధికారుల విచారణ

గతంలో జైలుకు వెళ్లిన ఆర్‌ఎంపీ పద్మజ

శంషాబాద్ రూరల్: గర్భస్రావంతో వైద్యం వికటించి యువతి మృతి చెందిన ఘనటపై జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. ఈ కేసులో నిందితురాలైన ఆర్‌ఎంపీ వైద్యురాలు పద్మజ ఇంటిని డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి, పెద్దషాపూర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్.ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. మండలంలోని ముచ్చింతల్ వాసి, హోంగార్డు మధుసూదన్ మృతురాలిని ప్రేమ పేరుతో నమ్మించి సన్నిహితంగా ఉన్నాడు. ఈ క్రమంలో గర్భం దాల్చిన ఆమెకు గర్భస్రావం చేయించగా.. వైద్యం వికటించి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఆర్‌ఎంపీ వైద్యురాలు పద్మజపై గతంలో కూడా ఇలాంటి తరహా కేసు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైంది. ఈ ఘటనలో గత ఏడాది ఏప్రిల్‌లో ఆమె జైలుకు వెళ్లింది. పాల్మాకులలో క్లినిక్ నడుపుతున్న సమయంలో షాద్‌నగర్ ఘటన చోటు చేసుకోగా.. ఆ తర్వాత ఆమె క్లినిక్‌ను మూసివేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలోనే ఇల్లు నిర్మించుకున్న పద్మజ అందులోనే వైద్య సేవలు కొనసాగిస్తూ వచ్చింది. తాజాగా యువతికి సైతం ఇంట్లోనే ఆమె గర్భస్రావం చేసినట్లు చెబుతున్నారు. వివాహేతర సంబంధాలతో సంతానం కల్గిన వారికి పద్మజ తన క్లినిక్‌లో ప్రసవాలు చేసి పిల్లలు లేని వారికి దత్తత ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. స్థానిక మెడికల్ దుకాణం నిర్వాహకుడు సైతం పద్మజకు సహకరించేవాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హోంగార్డు మధుసూదన్, ఆర్‌ఎంపీ వైద్యురాలు పద్మజకు గత పదేళ్లుగా సన్నిహిత సంబంధాలు ఉన్న కారణంగా యువతికి ఆమె వద్ద గర్భస్రావం చేయించినట్లు సమాచారం. మరోవైపు హోంగార్డు మధుసూదన్ మొదటి భార్య చనిపోగా రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం కూడా ఉన్నారు.

మాత్రలతో గర్భస్రావం..

గర్భందాల్చిన యువతికి ఆర్‌ఎంపీ పద్మజ మాత్రలతో గర్భస్రావం చేయగా అస్వస్థతకు గురైంది. దీంతో కర్మన్‌ఘాట్‌లో స్కానింగ్ చేయించారు. రిపోర్టులో రక్తస్రావం అవుతున్నట్లు తేలడంతో ఆమెను అత్తాపూర్‌లోని జాయ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. విచారణలో డిప్యూటి డీఎంహెచ్‌ఓ రాధిక, జిల్లా మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కదులుతున్న రైలులో మహిళపై లైంగిక దాడి

- గుంటూరు సమీపంలో ఘటన
- సికింద్రాబాద్‌లో బాధితురాలి ఫిర్యాదు
- జీరో ఎఫ్ఐఆర్ నమోదు

సికింద్రాబాద్: గుంటూరు-పెదకూరపాడు రైల్వేస్టేషన్ల మధ్య నడుస్తున్న రైలులో ఒంటరిగా ఉన్న మహిళపై మంగళవారం రాత్రి లైంగికదాడి జరిగింది. రైలు సికింద్రాబాద్ చేరుకున్న అనంతరం బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం నడికుడి రైల్వే పోలీసులకు బదిలీ చేశారు. సికింద్రాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ బీ.సాయిశ్వర్‌గౌడ్ తెలిపిన మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంకు చెందిన ఒక వ్యక్తి, ఓ మహిళ సంత్రాగాచి ఎక్స్‌ప్రెస్‌రైలులో చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. ఆమెను మహిళను మహిళల కోచ్‌లో ఎక్కించిన వ్యక్తి తను వేరే బోగీలో కూర్చున్నాడు. గుంటూరులో రైలు ఆగిన సమయంలో మహిళల బోగీలో మహిళ ఒక్కతే ఉంది. ఇది గమనించిన ఓ వ్యక్తి (40) మహిళల బోగీలోకి ఎక్కాడు. అందులో ఉన్న మహిళ ఇది మహిళల బోగీ అని వారిస్తున్నా ఒప్పించి అందులోకి ప్రవేశించాడు. రైలు పెదకూరపాడు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న సమయంలో బోగీ డోర్లు లాక్ చేసిన ఆ వ్యక్తి ఒంటరిగా ఉన్న మహిళపై కత్తితో బెదిరించి లైంగికదాడి చేశాడు. అనంతరం ఆమె వద్ద నున్న రూ.5600 నగదు, ఆమె సెల్‌ఫోన్ లాక్కొని పెదకూరపాడు రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి దిగి పరారయ్యాడు. సికింద్రాబాద్ చేరుకున్న అనంతరం బాధితురాలు జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

35కి చేరిన నామినేషన్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి మూడో రోజైన బుధవారం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రెండు సెట్లు దాఖలు చేయగా, మరో అభ్యర్థి అదనపు సెట్ దాఖలు చేశారు. దీంతో 10 మంది అభ్యర్థులు 13 నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు దాఖలైన నామినేషన్లు 35కి చేరాయి. బుధవారం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, స్వతంత్ర అభ్యర్థులు చిట్టిబోయిన సులోచనారాణి, సల్మాన్‌ఖాన్, చలికా పార్వతి, చిట్టిబోయిన నటరాజ, చలికా చంద్రశేఖర్, మహ్మద్ అక్బరుద్దీన్, జమాల్‌పూర్ మహేష్‌కుమార్, రెహమాన్ షరీఫ్, కంటె సాయన్న, ప్రజా వెలుగు పార్టీ తరుపున ప్రవీణ్ కుమార్ ఆరోళ్ల, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా బుద్దయ్య అంబోజు తదితరులు ఉన్నారు.

వ్యక్తిపై దాడి

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటిముందు ద్విచక్ర వాహనం పార్కు చేయొద్దని చెప్పినందుకు ఓ వ్యక్తిపై దాడి చేశారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కేపీహెచ్‌బీ కాలనీ 5వ రోడ్డులో నివాసం ఉండే నరసింహనాయుడు ఇంటి పక్కనే శివా బాయ్స్ హాస్టల్ ఉంది. అయితే ప్రతి రోజూ హాస్టల్ యువకులు తమ ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాలు పార్కు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో ఎన్నిసార్లు చెప్పినా వినకుండా ఇంటి ఎదుట బండి పార్కు చేస్తున్నారనే కోపంతో సీట్ కవర్‌ను కట్ చేశారు. దీంతో మంగళవారం రాత్రి ప్రదీప్, వంశీలతో పాటు మరికొందరు యువకులు తమ బండి సీట్ కవర్ కట్ చేయడాన్ని ప్రశ్నిస్తూ నరసింహనాయుడుపై దాడి చేశారు. ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం దాడి చేసుకోవడంతో పాటు కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రిమాండ్‌కు లైంగిక దాడి కేసు నిందితుడు

సైదాబాద్: బాలుడిపై లైంగిక దాడి కేసులో నిందితుడిని సైదాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో ఒక బాలుడిపై స్టాఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రహమాన్ లైంగిక దాడి చేసిన సంగతి విదితమే. బాధిత బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు నిందితుడు రహమాన్‌పై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసారు. బుధవారం అతడిని సైదాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతున్న ఓ దివ్యాంగ వ్యక్తిని బుధవారం రైలు ఢీ కొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పండరి తెలిపిన మేరకు.. మౌలాలి రైల్వే స్టేషన్ అప్‌లైన్ సమీపంలో ఓ వ్యక్తి(40) ని వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకుని ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: దైవ దర్శనానికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కే.నారాయణ తెలిపిన మేరకు..ఆసిఫ్‌నగర్ మల్లెపల్లికి చెందిన సయ్యద్ జమాలుద్దీన్ (63) కుటుంబ సభ్యులతో కలిసి నాసిక్ దర్గాకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైలు రాకకోసం వేచి చూస్తున్న సమయంలో గుండెపోటుకు గురైన జమాలుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

ఉప్పల్: ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది.పోలీసులు తెలిపిన మేరకు.. ఉప్పల్ ధర్మపురి కాలనీలో క్రికెట్ కోచ్ వెంకట రమణ నివాసముంటున్నాడు.ఇతని బార్య హర్షిణి(47) గృహిణి. వీరికి ముగ్గురు సంతానం. కుటుంబ సమస్యల వల్ల విషంతాగి ఆత్మహత్య చేసుకుంది. కాగా నిత్యం కుటుంబ కలహాలు ఉండేవని ప్రాథమిక సమాచారం. భర్త వెంకటరమణ పైనే అనుమానం ఉదని హర్షిణి తల్లి బాల లక్ష్మి ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

బాలానగర్: ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడవద్దు అని తండ్రి హెచ్చరించడంతో మనస్థాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఫిరోజ్‌గూడలో శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ చిన్న కుమారుడు ఆశిష్ (22) బెట్టింగ్ యాప్‌లలో డబ్బు పెట్టుబడి పెట్టి ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసయ్యాడు. దీంతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని తండ్రి హెచ్చరించాడు. దీంతో ఆశిష్ తన గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆశిష్‌ను కిందికి దించి స్థానిక హాస్పటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా తెలిపారు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బాలానగర్ సిఐ టి. నరసింహరాజు తెలిపారు.

క్లుప్తంగా...

17 నుంచి చైతన్య రథయాత్రలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవికుమార్‌

హిమాయత్‌నగర్‌: తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ(టీపీఆర్‌పీ) తొలి వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్‌ వెల్లడించారు. బుధవారం సామాజిక కార్యకర్త కర్రేటి విజయారెడ్డి పార్టీలో చేరగా ఆమెకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త రాజకీయ చైతన్యం, అవినీతి లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ఈ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని, బీసీలకు 42 శాతం టికెట్లు కేటాయిస్తామన్నారు.

వాలీబాల్‌లో బీవీబీపీ జట్టు సత్తా


సత్తా చాటిన వాలీబాల్‌ జట్టు

ఫిలింనగర్‌: ఈ నెల 13 నుంచి 15 వరకు ఎల్బీ స్టేడియంలో జరిగిన 69వ స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ ఇంటర్‌ స్కూల్‌ పోటీల్లో వాలీబాల్‌ అండర్‌–17 పోటీల్లో జూబ్లీహిల్స్‌ భారతీయ విద్యా భవన్‌ పబ్లిక్‌ స్కూల్‌ జట్టు రెండో స్థానంలో నిలిచింది. మొత్తం 34 జట్లు పోటీపడగా బీవీబీపీ స్కూల్‌ విద్యార్థుల జట్టు రెండో స్థానంలో నిలిచి తమ సత్తాను చాటినట్లు ప్రిన్సిపాల్‌ అరుణశ్రీ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

బంజారాహిల్స్‌: బోరబండ ఇందిరానగర్‌లో ఇద్దరు సంచుల్లో పెట్టుకుని అమ్ముతున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌టీఎఫ్‌బీ టీమ్‌ ఇన్‌స్పెక్టర్‌ బిక్షారెడ్డి, ఎస్‌ఐ బాలరాజులు సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టగా 173 మద్యం బాటిళ్లు లభించాయి. మద్యం విక్రయిస్తున్న ఈశ్వరమ్మ, మరియాను అరెస్టు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు పవిత్ర ఖురాన్ల అందజేత

రహమత్‌నగర్‌ :శ్రీరాంనగర్‌ జామా మసీదు సయ్యదిన ఉమర్‌ ఫరూఖీ రజీఅల్లాహుతాలలో పవిత్ర ఖురాన్‌ కంఠస్థం పూర్తి చేసిన మదర్సా విద్యార్థులకు గ్యార్వీ షరీఫ్‌ మాసం సందర్భంగా పవిత్ర ఖురాన్‌లను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్లాహ్‌ కృపతో స్థానిక మదర్సాలో ప్రతి సంవత్సరం ఎంతోమంది విద్యార్థులు ఖురాన్‌ కంఠస్థం పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు గులాం దస్తగీర్‌, జనరల్‌ సెక్రటరి (మోత్తెమద్‌)ఫేరోజ్‌ఖాన్‌, ఇన్‌చార్జి సెక్రటరి ఇంతేయాజ్‌ఖాన్‌ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా వైద్యుల క్రికెట్‌ మ్యాచ్‌



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్‌ గాంధీ మెడికల్‌ కాలేజీలో 2021 బ్యాచ్‌ ఆధ్వర్యంలో సైనెక్సెస్‌ పేరిట నిర్వహిస్తున్న కాలేజీ ఫెస్ట్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన మహిళ వైద్యుల క్రికెట్‌ మ్యాచ్‌ ఉత్కంఠభరితంగా సాగింది. చంద్రావతి ఎలెవన్‌ జట్టు టాస్‌ గెలిచి 6 ఓవర్లలో ఒక వికెట్‌కు 68 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌ చేపట్టిన దీప్తి ఎలెవన్‌ జట్టు ఆరు ఓవర్లలో 54 పరుగుల సాధించి 14 రన్స్‌ తేడాతో పరాజయం పాలైంది. ఇరుజట్లుకు చెందిన బ్యాటర్లు శ్రేయా 38, మాధురి 34, రేఖ 30, సుచరిత 16 పరుగులు సాధించి టాప్‌స్కోర్లర్లుగా నిలిచారు. డాక్టర్‌ కిరణ్‌మాదల, అబ్బాయ్య, లెనిన్‌, అపూర్వరెడ్డి ఎంపైర్లుగా బాధ్యతలు నిర్వహించారు. క్రీడస్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులకు గాంధీ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఇందిర, సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ వాణి అభినందించారు. సైనెక్సెస్‌ పేరిట నిర్వహిస్తున్న కాలేజ్‌ ఫెస్ట్‌లో ఒక్కో ఇయర్‌ విద్యార్థులకు బైరవాస్‌, రుద్ర వంశాస్‌, త్రిపురాంతకాస్‌, ధర్మవీరాస్‌, వృషిధారాస్‌ పేర్లతో కొనసాగుతారని, ఈనెల 18 వరకు కాలేజ్‌ఫెస్ట్‌ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఓటర్లు పెరిగినా తగ్గుతున్న పోలింగ్‌!

- పదేళ్లలో 10 శాతం తగ్గిన ఓటింగ్‌
- అభివృద్ధి జరగకపోవడమే అంటున్న విశ్లేషకులు



బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నిక నవంబర్‌ 11వ తేదీన జరగనుండగా నవంబర్‌ 14న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం నామినేషన్ల పర్వం కొనసాగుతుండగా ప్రచారం కూడా వేడెక్కింది. బీజేపీ అభ్యర్థిని కూడా ప్రకటించడంతో బరిలోకి మూడు పార్టీలు నువ్వా.. నేనా..! అన్నట్లుగా ప్రచారాన్ని ఉద్ధృతం చేస్తున్నాయి. అయితే జూబ్లీహిల్స్‌లో ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఓటింగ్‌ శాతం తగ్గుముఖం పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఓటర్లు పెరుగుతున్నా ఓటింగ్‌ శాతం మాత్రం పెరగడం లేదు. పోలింగ్‌ కేంద్రాల దాకా ఓటర్లను రప్పించడంలో ఆయా రాజకీయ పార్టీలు విఫలమవుతున్నాయి. పదేళ్లలో ఇక్కడ పోలింగ్‌ 10 శాతం తగ్గింది.2014 ఎన్నికల్లో 56, 2018లో 47.58, 2023లో జరిగిన ఎన్నికల్లో 45.59 శాతం పోలింగ్‌ మాత్రమే నమోదైంది.

నాయకుల విముఖత కారణమా?

2014 నుంచి 2023 వరకు జరిగిన మూడు ఎన్నికల్లో పోలింగ్‌ శాతం తగ్గడమే కానీ పెరగడం లేదు. దీనికి కారణం నియోజకవర్గంలో సమస్యలు పెరిగిపోవడం, అభివృద్ధి ఆశాజనకంగా లేకపోవడం, రాజకీయ పార్టీల పట్ల విముఖత కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని బోరబండ, రహమత్‌నగర్‌, వెంగళరావునగర్‌, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, షేక్‌పేట, సోమాజిగూడ తదితర ఏడు డివిజన్లు వస్తాయి. ఈ ఏడు డివిజన్లలో వెంగళరావునగర్‌లో మాత్రమే ఎగువ, మధ్యతరగతితో పాటు కాలనీలు ఉండగా, మిగతా అన్ని ప్రాంతాల్లో బస్తీలు, మురికివాడలు, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు నివసిస్తున్నాయి. అయితే ఏ బస్తీలో, ఏ కాలనీలో చూసినా దెబ్బతిన్న రహదారులు, పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు, నీటి ఎద్దడి, ఫుట్‌పాత్‌లు లేకపోవడం, పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా కనిపిస్తున్నాయి.

నీటి మూటలుగానే హామీలు..

గత రెండు దశాబ్దాలుగా నియోజకవర్గంలో ఆశించినంత అభివృద్ధి జరగకపోవడంతో పాటు ప్రభుత్వాలు ఆశాజనకంగా లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 1999లో మాజీ సీబీఐ డైరెక్టర్‌ కే విజయరామారావు గెలవగా, ఉమ్మడి ఖైరతాబాద్‌లో ఉన్న ఈ ప్రాంతం ఆయన గెలిచిన పార్టీ ప్రభుత్వంలోనే ఉంది. 2004లో పీజేఆర్‌ జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం నుంచి గెలువగా అప్పుడు కూడా కాంగ్రెస్‌ అధికారంలోనే ఉంది. ఆ తర్వాత విష్ణువర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా కాంగ్రెస్‌ పార్టీ అధికారంలో ఉంది. 2014 మాగంటి గోపీనాథ్‌ టీడీపీ నుంచి గెలిచిన తర్వాత కొద్ది రోజులకే బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి 2023 వరకు అధికారంలో బీఆర్‌ఎస్‌ ఉంది. చాలావరకు సమస్యలు పెండింగ్‌లో ఉండడం, అభివృద్ధి పనులు ముందుకుసాగకపోవడం పట్ల నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఓటర్లంతా నిరుత్సాహానికి గురవుతూ పోలింగ్‌ బూత్‌ల దాకా రాలేకపోతున్నారని నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు.తాము బాగా పనిచేస్తున్నట్లు, అభివృద్ధి చేస్తున్నట్లు ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఆయా పార్టీలు చెప్పుకోవడమే గానీ, గెలిచిన తర్వాత అటువైపు తొంగి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలతో సతమతమవుతున్న స్థానికులు ఓట్లు వేయడానికి ముందుకు రావడం లేదు. కనీసం ఈ సారైనా రాజకీయ పార్టీలు ఓటర్లను ఎంతవరకు పోలింగ్‌ బూత్‌ల దాకా తీసుకువస్తారో వారి ఇచ్చే హామీలు, చేసిన అభివృద్ధిపై ఆధారపడి ఉంది.

సాంకేతికతతో సంతాన సమస్యలను అధిగమించవచ్చు


ఫర్టిలిటీ సెంటర్‌ ప్రారంభోత్సవంలో గురవా రెడ్డి

బంజారాహిల్స్‌: సంతాన సమస్యలు ఎదుర్కొంటున్న దంపతులకు ప్రస్తుతం మార్కెట్లో అత్యాధునిక సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని గతంలో ఎన్నో ఇబ్బందులు ఉండేవని కానీ ఇప్పుడు ఎంతో మంది ఉత్తమ ఫలితాలు పొందుతున్నారని కిమ్స్‌ సన్‌షైన్‌ ఎండీ డాక్టర్‌ ఏవీ. గురవారెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కిమ్స్‌ ఫర్టిలిటీతో పాటు ఐవీఎఫ్‌ కేంద్రాన్ని కిమ్స్‌సన్‌ షైన్‌ సంస్థల చైర్మన్‌ డాక్టర్‌ బి. భాస్కర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. లేజర్‌ అసిస్టెడ్‌ఎంబ్రియో హ్యాచింగ్‌, ప్రీ ఇంప్లాంటేషన్‌ జెనెటిక్‌ టెస్టింగ్‌ వంటి అత్యాధునిక విధానాలు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆధునిక పద్ధతుల్లో చేస్తున్న ఈ పరీక్షలు, చికిత్సలతో ఎంతో మంది దంపతులు సంతానాన్ని పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌ జాదవ్‌, నిమ్మ పూజారెడ్డి, సిందూరా బండి పాల్గొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–2లోని ముఫకంజా కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ (ఎంజేసీఈటీ)లో నవంబర్‌ 8న 15 గంటల హ్యాకథాన్‌ 'హాక్‌ రివల్యూషన్‌–2025'ను నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఎంజేసీఈటీ ఆడిటోరియంలో హాక్‌ రివల్యూషన్‌–2025 పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌ మహిపాల్‌సింగ్‌ రావత్‌, ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఫర్హతుల్లా హుస్సైనీ, ప్రొఫెసర్‌ సయ్యద్‌ షబ్బీర్‌ అహ్మద్‌, డాక్టర్‌ అరిఫుద్దీన్‌ సోహైల్‌, నాజియా యాస్మిన్‌, రఫీయుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..కంప్యూటర్‌ సొసైటీ ఆఫ ఇండియా (సీఎస్‌ఐ), ఎంజేసీఈటీ స్టూడెంట్‌ చాప్టర్‌ ఆధ్వర్యంలో కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌ డిపార్ట్‌మెంట్‌ (సీఎస్‌ఈడీ), ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ సెల్‌, ఇనిస్టిట్యూషన్‌ ఇన్నోవేషన్‌ కౌన్సిల్‌ (ఐఐసీ), ఎంహెచ్‌ఆర్‌డీ సహకారంతో 'హాక్‌ రివల్యూషన్‌–2025' జరపనున్నట్లు తెలిపారు. ప్రతి ట్రాక్‌లో రూ.75,000 నగదు బహుమతులు ఇస్తారని మొత్తం గ్రాండ్‌ ప్రైజ్‌ మనీ రూ.3 లక్షలుగా నిర్ణయించినట్లు వివరించారు.

అబ్దుల్‌ కలాం సేవలు మరువలేనివి


కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మానిక్‌ రావు


నివాళులర్పించిన మహాలక్ష్మి రామన్‌ గౌడ్‌

రహమత్‌నగర్‌: డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌ కలాం సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. అబ్దుల్‌ కలాం జయంతిని పురస్కరించుకుని బుధవారం శ్రీరాంనగర్‌లో నిర్వహించిక కార్యక్రమంలో ఎమ్మెల్యే మానిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌ భాస్కర్‌ పాల్గొని కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌ మునీర్‌, సయ్యద్‌ మసూద్‌, నయూం, తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌: భారత మాజీ రాష్ట్రపతి డా.అబ్దుల్‌ కలాం జయంతి సందర్భంగా బుధవారం హిమాయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మహాలక్ష్మి రామన్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామన్‌ గౌడ్‌, ఉమామహేశ్వర్‌, రవీందర్‌, గిరీష్‌, జాకి, షేక్‌ అజర్‌, ప్రియరాజ్‌ జస్వాల్‌, పూర్ణచందర్‌, జోసెఫ్‌, రమేష్‌, శేఖర్‌, హితేష్‌, సుజాత, అభిషేక్‌, ఆదర్శ్‌, మోసిన్‌, అహ్మద్‌ పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

రహమత్‌నగర్‌ : యువత రాజకీయాల్లోకి రావాలన్న లక్ష్యంతో తాను జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికల్లో ప్రజా వెలుగు పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఎర్రోళ్ల ప్రవీణ్‌కుమార్‌ పేర్కొన్నారు. బుధవారం ఆయన నామినేషన్‌ వేసేందుకు వెళ్తూ కార్మికనగర్‌లో కూడలిలో మాట్లాడారు. ప్రజల కనీస అవసరాలు తీర్చడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. తాను గెలిస్తే యువతకు ఉపాధి, బస్తీల్లో ప్రాథమిక అవసరాలు తీరుస్తానని హామీ ఇచ్చారు.


కార్మికనగర్‌ ప్రచారంలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్‌

జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం ఖాయం

సికింద్రాబాద్‌: కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పాలనలపై తీతవ్ర వ్యతిరేకతలతో ఉన్న జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ ప్రజలు ఈసారి బీజేపీని గెలిపించేందుకు సమాయత్తం అవుతున్నారని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని లభినందిన బీజేపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ విద్యావంతులు, యువకులు జూబ్లీహిల్స్‌లో అక్కడి ప్రజలకు మోదీ సుపరిపాలన, దేశాభివృద్ధి అంశాల గురించి వివరించాలని కోరారు. సికింద్రాబాద్‌ నియోజకవర్గం నుంచి ఎంపిక చేసిన 38 మంది బీజేపీ నాయకులు ప్రతినిత్యం జూబ్లీహిల్స్‌ ఎన్నికల ప్రచారానికి వెళ్లేందుకు ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, ప్రకాశ్‌గౌడ్‌, కన్నా భిరామ్‌, ప్రభుగుప్తా, గణేశ్‌ముదిరాజ్‌, ఆకారం రమేశ్‌, శారద తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో శ్రీవిద్యకు బంగారు పతకం



సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా జిమ్నాస్టిక్స్‌ అసోసియేషన్‌, వీజే జిమ్నాస్టిక్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో టేబుల్‌ వాల్ట్‌, ఫ్లోర్‌ క్యాంప్‌ బాలురు మరియు బాలికలు–2025 మంగళవారం నిర్వహించిన టేబుల్‌ వాల్ట్‌, ఫ్లోర్‌లో శ్రీవిద్య బంగారు పతకం, ప్రజ్వల్‌ కుమార్‌ వెండి, వేద్‌ నిర్మల్‌ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా సీనియర్‌ జిమ్నాస్టిక్‌ కోచ్‌ బ్రహ్మానంద ప్రసాద్‌ తదితరులు విద్యార్థులను అభినందించారు.

పూజారిని బెదిరిస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలి



వెంగళరావునగర్‌: దేవాలయానికి వచ్చే భక్తురాలు పూజారులను బెదిరిస్తూ పూజలకు ఆటంకం కలిగిస్తుందని తెలంగాణా రాష్ట్ర అర్చక సమాఖ్య చైర్మన్‌ జి.ఉపేందర్‌శర్మ, గౌరవ అధ్యక్షులు బి.రామశర్మ ఆరోపించారు. వెంగళరావునగర్‌ ప్రధాన రహదారిలో ఉన్న శ్రీరామాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయా పూజారులు మాట్లాడారు. సదరు దేవాలయానికి 2018 నుంచి ఓ భక్తురాలు వచ్చి అనుచితంగా ప్రవర్తించడంతో నాటి నుంచి దేవాలయంలో అల్లర్లు, గొడవలు జరుగుతున్నాయన్నారు. అంతే కాక ఐదేళ్ల క్రితం దసరా ఉత్సవాల్లో పూనకం వచ్చిన ఒక భక్తురాలిని సమీపంలో ఉన్న అర్చకులు వెంకటరత్నం కాపాడటం కోసం ముట్టుకుంటే అది తప్పుగా చిత్రీకరించి సస్పెండ్‌ చేయించిందన్నారు. రెండేళ్ల తర్వాత తిరిగి విధులకు హాజరైన సదరు పూజారి ఇచ్చే తీర్థ ప్రసాదాలు తీసుకోకుండా అవమానిస్తూ, నిందిస్తూ వస్తుందన్నారు. 2018 నుంచి 25 వరకు సదరు భక్తురాలు ఐదుమంది ఈఓలను బదిలీ చేయించిందన్నారు. ఈ విషయంపై దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా సర్దుకుపోవాలని చెబుతున్నారన్నారు. పూజారులను ఇబ్బందులకు గురిచేస్తున్న భక్తురాలిపోలీసులు చర్యలు తీసుకోవాలని వెస్ట్‌జోన్‌ డీసీపీ, పంజగుట్ట ఏసీపీ, మధురానగర్‌ ఎస్‌హెచ్‌ఓకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి వెంకటరత్నం, పూజారి అంబాప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది


ఎర్రగడ్డలో ప్రచారం చేస్తున్న నాయకులు

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్‌ పార్టీ జూబ్లీహిల్స్‌లో చేసిన అభివృద్ధే అఖండ విజయాన్ని అందిస్తుందని తెలంగాణా డైరీ కార్పొరేషన్‌ చైర్మన్‌ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లో పలు బస్తీల్లో ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీని నమ్మి అధికారాన్ని ఇచ్చిన ప్రజలకు మంచి పాలన అందిస్తుందన్నారు. గత పదేళ్లలో లేని అభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిలోనే చేశారన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే నవీన్‌యాదవ్‌ను గెలిపిచాలన్నారు. ప్రచారంలో రవిగౌడ్‌, రమేష్‌నాయక్‌, పాల్గొన్నారు.

ఆయుష్‌, యోగా సేవలు కొనసాగించాలి


రోగి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

అమీర్‌పేట: మనిషి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయుష్‌, యోగా సేవలు కొనసాగించాలని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం సనత్‌నగర్‌ ఈఎస్‌ఐసీ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అవేక్‌ క్రానియోటమి శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళ బాలమణితో మాట్లాడారు. క్రానియోటమి అనేది మెదడు శస్త్ర చికిత్స చేసే విధానమని, రోగి మేల్కొన్న స్థితిలో ఉండగానే శస్త్ర చికిత్స నిర్వహిస్తారని వైద్యులు వివరించారు. మనిషి మాట, కదలిక, మెదడు కార్యకలాపాలను పర్యవేక్షించి సమస్యకు పరిష్కారమార్గం చూపవచ్చని చెప్పారు. డయాలసిస్‌ యూనిట్‌, న్యూరో సర్జరీ, క్యాథ్‌ల్యాబ్‌, ఆపరేషన్‌ థియేటర్ల వంటి ముఖ్య విభాగాలను పరిశీలించారు. అనంతరం మెడికల్‌ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖిగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించటానికి ప్రముఖ వ్యక్తుల ద్వారా గెస్ట్‌ లెక్చరర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యమైన విద్య, సమగ్ర వైద్య సేవలను అభినందించారు. వెంట కళాశాల డీన్‌ శిరీష్‌కుమార్‌ జి.చౌహన్‌ ఉన్నారు.

రూ.78.85 లక్షలు సీజ్‌

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నిక నేపథ్యంలో భారీగా డబ్బులు తరలిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. జూబ్లీహిల్స్‌, ఫిలింనగర్‌, బోరబండ, మధురానగర్‌, పంజగుట్ట, సనత్‌నగర్‌, టోలిచౌకి, గోల్కొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత 5 రోజుల నుంచి వేర్వేరు చోట్ల పోలీసులు తనిఖీలు చేపట్టి రూ.78.85 లక్షలు సీజ్‌ చేశారు.

రూ.10 లక్షలు..

వెంగళరావునగర్‌ : అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల నగదును బుధవారం ఎన్నికల పర్యవేక్షణ ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి.
అమీర్‌పేట చౌరస్తా, వెంకటగిరి కాలనీ రోడ్డు, మధురానగర్‌కాలనీతో పాటు తదితర ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో సరైన రసీదులు లేని డబ్బును స్వాధీనం చేసుకున్నారు.

ఏసీ పైపు ఊడిపడి వ్యక్తి మృతి


మృతుడు శివపూజన్‌ పండిట్‌

రహమత్‌నగర్‌: ప్రమాదవశాత్తు పైపు మీద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్‌ రాష్ట్రం చకరమదాస్‌ పట్టణం వీశాలి ప్రాంతానికి చెందిన శివపూజన్‌ పండిట్‌(47) ఖైరతబాద్‌ లక్ష్మీనగర్‌లో ఉంటూ ఏసీ ఇన్సూలేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం టిమ్స్‌ ఎర్రగడ్డ, సనత్‌నగర్‌లోని ఓ భవనంలో పనిచేస్తుండగా ఐదో అంతస్తు నుంచి పైపు పండిత్‌పై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు.చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటాం


మాట్లాడుతున్న రామకృష్ణయ్య

పంజగుట్ట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం సుప్రీం కోర్టుకు వెళ్లైనా సాధించుకుంటామని బీసీ యునైటెడ్‌ ఫ్రంట్‌ జాతీయ అధ్యక్షులు పాలూరి రామకృష్ణయ్య అన్నారు. బుధవారం సోమాజిగూడలోని ఫ్రంట్‌ కార్యాలయంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల కార్య నిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియపై ఇచ్చిన జీవోను స్టే విధిస్తూనే తాము ఎన్నికలకు స్టే ఇవ్వలేదనడం సరికాదన్నారు. అగ్రకులాలకు ఎలాంటి సర్వే లేకున్నా, కుల గణన లేకున్నా రిజర్వేషన్లు ఇస్తారని దానికి 50 శాతం స్లాబ్‌ అడ్డురాలేదని కేవలం బీసీ రిజర్వేషన్లకే 50 శాతం స్లాబ్‌ అడ్డు వచ్చిందా అని ప్రశ్నించారు. త్వరలోనే ఫ్రంట్‌ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తామన్నారు. రిజర్వేషన్ల కోసం బంద్‌కు పిలుపునిచ్చిన బీసీ జేఏసీ చైర్మన్‌ ఆర్‌.కృష్ణయ్య ముందు బీజేపీ పార్టీకి రాజీనామా చేసి తర్వాత రిజర్వేషన్ల కోసం పోరాడాలన్నారు. ఈ సమావేశంలో నరేందర్‌ గౌడ్‌, శ్రీనివాస్‌, మల్లెల శ్రీనివాస రావు, బెక్కం వెంకటేష్‌, భిక్షపతి గౌడ్‌, గోపి, వెంకటేశ్వర్లు, తిరుపతి పాల్గొన్నారు.

ఉద్యమాలు చేస్తాం..

హిమాయత్‌నగర్‌ : రాష్ట్రంలోని బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాలు కొనసాగిస్తామని తెలంగాణ మన ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ చొప్పర్‌ శంకర్‌ ముదిరాజ్‌ హెచ్చరించారు. బుధవారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీల మేలు కోసం పని చేస్తున్నామని చెబుతూనే పదవులన్ని ఓసీలకే కట్ట బెడుతున్నారని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చితేనే సాధ్యమవుతుందన్నారు. ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌ ముదిరాజ్‌లందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అందె బాబయ్య, పగిడాల సుధాకర్‌, డా.రాస వెంకట్‌, యాసాడ నర్సింగ్‌, ఈటల భద్రయ్య, సలేంద్ర శివయ్య, డా.మద్దెల సంతోష్‌, బోళ్ల కరుణాకర్‌, బైంద్ల సత్యనారాయణ, బొమ్మరగోని రాజు, గోపిరాజు పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతు..

బంజారాహిల్స్‌: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, తొమ్మిదో షెడ్యూల్‌లో రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి చట్టం చేయాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 18న బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే బంద్‌కు పలువురు బీసీ నేతలు మద్దతు తెలిపారు. బీసీ నేతలు నర్సాయ హనుమంతుగౌడ్‌, ఆనంద్‌, రాజు, అశోక్‌, నరేష్‌, రాజు తదితరులు తమ మద్దతు ప్రకటించారు.

సాక్షి
గురువారం
16 అక్టోబర్ 2025

ఏపీకే.. ఆచితూచి చూశాకే!

- నకిలీ ఫైల్స్‌పై హెచ్చరిస్తున్న పోలీసులు
- అమాయకుల జేబులు గుల్ల చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఇటీవల పెరిగిపోయిన ఈ తరహా నేరాలు
- అప్రమత్తంగా ఉండాలన్న డీసీపీ దార కవిత





సాక్షి, సిటీబ్యూరో:

- ఈ నెల 8న పంజాబ్ నేషనల్ బ్యాంక్ లైఫ్ సర్టిఫికెట్ పేరుతో బర్కత్‌పురకు చెందిన బ్యాంకు మాజీ ఉద్యోగి నుంచి రూ.12.99 లక్షలు
- ఈ నెల 7న తక్కువ ధరకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తామంటూ బిగ్‌బాస్కెట్ పేరుతో యూసుఫ్‌గూడకు చెందిన యువకుడి నుంచి రూ.1.97 లక్షలు
- గత నెల 25న ఆర్టీఏ చలాన్ల పెండింగ్ పేరుతో బేగంబజార్‌కు చెందిన 50 ఏళ్ల వ్యక్తి నుంచి రూ.5.08 లక్షలు, గడ్డి అన్నారం యువకుడి నుంచి రూ.లక్ష
- హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసిన 'నకిలీ ఏపీకే ఫైల్స్'కేసులు ఇవి. ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల సేవలు, పెట్టుబడులకు అవకాశాలు, పెండింగ్ చలాన్లు, రుణాల పేరుతో ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్స్ పంపి, బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీసీపీ దార కవిత సూచించారు. ఈ నేరాలు జరిగే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు.
- వాట్సాప్ సహా వివిధ రకాలైన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా, నకిలీ వెబ్‌సైట్ల ఆధారంగా లింకుల రూపంలో సైబర్ నేరగాళ్లు ఈ నకిలీ ఏపీకే ఫైల్స్ పంపుతున్నారు. వాటిని క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేస్తే చాలు... ఫోన్ వారి ఆధీనంలోకి వెళ్లిపోతుంది.
- గూగుల్ ప్లేస్టోర్ నుంచి కాకుండా యాప్స్ పేరుతో, నేరుగా లింకుల రూపంలో సైబర్ నేరగాళ్లు పంపిస్తుంటారు. కొన్ని ఫైల్స్‌ను ఇన్‌స్టాల్ చేసే సమయంలోనే అది ఎస్సెమ్మెస్, కాంటాక్ట్స్, నోటిఫికేషన్స్, స్క్రీన్ షేరింగ్ వంటి అనుమతులు కోరుతుంటాయి.
- ఇలా ఇన్‌స్టాల్ అయిన యాప్ ద్వారా సైబర్ నేరగాళ్లు వినియోగదారుల బ్యాంకు ఖాతాల లాగిన్లు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం తోసహా సున్నిత వివరాలు సైబర్ నేరగాళ్లకు చేరిపోతాయి.
- కొన్ని యాప్స్‌లో మొబైల్ ఫోన్లను రిమోట్ పద్ధతిలో యాక్సెస్ చేసే టూల్స్ కూడా అంతర్గతంగా నిక్షిప్తమై ఉంటాయి. బ్యాంకులు, ప్రభుత్వ పథకాలు, సంస్థలు, వ్యవస్థలతో పాటు పేమెంట్ గేట్ వేల రూపంలోనూ ఈ ఫైల్స్ ఉండవచ్చు.
- టార్గెట్ చేసిన వ్యక్తుల బ్యాంకు ఖాతాల నుంచి నగదు స్వాహా చేయడానికే ఎక్కువగా ఈ ఏపీకే ఫైల్స్ వినియోగిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత సమాచారం, డేటా తస్కరణకు కూడా వాడతారు.
- ఎస్సెమ్మెస్, వాట్సాప్, టెలిగ్రాం, ఈ–మెయిల్స్‌తోపాటు సోషల్ మీడియా ద్వారా లింకుల రూపంలో వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయకూడదు. బ్యాంక్ అప్‌డేట్స్, కేవైసీ వెరిఫికేషన్, ప్రభుత్వ ప్రయోజనాల పేరుతో వచ్చే లింకుల్ని నమ్మకూడదు.
- ఏదైనా యాప్ దాని పనితీరుకు భిన్నంగా, మించిన అంశాల్లో యాక్సెస్ అడుగుతుంటే అనుమానించాలి. వాటిని యాక్సెప్ట్ చేసే ముందు సరిచూసుకోవాలి. ఇలాంటి మాల్‌వేర్ బారిన పడకుండా ఉండటానికి ఫోన్లలో ఆపరేటింగ్ సిస్టమ్స్, సెక్యూరిటీ టూల్స్ అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలి.
- బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, పాస్‌వర్డ్స్, పిన్ నెంబర్లు అడగవని గుర్తుంచుకోవాలి. బాధితులుగా మారితే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి లేదా పోర్టల్ ద్వారా తక్షణం ఫిర్యాదు చేయాలి.

బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు

– ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్

రాయదుర్గం: రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేయాలని నిర్ణయించినట్లు అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్ ప్రకటించారు. బుధవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ ప్రధాన గేటు బయట ఆయన ఏఐఓబీసీఎస్‌ఏ నాయకులతో సమావేశమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఓబీసీఎస్‌ఏ ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్ల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలలో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అవగాహన కార్యక్రమాలు, నిరసనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుందన్నారు. కమిటీకి ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ కార్యదర్శి మహేష్‌గౌడ్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. హెచ్‌సీయూ నుంచి టి.అరుణ్ కేతన్, ఎస్.శివ, డాక్టర్ లక్ష్మీనర్సయ్య, శివ యాదవ్, ప్రవీణ్, మౌనిక ముదిరాజ్, కాకతీయ, ఉస్మానియా, మహత్మాగాంధీ, తెలంగాణ, పాలమూరు యూనివర్సిటీల విద్యార్థులు, పరిశోధకులు సభ్యులుగా ఉన్నారని వివరించారు. అన్ని యూనివర్సిటీల క్యాంపస్‌లలో 'ధూంధాం' కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర అమోఘం: సజ్జనర్



శ్రీమాతా సేవా సమితి స్పెషల్ సావనీర్–2025ను ఆవిష్కరించిన నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్

సనత్‌నగర్: నిరుపేదలకు చేయూతనందించి వారి జీవితాల్లో వెలుగులు నింపడంలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర అమోఘమని నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు. శ్రీమాతా సేవా సమితి స్పెషల్ సావనీర్–2025ను బుధవారం బంజారాహిల్స్‌లోని సీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీమాతా సేవా సమితి ముున్ముందు కూడా ఇలాంటి సేవలు కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా నిరుపేదలు ఎక్కువగా నివసించే మురికివాడలు, బస్తీల్లో వారి అవసరాలను తెలుసుకుని తదనుగుణంగా సేవలు అందిస్తే వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు కుసుమ విజయ, సభ్యులు రాధిక, గోనె శ్రీనివాస్, కమలమ్మ, కల్పన, దుర్గ, శ్రీదేవి, సౌమ్య, మాద అరుణ్‌కుమార్, శంకు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారులు మద్దిలేటి, తేజ వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాను వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

పోస్ట్.. 'రౌండ్ ది క్లాక్'

- జనరల్ పోస్టాఫీసులో రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు నైట్ సర్వీస్
- ప్రారంభమైన స్పీడ్ పోస్టు బుకింగ్, డిస్పాచ్ సేవలు

సాక్షి, సిటీబ్యూరో: తపాలా శాఖ సేవలను విస్తరించింది. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన నిరంతర సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆధునిక సాంకేతికత సమాచార వ్యవస్థను అందిపుచ్చుకుంటూ సరికొత్త ప్రయోగాలు చేస్తున్న తపాలా శాఖ తాజాగా 'రౌండ్ ది క్లాక్' స్పీడ్‌పోస్టు సేవలను అందుబాటులోకి తెచ్చింది. బుధవారం హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్‌లో స్పీడ్‌పోస్టు బుకింగ్, డిస్పాచ్ సేవలను ప్రారంభించింది. ప్రత్యేకంగా రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు స్పీడ్‌పోస్ట్ కోసం సేవలు కొనసాగనున్నాయి. గత నెల ఒకటో తేదీ నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు నిలిపివేసి వాటిని స్పీడ్‌పోస్ట్ సేవలో విలీనం చేసిన విషయం తెలిసిందే. తపాలా శాఖ తమ సేవలను ఆధునీకరించే ప్రయత్నంలో భాగంగా దేశీయ పోస్టల్ సేవల క్రమబద్ధీకరణ, మెరుగైన పనితీరు, ట్రాకింగ్ వ్యవస్థ బలోపేతం వంటి ప్రక్రియలో భాగంగానే స్పీడ్ పోస్ట్‌లో రిజిస్టర్డ్ పోస్ట్ సేవలను విలీనం చేస్తున్నట్లు తపాలా శాఖ వెల్లడించింది. స్పీడ్‌పోస్ట్ అంటే వేగవంతమైన డెలివరీ. రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు స్పీడ్ పోస్ట్‌లో కలపడంతో బుకింగ్, డెలివరీలు మరింత అందుబాటులోకి రానున్నాయి. స్పీడ్ పోస్ట్ ద్వారా పార్శిల్ ఎక్కడి వరకు చేరిందో ఆన్‌లైన్‌లో స్టేటస్ చూసుకునే వెసులుబాటు కల్పించింది.

ఏపీటీ– 2.0తో సేవలు

కంప్యూటర్ అనుసంధానం, డిజిటలైజేషన్‌తో ముందుకు సాగుతున్న తపాలా శాఖ ఈ ఏడాది మరో అడుగు ముందుకు వేసింది. సొంతంగా ఏపీటీ– 2.0 (అడ్వాన్స్‌డ్ పోస్టల్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)ని రూపొందించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సేవలను మరింత విస్తృతం చేసింది. ఇంటి వద్ద నుంచే పోస్టల్ సేవలు పొందే అవకాశం కల్పించింది. ప్రస్తుతం తపాలా సేవలన్నీ నూరు శాతం వెబ్ ఆధారిత క్లౌడ్ టెక్నాలజీతో అనుసంధానం చేసింది. ఈ కొత్త టెక్నాలజీతో పార్శిల్స్, లెటర్‌ల రియల్‌టైమ్ ట్రాకింగ్ సాధ్యమవుతోంది. వేగవంతమైన, పారదర్శకమైన, ఇంటి వద్దకే పోస్టల్ సేవలను అందించడానికి డిజిటల్ సాధనాలు ఉపయోగిస్తోంది.

తగ్గిన ఆదరణ.. పెరిగిన టెక్నాలజీ..

వాస్తవంగా స్పీడ్‌పోస్టు సేవలు కూడా గణనీయంగా తగ్గాయి. వాట్సాప్, జీమెయిల్ వంటి డిజిటల్ మాధ్యమాల రాకతో సమాచార మార్పిడి వేగవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఇప్పుడు డిజిటల్ మార్గంలోనే ఉత్తర, ప్రత్యుత్తరాలు జరుపుతున్నాయి. ఐదేళ్లలో జరిగిన రిజిస్టర్డ్ పోస్ట్ బుకింగ్‌ను పరిశీలిస్తే.. అది 25 శాతానికి పడిపోయింది. స్పీడ్ పోస్ట్, ఇతర కొరియర్ సేవలు అందుబాటులోకి రావడంతో రిజిస్టర్డ్ పోస్ట్‌కు డిమాండ్ తగ్గింది.

శాంతియుత వాతావరణంలో బంద్



సమావేశంలో ఐక్యతను చాటుతున్న బీసీ సంఘాల నేతలు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

అన్ని సంఘాలకు పిలుపు ఇచ్చిన ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టేను నిరసిస్తూ ఈ నెల 18వ తేదీన చేపట్టిన తెలంగాణ బంద్‌ను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన బీసీ జేఏసీ ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో 135 బీసీ కుల సంఘాలు, 35 బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని బంద్‌కు మద్దతు ప్రకటించాయి. ప్రధాన రాజకీయ పార్టీలు బంద్‌కు మద్దతు ప్రకటించాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యమంలో అందరికీ అవకాశాలు కల్పిస్తామని, స్వచ్ఛందంగా పని చేసే వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. అందరూ బంద్‌కు మద్దతు ప్రకటించి ఊరుకోవద్దని, రేపటి నుంచే అన్ని ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర బంద్‌లో సబ్బండ కులాలు పాల్గొని చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. పెంచిన బీసీ రిజర్వేషన్లను తగ్గించడానికి అనేకమంది కుట్రలకు పాల్పడుతున్నారని, ఇందుకు కోర్టులను వేదికలుగా చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులను ఎండగట్టి రాష్ట్రంలో రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ల సాధన కోసం ఈ బంద్‌ను చేపట్టినట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్లు పెంచడం ద్వారా రాష్ట్రంలోని అన్ని కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని, అంతిమంగా రాజ్యాధికారంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం వాటా దక్కుతుందని అన్నారు. వ్యాపారులు, విద్యాసంస్థలు, పెట్రోల్ బంక్ యాజమాన్యాలు, ఆర్టీసీ, రవాణా వ్యవస్థలు బంద్‌రోజు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బంద్ నిర్వహించడం ద్వారా బీసీ డిమాండ్లను దేశవ్యాప్తంగా వినిపించగలుగుతామని, గల్లీ నుండి ఢిల్లీ దాకా సెగ పుట్టించడానికే ఈ బంద్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని, కో చైర్మన్ దాసు సురేష్, కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, పి.పురుషోత్తం, కుల్కచర్ల శ్రీనివాస్, గుజ్జ సత్యం, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, తంగెళ్లమూడి నంద గోపాల్, ఉదయ్ నేత, శ్యామ్, చంద్రశేఖర్, మల్లయ్య, జగన్నాథం, జ్ఞానేశ్వర్, రామకోటి, మధు, వెంకటేష్, విజయ్, నరసింహా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ హజ్‌యాత్ర అవకాశం దక్కాలి

– హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా



సాక్షి,సిటీబ్యూరో: దరఖాస్తు చేసుకున్న వారందరికీ హజ్ యాత్ర–2026కు వెళ్లే అవకాశం దక్కాలని, ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరనున్నామని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియాబానీ ఖుస్రో పాషా అన్నారు. బుధవారం నాంపల్లి హజ్‌హౌస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026 హజ్ యాత్రకు 11,757 దరఖాస్తులు వచ్చాయని, 7,140 మందికి యాత్రకు వెళ్లే అవకాశం దక్కిందన్నారు. మిగిలిన 4,617 మంది కూడా యాత్రకు వెళ్లే అవకాశం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సేవకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రాంభించామన్నారు. హజ్ సేవకులు(హజ్ ఇన్‌స్పెక్టర్)గా ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు తప్పకుండా హజ్ లేదా ఉమ్రా చేసి ఉండాలని గతంలో షరతు ఉండేదని తెలిపారు. అయితే ఈసారి నుంచే 50 శాతం హజ్, ఉమ్రా యాత్ర చేయని వారికి కూడా అవకాశం ఉందన్నారు. యాత్రకు వచ్చేవారు తప్పకుండా కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని సౌదీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు హజ్ యాత్రికులకు ఎలాంటి లోటు రాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈసారి యాత్రకు సంబంధించిన వ్యవహారాలన్నీ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి సైపుల్ల తదితరులు పాల్గొన్నారు.

అవమానించేవారికి గుణపాఠం చెప్పాలి

– మాజీమంత్రి హరీశ్‌రావు

శ్రీనగర్ కాలనీ: దుఃఖంలో ఉన్నవారిని కూడా అవమానించే విధంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ మంత్రులకు గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ మహిళా నాయకులు కళావతి, బి.లక్ష్మి, శైలజ, ఆర్కే లక్ష్మి, అనురాధ, మంజుల, సత్యవతితోపాటు దాదాపు 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మహిళా నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పట్ల మంత్రులు అనుచితంగా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అన్నారు. గోపీనాథ్ ప్రజల మధ్య ఉంటూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఆయన మరణం కుటుంబానికి, నియోజకవర్గానికి తీరని లోటు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తోందని, ప్రధాని మోదీ ఏపీ పుష్కరాలకు రూ.100 కోట్లు ఇచ్చి, తెలంగాణాకు గుండు సున్నా ఇచ్చారని ఆరోపించారు. బీహార్‌లో ఓట్ చోరీ అంటున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఓటు చోరీ చేస్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. జూబ్లీహిల్స్ సునీతను ఓడించడానికి 20 వేల దొంగ ఓట్లను నమోదు చేశారని, ఇవన్నీ ప్రజలు గమనించాలన్నారు. మహిళలకు రూ.2,500 చొప్పున ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పటికి ఒక్కొక్కరికి రూ.55 వేలు బాకీ పడ్డారని, వాటిని ఇచ్చి ఓట్లు అడగాలని అన్నారు. కేసీఆర్ హయాంలో బస్తీ దావాఖానాలు ఏర్పాటు చేశారని, ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారని, నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు.

మానవ ఆరోగ్యంలో సూక్ష్మజీవులే కీలకం



సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

ఓయూ మైక్రో బయాలజీ విభాగం స్వర్ణోత్సవాల్లో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

లాలాపేట: మానవ ఆరోగ్యం, రోగాలపై సూక్ష్మజీవులే కీలక పాత్ర పోషిస్తాయనీ ప్రముఖ ఉదరకోశ వ్యాధుల నిపుణుడు పద్మవిభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు.ఉస్మానియా యూనివర్సిటీ మైక్రో బయాలజీ విభాగం స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఓయూ మైక్రో బయాలజీ శాఖ, అసోసియేషన్ ఆఫ్ మైక్రో బయాలజిస్ట్స్ హైదరాబాద్ ఇండియా యూనిట్ సంయుక్తంగా ఎమర్జింగ్ మైక్రోబియల్ టెక్నాలజీస్ ఫర్ –వన్ హెల్త్ 'అనే అంశంపై ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఓయూ వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'గట్ మైక్రోబయాట్'అనేది శక్తి సేకరణ, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, మానసిక ఆరోగ్యం, హృదయ సంబంధిత అంశాలను తెలియజేస్తుందన్నారు. సహజ ప్రసవం, చిన్నారులకు తల్లిపాల వినియోగం, సమతుల ఆహారం తీసుకోవడం, తక్కువ మోతాదులో యాంటీ బయాటిక్ మందులు వాడటం మొదలైన వాటి వల్ల మైక్రోబియల్ డైవర్సిటీని కలిగి ఉండవచ్చని అన్నారు. సదస్సు కన్వీనర్ ప్రొ.బీమా మాట్లాడుతూ ఓయూలో మైక్రో బయాలజీ డిపార్టుమెంట్ ప్రారంభమై 50 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సదస్సు మైక్రో బయాలజీ రంగంలో మరిన్ని పరిశోధనలు, ఆవిష్కరణలు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసోసియేషన్ ఆఫ్ మైక్రోబయాలజిస్ట్స్ ఇండియా అధ్యక్షులు డా.అనిల్ పునియా, ఓఎస్డీ ప్రొ. జితేంద్రకుమార్, డా. హమీదాబీ, వివిధ దేశాల ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞాన సంపన్నుడు చుక్కా సత్తయ్య

– ఎమ్మెల్సీ మధుసూదనాచారి



మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో జనార్ధనమూర్తి, పొత్తూరి సుబ్బారావు, వేమరాజు విజయకుమార్, రమాదేవి

చిక్కడపల్లి: ప్రాథమిక విద్యాస్థాయి కూడా సరిగా లేని ప్రముఖ ఒగ్గు కథకుడు చుక్కా సత్తయ్య చదువుకోకున్నా అద్భుతమైన జ్ఞానవంతుడిగా పేరుగడించారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం సాయంత్రం త్యాగరాయ గానసభలోని కళా మారుతి కళావేదికలో గానసభ నిర్వహణలో 'చుక్కా సత్తయ్య యాదిలో'జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఒగ్గుకథలు చెప్పటంలో ఆరితేరిన సత్తయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు, రివార్డులు అందుకున్నారని కొనియాడారు. తెలంగాణ జానపద కళారూపమైన ఒగ్గుకథను సత్తయ్య ఆరు దశాబ్దాలకుపైగా వివిధ ప్రాంతాల్లో చెప్పి విశ్వవ్యాప్తం చేశారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితి కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, గాయని రమాదేవి పాల్గొన్నారు.

రక్తమార్పిడికి సిరాలజీ విధానం కీలకం

– నిమ్స్‌లో అడ్వాన్స్‌డ్ రెడ్ సెల్ సిరాలజీ వర్క్‌షాప్‌లో నిపుణులు



లక్డీకాపూల్: రక్త మార్పిడి, రోగి సంరక్షణలో అధునాతన సిరాలజీ పద్ధతులు అత్యంత కీలకమైనవని నిపుణులు తెలిపారు. యాంటీబాడీ స్క్రీనింగ్, యాంటీబాడీ ఐడెంటిఫికేషన్, అడ్సార్షన్, ఎల్యూషన్ వంటి విధానాలు దోహదపడతాయన్నారు. ఆరోగ్య, పరిశోధనా శాఖ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నిమ్స్ ఇమ్యునో–హీమటాలజీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ''అడ్వాన్స్‌డ్ రెడ్ సెల్ సిరాలజీ''అనే ఒకరోజు హ్యాండ్స్–ఆన్ వర్క్‌షాప్‌ను బుధవారం నిమ్స్‌లో నిర్వహించారు. నిమ్స్ బ్లడ్ సెంటర్ ప్రొఫెసర్ డాక్టర్ బోనగిరి శాంతి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన ఈ వర్క్‌షాప్‌లో పలువురు నిపుణులు మాట్లాడుతూ భవిష్యత్తులో రక్త సంబంధిత పరిశోధనలకు, క్లినికల్ డయగ్నస్టిక్స్‌లో కొత్త పద్ధతుల అభివృద్ధికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహదం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీగా ఐసీఎంఆర్–ఎన్‌హెచ్‌హెచ్ ముంబైకి చెందిన డా.స్వాతి కులకర్ణి, అపోలో హాస్పిటల్‌కి చెందిన డా. సుధా రంగనాథన్, ఈఎస్‌ఐసీ హాస్పిటల్ డా.చుంచు శ్రీనివాస్, బీబీనగర్ ఏఐఐఎంఎస్ డా.అరుణ్ పాల్గొన్న కార్యక్రమాన్ని ఫ్యాకల్టీ సభ్యులు అదనపు ప్రొఫెసర్, విభాగాధిపతి డా.ఉజ్జిని సుధీర్ కుమార్, అదనపు ప్రొఫెసర్ డా. మురళీకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.మహేష్ కుమార్‌లు సమన్వయపరిచారు. కార్యక్రమంలో బిడుగు శేఖర్, వెంకటరత్నం, పద్మజ, చిరంజీవి, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

హరియాణా డీజీపీని అరెస్టు చేయాలి

దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు కృష్ణస్వరూప్



లిబర్టీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కృష్ణస్వరూప్ తదితరులు

కవాడిగూడ: తెలుగు ప్రాంతానికి చెందిన దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన హరియాణా రాష్ట్ర డీజీపీ శత్రుజిత్‌సింగ్ కపూర్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదైందని, వెంటనే ఆయన అరెస్టుకు కేంద్ర హోంశాఖ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో లిబర్టీ చౌరస్తాలో హరియాణా డీజీపీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కృష్ణస్వరూప్ మాట్లాడుతూ అదనపు డీజీపీ స్థాయి వంటి ఉన్నత పదవిలో ఉన్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్‌పై కుల అణచివేత, వేధింపులకు పాల్పడిన డీజీపీని కఠినంగా శిక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మనువాద సర్కార్ అండదండలతోనే పూరన్‌కుమార్‌పై వేధింపులు జరిగాయని ఆయన ఆరోపించారు. అదనపు డీజీపీ స్థాయి అధికారికే రక్షణ లేకపోతే సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహాచారి, జాతీయ ప్రజాస్వామిక కూటమి వర్కింగ్ ప్రెసిడెంట్ జేఎస్‌రావు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు, దళిత బహుజన పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ గణేశ్, నాయకులు సుబ్బారావు, సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో స్టెమ్ సెల్స్ పరిశోధనా కేంద్రం



కాలేయం, మోకాలు, వెన్నెముక సమస్యలకు ఉపశమనం

లక్డీకాపూల్: నిమ్స్‌లో మూలకణ చికిత్స విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ముఖ్యంగా పక్షవాతం వచ్చినవారికి, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిన్నవారికి ఇక నుంచి ఈ చికిత్సలు అందించనున్నారు. తీవ్రమైన గుండెజబ్బుతో వచ్చినవారికి కూడా ఈ విధానంలో చికిత్స చేయనున్నారు. ఈ క్రమంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్స్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తులసి తెరప్యూటిక్స్ అంకుర సంస్థను నిర్వహిస్తున్న డాక్టర్ సాయిరాం అట్లూరి ఈ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రపంచ స్థాయి మూలకణ చికిత్స పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. ఒక్కో వ్యాధి ఆధారంగా చికిత్సను తక్కువ ఖర్చుతో అందించనున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.1.70 లక్షల నుంచి రూ.2.33 లక్షల వరకూ ఖర్చయ్యే అవకాశాలున్నాయి.

మూలకణ చికిత్సతో..

వెన్నెముక కింద భాగంలో తీవ్రమైన నొప్పితో బాధపడేవారికి ఈ స్టెమ్ సెల్స్ పరిశోధన కేంద్రం ద్వారా మూలకణ చికిత్సను అందించనున్నారు. మోకాళ్లు అరిగిపోతే ప్రస్తుతం నీ–రిప్లేస్‌మెంట్ చికిత్సలు చేస్తున్నారు. గత ఏడాది నిమ్స్‌లో ఆర్థోపెడిక్ విభాగం 500 మందికి మోకాళ్ల మార్పిడి చికిత్సలను విజయవంతంగా చేశారు. వెన్నెముక, మోకాలి నొప్పులతోపాటు కాలేయం దెబ్బతిన్న రోగులకు ఈ కేంద్రం ద్వారా నిమ్స్ ఉపశమనం కలిగించనున్నది. ఇప్పటికే అమెరికాలో మోకాలు, వెన్నెముక ఇబ్బందులకు మూలకణాల చికిత్సలను వినియోగిస్తుంది.

నేడు ఓయూలో గ్లోబల్ టూరిజంపై సదస్సు



లాలాపేట: ఓయూ కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో టూరిజంపై నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమవుతున్నట్లు కాన్ఫరెన్స్ చైర్మన్ ప్రొ. ఎం.గంగాధర్ తెలిపారు. గురువారం కామర్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు కన్వీనర్‌లు ప్రొ.కృష్ణచైతన్య, ప్రొ ఇంద్రకాంతి శేఖర్, ప్రొ.ప్యాట్రిక్, డైరెక్టర్ ప్రొ.చెన్నప్ప తదితరులతో కలిసి మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమైయ్యే ఈ సదస్సుకు రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు హాజరైతున్నట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, గురువారం, 16, అక్టోబర్, 2025



దుస్తులు చెక్కిన చేతులు దృశ్యాలకు రూపమిస్తున్నాయి. మోడల్స్‌ని మెరిపించిన సృజన యాక్టర్స్‌ను కదిలిస్తోంది. ఫ్యాషన్ డిజైనర్లు సినిమా రంగం వైపు దృష్టి మళ్లిస్తున్నారు. కాదేదీ సృజనకు అనర్హం అనుకుంటూ తమ స్కిల్స్‌కు సాన పెడుతున్నారు. ఈ ట్రెండ్ దేశవ్యాప్తంగా ఇప్పటికే ప్రారంభం కాగా.. నగరంలో ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది.

- సాక్షి, సిటీబ్యూరో



ఫ్యాషన్ టు డైరెక్షన్

- సినిమా రంగం వైపు డిజైనర్ల చూపు
- దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ట్రెండ్
- నగర డిజైనర్లు మెగాఫోన్ పట్టిన వైనం
- తెరపైనా రాణించేందుకు కొందరి యత్నం

‘అక్కడ ఎంబ్రాయిడరీ వర్క్ రావాలి.. ఆ షేడ్ ఇంకొంచెం మార్చాలి’.. వగైరా సూచనలు చేసిన వారే ‘లైట్స్, కెమెరా, యాక్షన్..’ అంటూ నిర్దేశిస్తున్నారు. నగరంలో కొన్ని సినిమా షూటింగ్స్‌లో డైరెక్టర్లుగా మారిన ఫ్యాషన్ డిజైనర్లు చేస్తున్న సందడి ఇది.

బాలీవుడ్‌తో మొదలై..

ప్రముఖ భారతీయ ఫ్యాషన్ డిజైనర్లు అనగానే వెంటనే గుర్తుకు వచ్చే జాబితాలో ముందుంటాయి విక్రమ్ ఫడ్నిస్, మనీష్ మల్హోత్రా అనే పేర్లు. అయితే ఇప్పుడు వీరి పేర్లకు ముందు ఇప్పుడు డిజైనర్లతో పాటు డైరెక్టర్లు అనే కొత్త ప్రొఫెషన్ కూడా చేరింది. కొన్నేళ్ల క్రితమే సినిమా దర్శకత్వంలో అడుగుపెట్టి హృదయాంతర్(2017), స్మైల్ ప్లీజ్(2019) అనే రెండు మరాఠీ చిత్రాలకు విక్రమ్ ఫడ్నిస్ దర్శకత్వం వహించారు. అదేవిధంగా ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న హిందీ చిత్రం ద్వారా మనీష్ మల్హోత్రా దర్శకుడిగా అరంగేట్రం చేయబోతున్నారు. అయితే వీరు మాత్రమే కాకుండా గతంలో ఇతర డిజైనర్లు కూడా రంగుల లోకంలో భిన్న పాత్రలను పోషించారు. కాంతార ద్వారా దేశవ్యాప్తంగా అటు దర్శకత్వం, ఇటు హీరోగానూ పేరు సాధించిన రిషబ్ శెట్టి తొలి దశలో తాను తీసిన రిక్కీ అనే సినిమాకి కాస్ట్యూమ్ డిజైనర్‌గా కూడా పనిచేశారు. అదే విధంగా డిజైనర్‌గా సినిమా రంగంలో అడుగుపెట్టిన కేరళకు చెందిన స్టెఫీ జేవియర్ సైతం కొన్నేళ్ల తర్వాత మధుర మనోహర మోహం అనే సినిమా ద్వారా దర్శకురాలిగా మారారు.



రిషబ్ శెట్టి



రామ్జ్

నగరానికి వచ్చేసిన ట్రెండ్..

ఇప్పుడు అదే ట్రెండ్ నగరానికి కూడా విస్తరించినట్టు కనిపిస్తోంది. నగరానికి చెందిన ప్రముఖ డిజైనర్లు సినిమా రంగంపై తమ దృష్టి మళ్లించినట్టు స్పష్టమవుతోంది. డిజైనర్‌గా విజయవంతంగా కొనసాగుతున్న రామ్జ్.. పచ్చీస్ అనే సినిమా ద్వారా హీరోగా మారాడు. అలాగే ఫైటర్ రాజా పేరిట మరో సినిమాలో ఆయన నటిస్తున్నాడు. ఇక డైరెక్టర్లుగా మెగాఫోన్ పడుతున్నవారూ క్రమక్రమంగా పెరుగుతున్నారు. వీరిలో సినీ స్టైలిస్ట్, డిజైనర్‌గా పేరొందిన నీరజ కోన త్వరలో విడుదల కానున్న తెలుసు కదా సినిమాతో దర్శకురాలిగా ఆరంగేట్రం చేస్తున్నారు. గోదావరి వంటి సినిమాలకు పనిచేయడం ద్వారా శేఖర్ కమ్ములకు సన్నిహితుడైన మరో ప్రముఖ డిజైనర్ అరవింద్ జాషువా కూడా పేషన్ పేరుతో ఒక సినిమా తీస్తున్నారు.

డిజైనర్‌గా ఉన్నా కాబట్టే డైరెక్టర్‌గా మారా..

దాదాపు 12ఏళ్ల పాటు కాస్ట్యూమ్స్ డిజైనర్, స్టైలిస్ట్‌గా ఉన్నాను. అందువల్లే నేను డైరెక్టర్‌గా మారగలిగాను. సినిమా రంగంతో సన్నిహితంగా ఉంటూ తొలుత స్క్రిప్ట్ రాయడం మీద పట్టు సాధించి అలా అలా ఒక స్టోరీని రెడీ చేసుకుని ఇప్పుడు సినిమా డైరెక్షన్ చేశాను. ఖచ్చితంగా ప్రేక్షకుల మన్ననలు పొందుతుందని ఆశిస్తున్నాను.

- నీరజ కోన, ఫ్యాషన్ స్టైలిస్ట్, దర్శకురాలు



స్టెఫీ జేవియర్

అదే ప్యాషన్‌తో.. సినిమా

సినిమాల్లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా ఉన్నప్పుడు కూడా అసిస్టెంట్ డైరెక్టర్ తరహాలో కాస్త ఎక్కువగా ఇన్వాల్వ్ అయ్యేవాడిని. స్క్రిప్ట్ చదవడం దగ్గర నుంచి ప్రతీ అంశంపై నా ఆసక్తిని గమనించి శేఖర్ కమ్ముల బాగా నన్ను ప్రోత్సహించారు. అణువణువునా సృజనాత్మకత నింపే ఫ్యాషన్ డిజైనింగ్ అనేది రెగ్యులర్ స్టడీస్ లాంటిది కాదు. నిఫ్ట్‌లో చదువుతున్నప్పుడు నాతో పాటు సహ విద్యార్థుల్లో కూడా గమనించిన ప్యాషన్‌ను బుక్‌గా రాశాను. అదే నా సినిమాకి ఇప్పుడు నేపథ్యం.

- అరవింద్ జాషువా, ఫ్యాషన్ డిజైనర్, దర్శకుడు





మనీష్ మల్హోత్రా



విక్రమ్ ఫడ్నిస్



కథ, కథనం దర్శకత్వం

- అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా ఆధ్వర్యంలో మాస్టర్ క్లాస్
- సినీ ఔత్సాహికులకు నైపుణ్యాలపై అవగాహన కల్పించిన డీఎస్ కన్నన్

సాక్షి, సిటీబ్యూరో: సినిమా స్క్రీన్ రైటింగ్ ప్రక్రియలో సాహిత్యం ప్రధాన భూమిక పోషిస్తుందని, సినిమా ఔత్సాహికులు కథను సుసంపన్నం చేసుకోవడానికి విభిన్న శైలులు, సంస్కృతులను విస్తృతంగా చదివి అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని ప్రఖ్యాత స్క్రీన్ రైటర్, సినీ దర్శకులు డీఎస్ కన్నన్ తెలిపారు. నగరంలోని అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్ క్లాస్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్ కన్నన్.. స్క్రీన్ ప్లే రచన, క్యారెక్టర్ డెవలప్‌మెంట్‌తో పాటు భారతీయ కథను సినిమా చెప్పడంలోని నైపుణ్యాలు, మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా స్క్రీన్ ప్లే నిర్మాణంలోని ప్రాథమిక భావనలను, భారతీయ పురాణాలు, జానపద కథల గొప్ప వారసత్వాన్ని సినిమా కథగా ఎంపిక చేసుకునే విధానాన్ని అద్భుతంగా వివరించారు. 2 నిమిషాల షార్ట్ స్టోరీ నుంచి రెండున్నర గంటల సినిమాగా రూపొందించడంలో పిచ్‌లను ఎలా రూపొందించాలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. నగరంలోని ఈ తరం సినీ ఔత్సాహికులు భవిష్యత్ తరం పాన్ ఇండియా సినిమాలో కీలకంగా మారే నైపుణ్యాలతో రాణిస్తుండటం అభినందనీయం అన్నారు.

సహజమైన స్టైల్ దుస్తులే.. ఇష్టం

బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ సందడి

గచ్చిబౌలి: బాలీవుడ్ నటుడు ఓ స్టోర్ లాంచింగ్‌లో సందడి చేశారు. కొత్తగూడలోని శరత్‌సిటీ మాల్‌లో ఇండియన్ టెర్రైన్ ఎండీ నర్సింహన్‌తో కలిసి బుధవారం ఆయన సరికొత్త కాన్సెప్ట్ స్టోర్‌ను ప్రారంభించారు. ఫ్యాషన్ ప్రేమికులకు నాణ్యమైన వివిధ డిజైన్ల దుస్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సహజమైన స్టైల్‌గా ఉండే దుస్తులు ఇష్టమని ఓ తెలుగు సినిమాలో నటిస్తున్న కునాల్ కపూర్ పేర్కొన్నారు.



చేనేత.. ఓ ప్రామాణికత

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్ అంటే అనుసంధానం చేసేది, అనుభూతిని కలిగించేది.. మనం ధరించే వస్త్రాలు అందమైన అనుభూతులనే కాకుండా సామాజికంగా మంచిని ప్రోత్సహించాలని నటి తేజస్వి మడివాడ తెలిపారు. కళాధర్ హ్యాండ్లూమ్స్ ఆధ్వర్యంలో రానున్న హైఫ్రీక్వెన్సీ దుస్తుల శ్రేణి కోసం నటి తేజస్వి సంస్థతో కలిసి పనిచేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహజంగా లభించే ఫైబర్స్, స్వచ్ఛమైన పత్తి, నార, పట్టు నుంచి తయారైన దుస్తులను అమితంగా ఇష్టపడతాను, ఇలాంటి చేనేత ఫ్యాషన్ ఔత్సాహిక ఉన్న బ్రాండ్‌తో భాగస్వామిగా మారడం సంతృప్తిగా ఉందని అన్నారు. ప్రామాణికతపై నమ్మకం, చేతన ఫ్యాషన్ పట్ల నటి తేజస్వీకి ఉన్న ఉత్సుకత ఈ తరం ఫ్యాషన్ ప్రియులకు ఆదర్శమని కళాధర్ హ్యాండ్లూమ్స్ డైరెక్టర్ కళాధర్ రచబతుని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా మొదటి డ్రాప్‌లో క్లీన్ సిల్హౌట్‌లు, బ్రీతబుల్ టెక్చర్‌తో సమకాలీన హంగులతో భారతీయ హస్తకళను ప్రదర్శించే సీజన్‌లెస్ కలెక్షన్స్ ఉంటాయని పేర్కొన్నారు.





పసి మనసుల పండుగ

సాక్షి, సిటీబ్యూరో: ప్రాథమిక విద్య అభ్యసించే వారే అయినా.. ఆ పసి హృదయాల్లోనే సానుభూతి, సేవాభావం, పండుగ ఉత్సాహం కలగలిపిన గొప్ప అనుభూతిని ప్రతిబింబించారు. నగరంలోని మియాపూర్, తెల్లాపూర్ క్యాంపస్‌లకు చెందిన మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి, అక్కడి 170 మంది విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు.



సందడిగా.. రోడ్ టూ గివ్

సాక్షి, సిటీబ్యూరో: మారియట్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన ‘రోడ్ టు గివ్’ ఆకట్టుకుంది. మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్ దగ్గర ప్రారంభమైంది. వార్మప్ సెషన్, 5కె రన్, హై–ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ సెషన్ వంటివి సందడిగా సాగాయి. నగరంలోని మారియట్ హోటల్స్‌తో పాటు లే మెరిడియన్, ది వెస్టిన్, షెరటన్ హైదరాబాద్ తదితర హోటల్స్‌కు చెందిన ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు. రూ.కోటికి పైగా నిధులను సమీకరించామని, చెన్నైకి చెందిన ఎన్‌జీవో రైజింగ్ స్టార్ అవుట్ రీచ్ ఆఫ్ ఇండియాకు అందజేస్తామని మారియట్ ప్రతినిధులు తెలిపారు.

చదువుకున్న యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా వారి ఉజ్వల భవితకు బంగారు బాటలు వేయాలన్న సంకల్పంతో 2020వ సంవత్సరంలో ఆవిర్భవించింది సైనిక్ యూత్ మోటివేషనల్ సొసైటీ. దీన్నే సైనిక్ గ్రూప్ అని పిలుస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకు చెందిన యువకులకు ఈ సంస్థ సేవలు అందిస్తోంది. - పోచారం

- ఆర్మీలో ఉద్యోగం సాధించేలా యువతకు శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సాహం

భవితకు బాటలు

ఆర్మీలో చేరాలనే సంకల్పం ఉన్న విద్యార్థుల కలను సాకారం చేసేందుకు సంస్థ నిర్విరామంగా కృషి చేస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఉత్సాహవంతులను ఆర్మీ ర్యాలీ, మెడికల్ క్యాంపు, అర్హత పరీక్షల ద్వారా గుర్తించి ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు సంగారెడ్డిలోని యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, మెడికల్ టెస్ట్ వంటి అంశాల్లో ఆర్మీ మాజీ మేయర్ ఆధ్వర్యంలో తర్ఫీదునిస్తారు. వారానికి ఒకసారి మాజీ సైనికులచే జూమ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నారు. శిక్షణ పూర్తి కాగానే ప్రభుత్వం నిర్వహించే ఈవెంట్స్‌లో పాల్గొని ప్రతిభ ద్వారా ఆర్మీలో ప్రవేశించేలా ప్రోత్సహిస్తారు. దేశ రక్షణలో భాగస్వాములను చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్మీకి సెలెక్ట్ అయ్యారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్న వారికి బుక్స్, స్టడీ మెటీరియల్, షూష్, టీషర్టు, ప్యాంటు వంటి సామాగ్రిని అందజేస్తోంది. ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్ల వివరాలను ఆశావహులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తోంది.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

ప్రతిభావంతులైన విద్యార్థులకు మెడల్స్, షీల్డ్ వంటివి అందజేసి ప్రోత్సహిస్తున్నారు. దేశాభివృద్ధితో పాటు జాతి నిర్మాణంలో యువత కీలక భూమిక పోషించాలని సంస్థ నిర్వాహకులు ఆశిస్తున్నారు. నేటి యువత వేగవంతమైన సాంకేతిక, ఆర్థిక పరివర్తన, సామాజిక మాధ్యమాల మధ్య జీవిస్తోంది. వీటినే మేలు చేసే అవకాశాలుగా మలచుకొని సాధికారతకు పునాదులుగా చేసుకోవాలి.



ఇప్పటికే 275 మందికి లబ్ధి

సంస్థ ద్వారా ఇప్పటికే 275 మంది లబ్ధిపొందారు. కొందరు ఆర్మీలో చేరితే మరికొందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారు. సుమారు 8 వేల మంది శిక్షణ తీసుకుంటున్నారు. సంస్థ సేవలను తెలంగాణ బుక్స్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసుకుంది. మనం ఫౌండేషన్ ద్వారా ఉత్తమ సేవా అవార్డు అందుకుంది.

సంస్థ ఆవిర్భావం ఇలా..

సైనికుడిగా పనిచేస్తున్న లోకేష్, ఆర్పీసీలో కానిస్టేబుల్ శివకుమార్, సివిల్ కానిస్టేబుల్ ప్రసాద్‌ల మెదడులో మెదిలిన ఆలోచన నుంచి ఆర్మీ గ్రూప్ ఆవిర్భవించింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి జిల్లాలో ఇన్‌చార్జిలను నిర్వాహకులు నియమించి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జిగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడకు చెందిన రామకృష్ణ నియమితులయ్యారు. వివరాలకు ఫోన్: 87125 94853.



రామకృష్ణ

క్లుప్తంగా...

ఖర్గేతో మంత్రి దామోదర భేటీ

- బీసీ రిజర్వేషన్లు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చ



సాక్షి, న్యూఢిల్లీ: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఖర్గే నివాసంలో సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీకి ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డితో పాటు సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్టీనేత ఉజ్వల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చ జరిగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి, న్యాయస్థానాల్లో చేస్తున్న పోరాటంపై ఖర్గేకు మంత్రి వివరించారు. స్థానిక ఎన్నికలు వీలైనంత త్వరగా జరగాలని పార్టీ కేడర్ బలంగా కోరుకుంటోందని, ఈ విషయంలో మరింత జాప్యం చేయకుండా ప్రభుత్వం అన్ని దారులను అన్వేషిస్తోందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ చేస్తున్న ప్రచారంపైనా చర్చించారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా గెలవాల్సిందేనని ఖర్గే స్పష్టం చేసినట్లు సమాచారం.

జూబ్లీహిల్స్ బరిలోకి ఫార్మాసిటీ బాధితులు

- నామినేషన్లకు యాభై మందికి పైగా ప్రణాళిక

యాచారం: జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఫార్మాసిటీ బాధితులు సిద్ధమవుతున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల నుంచి దాదాపు యాభై మందికి పైగా రైతులు బరిలో ఉండేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకు అవసరమైన ధ్రువపత్రాల కోసం బుధవారం యాచారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కులాలకు చెందిన వారితో పాటు మహిళా రైతులుకూడా ఉన్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఇంటి పన్ను, నల్లా బిల్లు తదితర బకాయిలు చెల్లించి, నో డ్యూ సర్టిఫికెట్లు తీసుకున్నారు. అనంతరం కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాల్లో అర్జీ పెట్టుకున్నారు. అధికారంలోకివస్తే ఫార్మాసిటీని రద్దు చేయడంతో పాటు టీజీఐఐసీ పేరున మార్చిన పట్టా భూములను తమ పేర్లపై నమోదు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రస్తుతం మాట మార్చిందని మండిపడ్డారు. తమకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర ప్రజలకు తెలిసేలా చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నామని స్పష్టం చేశారు.

'బీసీ రిజర్వేషన్ల' బంద్‌లో ఎమ్మార్పీఎస్ భాగస్వామ్యం

- మంద కృష్ణ మాదిగ వెల్లడి



పంజగుట్ట (హైదరాబాద్): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాలు, బీసీ సమాజం ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ సమాజమే కాకుండా అగ్రకులాల్లోకూడా ఇది న్యాయమైన డిమాండ్ అని భావించే ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. బంద్‌కు సహాయ సహకారాలు అందించడమే కాకుండా, 42 శాతం రిజర్వేషన్లు సాధించే విషయంలో ఎమ్మార్పీఎస్ భాగస్వామ్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాలు ఒక సామాజిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ చేసిన ఉద్యమానికి బీసీ సంఘాలు, బలహీన వర్గాల ప్రజలు ఎంతో సహకరించారని ఆయన పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అంశం ఇంత దూరం తీసుకురావడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్ర ఎంతో ఉందని ఆయన ప్రశంసించారు.

సామాజిక తెలంగాణ మా విధానం

- ఈనెల 25 నుంచి 'జాగృతి జనం బాట'.. పోస్టర్‌ను ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత

సాక్షి, హైదరాబాద్: సామాజిక తెలంగాణ నినాదం కాదు.. తమ విధానమని, ప్రజల అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 25 నుంచి 'జాగృతి జనం బాట' పేరిట రాష్ట్ర వ్యాప్త యాత్రకు శ్రీకారం చుడుతున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సుమారు నాలుగు నెలల పాటు కొనసాగే ఈ యాత్ర వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో ప్రజల అభిప్రాయాలు, సూచనలు, సలహాల ఆధారంగా తన తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం కవిత 'జనం బాట' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 25న నిజామాబాద్ జిల్లా నుంచి తన యాత్ర మొదలవుతుందని చెప్పారు. కాగా, కేసీఆర్ ఫొటో లేకుండా జనం బాట చేపడుతున్నానని, ఇది ఆయనను అగౌరవపరిచే చర్య ఎంతమాత్రం కాదని కవిత స్పష్టం చేశారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ ఉన్నందున ఆయన ఫొటోతో జనం బాట పట్టటం నైతికంగా సరైనది కాదని తాను భావిస్తున్నానన్నారు.

నిలువు రాళ్ల కోసం తప్పుకోనున్న

భారీ టవర్లు



- ముడుమాల్‌లోని ఆదిమానవుల స్మారక శిలల ప్రాంగణంలో పవర్‌గ్రిడ్ టవర్లు
- ప్రస్తుతం యునెస్కో వారసత్వ హోదా పరిశీలనలో ఆ ప్రాంగణం
- ప్రపంచ వారసత్వ హోదా దక్కాలంటే ఆ టవర్లు తప్పుకోవాల్సిందే
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌తో చర్చించి టవర్లు తరలించేందుకు ప్రభుత్వ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: అవి మామూలు రాళ్లు కాదు, మూడున్నర వేల ఏళ్ల క్రితం పాతిన ఆది మానవుల స్మారక శిలలు. సమీప భవిష్యత్‌లో ప్రపంచ వారసత్వ సంపద హోదాను దక్కించుకునే ప్రయత్నంలో ఉన్న అత్యంత చారిత్రక ప్రాధాన్యం ఉన్న శిలలు. ఇంతకాలం ఆలనాపాలనా లేక నిలబడి కొన్ని, వంగిపోయి కొన్ని, కూలిపోయి మరికొన్ని ఉండిపోగా..అనుకున్నది అనుకున్నట్టు జరిగి యునెస్కో గుర్తింపు పొందితే ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే నిలువు రాళ్లవి. అంత ప్రాధాన్యం ఉన్న అతి పురాతన శిలలు కావటంతో, ఇప్పుడు వాటి కోసం జాతీయ పవర్ గ్రిడ్‌కు చెందిన భారీ టవర్లు పక్కకు తప్పుకోబోతున్నాయి. కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో కృష్ణా నది తీరంలోని ముడుమాల్ గ్రామ శివారులో ఆదిమానవులు ఏర్పాటు చేసిన భారీ గండ శిలలు ఇప్పుడు యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) గుర్తింపు పొందేందుకు పరిశీలనలో ఉన్నాయి. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన యునెస్కో ఇప్పటికే వాటిని తాత్కాలిక జాబితాలో చేర్చింది.

ఇలాంటి కీలక తరుణంలో ఆ నిలువు రాళ్ల ప్రాంగణంలో ఉన్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా టవర్లు నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముడుమాల్‌కు దాదాపు పది కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఆవల కర్ణాటకలో రాయచూర్ విద్యుత్ కేంద్రం ఉంది. అక్కడి నుంచి విద్యుత్‌ను పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ప్రత్యేక లైన్ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని గుత్తికి తరలిస్తోంది. ఈ లైన్ల తాలూకు టవర్లు సరిగ్గా ముడుమాల్ నిలువు రాళ్ల ప్రాంగణం మీదుగా సాగుతున్నాయి. అందులో ఓ టవర్ సరిగ్గా నిలువు రాళ్లున్న చోటుకు కాస్త పక్కనే ఉంది. లైన్లు మాత్రం సరిగ్గా నిలువు

ఆ టవర్లే అడ్డు...

రాళ్ల మీదుగా సాగుతున్నాయి. మరో టవర్ ఈ నిలువ రాళ్లకు చేరువగా ఉన్న రాకాసి గుండుల్ల (ఆదిమానవులు సమాధి ప్రాంతంలో ఏర్పాటు చేసుకునే పెద్ద రాతి గుండ్లు) ఉన్న ప్రాంతంలో ఉంది. మరో టవర్ దానికి కాస్త పక్కగా ఉంది. వెరసి మూడు టవర్లు ఆ ప్రాంగణం వద్దనే ఉన్నాయి. ఓ చారిత్రక ప్రాంతానికి ప్రపంచ వారసత్వ హోదా ఇచ్చే ముందు చాలా అంశాలను యునెస్కో పరిశీలిస్తుంది. ఆ ప్రాంతం ప్రత్యేకతకు అడ్డుగా కనిపించేలా భారీ టవర్లు ఉండకూడదనేది దాని నిబంధనల్లో ఒకటి. మరో ఏడాదిన్నరలో యునెస్కోకు డోషియర్‌ను సమర్పించనున్నారు. ఆ డోషియర్‌లో పేర్కొన్న ప్రత్యేకతలు ఆ ప్రాంతంలో ఉన్నాయా లేదా అని పరిశీలించేందుకు యునెస్కో ప్రతినిధులు వస్తారు. వారు వచ్చే నాటికి టవర్లు అడ్డుగా ఉంటే గుర్తింపునకు అవకాశాలు మూసుకుపోతాయి. ఈలోపే టవర్లను తరలించాల్సి ఉంటుంది. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని నిపుణుల బృందం ప్రభుత్వానికి తాజాగా విజ్ఞప్తి చేసింది.

దాదాపు మూడున్నర వేల నుంచి నాలుగు వేల సంవత్సరం క్రితం ఆదిమానవులు ఆ రాళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కోటి 10 అడుగుల నుంచి 15 అడుగుల ఎత్తున పెద్ద నిలువు రాళ్లను ఆదిమానవుల సమూహంలోని ముఖ్యుల సమాధులకు స్మారక శిలలుగా వాటిని ఏర్పాటు చేశారు. గతంలో వందల సంఖ్యలో ఉన్న రాళ్లు, వ్యవసాయ పనుల వల్ల ధ్వంసమై ప్రస్తుతం కేవలం 80 మాత్రమే మిగిలాయి. ఇక, వాటికి కనీసం

ఇదీ ఆ రాళ్ల ప్రత్యేకత...

500 ఏళ్ల పూర్వం ఇదే తరహాలో వందల సంఖ్యలో పెద్ద రాతి గుండ్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అలాంటి గుండ్లు 1200 ఉన్నాయి.. ఇవి స్మారక శిలలే అయినా, ఆ రాతి నీడల ఆధారంగా నాటి వాతావరణ పరిస్థితులను అంచనా వేసేందుకు వినియోగించారని పరిశోధనలో గుర్తించారు. ఆకాశంలో సప్తర్షి మండలం(ఉర్సామెజర్)గా పరిగణించి నక్షత్రాల సమూహం ఉన్న ఆకృతి ఈ నిలువు శిలల వద్ద చెక్కి ఉంది. అది మూడున్నర వేల ఏళ్ల క్రితం చెక్కినదేనని పరిశోధకులు తేల్చారు. నక్షత్ర గమనం, రాళ్ల నీడల గమనం... తదితరాల ఆధారంగా వాతావరణంలో మార్పులు, కాలాల ఆగమనం, విపత్తుల అంచనా... ఇలా గుర్తించేవారని నిపుణులు పేర్కొంటున్నారు.

సంక్షేమానికి నెలకు రూ.500 కోట్లు!

- గురుకులాలు, వసతిగృహాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజులకు వ్యయం
- ఈ మేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్న ప్రభుత్వం
- నెలాఖరు కల్లా ప్రతిపాదనలు సమర్పించనున్న సంక్షేమ శాఖలు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ శాఖలకు ప్రతి నెలా రూ.500 కోట్ల మేర నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలు, ఆశ్రమ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగేందుకు ఈ నిధులను వాడుకోవాలని చెప్పింది. రాష్ట్రంలోని పలు గురుకులాలు, వసతిగృహాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు, పాముకాటు ప్రమాదాలు, వసతుల లేమి తదితర అంశాలపై వస్తున్న కథనాలను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం... ప్రధానంగా ఆర్థిక ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు నెలవారీగా నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. రెండ్రోజుల క్రితం జరిగిన సంక్షేమ శాఖల సమీక్షలో నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. నెలవారీగా నిధులు విడుదల చేస్తే వాటిని ఏవిధంగా వినియోగించుకుంటారో స్పష్టత ఇవ్వాలని సీఎం చెప్పారు.

నిర్వహణకు తొలి ప్రాధాన్యత

రాష్ట్రంలో వెయ్యికిపైగా గురుకులాలున్నాయి. ఇవిగాకుండా 2 వేల సంక్షేమ వసతిగృహాలు, 3 వేల ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో దాదాపు 15 లక్షల మంది విద్యార్థులున్నారు. వీరికి నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించడానికి సంక్షేమ శాఖలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇందుకు సంబంధించిన బిల్లులను ప్రతినెలా చెల్లించనున్నారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు, ప్రైవేటు అద్దె భవనాల నెలవారీ చెల్లింపులు కూడా క్రమం తప్పకుండా చెల్లించనున్నారు. ఆ తర్వాత స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. ఈ మేరకు వారంలోగా ఆర్థిక ప్రణాళికను రూపొందించి నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని ఆయా సంక్షేమ శాఖల కార్యదర్శులు, కమిషనర్లు తెలిపారు.

అన్నింటా పారదర్శకత

సంక్షేమ విద్యాసంస్థల్లో అత్యంత కీలకమైనవి విద్యార్థుల హాజరు, ఆహార పంపిణీ. ఈ విషయంలో ప్రభుత్వం కూడా అత్యంత కచ్చితత్వంతో ఉండాలని నిర్ణయించింది. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరును ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరి ఫేస్ రికగ్నిజేషన్ విధానాన్ని తీసుకురావాలని సీఎం చెప్పారు. రోజు హాజరుతోపాటు ఎంతమంది విద్యార్థులు డైట్ స్వీకరించారో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అలాగే, విద్యార్థులకు అందించే పుస్తకాలు, దుప్పట్లు, ట్రంకుపెట్టెలు... ఇలా అన్నింటినీ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయనున్నారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిపై సంక్షేమ శాఖలు ఇచ్చే నివేదికల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది.

జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇది అభివృద్ధి పాలనకు, అరాచక పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక
- సునీత గోపీనాథ్‌కు అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయి
- కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడానికి వారంతా ఎదురుచూస్తున్నారు



నామినేషన్ వేస్తున్న మాగంటి సునీత. చిత్రంలో కేటీఆర్

బంజారాహిల్స్ (హైదరాబాద్): జూబ్లీహిల్స్‌లో జరిగే ఉప ఎన్నిక పార్టీల మధ్య, ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఎన్నిక కాదని పదేళ్ల అభివృద్ధి పాలనకు, రెండేళ్ల అరాచక పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పదేళ్ల రైతుబంధు పాలనకు, రెండేళ్ల రాక్షస పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక ఇదని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటీ 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారన్నారు. ఆమెకు అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని, రాష్ట్రంలో మరోసారి గులాబీ పార్టీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం కాబోతోందని చెప్పారు. బుధవారం తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరే ముందు బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు.

గోపీనాథ్ విశేష సేవలందించారు

'లక్షల మంది రైతన్నలు, నిరుద్యోగులు సునీత గెలవాలని కోరుకుంటున్నారు. తమ ఇళ్లు కూలగొట్టడం లాంటి అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని, ఆ అరాచకాలకు అడ్డుకట్ట పడాలని నగర పేదలు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాద్‌లో కట్టలేదు.. కానీ నగరంలో కేసీఆర్ కట్టిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నీ హైదరాబాద్ ప్రజలకు గుర్తున్నాయి. బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్ని విషయాల్లో మోసపోయామని రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు గుర్తించారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడానికి వారితో పాటు మైనారిటీలు కూడా సిద్ధంగా ఉన్నారు. దళితబంధు, అభయహస్తం అమలుకాక దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రతిఒక్కరికి, నియోజకవర్గానికి విశేషమైన సేవలు అందించిన నాయకుడు గోపీనాథ్. ఆయన అకాల మరణంతో బాధపడుతున్న కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఆయన సతీమణి సునీతకు టికెట్ కేటాయించారు. రెండు సంవత్సరాల ఈ విఫల కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రతిఒక్కరూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలి..' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కాగా సునీత గోపీనాథ్ బుధవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కేటీఆర్‌తో పాటు పలువురు పార్టీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ రిజర్వేషన్లు సాధించుకుందాం

- 18న బీసీ సంఘాలు నిర్వహించే బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- ముఖ్యమంత్రిగా రేవంత్ ఉన్నంత కాలం బీసీ రిజర్వేషన్లు అసాధ్యం
- బీసీ సంఘాల జేఏసీ నేతల సమావేశంలో కేటీఆర్



కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘాల జేఏసీ. చిత్రంలో ఆర్.కృష్ణయ్య, జాజుల, గంగుల, మధుసూదనాచారి, తలసాని, శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ తరహాలోనే బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని ఢిల్లీ వరకు తీసుకువెళ్లి సాధించుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కేంద్రంలో ఇండియా, ఎన్డీయే కూటమి కలిస్తే బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత ఏర్పడుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని బీజేపీ నేతలు ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్తే..బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని, రాజ్యసభలో తమ పార్టీ ఎంపీలు అనుకూలంగా ఓటు వేస్తారని చెప్పారు. ఈ నెల 18న బీసీ సంఘాలు నిర్వహించే తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. రాష్ట్ర బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు కోరుతూ బీసీ సంఘాల జేఏసీ నేతలు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్యతోపాటు బీసీ సంఘాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, నారగోని తదితరులు కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంలో సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం రిజర్వేషన్ల పెంపు అసాధ్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్‌కు సమగ్ర విధానం ఉందని, ఉద్యమ కాలం నుంచే బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా పలు తీర్మానాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ అంశంలో సంపూర్ణ మద్దతు ప్రకటించినా, ఆ పార్టీ రోజుకో విధానం అవలంబిస్తోందన్నారు.

- బీసీలకు కేసీఆర్ మాత్రమే శ్రీరామ రక్ష అని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బీఆర్ఎస్‌లో మాత్రమే బలమైన నాయకత్వం ఉందని చెప్పారు.
- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటాన్ని ఆపేది లేదని, ఉద్యమంలో వెనక్కి తగ్గే వారిని క్షమించరాదని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.
- ప్రధాని ఇంటి వద్ద ధర్నా చేసేందుకు సిద్ధమని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని మాజీమంత్రి గంగుల డిమాండ్ చేశారు.
- ఎస్సీ, ఎస్టీ, ఓసీలకు మాత్రమే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందుతున్నాయని, బీసీలకు కూడా అదే రీతిలో రిజర్వేషన్లు ఇవ్వాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ రిజర్వేషన్ల సాధన ఉద్యమాలకు మద్దతు పలికారన్నారు.

ఇద్దరికి బీజేపీ షోకాజ్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: పార్టీ క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడినందుకు పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత, గత లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన గోసాల శ్రీనివాస్‌లకు బీజేపీ షో కాజ్ నోటీసులు జారీ చేసింది. వారిపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోరాదో మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లాలో పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటించిన సందర్భంగా.. ఆయన సమక్షంలోనే క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడటంతో నోటీసులు జారీ చేసినట్టు క్రమశిక్షణా కమిటీ కన్వీనర్ రవీందర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా వీరిద్దరూ ఒకరిపై ఒకరు దూషణలకు దిగి పార్టీ నియమావళిని ఉల్లంఘించి క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడ్డారని నోటీసులో పేర్కొన్నారు.

'మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పెంపు లేదు'

సాక్షి, హైదరాబాద్: 2025 మద్యం పాలసీలో భాగంగా 2,620 మద్యం షాపులకు పిలిచిన దరఖాస్తులకు గడువు పెంపు లేదని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం ఒక్కరోజే 4,300 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుల స్వీకరణకు మరికొంతమంది క్యూలో ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుల గడువు పెంచుతారని జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. ఈనెల 18తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుంది. 19, 20 తేదీల్లో దీపావళి పండుగ. 21, 22 తేదీల్లో డ్రా కోసం అవసరమైన ఏర్పాట్లను ఎక్సైజ్ సిబ్బంది చేపట్టనున్నారు. 23న కలెక్టర్ల సమక్షంలో ఏ-4 మద్యం షాపుల డ్రా యథాతథంగా కొనసాగుతుందని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. 2023లో మద్యం షాపులకు పిలిచిన దరఖాస్తుల ఆహ్వానంలో భాగంగా చివరి రెండు రోజులు 75 శాతం దరఖాస్తులు వచ్చాయి. ఈసారి కూడా గతంలో మాదిరిగా చివరి రెండు మూడు రోజుల్లో ఎక్సైజ్ లక్ష్యాల మేరకు దరఖాస్తులు వస్తాయని ఆ శాఖ భావిస్తోంది.

కరీంపూర్‌వాసులకు బీఆర్ఎస్ నేత వరాలు

- ఆడపిల్ల వివాహానికి రూ.1,05,116
- అబ్బాయి పెళ్లికి రూ.55,116

బంట్వారం: వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం కరీంపూర్ గ్రామస్తులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సుందరి అనిల్ స్వచ్ఛందంగా కానుకలు ప్రకటించారు. ఈ వివరాలను బుధవారం ఆయన విలేకరులకు వెల్లడించారు. కులమతాలకు అతీతంగా ప్రతీ ఆడపిల్ల పెళ్లికి రూ.1,05,116, అబ్బాయి వివాహానికి రూ.55,116, ఇల్లు నిర్మించుకునే వారికి రూ.21 వేలు, అనారోగ్యం బారినపడి ఆస్పత్రి పాలైతే రూ.15 వేలు, ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు రూ.11 వేలు అందజేస్తానని ప్రకటించారు. గ్రామంలో జరుపుకొనే శుభ కార్యాలు, వివాహాలకు తన ఫంక్షన్ హాల్‌ను ఉచితంగా ఇస్తానని తెలిపారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

18న బంద్‌కు మద్దతు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లక్ష్యంగా బీసీ జేఏసీ ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు మద్దతు ఇస్తున్నామని సీపీఐ (ఎం-ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. జనాభా ప్రాతిపదికగా వర్గీకరణ జరగాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి, ఉద్యోగాలు విద్య, రాజకీయ రంగాల్లో తగిన భాగస్వామ్యం కావాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే మాధవరెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

- నర్సంపేట ఎమ్మెల్యే తల్లికి సీఎం, మంత్రుల నివాళి



ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల మరణించిన మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ దశదినకర్మ సందర్భంగా బుధవారం కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపంలోని పీజీఆర్ గార్డెన్‌లో మాతా యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలసి కాంతమ్మ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆయన సోదరులు, కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం సీఎం హెలికాప్టర్ ద్వారా తిరిగి హైదరాబాద్ బయలుదేరారు.

సీఎం పర్యటనకు మంత్రి కొండా సురేఖ దూరం..

మంత్రి కొండా సురేఖ.. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. మంత్రి సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ప్రభుత్వం మంగళవారం టర్మినేట్ చేసింది. ఈ విషయమై మంత్రి సురేఖ ఏమీ మాట్లాడనప్పటికీ.. హఠాత్తుగా ఓఎస్డీని తప్పించడమనేది అధికార, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో సురేఖ హైదరాబాద్‌లోనే ఉన్నారన్న అంశం వైరల్ అవుతుండగా.. సుదీర్ఘ కాలంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కొండా దంపతులకున్న రాజకీయ విభేదాలు, వైరం కారణంగానే సీఎం పర్యటనకు సురేఖ దూరంగా ఉన్నారన్న చర్చ కూడా జరుగుతోంది. కాగా కొండా అనుచరులు మాత్రం సమాచారం లేకపోవడం వల్ల మంత్రి సురేఖ రాలేదని అంటున్నారు.

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్‌రెడ్డి

- పార్టీ అధిష్టానం ప్రకటన



రాంచందర్‌రావుతో దీపక్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థిని బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. గతంలో ఇదే అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన లంకల దీపక్‌రెడ్డి పేరును ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా.. ఉప ఎన్నిక రేసులో ప్రధానంగా దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలత పేర్లు వినిపించాయి. ఈ మూడు పేర్లతో కూడిన నివేదికను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు శనివారం అధిష్టానం పెద్దలకు అందజేశారు. ఈ నివేదికలోని పేర్లపై ఆదివారం ఢిల్లీలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై చర్చించింది. చివరగా దీపక్‌రెడ్డిని ఉప ఎన్నిక బరిలో నిలిపేందుకు ఆమోద ముద్ర వేసింది. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నవంబర్ 11వ తేదీన పోలింగ్ జరగనుంది.

దీపక్‌రెడ్డికి నేడు బీఫారమ్ అందజేత

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి బీఫారమ్ అందించనున్నారు. ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొనేందుకు జాతీయ, రాష్ట్రనేతలతో కూడిన 40 మంది జాబితాను ఎన్నికల సంఘానికి సమర్పించినట్టు రాంచందర్‌రావు 'సాక్షి'కి తెలిపారు. కాగా, బీజేపీ అభ్యర్థిగా ఎంపికైన దీపక్‌రెడ్డిని బుధవారం ఎక్స్‌వేదికగా రాంచందర్‌రావు అభినందించారు.

కేటీఆర్ చెపుతున్న ఓటరు జాబితా.. అప్పుడే తయారైంది

- మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యలు




సాక్షి, హైదరాబాద్: ఓట్ చోరీ జరిగిందంటూ.. పులిని చూసి, నక్క వాతలు పెట్టుకున్న తీరుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఓట్ చోరీ జరుగుతున్న తీరును రాహుల్ గాంధీ ఆధారాలతో సహా నిరూపించారని, అదే తీరులో తెలంగాణలో ఏదో చేయాలనుకున్న కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓట్ చోరీ చేసి గెలిచామని చెప్పారని ఎద్దేవా చేశారు. టీపీసీసీ నిర్వహిస్తున్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీభవన్‌కు వచ్చిన శ్రీధర్‌బాబు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఇప్పుడు కేటీఆర్ చెపుతున్న ఓటరు జాబితా అప్పుడే తయారైందని, ఆ లిస్టులోనే తప్పులున్నాయని చెప్పడం ద్వారా బీఆర్ఎస్ పార్టీనే ఓట్ చోరీకి పాల్పడిందని కేటీఆర్ చెపుతున్నారని అన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, ఓటమిని గ్రహించిన కేటీఆర్ ఏదో కారణం వెతుక్కుంటున్నారని, అందులో భాగంగానే ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలి

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో సాధికారత సాధించాల్సిన అవసరం ఉందని మంత్రి శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. బుధవారం సచివాలయంలో ఆయనను బ్రాహ్మణ ఫెడరేషన్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన ద్రోణంరాజు రవికుమార్‌ను శ్రీధర్‌బాబు అభినందించారు.

రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



రాంచందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 18న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ బంద్‌లో రాష్ట్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఆయన్ను బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పలువురు బీసీ సంఘాల నాయకులు కలిసి బంద్‌కు మద్దతు తెలపాలని కోరారు. వివిధ కుల సంఘాలు, బీసీ సంఘాల ప్రతినిధులతో కూడిన జేఏసీ ఇచ్చిన బంద్‌కు బీజేపీ అండగా నిలుస్తుందని రాంచందర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహం కారణంగానే బీసీల్లో ఆ పార్టీ పట్ల వ్యతిరేకతకు కారణమన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు స్టే ఇచ్చినప్పుడు, బీసీల వాదనలు వినకపోవడం పట్ల సమాజం ఆగ్రహంగా ఉందని తెలిపారు. ఈ రిజర్వేషన్ల పిటిషన్ల కేసులో ఆర్.కృష్ణయ్య ఇతర కుల సంఘాలు ఇంప్లీడ్ అయినా వాటిని పట్టించుకోలేదని చెప్పారు. బీజేపీ మాత్రమే బీసీలకు న్యాయం చేయగలిగిన పార్టీ అని తెలిపారు.

ఫొటోల కోసం బాహాబాహీ

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసి మీడియా ఎదుట మాట్లాడే సందర్భంలో కొందరు బీసీ నాయకుల మధ్య బాహాబాహీకి దారితీసింది. ఫొటోలు దిగేందుకు కొందరు ముందుకొచ్చే క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకోగా రెండువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. తాము ఇంతకాలం నుంచి ఉద్యమం చేస్తుంటే..ఇప్పుడు ఫొటోలు దిగి పబ్లిసిటీ చేసుకునేందుకు తోసుకువస్తున్నారంటూ ఒకనేత మండిపడ్డారు. దీనిపై మరోవర్గం వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముందుకురాగా తోపులాట జరిగింది. ఇది మరింత ముదిరి ఒకరిపై ఒకరు దాడి చేసే వరకు వెళ్లింది. రాంచందర్‌రావు, ఆర్.కృష్ణయ్య ప్రయత్నించినా కొంతసేపు ఇది కొనసాగింది. ఆ తర్వాత అందరూ సర్దిచెప్పడంతో వివాదం సమసిపోయింది.



'ఆ తోటలోనొకటి ఆరాధనాలయము'
అని గానం చేసి తెలుగువారి
అపురూప గాయనిగా నిలిచిన
రావు బాలసరస్వతి దివిలోని
దివ్య పాటల లోగిలికి తరలి వెళ్లారు.
'మల్లెపూలు మొల్లపూలు కల్వపూలు కావాలా'...
అని సుమగీతాలనిచ్చిన రావు బాలసరస్వతి
వాడని పూలుండే లోకానికి బయలుదేరారు.
గాయనిగా సవాళ్లు ఎదుర్కొన్నా
గొంతు ఖైదు చేయబడినా
నిలిచిన నాలుగు నిక్కమైన నీలాలతోనే
నేటికీ మిలమిలలాడిన ఆమె
వజ్రాల నదులు పారే అంబరాల బాట పట్టారు.
ఆమెకు తెలుగువారి నివాళి.
లలిత సంగీత ప్రపంచపు
సురాగమయ జోహారు.

ఆ దివ్య తోటలోనికి ఆమె తరలి వెళ్లింది

ఈ వేళ పొద్దున్నే ఫేస్‌బుక్‌లో, ఇతర గ్రూపుల్లో రావు బాలసరస్వతి గారి ఫొటో చూడగానే మనసు కీడు శంకించింది. చాలా రోజులు నుంచి ఆమె ఆరోగ్యం బాగా లేదని తెలుసు. అయినా వున్నారనే ఆలోచన తృప్తినిస్తుంది. ఇంక ఈ రోజుతో ఆ ఆశ లేదు. ఆమె తెలుగువారి తొలి నేపథ్యగాయని అవునో కాదో ఆ చర్చ వేరేగాని తొలి ప్రముఖ నేపథ్య గాయని అనడంలో ఎటువంటి సందేహం లేదు.
సి.ఆర్.సుబ్బరామన్, ఎస్.రాజేశ్వరరావుల సంగీతంలో ఎన్ని గొప్ప పాటలు. 'దేవదాసు'లో ఆమె పాడిన 'తానే మారెనా... గుణమ్మే మారెనా' పాట ఎంతమందికో ఇష్టం.
ఆమె పాడిన 'ఆ తోటలో నొకటి ఆరాధనాలయము' విని 'అందులో ఆమె అందగాడెవరే అని గొంతెత్తి పాడుతూ వుంటే మనసు ఎటో వెళ్లిపోతుంది' అన్నారు మహా రచయిత చలం. అంత మధురమైన స్వరం బాలసరస్వతిది.
చాలా ఏళ్ల క్రితం గుంటూరులో ప్రోగ్రాం. కారణం 'అజో విభో అవార్డు' ఆమెను వరించింది. ఆ సభకు హాలులో జనం పోటెత్తారు. ఎన్ని రోజులు అయింది! ఆమెని చూడాలి. ఆమె పాట వినాలి. అప్పటికే భర్త ఆంక్షలతో ఆంధ్రదేశం ఆమె పాటకి దూరమై దాదాపు అర్ధ శతాబ్దం అయింది. అందుకే అదో అపురూప అవకాశం అని విజయవాడ నుంచి మేమూ వెళ్ళాం. ఎప్పటిలా నేను పాడనని నిర్వాహకులకి చెప్పారుట. అవార్డు ఇచ్చాక 'అమ్మా... ఒక ముక్క పాడండి' అని ప్రేక్షకులు ఒక్క గొంతుతో అడిగితే సరేనని -

చలి గాలి వీచింది - తెరవారబోతోంది
ఇకనైన ఇలు చేరవా - ఓ ప్రియా ఇకనైన ఇలు చేరవా...

ఆమె స్వరం ఎంత మధురమో మనిషి అంత అందం. మనసు అంత సున్నితం! సినిమాల్లో, ఆల్ ఇండియా రేడియోలో ఆమె పాడిన పాటలు జనాన్ని ఆనందడోలికల్లో ఊరేగించాయి... రాసిలో కొన్నే అయినా వాసిలో మిన్నగా. ఆమె పాడిన 'బంగారు పాపాయి బహుమతులు పొందాలి' లలిత గీతం రేడియోలో సూపర్‌హిట్.

పాట వింటూ అందరూ చప్పట్లు కొట్టారు. ఆ ఉద్వేగాన్ని మర్చిపోలేను. అందరి కళ్లలో నీళ్ళు! లేచి నిల్చుని చప్పట్లు. మారుమోగిన హాలు. ఆ తర్వాత ఆమెతో చనువు ఏర్పడ్డాక అడిగాను 'ఎందుకలా పాడనంటారు' అని . 'చాలా రోజులుగా పాడలేదు గదా... అప్పటి పాటలా రాకపోతే నాకు బాగుండదు' అన్నారు. 'ఎవరన్నారు మీ పాట అప్పటి పాటలా లేదని.? వయసుతో మరింత అందం వచ్చింది' అన్నాను. నిజమే! ఆ గొంతులో మధురిమ ఏ మాత్రం తగ్గలేదు.
'బెజవాడ వచ్చి నాలుగు రోజులు మీ ఇంట్లో వుంటా, నన్ను పాడమని అడగద్దు' అన్నారొకసారి. అలాగేనని తీసుకుని వచ్చాను. మహీధర రామ్మోహనరావు గారు, నండూరి రామ్మోహనరావు గారు... ఇలా అందరూ వచ్చారు ఆమెను చూడటానికి. ఆమెకీ వారందరంటే అభిమానమే. అందరూ ఇంట్లో కూర్చుని కబుర్లు మొదలు పెట్టాక పాట ఎలా ఆగుతుంది? రామ్మోహనరావు గారి కోరిక పై 'ఆ తోటలో నొకటి ఆరాధనాలయం' పాడారు. 'రెల్లు పూల పానుపు పైన ఎవరో వెన్నెల జల్లినా రమ్మా!' అని ఆమె పాడుతూ ఉంటే నిజంగానే వెన్నెల మా అందరి మనసుల్లో. ఆ స్వరం జల్లుజల్లుగా కురిపించింది. అంత మంది పండితులు, కవులు మధ్య కూర్చునే సరికి ఆ కోయిల అలా నాలుగు గంటలసేపు పాడింది! ఎంత భాగ్యం కదా!
అదే మొదలు. ఎప్పుడు రావాలి అని అనిపిస్తే అపుడు విజయవాడ రావడం నాలుగు రోజులు వుండడం. మా ఇంట్లో కుదరని పరిస్థితి వచ్చినప్పుడు హేమ పరిమిగారిని అడిగాను. ఆమె ఎంతో సంతోషించి వారి పొదరింట్లో రెండు మూడుసార్లు ఆతిథ్యం యిచ్చారు. బాలసరస్వతి గారి పాట ఎంత మధురమో మనసు అంత సున్నితం. ఒకసారి స్నేహం చేస్తే మర్చిపోరు. ఆత్మీయతను పదిసార్లు గుర్తు తెచ్చుకుంటారు. మనకి ఆమె చిన్నప్పటి నుంచి తెలిసిన చుట్టం అవుతారు. రాగానే ముందు పాత పరిచయాలు గుర్తుకు తెచ్చుకుని వారిని ఒకసారి కలవాలి అని అనుకుంటారు. 'అమ్మాయి' అంటూ స్వంత కూతురులా చూసుకుంటారు. అలా వారి పెద్దబ్బాయి, చిన్నబ్బాయి మా వారిని అన్నయ్య అని, నన్ను వదినా అని కలిపేసుకున్నారు.
మామయ్య గారి (బాలాంత్రపు రజనీకాంతరావు) పై అభిమానం. వి.ఏ.కే రంగారావు గారి దృష్టిలో ఆమె పాడిన అన్ని పాటలలోకి గొప్పది రజనీ గారు స్వరపరిచిన 'తన పంతమే తా విడువడు'.
ఆమెకు లలితమైన సంగీతం మాత్రమే యిష్టం. సుబ్బరామన్ సంగీతం ఆమెకు యిష్టం. హాయిగా పాడుకోవచ్చు అంటారు. తన గొంతుకు సరిపోయే పాట, సంగీతం అయితేనే పాడతారు. పాట పాడితే అది పదికాలాలు వుండాలి అంటారు. 'పాట నాకు నచ్చకపోతే ఎంత పెద్దవాళ్లైనా లేచి వెళ్లి పోతాను' అంటారామె. అందుకే సంగీత దర్శకులు 'బాలమ్మా సరేనా?'అని అడిగి ట్యూన్ చేసేవారట. మీరా భజనలు ఎంత గొప్పగా పాడేవారని. వసంతదేశాయి దగ్గర వాటిని నేర్చుకున్నారు. 'మీరా భజన్ కర్ణాటక పద్ధతిలో పాడితే బాగుండదు' అని ఆమె స్థిర అభిప్రాయం. అందుకే హిందీ మాటలు పలికే పద్ధతిని నేర్చుకుని అదే విధంగా పాడేవారు. హిందీ చిత్ర పరిశ్రమలోకి వెళ్ళ లేకపోవడం ఆమెకు కొంచెం అసంతృప్తి. మనసులో కొంచెం ఆ బాధ మిగిలిపోయింది. హిందీ సినీ సంగీతం గురించి ఎన్నో కబుర్లు చెప్పేవారు. ఆమె ఇంట్లో ఉన్నప్పుడు ఈల వినపడితే ఎవరా అని ఇటు అటు చూస్తే 'నేనే' అని చిలిపిగా నవ్వేవారు. 'అమ్మకి అల్లరి ఎక్కువ' అని ఆమె పిల్లలు కూడా గారాబం చేసేవారు. చివరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెకు 'వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్' యిస్తే వచ్చేందుకు ఆరోగ్యం సహకరించలేదు. ఆ పురస్కారంతో పాటో దిగి పంపారు.
ఇక మళ్ళీ ఆమెను చూడలేము. కాని పాట వున్నంత వరకూ ఆమె చిరస్థాయిగా వుండి పోతారు.

- ప్రసూన బాలాంత్రపు

నివాళి

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తొలి నేపథ్య గాయనిగా చరిత్రలో నిలిచిపోయిన రావు బాలసరస్వతీదేవి (97) బుధవారం ఉదయం 8 గంటలకు కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో ఆమె తుది శ్వాస విడిచారు. 1928 ఆగస్టు 29న వెంకటగిరి (మద్రాసు)లో జన్మించారామె. బాల సరస్వతి మాతృభాష తెలుగు. గుంటూరులో 'రత్న మహల్' పేరుతో బాల సరస్వతి కుటుంబానికి ఓ థియేటర్ ఉండేది. దాంతో 1934లో ఈ కుటుంబం గుంటూరు తరలి వచ్చింది. కుమార్తె మంచి గాయనిగా పేరు తెచ్చుకోవాలన్నది సరస్వతి తండ్రి పార్థసారథి కల. ఆయన హార్మోనియం వాయిస్తూ పాటలు పాడేవారు. ప్రముఖ గురువుల దగ్గర కుమార్తెకు శాస్త్రీయ కర్ణాటక సంగీతం, హిందుస్తానీ సంగీతం వంటివి నేర్పించారు. బాల సరస్వతి తన ఆరేళ్ల వయసు నుంచే పాడడం ప్రారంభించారు. ఆకాశవాణి కార్యక్రమంతో తొలిసారిగా తన గాత్రాన్ని వినిపించారామె. ఆరేళ్ల వయసులోనే హెచ్ఎంవీ కంపెనీ ఆమె పాటను గ్రామ్‌ఫోన్‌లో రికార్డు చేసింది. తొలి తెలుగు సోలో గ్రామ్‌ఫోన్ రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు అయిన మద్రాసు, విజయవాడ స్టేషన్ల కోసం ప్రారంభ గీతం పాడిన రికార్డు కూడా ఆమె సొంతం. ఇక 'సతీ అనసూయ' (1936) చిత్రంలో చేసిన గంగ పాత్రతో తన సినీ ప్రయాణాన్ని ఆరంభించారామె. 'మహానంద' (1939) చిత్రంతో గాయనిగా మారారు. అప్పట్నుంచి 1960ల వరకూ తెలుగు, తమిళ, కన్నడ, హిందీతో పాటు పలు భాషల్లో 2000కి పైగా పాటలు పాడిన ఘనత సరస్వతిది.

తొలి ప్రసిద్ధ గాయని బాల సరస్వతి ఇక లేరు

అలా 'బాల' సరస్వతి అయ్యారు

చిన్నప్పుడే ఆమె పాటలు పాడటంతో 'బాల సరస్వతీదేవి' అని ఆమెను పిలవడం మొదలుపెట్టారు. అలాగే ఏడేళ్ల వయసులో నటించిన 'బాల యోగిని' సినిమా కూడా 'బాల' పేరు స్థిరపడేలా చేసింది. కాగా గాయనిగానే కుమార్తె కొనసాగాలన్నది బాల సరస్వతి తల్లిదండ్రుల సంకల్పం. దాంతో పాటు నటన కన్నా కూడా బాల సరస్వతికి పాటంటేనే మక్కువ. అందుకే నటిగా తక్కువ సినిమాలు చేశారు. 'పాట అంటే నాకు ప్రాణం' అని పలు సందర్భాల్లో పేర్కొన్న బాల సరస్వతి 1930ల నుంచి 1960ల వరకూ మూడు దశాబ్దాల పాటు పలు భాషల్లో పాటలు పాడారు. గాయనిగా చిత్రసీమకు ఆమె చేసిన సేవలకు 'వైఎస్ఆర్ జీవన సాఫల్య పురస్కారం', 'రామినేని ఫౌండేషన్' అవార్డులు అందుకున్నారు.


కుటుంబంతో...


ఆరేళ్ల వయసులో...

హీరోయిన్‌గా...

తమిళ చిత్రం 'దాసిప్పెణ్' (1943)లో బాల సరస్వతి హీరోయిన్‌గా నటించారు. ఇందులో ఆమెది దాసి పిల్ల పాత్ర. ఎల్లిస్ ఆర్ డంకన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి సంగీతదర్శకుడు ఎస్. రాజేశ్వరరావు పాటలు స్వరపరచగా, అన్ని పాటలనూ ఆమె పాడారు.


సాలూరి రాజేశ్వరరావుతో...

జమీందార్‌తో వివాహం

సినిమా ప్రయాణం మొదలయ్యాక బాల సరస్వతి కుటుంబం 1944లో మద్రాసు చేరుకుంది. ఆ సమయంలో మద్రాసు గిండీలో గుర్రపు రేసులు చూడ్డానికి వెళ్లిన సరస్వతిని వెంకటగిరి మహారాజా కుమారుడు, కోలంక జమీందార్ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు చూశారు. బాల సరస్వతి పాటలు బాగా పాడుతుందని విని, రాజా కుటుంబం ఆమె ఇంటికి వెళ్లింది. అయితే వాళ్లు వెళ్లింది పెళ్లి చూపులకు. బాల సరస్వతి నచ్చిందని చెప్పడం, కోలంక రాజాతో ఆమె పెళ్లి జరగడం చకచకా జరిగి పోయాయి. పెళ్లి తర్వాత భార్య గాయనిగా కొనసాగడం రాజాకి నచ్చలేదు. అయినా ఆయనకు తెలియకుండా పాటలు పాడారామె. కానీ పత్రికలో ఆమె హిట్ పాటల గురించి వచ్చిన వ్యాసం చూసి, పాడటం మానేయమన్నారు. అలా సరస్వతి కెరీర్‌కి బ్రేక్ పడింది. అయితే పుట్టింటికి వచ్చినప్పుడు భర్తకు తెలియకుండా కొన్ని పాటలు పాడారామె. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు.



భర్తతో కలిసి మైసూరులో స్థిరపడిన సరస్వతి ఆయన మరణానంతరం హైదరాబాద్ వచ్చేశారు. మణికొండలోని గాయత్రి ప్లాజాలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో ప్రమాదవశాత్తు ఆమె జారిపడిపోవడంతో తుంటి ఎముక విరిగింది. ఆ గాయం మానిపోయినప్పటికీ వృద్ధాప్య సమస్యలతో బుధవారం కన్ను మూసిన ఆమె అంత్యక్రియలు అదేరోజు సాయంత్రం హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. తొలి తరం గాయనిగా, నటిగా ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకున్న రావు బాలసరస్వతీదేవి మరణం తెలుగు సినీ సంగీత ప్రపంచానికి తీరని లోటు. ఆమె మృతి పట్ల పలువురు సంగీత ప్రియులు, సినీ ప్రముఖులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

అజరామర స్వరం

రావు బాలసరస్వతీదేవికి 2023లో 'వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం' బహూకరించిన సందర్భంగా ఆమె 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ సారాంశం...

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాలసరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గాన సరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్పలేదు. తొంభైఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తూ 2023 నవంబర్ ఒకటిన ఆమెను వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారంతో సంభావించింది. ఈ సందర్భంగా...

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

రావు బాల సరస్వతి తన నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన బాల సరస్వతి సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలు కెళ్లడం కుదరకపోవడంతో ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోద సాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి నేటి పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.



పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు)లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోలంక జమీందారీలో కోడలిగా అడుగుపెట్టారు. 'నా పాటను వినడానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతికి హాఫ్ వైట్ పట్టుచీరలిష్టం. క్రీమ్‌కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్నపిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసిపిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి.
భోజనం గుప్పెడే కానీ ఆ వెంటనే స్వీట్ తినడం ఆమెకిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంబై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ కోడలు ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే జారి పడడంతో విరిగిన తుంటి ఎముక ఆశ్చర్యంగా దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.

● బ్యూటిప్



నగభాగం ఆపిల్‌ని చెక్కు తీయకుండా చిన్న ముక్కలుగా కట్ చేసి, మిక్సీలో వేయాలి. దీంట్లో 5 టీ స్పూన్ల పాలు, రెండు టీ స్పూన్ల నిమ్మరసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల తరవాత కడిగేయాలి. 10 రోజులకి ఒక సారి ఈ విధంగా చేయడం వల్ల చర్మం కాంతిమంతమవుతుంది.

● మన(సు)లో మాట

మానసిక వ్యాధులను మందుల్లేకుండానే నయం చేయచ్చా?

మా అబ్బాయికి చాలా కాలంగా స్కిజోఫ్రీనియా వ్యాధి ఉంది. హైదరాబాదులో చికిత్స ఇప్పిస్తున్నాము. చాలాసార్లు ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యి కరెంటు ట్రీట్మెంట్ (ఇ.సి.టి.) కూడా ఇప్పించాము. చాలా కాలం నుండి డాక్టర్ ఇచ్చిన క్లోజపిన్ మందులు వాడుతున్నాము. అయితే తను మన అందరి లాగా పూర్తిగా నార్మల్‌గా ఉండదు. కొన్ని లక్షణాలు అలాగే మిగిలి ఉన్నాయి. పని కూడా ఏమీ చేయడు. ఇలా ఉండగా యూ ట్యూబ్‌లో ఒక కౌన్సెలర్ ఇంటర్వ్యూ చూసి ఆయనను వ్యక్తిగతంగా కలిసి ఆయన సలహా మేరకు మందులు - ఆపేశాం. మందులు మానేస్తే 3-4 నెలల్లోనే జబ్బును పూర్తిగా నయం చేస్తానన్నాడాయన. అలా చేసిన తర్వాత లక్షణాలు తగ్గకపోగా, మరింత పెరిగాయి. మా అబ్బాయికి చెవిలో మాటలు వినపడుతుండడంతో వాటిని తట్టుకోలేక ఆత్మహత్యకి కూడా ప్రయత్నించాడు. ఇప్పుడు నాకు స్పష్టత రావట్లేదు - మళ్ళీ డాక్టర్ని కలిసి మందులు తీసుకోవాలా? లేక ఆ కౌన్సెలర్ చెప్పినట్టే ఇంకొంత కాలం మందులు లేకుండా కౌన్సిలింగ్ మాత్రమే చేయించాలా? ఏది నమ్మాలి? ఏం చేయాలో కన్‌ఫ్యూజన్‌లో ఉన్నాను. అసలు మందులు లేకుండా మానసిక వ్యాధులను నయం చేయలేరా!

- శ్రీనివాసరావు, హైదరాబాద్

'స్కిజోఫ్రీనియా' అనేది ఒక దీర్ఘకాలిక మానసిక వ్యాధి, కొంతమందిలో లక్షణాలు తగ్గినా, చాలాసార్లు దాన్ని పూర్తిగా నయం చేయడం కష్టం. చాలా సందర్భాల్లో దీర్ఘకాలికంగా మందులు అవసరమవుతాయి. కొన్ని సందర్భాల్లో తీవ్ర లక్షణాలు ఉన్నప్పుడు రోగిని ఆసుపత్రిలో ఉంచి ఇ.సి.టి. థెరపీ వంటి చికిత్సలు కూడా ఇవ్వాల్సి వస్తుంది. తరువాత జబ్బు మళ్లీ పెరగకుండా మందులను చాలాకాలం కొనసాగించడం అవసరం పడవచ్చు. ఇక మీ అబ్బాయికి వాడినట్లుగా మీరు చెబుతున్న క్లోజపిన్ అనే మందు స్కిజోఫ్రీనియా లక్షణాలు మొండిగా ఉన్నప్పుడు, ఇతర మందులు పని చేయని సందర్భాల్లో వాడే ఔషధం. దీనిని డాక్టర్ పర్యవేక్షణలో సరైన డోసుల్లో వాడితే మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఇది ఆత్మహత్య ఆలోచనలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. మానసిక సమస్యలకు ఇచ్చే చికిత్సలో రెండు ప్రధాన భాగాలు ఉంటాయి. మెదడులో రసాయన అసమతుల్యతను సరిచేయడానికి కొన్ని మందులు వాడడం అలాగే రోగికి, వారి కుటుంబానికి జబ్బుపై అవగాహన పెంచడం (సైకోఎడ్యుకేషన్), లక్షణాలు తగ్గడం కోసం 'కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ' వంటి సైకలాజికల్ ట్రీట్మెంట్, ఈ రెండూ కలిపి తీసుకుంటే మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. వైద్యుల సూచన లేకుండా మందులను ఇలా ఆపడం చాలా ప్రమాదం! మందులు ఆపిన తరువాత లక్షణాలు పెరిగి, ఆత్మహత్యా ప్రయత్నం జరగడం చాలా తీవ్రమైన విషయం. అందుకే మళ్లీ మీ సైకియాట్రిస్ట్‌ను కలిసి పరిస్థితిని వివరించి మందులను ప్రారంభించండి. అలాగే మందులతోపాటు, అవసరమైతే అర్హత కలిగిన (ఆర్.సి.ఐ. లైసెన్స్ పొందిన) క్లినికల్ సైకాలజిస్ట్ వద్ద నుండే సైకోథెరపీ కౌన్సెలింగ్ తీస్కోండి. నేటి కాలంలో యూట్యూబ్, సోషల్ 'మీడియా వేదికల్లో చాలా మంది వైద్యపరమైన అర్హత లేని వ్యక్తులు పెద్ద పెద్ద హామీలు ఇస్తూ కనిపిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల విషయంలో ముఖ్యంగా స్కిజోఫ్రీనియా, బైపోలార్ డిసార్డర్. లాంటి మానసిక వ్యాధుల విషయంలో అలాగే ఆటిజం, ఎ.డి. హెచ్.డి. వంటి న్యూరో డెవలప్‌మెంట్ సమస్యల - విషయంలో అటువంటి అసంబద్ధమైన మోసపూరిత ప్రకటనలను నమ్మరాదని, వైద్యుల సూచన లేకుండా మందులు నిలిపివేయవద్దని మనవి. జబ్బు లక్షణాలు తగ్గేకొద్దీ, డాక్టర్లే మందుల డోసును క్రమేపీ తగ్గిస్తారు, తప్ప అర్హతలేని వారి సలహామేరకు మందులు ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఆపరాదు.. చిన్న చిన్న మానసిక వ్యాధుల విషయంలో ఒక్కోసారి మందులు లేకుండా కేవలం కౌన్సెలింగ్ తో సరిచేయవచ్చేమో కానీ, స్కిజోఫ్రీనియా లాంటి తీవ్రమైన మానసిక వ్యాధులకు మందులు తప్పనిసరి!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) అక్టోబర్ 15న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	1,32,410
బంగారం (22 క్యారెట్లు)	1,22,190
వెండి	1,95,000

విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,30,700
బంగారం (22 క్యారెట్లు)	1,18,150
వెండి	1,80,600

విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,29,440
బంగారం (22 క్యారెట్లు)	1,18,650
వెండి	2,07,000

రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,30,700
బంగారం (22 క్యారెట్లు)	1,21,700
వెండి	1,80,600

ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	1,31,800
బంగారం (22 క్యారెట్లు)	1,21,260
వెండి	1,85,500

చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,29,380
బంగారం (22 క్యారెట్లు)	1,18,600
వెండి	2,07,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



'గ్రాండ్‌స్లామ్ చాంపియన్' స్లోన్ స్టీఫెన్స్‌కు సహజ షాక్

భారత మహిళల టెన్నిస్ నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకుంది. మెక్సికోలో జరుగుతున్న ఎబియర్టో టాంపికో డబ్ల్యూటీఏ-125 టోర్నమెంట్ తొలి రౌండ్‌లో 2017 యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ విజేత, ప్రపంచ మాజీ మూడో ర్యాంకర్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై సహజ వరుస సెట్‌లలో గెలిచి సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 347వ స్థానంలో ఉన్న సహజ 6-2, 6-2తో ప్రస్తుతం 624వ ర్యాంక్‌లో ఉన్న స్లోన్ స్టీఫెన్స్‌ను బోల్తా కొట్టించింది. 70 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించింది. రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన సహజ, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. కెరీర్‌లో ఇప్పటి వరకు 50 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన 32 ఏళ్ల స్లోన్ స్టీఫెన్స్ 2017 యూఎస్ ఓపెన్‌లో విజేతగా, 2018 ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. మరోవైపు 24 ఏళ్ల సహజ ఇంకా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అరంగేట్రం చేయలేదు.



ఎలా ఉన్నావు హీరో!

వన్డే కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌కు రోహిత్ శర్మ ఆత్మీయ పలకరింపు

ఆస్ట్రేలియాకు బయలుదేరిన భారత జట్టు





న్యూఢిల్లీ: దాదాపు ఏడు నెలల సుదీర్ఘ విరామం తర్వాత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ భారత జట్టుతో చేరారు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత వీరిద్దరు అంతర్జాతీయ క్రికెట్ బరిలోకి దిగలేదు. టెస్టు లేదా టి20 జట్టు సభ్యులుగా ఉన్న ఇతర ప్లేయర్లు కలిసి ఆడుతూ బిజీగా ఉండగా వన్డేలకే పరిమితమైన రోహిత్, కోహ్లి మాత్రం టీమ్‌కు దూరంగా ఉన్నారు. వన్డే, టి20ల సిరీస్‌ల కోసం బుధవారం భారత జట్టు రెండు బృందాలుగా ఆస్ట్రేలియాకు బయల్దేరి వెళ్లింది. మొదటి బృందంలో రోహిత్, కోహ్లి, శ్రేయస్, కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రోహిత్, గిల్ భేటీ ఆసక్తిని సంతరించుకుంది. తన స్థానంలోనే గిల్‌ను సెలక్టర్లు వన్డే కెప్టెన్‌గా నియమించగా... గిల్ నాయకత్వంలో రోహిత్ తొలిసారి ఆడనున్నాడు. టూర్‌కు వెళ్లేందుకు ఆటగాళ్లంతా ఒకే చోటికి చేరే క్రమంలో ఇందిరాగాంధీ విమానాశ్రయంలో రోహిత్‌ను చూసిన గిల్ దగ్గరకు వచ్చి ఆలింగనం చేసుకున్నాడు. వెంటనే రోహిత్ కూడా 'ఎలా ఉన్నావు హీరో' అంటూ ఆత్మీయంగా పలకరించాడు. టీమ్ బస్సులోకి వెళ్లాక మొదటి సీటులోనే కూర్చున్న కోహ్లికి కూడా గిల్ అభివాదం చేయగా... దానికి బదులిచ్చిన కోహ్లి కెప్టెన్ భుజం తట్టి అభినందించాడు. జట్టు సహచరుల్లో కనిపించిన చిరునవ్వులు అందరి మధ్య ఉన్న అనుబంధాన్ని చూపించాయి. ఆసీస్ పర్యటనలో భాగంగా భారత జట్టు 3 వన్డేలు, 5 టి20లు ఆడుతుంది. ఆదివారం ఇరు జట్ల మధ్య తొలి వన్డే జరుగుతుంది.

మా అభిమానులకు ఇది ఆఖరి అవకాశం...

భారత టాప్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లికు ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు ఆస్ట్రేలియాలోని అభిమానులకు ఇది ఆఖరి అవకాశమని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. ఇక్కడ జరిగే మూడు వన్డేల్లో వారి బ్యాటింగ్‌ను చూడాలని అతను సూచించాడు. అయితే వెన్ను నొప్పితో కమిన్స్ ఈ సిరీస్‌లో ఆడటం లేదు. 'నిస్సందేహంగా వారిద్దరు ఆటలో చాంపియన్లు. వారితో మేం ఆడినప్పుడల్లా అభిమానులు మ్యాచ్‌లు చూసేందుకు ఎంతో ఉత్సాహం ప్రదర్శించారు. గత 15 ఏళ్లలో వారిద్దరు భారత్ ఆడిన ప్రతీ సిరీస్‌లో ఉన్నారు. కాబట్టి ఆస్ట్రేలియాలో ఉన్న ఫ్యాన్స్‌కు వారి ఆటను చూడటం ఇదే ఆఖరిసారి కావచ్చు' అని కమిన్స్ అభిప్రాయ పడ్డాడు.

అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ గేమ్స్

కామన్వెల్త్ స్పోర్ట్స్ బోర్డు సిఫారసు ● నవంబర్ 26న లాంఛనంగా ప్రకటన



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడలకు భారత దేశం రెండోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. 2030లో జరిగే క్రీడలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదిక కావడం దాదాపుగా ఖాయమైంది. ఈ క్రీడల కోసం బిడ్ వేసిన నగరాలలో అహ్మదాబాద్‌కు క్రీడలు కేటాయించాలంటూ కామన్వెల్త్ స్పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సిఫారసు చేసింది. బోర్డు సిఫారసు చేయడమంటే దీనికి దాదాపు అధికారికంగా ఆమోద ముద్ర పడినట్లే. ఇక లాంఛన ప్రకటనే తరువాయి. నవంబర్ 26న జరిగే బోర్డు సమావేశంలో వేదిక పేరును ప్రకటిస్తారు. అహ్మదాబాద్‌తో పాటు నైజీరియా నగరం అబూజా పోటీలో నిలిచినా... ఎగ్జిక్యూటివ్ బోర్డు భారత్ వైపే మొగ్గు చూపింది. ఆఫ్రికా దేశంలో క్రీడలను మరింత అభివృద్ధి చేసి 2034లో పోటీలు నిర్వహించే దిశగా తాము సహకారం అందిస్తామని కూడా బోర్డు హామీ ఇచ్చింది. 2010లో తొలిసారి న్యూఢిల్లీలో భారత్ కామన్వెల్త్ క్రీడలను నిర్వహించింది. భారత్‌కు ఈ క్రీడల నిర్వహించే అవకాశం రావడం గొప్ప గౌరవమని మాజీ అథ్లెట్, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష పేర్కొంది. 2036లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించాలని ఆసక్తి ప్రదర్శిస్తున్న మన దేశానికి కామన్వెల్త్ పోటీల నిర్వహణతో తమ సత్తా చాటేందుకు తగిన అవకాశం లభిస్తోందని భారత ప్రభుత్వం భావిస్తోంది. 'భారత క్రీడలకు సంబంధించి ఇదో గొప్ప క్షణం. ప్రపంచ క్రీడల్లో మన స్థాయి పెరుగుతోందని చెప్పడానికి ఇదో సూచిక. మన దేశాన్ని ఆటలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ వల్లే ఇది సాధ్యమైంది' అని కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవియా స్పందించారు. 2026లో జరిగే కామన్వెల్త్ క్రీడలకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరం వేదికవుతోంది. అయితే సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో వీటిని నిర్వహించే ప్రయత్నంలో పలు క్రీడలను తొలగించిన కమిటీ కేవలం రూ.1300 కోట్ల బడ్జెట్‌ను మాత్రమే వీటికి కేటాయించింది. ఈ నేపథ్యంలో 2030లో జరిగే పోటీల కోసం కోసం భారత్ ఎంత మొత్తం కేటాయిస్తుందనేది ఆసక్తికరం. గ్లాస్గోలో తొలగించిన, భారత్‌కు పతకావకాశం ఉన్న అన్ని క్రీడాంశాలను ఇందులో మళ్లీ చేర్చాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

హైదరాబాద్ బౌలర్ల వైఫల్యం

తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 256/3

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌ను సొంతగడ్డపై ఘనంగా ప్రారంభించడంలో హైదరాబాద్ విఫలమైంది. టాస్ గెలిచిన హైదరాబాద్ ఫీల్డింగ్ ఎంచుకోగా... జట్టు బౌలర్లు రాణించకపోవడంతో తొలి రోజు ఢిల్లీ మెరుగైన స్థితిలో నిలిచింది. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా బుధవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ఆట ముగిసే సమయానికి ఢిల్లీ తమ తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఆయుశ్ దొసెజా (141 బంతుల్లో 97 బ్యాటింగ్; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు), సనత్ సాంగ్వాన్ (257 బంతుల్లో 91 బ్యాటింగ్; 11 ఫోర్లు) సెంచరీలకు చేరువగా నిలిచారు. కెప్టెన్ ఆయుశ్ బదోని (72 బంతుల్లో 53; 9 ఫోర్లు) వేగంగా అర్ధ సెంచరీ సాధించి వెనుదిరగ్గా... అర్పిత్ రాణా (7), యశ్ ధుల్ (0) విఫలమయ్యారు. ఇదే మ్యాచ్‌తో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన దొసెజా, సాంగ్వాన్ నాలుగో వికెట్‌కు ఇప్పటికే అభేద్యంగా 143 పరుగులు జోడించారు. హైదరాబాద్ బౌలర్లలో సీవీ మిలింద్ 2 వికెట్లు పడగొట్టగా, పున్నయ్యకు 1 వికెట్ దక్కింది.

భరత్ 142: ఆంధ్ర 289/3



కాన్పూర్: రంజీ ట్రోఫీ సీజన్‌ను ఆంధ్ర జట్టు మెరుగైన రీతిలో మొదలు పెట్టింది. ప్రత్యర్థి వేదికపై తొలి రోజు భారీ స్కోరుతో శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఉత్తరప్రదేశ్‌తో మొదలైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆంధ్ర బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో జట్టు 85.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. వికెట్ కీపర్ కే భరత్ (244 బంతుల్లో 142; 13 ఫోర్లు) భారీ శతకంతో చెలరేగగా...షేక్ రషీద్ (197 బంతుల్లో 94 బ్యాటింగ్; 8 ఫోర్లు) సెంచరీ ముంగిట నిలిచాడు. ఇతర బ్యాటర్లలో అభిషేక్ రెడ్డి (36) ఫర్వాలేదనిపించగా, కెప్టెన్ రికీ భుయ్ (2) విఫలమయ్యాడు. భరత్, రషీద్ మూడో వికెట్‌కు 194 పరుగులు జత చేయడం విశేషం. యూపీ బౌలర్లలో ఆఖిబ్ ఖాన్‌కు 2 వికెట్లు దక్కగా, విప్‌రాజ్ నిగమ్ మరో వికెట్ తీశాడు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో జ్ఞానదత్తు



గువాహటి: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ టంకర తలశిల జ్ఞానదత్తు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన మూడో రౌండ్‌లో జ్ఞానదత్తు 11-15, 15-6, 15-11తో భారత్‌కే చెందిన సూర్యాక్ష్ రావత్‌పై గెలిచాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో గారెట్ టాన్ (అమెరికా)తో జ్ఞానదత్తు తలపడతాడు. భారత్‌కే చెందిన హమార్ లాల్‌థాజువాలా, రౌనక్ చౌహాన్ మూడో రౌండ్‌లో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు తన్వీ శర్మ, ఉన్నతి హుడా, రక్షిత శ్రీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మూడో రౌండ్‌లో తన్వీ 15-12, 15-7తో ఒయి వినార్తో (ఇండోనేసియా)పై, ఉన్నతి 15-8, 15-5తో అలైస్ వాంగ్ (అమెరికా)పై, రక్షిత 11-15, 15-5, 15-8తో ఆలియా జకారియా (సింగపూర్)పై గెలిచారు. పురుషుల డబుల్స్ మూడో రౌండ్‌లో గొబ్బూరు విశ్వతేజ్-అరిగెల భార్గవ్ రామ్ (భారత్) జోడీ 11-15, 15-10, 15-10తో షునొకి హగివారా-మహిరో మత్సుమోతో (జపాన్) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో వెన్నెల కలగోట్ల-రేషిక (భారత్) ద్వయం 15-8, 15-10తో సయాక ఎనోమోతో-మికు యషిమా (జపాన్) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

శ్రమించి గెలిచిన సాత్విక్-చిరాగ్ జోడీ

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 64 నిమిషాల్లో 17-21, 21-11, 21-17తో క్రిస్టోఫర్-మాథ్యూ గ్రిమ్లే (స్కాట్లాండ్) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ (భారత్) 10-21, 21-8, 21-18తో ఎన్‌హాట్ నుగుయెన్ (ఐర్లాండ్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పాకిస్తాన్-ఇంగ్లండ్ మ్యాచ్ రద్దు

కొలంబో: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో కొలంబో వేదికగా ముచ్చటగా మూడో మ్యాచ్ వాన బారిన పడింది. బుధవారం పాకిస్తాన్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ భారీ వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దు చేయాల్సి వచ్చింది. వాన కారణంగా మ్యాచ్‌ను ముందుగానే 31 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 31 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. చార్లీ డీన్ (33) టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగతావారంతా విఫలమయ్యారు. పాక్ కెప్టెన్ ఫాతిమా సనా (4/27) ప్రత్యర్థిని దెబ్బ కొట్టగా, సాదియా ఇక్బాల్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం వర్షంతో ఆట నిలిచిపోయే సమయానికి పాక్ 6.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 34 పరుగులు చేసింది. ఈ దశలో వచ్చిన వాన ఎంతకీ ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేయక తప్పలేదు. ఈ ఫలితం తర్వాత ప్రతీ జట్టు సరిగ్గా నాలుగేసి మ్యాచ్‌లు ఆడగా...ఇంగ్లండ్ (7 పాయింట్లు), ఆస్ట్రేలియా (7), దక్షిణాఫ్రికా (6), భారత్ (4) జట్లు తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో ఆస్ట్రేలియా తలపడుతుంది.

సాక్షి సినిమా

డ్యూడ్‌లో అందమైన భావోద్వేగాలు ఉంటాయి

- నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్



''డ్యూడ్' వైవిధ్యమైన ప్రేమకథ. అందమైన భావోద్వేగాలు ఉంటాయి. కీర్తీశ్వరన్‌గారు చెప్పిన కథ కంటే 20 శాతం ఎక్కువగానే సినిమా తీశారు. మా మూవీ అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాతలు నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్. ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ చెప్పిన విశేషాలు.

● 'డ్యూడ్' యూత్‌తో పాటు ఫ్యామిలీ కూడా చూసే కంటెంట్. చాలా కొత్తగా ఉంటుంది. చెప్పాలంటే 'సఖి' లాంటి ఫ్యామిలీ మూవీ. ప్రదీప్‌గారి 'లవ్ టుడే, డ్రాగన్' సినిమాలు తెలుగులో దాదాపు రూ. 12 కోట్లు కలెక్షన్స్ తెచ్చుకున్నాయి. రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ఉన్నాయి కాబట్టి 'డ్యూడ్' కచ్చితంగా రూ. 15 కోట్లు వసూలు చేస్తుందని నమ్ముతున్నాం. ● 'డ్యూడ్'ని తమిళంలో ఏజీఎస్ సంస్థ ద్వారా తమిళంలో మేమే విడుదల చేస్తున్నాం. తమిళ్‌తో సమానంగా తెలుగులోనూ మా సినిమా ఆడుతుందనే నమ్మకం ఉంది. ● మేము హిందీలో తీసిన 'జాట్' మాకు మంచి వెంచర్. 'జాట్ 2' కూడా ఉంటుంది. ప్రభాస్‌గారితో, ఎన్టీఆర్‌గారితో మేం నిర్మిస్తున్న సినిమాలు 2026లోనే వస్తాయి. రామ్‌తో తీస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' బాగుంటుంది. 'పెద్ది' చిత్రం 2026 మార్చ్ 27న కచ్చితంగా విడుదలవుతుంది. ఆ తర్వాత సుకుమార్‌గారితో సినిమా ఉంటుంది.

అసుర ఆగమన...



● రోహిత్ కేపీ, సాయిదుర్గా తేజ్, చైతన్య, నిరంజన్ రెడ్డి

''నా జీవితంలో 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు) చిత్రం చాలా ముఖ్యమైనది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోశాను. ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను'' అని సాయి దుర్గా తేజ్ చెప్పారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు). ఐశ్వర్యా లక్ష్మి, జగపతిబాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ద్వారా రోహిత్ కేపీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో త్వరలో విడుదల కానుంది. బుధవారం (అక్టోబరు 15) సాయి దుర్గా తేజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'అసుర ఆగమన' పేరుతో ఈ మూవీ గ్లింప్స్‌ను విడుదల చేశారు. అనంతరం సాయి దుర్గా తేజ్ మాట్లాడుతూ– ''నిరంజన్, చైతన్యగార్లు ఖర్చుకి వెనకాడకుండా సపోర్ట్ చేశారు. డైరెక్టర్ రోహిత్ తీసిన ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది'' అని తెలిపారు. ''మా సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు కె. నిరంజన్ రెడ్డి. ''మా చిత్రం తప్పకుండా అందరికీ నచ్చుతుంది'' అని చైతన్య రెడ్డి పేర్కొన్నారు. రోహిత్ మాట్లాడుతూ– ''ఇది నా తొలి సినిమా అయినప్పటికీ రాజీ పడకుండా సపోర్ట్ చేసిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు. ''ఎస్‌వైజీ' విజయం సాధించాలి'' అని దర్శకులు దేవా కట్ట, వశిష్ఠ, వీఐ ఆనంద్, నిర్మాత వివేక్ కూచిభొట్ల, కెమెరామేన్ పళని స్వామి ఆకాంక్షించారు.

వరుణ్ పాత్రకి గుడ్ బై చెప్పడం బాధగా ఉంది

- సిద్ధు జొన్నలగడ్డ



● కృతీ ప్రసాద్, రాశీ ఖన్నా, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధీ శెట్టి, నీరజ కోన

''తెలుసు కదా' సినిమాలో నేను చేసిన వరుణ్ పాత్ర ఒక్క చుక్క రక్తం చిందించకుండా ఎమోషనల్ వార్, సైకలాజికల్ వయొలెన్స్‌ని జనరేట్ చేస్తుంది. ఏడాదిగా వరుణ్ అనే రాడికల్ అండ్ ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను... ఆ పాత్రకి గుడ్ బై చెప్పడం బాధగా ఉంది'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ తెలిపారు. ఆయన హీరోగా, శ్రీనిధీ శెట్టి, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజ్ కానుంది. బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''ఈ దీపావళికి మా 'తెలుసు కదా'. ప్రియదర్శి 'మిత్రమండలి', కిరణ్ అబ్బవరం 'కె ర్యాంప్', ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్' సినిమాలు విడుదలవుతున్నాయి. మంచి సినిమా విన్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. ''మా సినిమా తప్పకుండా ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు శ్రీనిధి. ''తెలుసు కదా' నా మనసుకు దగ్గరైన సినిమా'' అని రాశీ ఖన్నా పేర్కొన్నారు. ''మా సినిమాని బిగ్ స్క్రీన్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను'' అని కృతీ ప్రసాద్ చెప్పారు. ''ఈ సినిమా అద్భుతంగా రావడానికి కారణం నిర్మాతలే'' అన్నారు నీరజ కోన.

నా దృష్టిలో అలాంటి కామెడీ తప్పు

- ప్రియదర్శి



''మిత్ర మండలి' చిత్రకథ విన్నప్పుడు ఆద్యంతం వినోదాత్మకంగా అనిపించింది. ఫుల్‌గా ఎంజాయ్ చేశాను. వెంటనే ఓకే చెప్పాను. విజయేందర్‌కి దర్శకునిగా ఇది తొలి సినిమా అయినప్పటికీ చెప్పిన కథను అలాగే తెరపైకి తీసుకొచ్చారు. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక చాలా సంతోషంగా అనిపించింది. అందుకే సినిమా విజయంపై నేను అంత నమ్మకంగా ఉన్నాను'' అని హీరో ప్రియదర్శి చెప్పారు. విజయేందర్ .ఎస్ దర్శకత్వంలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం జోడీగా నటించిన చిత్రం 'మిత్ర మండలి'. బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ప్రియదర్శి పంచుకున్న విశేషాలు.

● దర్శకులు అనుదీప్, విజయేందర్, ఆదిత్య హాసన్, కల్యాణ్ శంకర్... ఇలా అందరూ రూమ్ మేట్స్. విజయేందర్ 'మిత్ర మండలి' కథని ఎంతో వివరంగా చెప్పాడు. ఇందులో కుల వ్యవస్థ మీద విజయేందర్ మంచి సెటైరికల్ సన్నివేశాలు రాసుకున్నాడు. అయితే ఇది సమాజానికి సందేశంగా ఉండదు. సినిమాల్లో ఇచ్చే సందేశాల ద్వారా సమాజం మారుతుందని నేను నమ్మను. ఎవరి మనోభావాల్నీ దెబ్బ తీసేలా మా చిత్రం ఉండదు. అందర్నీ నవ్వించేలా, ఆకట్టుకునేలా ఉంటుంది.

● 'జాతి రత్నాలు, మిత్ర మండలి' సినిమాలు ఒకేలా ఉండవు. 'జాతి రత్నాలు' తర్వాత '35 చిన్న కథ కాదు', 'కోర్ట్' వంటి వైవిధ్యమైన చిత్రాలు చేశాను. ఎప్పుడూ ఒకే రకమైన జానర్ సినిమాలు చేయడం నాకు ఇష్టం ఉండదు. ఏ సినిమాలో అయినా అవతలి వాళ్లని నవ్వించే ప్రయత్నం చేయడం తప్పు కాదు. కానీ, అవతలి వాళ్లని తక్కువ చేసి కామెడీ చేయడమే నా దృష్టిలో తప్పు అవుతుంది. ఓ సినిమాని విమర్శించే హక్కు ఎవరికైనా ఉంటుంది. నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తే ఓకే. కానీ, కావాలనే ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారు. కించపర్చాలని, కిందకు తొక్కాలని టార్గెటెడ్‌గా హేట్‌ను వ్యాప్తి చేయడం తగదు.

● 'మిత్ర మండలి'పై ఓవర్సీస్‌లో మంచి బజ్ ఉంది. అక్కడి వాళ్లు మనకంటే ఎక్కువ డబ్బులు పెట్టి సినిమాలు చూస్తుంటారు. వారినీ మా చిత్రం నవ్విస్తుంది. బన్నీ వాసుగారితో పాటు మా నిర్మాతలందరూ బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా గ్రాండ్‌గా నిర్మించారు. ఇక ఈ వారం విడుదలవుతున్న మా 'మిత్ర మండలి'తో పాటు మరో మూడు సినిమాలు కూడా బాగా ఆడాలి. ప్రస్తుతం 'ప్రేమంటే' అనే సినిమా చేస్తున్నాను.

ట్రెండ్ సెట్ చెయ్ పిల్లోడా...



● సుధీర్ బాబు, శ్రేయా శర్మ

'ట్రెండ్ సెట్ చెయ్ పిల్లోడా... ట్రెండ్ సెట్ చెయ్...' అంటూ సుధీర్‌బాబుతో ఆడి పాడుతున్నారు బాలీవుడ్ బ్యూటీ శ్రేయా శర్మ. సుధీర్ బాబు హీరోగా రూపొందిన పాన్ ఇండియన్ చిత్రం 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సోనాక్షీ సిన్హా, శిల్పా శిరోద్కర్, 'శుభలేఖ' సుధాకర్, రాజీవ్ కనకాల, ఝాన్సీ కీలక పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేశ్ కుమార్ బన్సల్, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నంద నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో నవంబరు 7న రిలీజ్ కానుంది. రాయిస్, జైన్, సామ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ట్రెండ్ సెట్ చెయ్...' అంటూ సాగే వీడియో సాంగ్‌ని బుధవారం విడుదల చేశారు. పబ్ నేపథ్యంలో సాగే ఈ పాటకి శ్రీమణి సాహిత్యం అందించగా, స్ఫూర్తి జితేందర్, రాజీవ్ రాజ్ పాడారు. జీతూ నృత్యరీతులు సమకూర్చారు. ''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'జటాధర'' అని చిత్రబృందం పేర్కొంది.

ఇలాంటి సినిమాలను ప్రోత్సహించాలి


- దర్శకుడు సాయి రాజేశ్



● రమణా రెడ్డి, క్యాంప్ శశి, పవోన్, సాయి రాజేశ్

''రోహిత్, శశి మంచి ఫిల్మ్ మేకర్స్. యునిక్ కాన్సెప్ట్‌తో వాళ్లు తెరకెక్కించిన 'గోపి గాళ్ల గోవా ట్రిప్' చిత్రాన్ని ప్రేక్షకులు ప్రోత్సహించాలి. ఎప్పటికైనా ఇండస్ట్రీలో రోహిత్ అండ్ శశి పేరు గట్టిగా వినిపిస్తుంది'' అని 'బేబీ' మూవీ ఫేమ్ డైరెక్టర్ సాయి రాజేశ్ చెప్పారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి, క్యాంప్ శశి, సాయికుమార్, పవోన్ రమేష్, మోనిక బుసం నటించిన చిత్రం 'గోపి గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్-శశి ద్వయం దర్శకత్వంలో సాయికుమార్, సీతారామ రాజు, రమణా రెడ్డి నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకులు సాయి రాజేశ్, వెంకటేష్ మహా, రూపక్ అతిథులుగా హాజరయ్యారు. వెంకటేశ్ మహా మాట్లాడుతూ–'' గోపి గాళ్ల గోవా ట్రిప్' ట్రైలర్ చూస్తే మేకర్స్ అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ తీసినట్టుగా అనిపించింది'' అని తెలిపారు. ''ఇదో క్రేజీ చిత్రం. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు రోహిత్ . ''ఇదొక రోడ్ ట్రావెల్ ఫిల్మ్. సాయికుమార్ రాజీపడకుండా నిర్మించారు'' అని శశి పేర్కొన్నారు. ''మా మూవీ చూస్తే గోవా వెళ్లొచ్చినట్టుగా ఉంటుంది'' అన్నారు సాయికుమార్.

ఈ సినిమాను విడుదల కానివ్వం !



● దామోదర ప్రసాద్‌కి వినతి పత్రం అందిస్తూ...

సదన్ హాసన్, విక్రమ్ జిత్, నరేశ్ రాజు, వినయ్ బాబు హీరోలుగా శ్రీలు దాసరి, అదితీ మైకేల్, మోహన సిద్ధి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. నరసింహ నంది రచన, దర్శకత్వంలో దైవ నరేష్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌లోని డైలాగులు అసభ్యకరంగా, మహిళలను కించపరిచేలా ఉన్నాయంటూ పలువురు మహిళా సమాఖ్య ప్రతినిధులు మంగళవారం తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ప్రధాన కార్యదర్శి దామోదర ప్రసాద్‌కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య ప్రతినిధులు దీపా దేవి, నీరజ, ధనమ్మ మాట్లాడుతూ– ''టీజర్‌లో మహిళలను కించపరుస్తూ డైలాగులు ఉన్నాయి. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని ఏం చేద్దాం అనుకుంటున్నారు? ఇలాంటి చిత్రాన్ని విడుదల కానివ్వం'' అని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో పద్మ, చంద్రమ్మ, నసీమా తదితరులు ఉన్నారు.

స్టాక్ మార్కెట్లు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
575	178
82,605	25,324

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,529	▲	7
డోజోన్స్	46,136	▽	136
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,434	▽	19
డాక్స్	24,217	▽	20
షాంఘై	3,912	▲	47
నికాయ్	47,673	▲	825

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.95	88.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.63	119.59
€	యూరో	ఎస్‌బీఐ	101.43	104.21
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.82	59.27
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.70	58.97
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.60	69.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.34
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.48	13.31

బంగారం @1,31,800

- మరో రూ.1,000 పెరుగుదల
- రూ.3,000 దిగొచ్చిన వెండి ధర

న్యూఢిల్లీ: దేశీ మార్కెట్లో పసిడి ధరలు మరో సరికొత్త రికార్డును సృష్టించాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి బుధవారం మరో రూ.1,000 పెరిగి రూ.1,31,800 (పన్నులు సహా) స్థాయికి చేరింది. మరోవైపు వెండి ధర కాస్తంత దిగొచ్చింది. కిలోకి రూ.3,000 తగ్గి రూ.1,82,000 (పన్నులు సహా) వద్ద స్థిరపడింది. మంగళవారం వెండి కిలోకి రూ.6,000 పెరిగి ఆల్‌టైమ్ గరిష్ట ధర రూ.1,85,000ను నమోదు చేయడం తెలిసిందే. పండుగల సీజన్ కావడంతో రిటైలర్లు, జ్యువెలర్ల కొనుగోళ్లతో పసిడి ధరలు పెరిగినట్టు ఆల్ ఇండియా సఫారా అసోసియేషన్ తెలిపింది. ''అంతర్జాతీయంగా బలమైన ర్యాలీ, దేశీయంగా భౌతిక బంగారం కొనుగోళ్లు, పెట్టుబడుల డిమాండ్ తోడవడంతో బంగారం ధర మరో నూతన రికార్డు గరిష్టానికి చేరింది. రూపాయి బలపడడం ధరల ర్యాలీకి కీలక అవరోధంగా వ్యవహరించింది. దీంతో దేశీ మార్కెట్లో ధరల పెరుగుదల పరిమితమైంది. మొత్తం మీద బుల్లిష్ ధోరణి కొనసాగుతోంది. పండుగల కొనుగోళ్లతో ఇదే ధోరణి కొనసాగుతుందని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పార్మర్ తెలిపారు.



రూపాయి భారీ రికవరీ

73 పైసలు అప్.. 88.08 వద్ద క్లోజ్



ముంబై: పాతాళానికి పడిపోయిన రూపాయి కాస్త కుదుటపడింది. డాలర్ మారకంలో బుధవారం ఏకంగా 73 పైసలు జంప్ చేసి 88.08 వద్ద స్థిరపడింది. దేశీ మార్కెట్లు పుంజుకోవడం, దేశీ కరెన్సీకి మద్దతుగా ఆర్‌బీఐ కూడా చర్యలు చేపట్టడంతో నాలుగు నెలల్లో అతిపెద్ద లాభాన్ని నమోదు చేసింది. ఇంట్రాడేలో 87.93 స్థాయికి కూడా బలపడటం విశేషం. కాగా, మంగళవారం రూపాయి విలువ 13 పైసలు నష్టపోయి సరికొత్త ఆల్‌టైమ్ కనిష్టం 88.81ని తాకిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు శాంతిస్తుండటం, మళ్లీ మన స్టాక్ మార్కెట్లపై విదేశీ ఇన్వెస్టర్లు దృష్టి సారించడంతో పాటు యూఎస్ డాలర్ బలహీన ధోరణి కారణంగా రూపాయి 87.70–88.40 శ్రేణిలో ట్రేడ్ కావచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ ఎనలిస్ట్ అనూజ్ చౌదరి పేర్కొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లాభం డౌన్

క్యూ2లో రూ. 5,528 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 5,528 కోట్లకు పరిమితమైంది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం పంట రుణాలపై రూ. 1,231 కోట్ల ప్రొవిజన్లు చేపట్టడం ప్రభావం చూపింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 26 శాతం నీరసించి రూ. 5,090 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 6,918 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 2 శాతం నామమాత్ర వృద్ధితో రూ. 13,745 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.99 శాతం నుంచి 3.73 శాతానికి బలహీనపడ్డాయి. ట్రేడింగ్ ఆదాయం 55 శాతం తగ్గడంతో ఇతర ఆదాయంలోనూ 1 శాతం కోత పడి రూ. 6,625 కోట్లకు పరిమితమైంది. ప్రొవిజన్లు రూ. 2,204 కోట్ల నుంచి రూ. 3,547 కోట్లకు పెరిగాయి. రెండు రకాల పంట రుణ ప్రొడక్టులను నిలిపివేయడం ఇందుకు కారణమైంది.



10 లక్షల క్రెడిట్ కార్డులు: త్రైమాసికవారీగా యాక్సిస్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.57 శాతం నుంచి 1.46 శాతానికి తగ్గాయి. ఈ కాలంలో 10 లక్షల క్రెడిట్ కార్డులను విక్రయించింది. కనీస మూలధన నిష్పత్తి 16.55 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థలలో యాక్సిస్ ఫైనాన్స్ నికర లాభం తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో రూ. 327 కోట్ల నుంచి రూ. 385 కోట్లకు బలపడింది. యాక్సిస్ ఫైనాన్స్ అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందనున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరీ పేర్కొన్నారు. దీంతో లిస్టింగ్ చేపట్టవలసి ఉంటుందని తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 0.7 శాతం క్షీణించి రూ. 1,169 వద్ద ముగిసింది.

మార్కెట్ బౌన్స్‌బ్యాక్

- అమెరికా వడ్డీరేట్ల కోత ఆశలతో...
- ప్రపంచ మార్కెట్ల ర్యాలీ...
- సెన్సెక్స్ 575 పాయింట్లు అప్
- నిఫ్టీ 178 పాయింట్లు ప్లస్



ముంబై: అమెరికా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ జెరోమ్ పావెల్ వడ్డీరేట్ల కోత సంకేతాలు ప్రపంచ మార్కెట్లలో జోష్ నింపింది. త్వరలోనే మరో విడత ఫెడ్ రేట్ల కోత ఉండొచ్చన్న ఆశలతో ఆసియా నుండి యూరప్ వరకు అన్ని మార్కెట్లూ ర్యాలీ చేశాయి. ముందురోజు అమెరికా మార్కెట్లు కూడా సానుకూలంగా ముగియడంతో ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ మెరుగుపడింది. దీంతో దేశీ సూచీలు కూడా బౌన్స్‌బ్యాక్ అయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ దన్నుతో సెన్సెక్స్ 575 పాయింట్లు జంప్ చేసి 82,605 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 178 పాయింట్లు ఎగబాకి 25,324 వద్ద క్లోజయ్యింది. 'అమెరికా–చైనా మధ్య తాజాగా పెరిగిన వాణిజ్య ఉద్రిక్తతలు కాస్త శాంతించడంతో పాటు క్యూ2 ఫలితాల సీజన్ స్థిరంగా షురూ కావడం మార్కెట్‌కు సానుకూలంగా నిలిచింది. అలాగే, టారిఫ్ వార్ దెబ్బకు ప్రపంచ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు నెలకొన్నప్పటికీ, భారత్ వృద్ధికి ఢోకా ఉండదంటూ రేటింగ్ ఏజెన్సీలు ఇచ్చిన తాజా అంచనాలు కూడా మన మార్కెట్లో విశ్వాసం పెంచాయి' అని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

- బీఎస్‌ఈలో దాదాపు అన్ని రంగాల సూచీలు ప్లస్‌లో ముగిశాయి. ముఖ్యంగా రియల్టీ ఇండెక్స్ 3.06 శాతం జంప్ చేయగా.. టెలికం 1.94%, కన్జూమర్ డ్యూరబుల్స్ 1.2 శాతం చొప్పున బలపడ్డాయి. మిడ్‌క్యాప్ సూచీ 1.07 శాతం, స్మాల్‌క్యాప్ 0.78 శాతం ఎగిశాయి.

హ్యుందాయ్ పెట్టుబడుల ధమాకా!

- 2030కల్లా రూ. 45,000 కోట్లు
- రూ. లక్ష కోట్ల ఆదాయంపై కన్ను
- కొత్తగా ఈవీ ఎస్‌యూవీ తయారీ
- 2027కల్లా లగ్జరీ బ్రాండ్ జెనిసిస్ రెడీ

ముంబై: కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా(హెచ్‌ఎంఐఎల్) దేశీయంగా భారీ పెట్టుబడులకు తెర తీస్తోంది. దక్షిణ కొరియా మాతృ సంస్థ హ్యుందాయ్ మోటార్ కో ప్రెసిడెంట్, సీఈవో జోస్ మునోజ్ 2030కల్లా దేశీ యూనిట్ రూ. 45,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. తద్వారా హ్యుందాయ్ కార్ల తయారీ, అభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా రెండోపెద్ద కేంద్రంగా భారత్ నిలవనున్నట్లు తెలియజేశారు. భారత్‌లో తొలిసారి పర్యటిస్తున్న మునోజ్ ఎగుమతుల్లో హెచ్‌ఎంఐఎల్ వాటా 30 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా వృద్ధి లక్ష్యాలలో భాగంగా కంపెనీ ఆదాయాన్ని సైతం 1.5 రెట్లు పెంచుకోవాలని చూస్తోంది. వెరసి 2030కల్లా రూ. లక్ష కోట్ల మైలురాయిని అధిగమించే ప్రణాళికల్లో ఉన్నట్లు హెచ్‌ఎంఐఎల్ ఎండీ అన్సూ కిమ్ తెలియజేశారు. ఇందుకు వీలుగా 2030కల్లా 26 ప్రొడక్టులను ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. వీటిలో 7 కొత్త ప్రొడక్టులకు కంపెనీ తెరతీయనుంది. తద్వారా ఎంపీవీ, ఆఫ్‌రోడ్ ఎస్‌యూవీ విభాగాలలోకి ప్రవేశించనుంది. వీటితోపాటు 2027కల్లా స్థానికంగా డిజైన్ చేసి అభివృద్ధి చేసిన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని దేశీ మార్కెట్‌కోసం తయారు చేసే లక్ష్యంతో ఉంది. ఈ బాటలో లగ్జరీ విభాగ బ్రాండ్ జెనిసిస్‌ను దేశీయంగా 2027కల్లా విడుదల చేయాలని ఆశిస్తోంది.



మూడు దశాబ్దాలు

దేశీయంగా మూడు దశాబ్దాల విజయం తరువాత గతేడాది ఐపీవో ద్వారా కంపెనీ లిస్టయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తదుపరి దశ వృద్ధి ప్రణాళికలను అమలు చేయనున్నట్లు మునోజ్ కంపెనీ తొలిసారి నిర్వహించిన ఇన్వెస్టర్ డే సందర్భంగా పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా 2030కల్లా రూ. 45,000 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడుల్లో 60 శాతం ప్రొడక్ట్, ఆర్ అండ్‌డీపైనా.. మిగిలిన 40 శాతం సామర్థ్య విస్తరణ, అప్‌గ్రేడేషన్ కోసం వినియోగించనున్నట్లు వివరించారు. అమ్మకాల రీత్యా ప్రస్తుతం హ్యుందాయ్‌కు భారత్ మూడో పెద్ద మార్కెట్‌గా నిలుస్తున్నట్లు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడీ మేకిన్ ఇండియా విజన్‌కు అనుగుణంగా ప్రపంచ ఎగుమతుల కేంద్రంగా భారత్‌ను అభివృద్ధి చేయనున్నట్లు మునోజ్ పేర్కొన్నారు. కాగా.. కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ 2026 జనవరి 1నుంచి ఎండీ, సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్న విషయం తెలిసిందే. తొలిసారి భారతీయ వ్యక్తికి సారథ్యం అప్పగించడమనేది మాతృ సంస్థకు దేశీ కార్యకలాపాలపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నట్లు మునోజ్ పేర్కొన్నారు. హ్యుందాయ్ క్యాపిటల్ దేశీయంగా 2026 రెండో త్రైమాసికం నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని చెప్పారు.

చిన్న కార్లు వీడేదిలేదు

దేశీయంగా చిన్న కార్లకు ప్రాధాన్యత ఉన్నదని మునోజ్ పేర్కొన్నారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనదారులు అప్‌గ్రేడ్ కావడానికి వీలయ్యే చిన్న కార్ల విభాగాన్ని వీడబోమని స్పష్టం చేశారు. ఎంట్రీలెవల్ కస్టమర్లు తదుపరి దశలో అప్‌గ్రేడ్ అయ్యేందుకు వీలయ్యే ప్రొడక్టుల పైనా దృష్టి కొనసాగించనున్నట్లు తెలియజేశారు. భారత్‌ను రెండు మార్కెట్లుగా పేర్కొనవచ్చని, గ్లోబల్ మార్కెట్ల తరహాలో మరిన్ని ఎస్‌యూవీలు, ఆఫ్‌రోడ్ వాహనాలకు వీలున్నట్లే మరోపక్క ఎంట్రీలెవల్ కార్లకు డిమాండ్ ఉంటుందని అభిప్రాయపడ్డారు.

తెలుగు రాష్ట్రాల్లో ఐటీసీ హోటల్స్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీసీ హోటల్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కార్యకలాపాలు మరింతగా విస్తరించనుంది. 'వెల్కమ్ హోటల్ బై ఐటీసీ హోటల్స్' బ్రాండ్ కింద హైదరాబాద్, నెల్లూరులో రెండు కొత్త హోటళ్ల నిర్వహణ కోసం డీఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపింది. హైదరాబాద్ పంజాగుట్టలోని వెల్కమ్ హోటల్‌లో 117 గదులు, నెల్లూరు హోటల్‌లో 127 గదులు ఉంటాయి.



కొత్త నగరాల్లోకి విస్తరించాలనే వృద్ధి ప్రణాళికల అమలుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఐటీసీ హోటల్స్ ఎండీ అనిల్ చద్దా తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు తమకు చాలా ప్రతిష్టాత్మకమైనవని డీఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ మేనేజింగ్ పార్ట్‌నర్ డి. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
జీసీసీల్లో హైరింగ్ జోరు | సెప్టెంబర్‌లో రాణించిన ఎగుమతులు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

బోధన, పరిశోధనకు నెట్

» యూజీసీ నెట్ డిసెంబర్–2025 నోటిఫికేషన్ విడుదల
» జేఆర్ఎఫ్, పీహెచ్‌డీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువుకు మార్గం

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) 2025 డిసెంబర్ సెషన్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. నెట్‌లో ప్రతిభ ద్వారా పరిశోధనలకు వీలు కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)ను పొందొచ్చు. దీంతోపాటు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అదేవిధంగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. యూజీసీ నెట్ 2025 డిసెంబర్ వివరాలు, ఈ పరీక్షతో ప్రయోజనాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర సమాచారం..

సబ్జెక్టులు ఇవే

అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ క్రిమినాలజీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హోంసైన్స్, హిస్టరీ, ఫోరెన్సిక్ సైన్స్, ఇండియన్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్ తదితరాలు.

అర్హత

కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ-ఎన్‌సీఎల్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. అర్హత పరీక్ష ఫైనల్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

01.12.2025 నాటికి జేఆర్ఎఫ్‌కు 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్ /ఎస్సీ /ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది. పీహెచ్‌డీకి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

ఎంపిక విధానం

కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.

మూడు కేటగిరీలుగా పరీక్ష

- యూజీసీ–నెట్‌ను జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అడ్మిషన్ టు పీహెచ్‌డీ అనే మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరవుతామనే విషయాన్ని స్పష్టం చేయాలి.
- కేటగిరీ 1లో.. అవార్డ్ ఆఫ్ జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్.
- కేటగిరీ 2లో .. అపాయింట్‌మెంట్ యాజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అడ్మిషన్ టు పీహెచ్‌డీ .
- కేటగిరీ 3లో.. అడ్మిషన్ టు పీహెచ్‌డీ కేటగిరీని ఎంచుకోవాలి.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూలు నిర్వహించి పీహెచ్‌డీలో ప్రవేశం కల్పిస్తారు.
- కేటగిరీ 2, 3ల్లో అర్హత పొందిన వారిని కూడా పీహెచ్‌డీలో ప్రవేశాలకు పరిగణనలో తీసుకునే అవకాశం ఉంది. అలాంటి సందర్భాల్లో నెట్ మార్కులకు 70 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూ/వైవావోస్‌కు 30 శాతం వెయిటేజీ కల్పిస్తారు.

పరీక్ష విధానం

- కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి.
- పేపర్–1 టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–100 మార్కులకు, పేపర్–2 సబ్జెక్ట్ సంబంధిత పేపర్ 100 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.
- పేపర్–1కు అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి.
- పేపర్–2ను అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా యూజీసీ నెట్‌లో అర్హత ఉన్న సబ్జెక్టుకు హాజరుకావాలి.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌కు సంబంధించి రెండు కేటగిరీల అభ్యర్థులు (జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్) ఉత్తీర్ణత సాధించాలంటే.. తాము రాసిన పేపర్లలో కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు స్కోర్ చేయాలి.



నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో సులభంగా అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేయొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారికి సైంటిస్టులుగా ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 07.10.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 07.11.2025.
- పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:07.11.2025
- దరఖాస్తు సవరణ తేదీలు: 10.11.2025 నుంచి 12.11.2025 వరకు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: **https://ugcnet.nta.nic.in**

రాత పరీక్షలో రాణించేలా

యూజీసీ నెట్‌లో విజయం సాధించేందుకు అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పైనా పట్టు పెంచుకోవాలి.

పేపర్–1

అభ్యర్థులందరికీ ఉమ్మడి పేపర్‌గా నిర్దేశించిన పేపర్–1లో టీచింగ్,రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

పేపర్–2 సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలు

పేపర్–2లో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ నుంచే ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ప్రశ్నలు పీజీ స్థాయిలో ఉంటాయి. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్టుకు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఆయా సిలబస్ అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేటప్పుడు ప్రాక్టికల్ థింకింగ్, అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతున్నాయి. దీంతోపాటు క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ అప్రోచ్‌ను పెంచుకుంటే పరీక్ష ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

సైనిక్ స్కూల్–2026 ప్రవేశాలు

త్రివిధ దళాలలో పనిచేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే సిద్ధంచేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైనిక పాఠశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆలిండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్(ఏఐఎస్‌ఎస్‌ఈఈ) నోటిఫికేషన్ విడుదలైంది. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపికచేస్తారు. ఈ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తుంది.

» **అర్హత**: ఆరో తరగతికి దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు 31.03.2026 నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు 13 నుంచి 15 ఏళ్ల మధ్య ఉండాలి. ఎనిమిదో తరగతి పాసై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.10.2025
» **దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది:** 31.10.2025.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 02.11.2025 నుంచి 04.11.2025 వరకు
» **పరీక్ష తేది:** జనవరి–2026.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షకేంద్రాలు:**
ఆంధ్రప్రదేశ్: అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
తెలంగాణ: హైదరాబాద్, కరీంనగర్.
» **వెబ్‌సైట్:** **https://examinationservices.nic.in**

బీఎస్ఎఫ్‌లో 391 స్పోర్ట్స్ కోటా కానిస్టేబుల్ పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) 2025 సంవత్సరానికి సంబంధించి గ్రూప్–సి నాన్–గెజిటెడ్, నాన్–మినిస్టీరియల్ కింద స్పోర్ట్స్ కోటా కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 391 (పురుషులు–197, మహిళలు–194).
» **క్రీడలు:** అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, షూటింగ్, జూడో, కరాటే, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, సైక్లింగ్ తదితరాలు.
» **అర్హత:** మెట్రిక్యులేషన్(పదో తరగతి) లేదా తత్సమాన విద్యార్హతతో పాటు స్పోర్ట్స్‌లో ప్రతిభావంతులైన క్రీడాకారులు అయి ఉండాలి. 04.11.2023 నుంచి 04.11.2025 వరకు జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారు లేదా పాల్గొన్న వారు అర్హులు. » **వయసు:** 01.08.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి 69,100.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), మెరిట్ లిస్ట్(స్పోర్ట్స్ ప్రదర్శన ఆధారంగా), సర్టిఫికేట్‌ల పరిశీలన, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.11.2025
» **వెబ్‌సైట్:** **https://rectt.bsf.gov.in**

ఆర్‌వీఎన్‌ఎల్,న్యూఢిల్లీలో 10 పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్–05, డిప్యూటీ మేనేజర్–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **వయసు:** మేనేజర్‌కు 40 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డాస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్ట్ క్రాంతి భవన్, బికాజీ కామా, ఆర్‌కే పురం, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.11.2025.
» **వెబ్‌సైట్:** **https://rvnl.org**

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– ఫిజికల్ సైన్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – ఇండియన్ పాలిటీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం – రీజనింగ్



- ఎన్నికల నిర్వహణ విషయంలో నేడు చిక్కుముడి వీడే చాన్స్
- సుప్రీంకోర్టులో విచారణ నేపథ్యంలో భేటీ కానున్న కేబినెట్
- న్యాయస్థానం నిర్ణయం మేరకు ముందుకు వెళ్లడంపై చర్చించనున్న మంత్రివర్గం
- ఎస్ఎల్‌బీసీ సొరంగాల కాంట్రాక్టు రద్దుపై కూడా నిర్ణయం తీసుకోనున్న కేబినెట్

స్థానికం.. నేడే కీలకం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు సంబంధించిన చిక్కుముడి వీడే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవోలు 9, 41, 42ల అమలును నిలుపుదల చేస్తూ రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. కాగా సర్కార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టు విచారణ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సమావేశం కానుంది. సుప్రీంకోర్టు విచారణలో వచ్చే ఫలితం ఆధారంగా ఎన్నికల నిర్వహణ విషయంలో కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. పాత విధానంలో రిజర్వేషన్లను అమలు పరుస్తూ ఎన్నికలు నిర్వహించుకోవాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై సుప్రీంకోర్టు కనుక స్టే విధించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అనుమతిస్తే తక్షణమే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లనుంది. ఒకవేళ స్టే నిరాకరిస్తూ హైకోర్టు సూచనల మేరకు పాత రిజర్వేషన్ల విధానంలోనే ఎన్నికలకు వెళ్లాలని సుప్రీం చెప్పినా, ఇతర సూచనలు ఏవైనా చేసినా..తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రివర్గం చర్చించి ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

'దేవాదుల', 'తుమ్మిడిహెట్టి'పైనా నిర్ణయాలు!

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగాల నిర్మాణ సంస్థ జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌తో 2ఒప్పందం రద్దు చేస్తే మళ్లీ టెండర్లు నిర్వహించి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. టన్నెల్ బోరింగ్ మెషీన్‌కి బదులు అధునాతన టెక్నాలజీతో సొరంగం తవ్వకాలు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశాలపై మంత్రివర్గం చర్చించి కీలక నిర్ణయం తీసుకోనుంది. దేవాదుల ప్రాజెక్టు ప్యాకేజీ–6 అంచనాల పెంపుతో పాటు అదనంగా మూడో దశ పనులకు అనుమతులు ఇచ్చే అంశంపై కూడా కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పనుల పునరుద్ధరణతో పాటు తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం వంటి అంశాలపై నిర్ణయం తీసుకోనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ పనులకు డిజైన్ల రూపకల్పన కోసం ఇటీవల నీటిపారుదల శాఖ ఆహ్వానించిన ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లకు సైతం ఆమోదం తెలిపే (రాటిఫై) అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు రాంరెడ్డి దామోదరరెడ్డి పేరు పెట్టే అంశాన్ని కూడా రాటిఫై చేయనుంది.

డిసెంబర్ 1 నుంచి విజయోత్సవాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7తో రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోనుంది. సనత్‌నగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించడంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం చేపట్టనుంది. తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్–2047పై మంత్రివర్గం చర్చించి ఆమోదించే అవకాశం ఉంది. హామ్ విధానంలో రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి చేపట్టడంతో పాటు ఎల్అండ్‌టీ నుంచి హైదరాబాద్ మెట్రో రైలును టేకోవర్ చేయాలనే నిర్ణయాలకు సైతం మంత్రివర్గం ఆమోదం తెలుపనుంది.

సదర్‌లో జంతుహింస నివారణ

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సదర్ పండుగకు అనుమతులిచ్చే ముందు జంతు హింస నివారణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ సమర్పించిన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. జంతు హింస నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. ఆలోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పశు సంవర్థకశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్, సైబరాబాద్, రామగుండం పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. సదర్ సందర్భంగా జంతు హింస నివారణ చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఈ నెల 9న వినతిపత్రం సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ.. కరీంనగర్ జిల్లాకు చెందిన గౌతం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు.

బీసీ రిజర్వేషన్లపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ముందుకు రానున్న రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్

42 శాతం కోటాపై సర్వత్రా ఉత్కంఠ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే అంశంపై జరుగుతున్న న్యాయ పోరాటం దేశ సర్వోన్నత న్యాయస్థానానికి చేరింది. రిజర్వేషన్ల పెంపుపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) గురువారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. ఈ విచారణ ఫలితం రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణతో పాటు బీసీ రిజర్వేషన్ల భవితవ్యాన్ని నిర్దేశించనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏమిటీ వివాదం?

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 26న జీవో నం.9 జారీ చేసింది. అయితే దీనివల్ల మొత్తం రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీలతో కలిపి) 67 శాతానికి చేరాయని, ఇది సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం గరిష్ఠ పరిమితికి విరుద్ధమంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం.. అక్టోబర్ 9న జీవో నం.9పై మధ్యంతర స్టే విధించింది. ఎన్నికల ప్రక్రియను ఆపనప్పటికీ, పెంచిన రిజర్వేషన్లను అమలు చేయవద్దని, పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

శాస్త్రీయ సమాచారం ఆధారంగానే పెంపు

సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ ప్రక్రియను పూర్తి చేశాకే రిజర్వేషన్లు పెంచామని పిటిషన్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక సర్వేలో బీసీ జనాభా 56.33 శాతంగా తేలిందని, ఈ శాస్త్రీయ సమాచారం ఆధారంగానే కోటాను పెంచామని పేర్కొంది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అనేది రాజ్యాంగంలో ఎక్కడా లేదని, అసాధారణ పరిస్థితుల్లో ఆ పరిమితిని దాటవచ్చని ఇందిరా సాహ్నీ వంటి కేసుల్లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనమే చెప్పిందని గుర్తుచేసింది. కులగణన డేటాను విశ్లేషించిన జస్టిస్ వెంకటేశ్వరరావు ఏకసభ్య కమిషన్ కూడా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సిఫార్సు చేసిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించడం ప్రజాభిప్రాయానికి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ గురువారం వాదనలు వినిపించనున్నారు. తక్షణమే హైకోర్టు స్టేపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని, పెంచిన రిజర్వేషన్లతోనే ఎన్నికల ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతించాలని ప్రభుత్వం కోరనుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

చిట్టి కొమ్మకు గట్టి గూళ్లు



ఎండిన చిట్టి కొమ్మకు కొబ్బరికాయలు కాసినట్లు.. పిచ్చుక గూళ్లు కనువిందు చేస్తున్నాయి. చిన్నగాలికే విరిగిపోయే కొమ్మకు పక్షులు గూళ్లు అల్లుకున్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం లంబాడితండా గ్రామ శివారులో ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పాములా కదులుతూ..



పచ్చని ప్రకృతి ఒడిలో ఏపుగా పెరిగిన వరిపైరు మధ్య పాములా కదులుతున్న ట్రాక్టర్‌పై వెళ్తున్న వీరంతా వ్యవసాయ కూలీలు. పనులు ముగించుకొని ఇళ్లకు పయనమైన కూలీలు పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామ శివారులో కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

శుభ్రమైన చేతులు.. ఆరోగ్యకరమైన జీవితం!

- పిల్లలకు, పెద్దలకు అవగాహన కలిగించేందుకు అధికారుల కసరత్తు
- కార్యక్రమం నిరంతర అమలుకు కార్యాచరణ

చిన్న అలవాటుతో సంపూర్ణ రక్షణ



ఇప్పపిండితో చిన్నారి చేతులు కడిగిస్తున్న గొత్తికోయ మహిళ

కరకగూడెం(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): పరిశుభ్రత అంటే కేవలం ఇల్లు, పరిసరాలే కాదు.. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం కూడా అంతే కీలకం. కనిపించని సూక్ష్మక్రిములు ఆరోగ్యాన్ని దెబ్బతీయకుండా సబ్బుతో కడుక్కోవడం ప్రధానంగా నిలుస్తుంది. ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏటా అక్టోబర్ 15న 'గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే' నిర్వహిస్తున్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం, అవగాహన జీవితాలను ఎంత మెరుగుపరుస్తాయో చెప్పడమే ఈ కార్యక్రమం ప్రధానోద్దేశం. ఈ మేరకు పాఠశాలలు, వైద్యసంస్థల్లో అధికారులు చేతులు కడుక్కోవడం ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. వాస్తవానికి ఈ దినోత్సవం బుధవారం ముగిసినా.. విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించడాన్ని యంత్రాంగం నిరంతరం కొనసాగించేలా ప్రణాళిక రూపొందించింది. అందుకోసం క్షేత్రస్థాయి నుంచి కార్యాచరణపై అధికారులు దృష్టి పెట్టారు.

చేతుల పరిశుభ్రతే మొదటి టీకా..

ఆహారం తినే ముందు లేదా వండే ముందు, టాయిలెట్‌కు వెళ్లి వచ్చాక, దగ్గు లేదా తుమ్ము తర్వాత, పిల్లల సంరక్షణ ముందు, రోగులు, చెత్త, జంతువులను తాకాక చేతులను తప్పనిసరి కడుక్కోవాలి. పైపైన కాక సబ్బు, శుభ్రమైన నీటితో కడిగి తుడుచుకోవడం ప్రధానం . నీరు అందుబాటులో లేకపోతే ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్ వాడొచ్చు. తద్వారా మనం తాకే వస్తువుల్లో దాగి ఉండే లక్షలాది సూక్ష్మక్రిములు చేతుల ద్వారా ఆహారంలోకి, ఆపై శరీరానికి చేరి వ్యాధులకు కారణం కాకుండా అడ్డుకోవచ్చు.

గ్రామీణులకు అవగాహన లోపం..

నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై అవగాహన లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా టాయిలెట్ వెళ్లి వచ్చాక లేదా పిల్లలకు ఆహారం ఇచ్చే ముందు సబ్బు వాడకపోవడం, మొక్కుబడిగా చేతులు కడుక్కోవడంతో అతిసార, వాంతులు వంటివి వ్యాపిస్తున్నాయి. గొత్తికోయ ప్రాంతాల్లో హ్యాండ్‌వాష్‌కు బదులు ఇప్పగింజల పొడి, కానుగ పొడి వాడుతున్నా అవగాహన మరింత పెరగాల్సి ఉంది.

చేతులు కడుక్కోకపోతే అనర్థాలు

చేతులు కడుక్కోకపోవడం వల్ల కలిగే అనర్థాలు చాలా తీవ్రమైనవి. కంటికి కనిపించని క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి. టాయిలెట్‌కు వెళ్లివచ్చాక చేతులు కడుక్కోకపోతే మలంలోని సూక్ష్మక్రిములు చేతులకు అంటుకోవడం, అపరిశుభ్రమైన చేతులతో ఆహారం తినడం ద్వారా అవి శరీరంలోకి ప్రవేశించి డయేరియాకు కారణమవుతాయి. ఇది చిన్న పిల్లలలో తీవ్రమైన డీహైడ్రేషన్‌కు దారి తీసి మరణానికి కారణం కావచ్చు. అపరిశుభ్రమైన చేతులతో ఆహారాన్ని తాకినా, తయారుచేసినా వాంతులు, కడుపు నొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటికి తోడు టైఫాయిడ్, కలరా కూడా కలిగే ప్రమాదమూ ఉంది. అలాగే, ముఖం, కళ్లు, ముక్కును చేతులతో తాకినప్పుడు క్రిములు శ్వాసకోశంలోకి చేరి ఇన్‌ఫ్లుయెంజా, జలుబు వ్యాపిస్తాయి. అలాగే, కళ్లను రుద్దుకున్నప్పుడు కండ్ల కలక వచ్చే ప్రమాదం ఉంది.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం సొంతం



మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని అంతా గుర్తించాలి. తరచుగా చేతులు కడుక్కోవడం ద్వారా అంటువ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు. ఈ చిన్న అలవాటు కుటుంబ ఆరోగ్య రక్షణలో కీలకంగా నిలుస్తుంది. సబ్బు, నీరు అందుబాటులో లేకపోతే ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్ ఉపయోగించొచ్చు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ 'హ్యాండ్‌వాషింగ్ హీరో'గా మారితే వ్యాధి నియంత్రణ సాధ్యమవుతుంది.

– డాక్టర్ జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా




దశల వారీగా చేతులు కడుక్కునే విధానం చూపించే పోస్టర్



భట్టుపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో చేతులు శుభ్రం చేయిస్తున్న ఉపాధ్యాయులు

రాజకీయ ఉద్దేశాలతో పిటిషన్ వేసినట్లుంది

జడ్సన్ పిల్‌ను విచారణకు అనుమతించలేమన్న హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం కాంట్రాక్ట్ అప్పగింతకు సంబంధించి విచారణ జరపాలంటూ మాజీ ఏఐసీసీ సభ్యుడు బక్కా జడ్సన్ దాఖలు చేసిన పిటిషన్ రాజకీయ ఉద్దేశాలతో వేసినట్లుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఆయన దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి నంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను సమర్థించింది. ఈ పిటిషన్ వెనక ప్రజాప్రయోజనం కంటే రాజకీయ ఉద్దేశాలే కనిపిస్తున్నందున అనుమతించలేమని, పిటిషనర్‌కు పిటిషన్ వేసే అర్హత లేదంటూ కొట్టివేసింది. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంపై బక్కా జడ్సన్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫైలింగ్ నంబర్‌పైనే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

రిజర్వేషన్ల గందరగోళానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల గందరగోళానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను బీఆర్‌ఎస్ అడ్డుకుంటోందని మహేశ్‌కుమార్‌గౌడ్ అనడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడే బీసీ సంఘాల నాయకులను ప్రధానమంత్రి వద్దకు తీసుకువెళ్లారని మధుసూదనాచారి గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని పీఎం వద్దకు తీసుకెళ్లాలని కోరారు. తెలంగాణలో తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు బీసీలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన బంద్‌కు బీఆర్‌ఎస్ మద్దతు తెలుపుతుందన్నారు.

సునీతకో న్యాయం.. నవీన్‌కు ఇంకో న్యాయమా?

బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ, కాంగ్రెస్, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయ్యారని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి సునీత, తన కూతురు అక్షర ఇతర కార్యకర్తలతో కలిసి ఈనెల 10న మసీదు ముందు రోడ్డు మీద బాకీ కార్డులు పంచితే నేరం ఎలా అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. అదే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ ఫేక్ ఐడీ కార్డు పంపిణీ చేసిన అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. సునీతకో న్యాయం.. నవీన్‌కు ఇంకో న్యాయమా? అని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఇతరుల పేరుతో ఎందరిని జైలుకు పంపించాలని చూస్తున్నారో చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో గ్రూప్–2 నియామక పత్రాలు పంచి, జూబ్లీహిల్స్‌లో ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సునీతను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన తర్వాత, ప్రచారంలో భాగంగా సునీత భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకుంటే దీనిపై కాంగ్రెస్ వాళ్లు విమర్శలు చేయడం విడ్డూరమని పేర్కొన్నారు.

నొప్పి తెలియకుండా శస్త్రచికిత్స

నేడు ప్రపంచ అనస్తీషియా దినం

- శస్త్రచికిత్సల్లో కీలకంగా అనస్తీషియా విభాగం
- పూర్వం రోగికి మత్తిచ్చేందుకు అనేక విధానాలు
- నేడు చిన్న సూదితో శరీరంలోకి మత్తు ఎక్కించి శస్త్రచికిత్సలు
- ఆపరేషన్ల విజయవంతంలో అనస్తీషియన్ల పాత్రే కీలకం



అనస్తీషియా సాయంతో కడుపులో డ్రిల్ బిట్ తొలగించాక బాలుడితో భద్రాచలం ఆస్పత్రి వైద్యులు (ఫైల్)

భద్రాచలం అర్బన్: రోగికి నొప్పి తెలియకుండా ఆపరేషన్ చేయడం వైద్యశాస్త్రంలో అద్భుతంగా చెప్పవచ్చు. శరీరంలోని ప్రతీ అవయవానికి చేసే ఆపరేషన్‌కు ముందు మత్తుమందు ఇస్తారు. తద్వారా రోగికి ఎలాంటి నొప్పి భావన ఉండదు. నేడు ప్రపంచ అనస్తీషియా దినోత్సవం సందర్భంగా కథనం.

1846లో తొలిసారి..

పూర్వం వైద్యులు ఆపరేషన్ చేయాలంటే అనేక పద్ధతులు అవలంబించేవారు. మత్తు రావడానికి తలపై గట్టిగా కొట్టడం, పాములతో కరిపించడం. వివిధ రకాల మత్తు పదార్థాలు తినిపించడం లేదా గట్టిగా చేతులతో పట్టుకుని ఆపరేషన్ చేయడం చేసేవారని చెబుతారు. ఆ సమయంలో రోగులు బాధతో విలవిల్లాడేవారు. అలాంటి సమయంలో శస్త్రచికిత్స చేయడం వైద్యులకు సవాల్‌గానే ఉండేది. మత్తు మందు (అనస్తీషియా) కనిపెట్టాక ఒక చిన్న సూదితో శరీరంలో మత్తు ఎక్కించేసి ఆపరేషన్ చేస్తున్నారు. సరైన విధానంలో వాడుతున్న నేపథ్యంలో ఆ మత్తే గమ్మత్తుగా మారి ప్రాణాలను నిలుపుతోంది. 1846, అక్టోబరు 16న అమెరికాలోని మసాచుసెట్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్, దంత వైద్యుడు జాన్ కొలిన్స్‌తో కలిసి ఓ రోగికి తొలిసారి మత్తుమందు (ఈథర్ అనస్తీషియా) ఇచ్చి గొంతుకు శస్త్రచికిత్స చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 16న ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

అనస్తీషియన్లూ.. వైద్యులే

రోగికి ఎలాంటి నొప్పి తెలియకుండా ఆపరేషన్ విజయవంతం చేయడంలో అనస్తీషియన్ల పాత్ర కీలకం. అయితే అనస్తీషియా ఇచ్చే నిపుణులు కూడా వైద్యులేనన్నది చాలా మందికి తెలియదు. నాడీ వ్యవస్థపై పరిపూర్ణమైన అవగాహన కలిగిస్తూ నిష్ణాతులుగా తీర్చిదిద్దే కోర్సునే అనస్తీ బయాలజీ అంటారు. ఆపరేషన్ చేసే సమయంలో నొప్పి తెలియకుండా ఉండేందుకు నాడీ వ్యవస్థ స్పందనలను అనస్తీషియన్ అణచివేస్తారు. గుండె, ఊపిరితిత్తులు, లివర్, మూత్రపిండాల పనితీరులో హెచ్చుతగ్గులను జాగ్రత్తగా గమనించి, అత్యవసర సమయంలో సరైన చర్యలు తీసుకోవడమే మత్తు వైద్య నిపుణుల బాధ్యత. ఆపరేషన్ జరిగే సమయంలో రక్తస్రావాన్ని గమనిస్తూ తగు మోతాదులో సెలైన్, రక్తం ఎక్కించే నిర్ణయం కూడా మత్తు వైద్యులదే. మత్తు మందు నిపుణుల విధులను సాధారణంగా శస్త్రచికిత్సకు ముందు, ఇంట్రా ఆపరేటివ్, శస్త్రచికిత్స తర్వాత అనే మూడు విభాగాలుగా విభజిస్తారు. శస్త్రచికిత్సకు ముందు అనస్తీషియా ఇవ్వడం ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలను తెలుసుకునేందుకు రోగి వైద్యచరిత్రతో పాటు ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలి. శస్త్రచికిత్స ముగిసే వరకే కాక ఆ తర్వాత కూడా రోగిని పర్యవేక్షిస్తారు.

ఐసీయూలో ముఖ్యపాత్ర

రోగి ప్రాణాపాయస్థితిలో అత్యవసర చికిత్స అవసరమై, అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు అనస్తీషియన్లు కీలకపాత్ర పోషిస్తారు. క్రిటికల్ కేర్ విభాగం (ఐసీయూ) లోనూ వారే కీలకం. రోగి ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు సిరలు, జీర్ణవాటిక ద్వారా ప్రత్యేక రీతిలో శరీరానికి అవసరమైన అత్యవసర పోషక పదార్థాలను శరీరానికి అందేలా ఏర్పాట్లు చేసేది అనస్తీషియా వైద్యులే. రోగికి మత్తు మందు ఇవ్వడమే గాక అత్యవసర చికిత్సలో ప్రాణాలను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తారు.

అనస్తీషియా లేకపోతే కష్టమయ్యేది



వైద్యరంగంలో అనస్తీషియా కీలకమైంది. ప్రస్తుత వైద్యవిధానంలో ఇది లేకపోతే అన్న ఊహే కష్టంగా ఉంటుంది. అనస్తీషియా మందు రావడంతో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది లేకుండా ఆరోగ్య సంరక్షణ ఊహించడం దాదాపు అసాధ్యం. సాధారణ అనస్తీషియాలో రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు. వారు ఎలాంటి అనుభూతికి లోనుకారు. ఐవీ ద్వారా ఔషధాన్ని స్వీకరిస్తారు.

– డాక్టర్ నిఖిత, అనస్తీషియన్, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

సమష్టి కృషితో సేవలు



భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే శస్త్రచికిత్సల్లో అనస్తీషియా వైద్యులు సమష్టిగా సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్లలో మత్తు మందు వైద్య బృందం అందిస్తున్న సేవలు మరువలేనివి. ఆస్పత్రిలో ఏటా జరిగే వేల సర్జరీలు విజయవంతం చేయడంలో ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నాం.

– డాక్టర్ కౌండిన్య, అనస్తీషియన్, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,473 మంది స్వామివారిని దర్శించుకోగా 23,900 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కృష్ణా జలాలపై మన హక్కు కాపాడుకోవాలి

మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి



సాక్షి, రాజమహేంద్రవరం: కృష్ణా జలాలపై 1976లో బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 811 టీఎంసీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాడుకునే అవకాశం ఉందని, ప్రతి నీటి బొట్టును మనం వాడుకోవాలని మాజీ సీఎం, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అయితే ట్రిబ్యునల్ ఆర్డర్లు పునఃపరిశీలించాలని తెలంగాణ అడుగుతోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు. రాజమండ్రి నగరం క్వారీ ఏరియాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆర్డర్లను వ్యతిరేకిస్తూ తాను ముఖ్యమంత్రిగా ఉండగా 2011లో అఖిల పక్షాన్ని ప్రధాన మంత్రి వద్దకు తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కలిసికట్టుగా ఈ అంశంపై న్యాయ స్థానంలో గెలవాలన్నారు.

ప్రజలకు నమ్మకం కలిగించడమే పోలీసుల బాధ్యత

కేరళ డీజీపీ చంద్రశేఖర్



వీరవాసరం: పోలీసింగ్ అనేది నిరాడంబర అధికారిగా ఉండటంతో పాటు ప్రజలకు నమ్మకం కలిగించడం బాధ్యత అని కేరళ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరానికి చెందిన ఆయనకు బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, కేరళ డీజీపీగా ఎదగడానికి ప్రధాన కారణం గురువులు, ఊరి ప్రజల ఆశీస్సులే కారణం అన్నారు. ఇదే ఊరిలో తనతో పాటు చదివిన ఎం.సుబ్బారెడ్డి, చికిలే సుధాకర్ ఆల్ ఇండియా సర్వీసులకు ఎంపిక రావడం, వివిధ రాష్ట్రాల్లో అత్యున్నత పదవుల్లో ఉండటంతో వీరవాసరం ఖ్యాతి దేశం మొత్తం తెలిసిందన్నారు. ఏదైనా సాధించాలంటే ఫిజికల్ ఎనర్జీ, మెంటల్ ఎనర్జీ, ఎమోషనల్ ఎనర్జీ, స్పిరిట్యువల్ ఎనర్జీ అనేవి ప్రధానంగా ఉండాలని, ఉన్న సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు.

విదేశానికి తొలిసారిగా మాంగనీస్.!

సాక్షి, విశాఖపట్నం: దేశంలోని పలు ప్రాంతాలకు మాంగనీస్ ఖనిజం విశాఖ నుంచి ఎగుమతి అయ్యేది. కానీ.. తొలిసారిగా విదేశాలకు మాంగనీస్ ఎగుమతి నిర్వహించి విశాఖ పోర్టు అథారిటీ అరుదైన మైలురాయిని చేరుకుంది. పనామా కాలువకు చెందిన బల్క్‌డ్రగ్ కార్గో క్యారియర్ షిప్ ఎంవీ హెలెన్ బల్కర్ ద్వారా మాంగనీస్ ఖనిజం ఎగుమతయింది. విశాఖ పోర్టులోని వెస్ట్‌క్యూ-4 బెర్త్‌లో 20 వేల మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను బుధవారం లోడ్ చేయడంతో ఎంవీ హెలెన్ బల్కర్ కార్గో వెసెల్ చైనాకు బయల్దేరింది. వైజాగ్ పోర్టు నుంచి తొలిసారిగా మాంగనీస్ విదేశాలకు ఎగుమతి చేసినట్లు పోర్టు వర్గాలు వెల్లడించాయి.

గుజ్జు లాగేశారు!

ఏడాది పాటు చెమటోడ్చి కష్టించే మామిడి రైతులంటే అందరికీ అలుసుగా మారింది. తోతాపురి మామిడి రైతులను ఈ ఏడాది ఎన్నడూ లేనన్ని కష్టాలు చుట్టుముట్టాయి. పంట విక్రయం ద్వారా వచ్చే సొమ్ముతో కుటుంబ అవసరాలు, చేసిన అప్పులు తీర్చుకుందామనుకున్న కర్షకుల ఆశలు అడియాశలయ్యాయి. తోతాపురి విక్రయంలో అన్ని దశల్లోనూ పుడమి పుత్రులు దగా పడ్డారు.

మామిడి విక్రయాల్లో మాయాజాలం

- ర్యాంపుల్లో గోల్‌మాల్
- బినామీ పేర్లతో కాయలు తోలినట్లు లెక్కలు
- పరిశీలనలో తేలని అక్రమాలు
- ఫ్యాక్టరీ ఇవ్వాల్సిన రూ.8పై నిలదీస్తున్న రైతు నాయకులు



మామిడి కాయలతో క్యూకట్టిన ట్రాక్టర్లు (ఫైల్)



ఇలా అమ్మకాలు..

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది తోతాపురి రకం 39,895 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు కాగా 4.99 లక్షల టన్నుల కాయలు దిగుబడి వచ్చినట్లు అధికారుల అంచనా వేశారు. మొత్తం 43 ఫ్యాక్టరీలుండగా 31 ఫ్యాక్టరీలు కాయల కొనుగోలు చేశాయి. ఈ ఫ్యాక్టరీ లు 49,350 మంది రైతుల నుంచి 2.31 లక్షల మెట్రిక్ టన్నుల కాయలను కొనుగోలు చేయగా.. 25 ర్యాంపులు 30,600 మంది రైతుల నుంచి 1.44 లక్షల మెట్రిక్ టన్నుల కాయలను కొనుగోలు చేసినట్లు అధి కారులు అప్పట్లో నివేదికలిచ్చారు.

కాణిపాకం: మామిడి కాయల విక్రయంలో బినామీ లెక్కలకు రెక్కలొచ్చాయి. అక్రమాలు పరిశీలన పక్కదారి పట్టింది. అసలు లెక్కలను అధికారులు తోసిపుచ్చారు. బోగస్ లెక్కలను తేల్చలేక పోయారు. తద్వారా ప్రభుత్వం అందించిన మామిడి ప్రోత్సాహక నిధి రూ.4 చెల్లింపు దుర్వినియోగమైందని రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. రాయితీ పోయినా ఫ్యాక్టరీ చెల్లించాల్సిన రూ.8 కోసం రోడ్డెక్కారు. రైతు సంఘం నేతల గొంతు నొక్కేందుకు కొందరు ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి అవకతవలను నివారణకు జిల్లా యంత్రాంగం ముందుకు వచ్చి కాయలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తోతాపురి కిలో రూ.12 గిట్టుబాటు ధరను ప్రకటించింది. ఫ్యాక్టరీలు కిలో రూ.8 చెల్లించేలా, ప్రభుత్వం ప్రోత్సాహక నిధి కింద రూ.4 చెల్లిస్తామని వెల్లడించింది. అయితే కాయల విక్రయానికి టోకెన్ల పద్ధతి ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో రాయితీపై కన్నేసిన కొందరు అక్రమాలకు తెగబడ్డారు.

మధ్యవర్తుల దందా..

మామిడి కొనుగోలు సమయంలో ఫ్యాక్టరీల వద్ద కొందరు కాపు కాచారు. కూటమి నేతలు, ప్రజాప్రతినిధుల పేరు చెప్పి టోకన్లను అమ్ముకున్నారనే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఆ తర్వాత తమిళనాడు రాష్ట్రంలో పండిన కాయలను జిల్లాలోని ఫ్యాక్టరీలకు తరలించారనే వాదనలు వినిపించాయి. ఈ దోపిడీ జోరుగా సాగుతోందని సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై తమిళనాడు సరిహద్దులో నిఘా పెట్టారు. దీనికి తోడు వ్యాపారులను బుట్టలో వేసుకుని కూటమికి చెందిన కొందరు ప్రభుత్వ ప్రోత్సాహక నిధి దోపిడీకి తెరలేపారు. ర్యాంపులను అడ్డం పెట్టుకుని కాయలు కాటా వేసి, బోగస్ పేర్లు, బిల్లులు సృష్టించారు. ఇలాంటివి బంగారుపాళెం, కుప్పం, వి.కోట, పలమనేరు, సోమల తదితర ప్రాంతాల్లో జరిగినట్లు విమర్శలు వచ్చాయి. అలాగే నీలం కాయలను కూడా ర్యాంపులకు తరలించి తోతాపురి లెక్కల్లోకి ఎక్కించారని ఆరోపణలు భగ్గుమన్నాయి. దీనిపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రపంచ మామిడి దినోత్సవ సభలో భగ్గుమన్నారు. బోగస్ లెక్కలను బయటకు తీస్తామని సభ సాక్షిగా హామీ ఇచ్చారు. అయితే అధికారులు పరిశీలన పేరుతో జాప్యం చేసి తమ చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. ర్యాంపుల వద్ద లెక్కలు గందరగోళంగా ఉండడంతో ఏం చేయలేక మిన్నకుండిపోయినట్లు సమాచారం.

రూ.8 మాటేంటీ..

ప్రభుత్వం తోతాపురికి ప్రకటించిన మద్దతు ధర విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. రూ.4 ప్రోత్సాహక నిధి చెల్లించి..చేతులు దులుపుకుంటోంది. అయితే ఫ్యాక్టరీ నుంచి కిలో రూ.8 ఇవ్వాల్సి ఉండగా.. దీనిపై నోరువిప్పడం లేదు. ఇది వరకే కొన్ని ఫ్యాక్టరీలు కిలో రూ.5 చెల్లించగా రైతులు భగుమంటున్నారు. ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు వ్యతిరేకంగా రైతు సంఘ నాయకులు ఆక్రందన సభ నిర్వహణకు సిద్ధపడ్డారు. బుధవారం బంగారుపాళెం మండలంలోని మార్కెట్‌యార్డులో సభ నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు కూటమికి చెందిన నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి రైతుల సంఘం నాయకులకు బెదిరింపులు వస్తున్నాయి. సభను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర్పై పోరాడుతున్న రైతు నాయకులను అడ్డుకుంటే భవిష్యత్ ఉండదని వారు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నిధి మంజూరుతో ఇలా..

అధికారులు పరిశీలన పూర్తి చేసి ఇచ్చిన నివేదికలపై రైతులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి చిత్తూరుజిల్లా వ్యాప్తంగా 31,929 మంది రైతులు 79,963 సార్లు కాయలు తరలించగా 3.67లక్ష టన్నుల కాయలు విక్రయించినట్లు లెక్కకట్టారు. ఇందుకు గాను ప్రభుత్వం రూ.146 కోట్ల మేర నిధులు మంజూరు చేసిందని అధికారులు వెల్లడించారు. అయితే ఈ చెల్లింపులపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బోగస్ లెక్కలు తేలకుండా నిధులు జమ చేయడంపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

బోగస్ లెక్కలు తేల్చాలి



కొన్ని ర్యాంపుల్లో ప్రభుత్వ నిధిని దోచుకోవాలని బోగస్ లెక్కలు చూపించారు. ఆ లెక్కలు తేలకుండా నిధి జమ చేశారు. దీంతో ప్రజానిధి పక్కదారి పట్టిందని భావిస్తున్నాం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలి. ఆ బోగస్ లెక్కలు తేల్చాలి. అలాగే ఫ్యాక్టరీలు కిలోకు రూ.8 ఇవ్వాలి. ఇందుకు అన్ని పార్టీలను సమన్వయం చేసుకుని సభకు పూనుకున్నాం.

– ఉమాపతినాయుడు, మామిడి రైతు సంఘ ఉపాధ్యక్షులు

ఫ్యాక్టరీల నుంచి రూ. 8 ఇప్పించాలి



ప్రభుత్వం తోతాపురికి మద్ద తు ధరగా కిలో రూ.12 ప్రకటించింది. ఆ ప్రకారమే రైతు లకు నగదు ఇప్పించాలి. ఫ్యా క్టరీలు కేజీకి రూ. 5 ఇస్తే ఒప్పుకోం. కచ్చితంగా రూ.8 ఇవ్వా ల్సిందే. ఇవ్వని ఫ్యాక్టరీ లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈనేపథ్యంలోనే బంగారుపాళ్యంలో అక్రందన సభను నిర్వహిస్తున్నాం. ఈ సభను అడ్డుకోవద్దు. మేము రైతుల కోసం పోరాడుతున్నాం. ఇందుకు అందరు సహకరించాలి.

– జనార్దన్, మామిడి రైతు సంఘ అధ్యక్షులు

ఇంకా చేయాల్సింది ఉంది



మామిడి కొనుగోలుపై పరిశీలన చేపట్టాం. పరిశీలనలో చాలా వరకు తీసేశాం. ఇంకా పరిశీలన చేయాల్సి ఉంది. చేస్తాం. ఏదైనా అనుమానం ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. కచ్చితంగా స్పందిస్తాం. చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. అనుమానాలు వద్దు.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, చిత్తూరు

● దళారుల దందా

పెళ్లి బృందాలకు క్షవర కల్యాణం

- రత్నగిరిపై వివాహ మండపాలు, సత్రం గదులు ఇప్పిస్తామని మోసాలు
- తాజాగా ఈఓకు ఓ బాధితుడి ఫిర్యాదు

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని సన్నిధిలో పేదలు తమ బిడ్డల వివాహాలు చేసుకునేందుకు వీలుగా రత్నగిరిపై పలువురు దాతలు ఉచిత కల్యాణ మండపాలు నిర్మించారు. కానీ, వీటి కేటాయింపులో దళారుల దందా సాగుతోంది. వారికి కొంతమంది దేవస్థానం సిబ్బంది అండదండలు ఉండటంతో పేదలకు ఉచిత కల్యాణ మండపాలు లభించడం దుర్లభంగా మారుతోంది. ఇటీవల జరుగుతున్న సంఘటనలే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఉచిత కల్యాణ మండపాల కేటాయింపును దేవస్థానం అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో దళారులు, కొంతమంది సిబ్బంది ఒక్కటై వివాహ బృందాలను దోచుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నాయి. తాజా ఉదంతమే దీనికి ఉదాహరణ.

రూ.25 వేలకు ఒప్పందం

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన తోట నాగతేజ గత శనివారం రాత్రి రత్నగిరిపై వివాహం చేసుకున్నారు. ఈ వివాహ ఏర్పాట్ల కోసం ఆయన గత ఆగస్టులో దేవస్థానానికి వచ్చారు. మట్టే వారి సత్య శ్రీనివాస ఉచిత కల్యాణ మండపంలో ఏసీ కల్యాణ మండపం, పక్కనే సత్రంలో రెండు ఏసీ గదులు, పురోహితుడు, సన్నాయి మేళం కోసం దేవస్థానం సీఆర్‌ఓ కార్యాలయాన్ని సంప్రదించారు.



ఉచిత కల్యాణ మండపాల్లో వివాహాల సందడి

సత్రం గదులు, వివాహ మండపం వివాహానికి నెల రోజులు ముందుగా మాత్రమే రిజర్వేషన్ చేస్తారని అక్కడి అధికారులు చెప్పారు. అక్కడి నుంచి నాగతేజ వెలుపలకు రాగానే అశోక్, పోరి అనే ఇద్దరు దళారులు అతడి వద్దకు వెళ్లారు. అక్టోబర్ 11 వివాహానికి గదులు, వివాహ మండపం సెప్టెంబర్ 11న వస్తే రిజర్వ్ చేస్తారని చెప్పారు. ఆయన రానవసరం లేకుండా అన్నీ తామే ఏర్పాటు చేస్తామని, రూ.25 వేలు ఇవ్వాలని చెప్పారు. ఆ మాటలు నమ్మిన నాగతేజ.. వారికి తన, పెళ్లి కుమార్తె ఆధార్ నకళ్లతో పాటు శుభలేఖ, రూ.15 వేల నగదు ఇచ్చారు. మిగిలిన రూ.10 వేలు వివాహ సమయంలో ఇస్తామని చెప్పారు. అయితే, వివాహం చేసుకునేందుకు గత శనివారం దేవస్థానానికి వచ్చిన నాగతేజకు నాన్ ఏసీ కల్యాణ మండపం, రెండు నాన్ ఏసీ గదులు మాత్రమే ఇచ్చారు. దీంతో, అతడు దళారులకు రూ.10 వేలకు బదులు రూ.7,500 మాత్రమే ఇచ్చారు. మిగిలిన రూ.2,500 కూడా ఇవ్వాలని దళారులు గొడవకు దిగడంతో నాగతేజ పెళ్లి దుస్తుల్లోనే వెళ్లి ఈఓ వీర్ల సుబ్బారావుకు ఫిర్యాదు చేశాడు. దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వివాదం సంగతి అలా ఉంచితే.. ఈ ఎపిసోడ్‌లో అసలు వ్యక్తులు రాకుండా దళారులు ఆధార్ కార్డులు ఇస్తే వివాహ మండపం, సత్రంలో గదులు ఎలా రిజర్వ్ చేశారు? సీఆర్‌ఓ కార్యాలయ సిబ్బంది ప్రమేయం లేకుండా ఇది జరిగే పనేనా వంటి అనేక సందేహాలు కలుగుతున్నాయి.

నెరవేరని దాతల లక్ష్యం

అన్నవరం దేవస్థానంలో సత్యగిరిపై పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్ దంపతులు 2022లో 12 మినీ కల్యాణ మండపాలతో పెద్ద ఏసీ కల్యాణ మండపం నిర్మించారు. ఇదేవిధంగా విశాఖపట్నానికి చెందిన దాత ఎంఎస్ రెడ్డి కూడా 12 మినీ కల్యాణ మండపాలతో పెద్ద కల్యాణ మండపం నిర్మించారు. ఈ రెండు మండపాల్లో చెరో తొమ్మిది మినీ కల్యాణ మండపాల కేటాయింపును దేవస్థానానికి అప్పగించారు. మిగిలిన చెరో మూడు మండపాలను దాత సిఫారసు మేరకు కేటాయిస్తారు. ఈ మండపాల్లో పెళ్లిళ్లు చేసుకునే వారు రూపాయి కూడా అద్దె చెల్లించనవసరం లేదు. అలాగే, ఒక్కో వివాహానికి రెండు గదులను దేవస్థానం అద్దె ప్రాతిపదికన ఇస్తుంది. వివాహ ముహూర్తానికి నెల రోజుల ముందు మాత్రమే ఈ కల్యాణ మండపాలను రిజర్వ్ చేస్తారు. ఈ విషయం తెలియక చాలామంది వివాహానికి చాలా రోజుల ముందే వస్తున్నారు. తీరా విషయం తెలిశాక మళ్లీ రాలేకపోతున్నారు. అటువంటి వారిని గుర్తించి, దళారులు వల విసురుతున్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయండి

జాతీయ ఉపాధ్యాయ పరిషత్ డిమాండ్

సాక్షి, అమరావతి: డీఎస్సీలో పోస్టుల భర్తీ తర్వాత మిగిలిన ఖాళీ పోస్టులకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి జూన్‌లో బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బదిలీలు పొందిన ఉపాధ్యాయుల్లో చాలా మందికి రిలీవర్ లేక పాత పాఠశాలలోనే కొనసాగిస్తున్నారని, జీతం మాత్రం బదిలీ అయిన పాఠశాలలో పొందాలని ఉత్తర్వులిచ్చారని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందన రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి రెగ్యులర్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు చాలా అవసరమన్నారు.

తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే ఖబడ్దార్

- డీజీపీ హెచ్చరిక

సాక్షి, అమరావతి : వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్టకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో అసత్యాలను ప్రచారంచేస్తూ పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా.. సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తున్న కొంతమందిని ఇప్పటికే గుర్తించినట్లు ఆయన తెలిపారు. మతం, వర్గ, ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టేలా పోస్టులు, వీడియోలు లేదా వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తప్పుడు వార్తలు ప్రచారం చేసినా నేరమేనని హెచ్చరించారు. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామన్నారు.

రాష్ట్రంలో నాలుగు స్పోర్ట్స్ అకాడమీలు

- శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్

దేవరపల్లి: రాష్ట్రంలో నాలుగు స్పోర్ట్స్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. తిరుపతి, నెల్లూరు, కాకినాడ, విశాఖలలో అకాడమీల ఏర్పాటుకు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అధ్యక్షతన ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో తీర్మానించినట్లు ఆయన చెప్పారు. ఒక్కొక్క అకాడమీలో 14 నుంచి 16 గేమ్స్ ఉంటాయని, ఆరు టీమ్ గేమ్స్ కాగా, మిగిలినవి వ్యక్తిగత క్రీడలని తెలిపారు. విజయనగరంలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం తిరుపతిలో 100 ఎకరాల్లో క్రీడా పాఠశాల ఉందని ఆయన చెప్పారు.

శ్రీగిరి అభివృద్ధికి ఆమోదించేనా!

- నేడు శ్రీశైలం రానున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ
- శ్రీగిరి అభివృద్ధికి బాటలు పడేనా? కలగా మిగిలిన శ్రీశైలానికి రైలు మార్గం
- క్షేత్రానికి 5,300 ఎకరాల భూ బదిలీ జరిగేనా
- ఆత్మకూరు–దోర్నాల ఘాట్‌రోడ్డు విస్తర్ణకు ఆమోదం లభించేనా?
- గతంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం నుంచి రూ.43 కోట్లు విడుదల



శ్రీశైలంటెంపుల్: ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వరూపంలో కొలువైన ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీశైల మహాక్షేత్రం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే ప్రాంగణంలో జ్యోతిర్లింగ స్వరూపుడు, శక్తిపీఠం కలగలసి వెలసి ఉన్న ఏకైక క్షేత్రం. అంతటి ప్రాశస్త్యం ఉన్న మహాక్షేత్రం అభివృద్ధికి దూరమవుతోంది. అరకొర సౌకర్యాలతో భక్తులు అవస్థలు పడుతున్నారు. క్షేత్రంలో ఏ చిన్న అభివృద్ధి చేయాలన్న అటవీశాఖ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. రహదారులు, వసతి సౌకర్యాలు భక్తులను వేధిస్తున్నాయి. గురువారం శ్రీశైలానికి భారత ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో క్షేత్ర అభివృద్ధిపై దృష్టి సారించి, శ్రీగిరిలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు. ఈ క్షేత్రానికి చేరుకోవాలంటే అటు ఆంధ్రా నుంచి అయినా, ఇటు తెలంగాణ ప్రాంతం నుంచి అయినా రైలు మార్గం లేదు. సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని మార్కాపురం రోడ్డు వరకు మాత్రమే రైలు మార్గం ఉంది. ఇటు తెలంగాణ నుంచి అయితే రైలు మార్గం అసలే లేదు. గతంలో పార్లమెంట్‌సభ్యులు శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడంతో పరిశీలించాలని అధికారులకు ఆదేశించింది. కేంద్రం ఆదేశాలతో ప్రత్యేక కమిటీ సభ్యులు శ్రీశైలానికి రైలు మార్గానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. శ్రీగిరి చుట్టూ నల్లమల అభయారణ్యం కావడంతో మార్కాపురం రోడ్డు నుంచి దోర్నాల వరకు రైలు మార్గాన్ని విస్తరించవచ్చునని ప్రతిపాదనలను పంపినట్లు సమాచారం. అయితే ఏటా బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు శ్రీశైలానికి రైలు మార్గం బడ్జెట్‌లో ప్రస్తావనకు రావడం లేదు. క్షేత్రానికి రైలు మార్గం ఉంటే సామాన్య భక్తులు సైతం క్షేత్ర యాత్ర చేసుకునే అవకాశం ఉంటుంది.

ఐకానిక్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేనా?

శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు సున్నిపెంటగ్రామంలో సుమారు రూ.70 కోట్లతో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించారు. సున్నిపెంట నుంచి శ్రీశైలానికి 10 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దూరాన్ని తగ్గించాల నే ఉద్దేశంతో సున్నిపెంట నుంచి కృష్ణానదిపై శ్రీశైలం వరకు ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించారు. అలాగే తెలంగాణ నుంచి శ్రీశైలంకు సమీపంలో దూరాన్ని తగ్గించేలా తెలంగాణ ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేసి అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఏపీ, తెలంగాణ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలి. ఐకానిక్ వంతెనను నిర్మిస్తే భక్తులకు శ్రీశైలం దూరం తగ్గడంతో పాటు ప్రయాణం సాఫీగా సాగుతుంది.

భూ బదలాయింపు జరిగేనా

గతంలో దేవదాయ, అటవీ, రెవెన్యూ శాఖల మంత్రులు, మూడు శాఖల ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి ప్రాథమికంగా శ్రీశైల దేవస్థానానికి 5,302 ఎకరాల భూమి ఉందని నిర్ధారించారు. శ్రీశైల దేవస్థానానికి 1967 నవంబర్‌లో ఫుడ్ అండ్ అగ్రికల్చరేట్ డిపార్ట్‌మెంట్ ప్రకారం 5,302 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మొత్తం భూమి 9 సర్వే నెంబర్లలో ఉంది. 5,302 ఎకరాల్లో 900 ఎకరాలు శ్రీశైలం ప్రాజెక్టు రిజర్వాయర్‌లో ముంపు అయింది. బ్రిటీష్‌కాలం నాటి జీవో, బ్రిటీష్ కాలం నాటి గెజిట్ ఎంట్రీ ద్వారా సర్వే చేయించి క్షేత్ర సరిహద్దులను గుర్తించారు. 4,400 ఎకరాలు శ్రీశైల మల్లన్న కు చెందిన భూమి అని గుర్తించి, అటవీశాఖ అంగీకరించింది. దీంతో ఆ భూమిని దేవస్థానానికి అప్పగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవదాయశాఖకు భూమిని అప్పగించేందుకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సర్వే డిపార్ట్‌మెంట్‌కు డీఎఫ్‌వో లేఖ రాశారు. అక్కడి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

ఘాట్‌రోడ్డు విస్తరించేనా


శ్రీశైల క్షేత్రానికి ఏపీ, అటు తెలంగాణ నుంచి చేరుకోవాలంటే సుమారు 100 కి.మీ దూరం ఘాట్‌రోడ్డులో రోడ్డు ప్రయాణం చేయాలి. ఏపీ వైపు శ్రీశైలం నుంచి ఆత్మకూరు వైపు సుమారు 100 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డు సింగిల్ రోడ్డు మాత్రమే. వర్ష కాలంలో ఇరుకైన ఈ రోడ్డులో తరచూ భారీ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. ఈ రోడ్డు నేషనల్ హైవే పరిధిలో ఉన్నప్పటికీ విస్తరించడం లేదు. ఆత్మకూరు నుంచి దోర్నాల, దోర్నాల నుంచి శ్రీశైలం నాలుగు లైన్లుగా విస్తరిస్తే క్షేత్రానికి భక్తుల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంది. అలాగే దోర్నాల-శ్రీశైలం నేషనల్ హైవే 765 పరిధిలో ఉంది. ఎన్‌హెచ్-765 రహదారిని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.3వేల కోట్లతో చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ ప్రాంతంలో అండర్‌పాస్, ఓవర్ పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తే వన్యప్రాణులు, పులుల సంచారానికి ఆటంకం లేకుండా, వన్యప్రాణులు వాహనాల ప్రమాదానికి గురికాకుండా ఉంటుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే లింగాలగట్టు నుంచి శ్రీశైలానికి ఆంధ్రా-తెలంగాణ ప్రాంతాలను కలుపుతూ సుమారు రూ.300కోట్లతో ఒక ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు.





మల్లన్న క్షేత్రానికి 'ప్రసాదం' అందేనా..!


శ్రీశైల క్షేత్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం రూ.43 కోట్లతో అభివృద్ధి చేసింది. శ్రీశైలక్షేత్రానికి రోజు రోజుకు పెరుగుతున్న భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం శ్రీశైలంలో కల్పించాల్సిన సౌకర్యాలపై 2017 లో అప్పటి ఈవో భరత్‌గుప్తా కేంద్ర పర్యాటక శాఖ అధికారులకు వివరించి, డీపీఆర్‌ను సమర్పించారు. దీంతో కేంద్ర పర్యాటక శాఖ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్ డ్రైవ్) ప్రసాద్ పథకం కింద శ్రీశైల క్షేత్రంలో భక్తులకు, పర్యాటకులకు కల్పించాల్సి న సౌకర్యాల కోసం రూ.43 కోట్లు నిధులు మంజూరు చేసింది. మూడు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. 2017లో శ్రీశైలంలో ప్రసాద్ పథకం ద్వారా పనులు ప్రారంభించారు. కేంద్రం మంజూరు చేసిన పనులను రాష్ట్ర పర్యాటక శాఖ, శ్రీశైల దేవస్థాన ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టారు. 2022 డిసెంబరు 26న రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ఆయా అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మల్లన్న దర్శనానికి వస్తున్న మోదీ.. శ్రీగిరి అభివృద్ధికి వరాలు కురిపించాలని భక్తులు కోరుతున్నారు.



పుణ్యభారతాన ఆదివైద్యుడి ఆలయాలు

శ్రీ మహావిష్ణువు అవతారంగా, దేవతలకు వైద్యుడుగా, ఆయుర్వేద వైద్యానికి ఆది వైద్యుడిగా ప్రసిద్ధి చెందిన ధన్వంతరి క్షీర సాగర మథన సమయాన ఆశ్వయుజ శుద్ధ త్రయోదశి నాడు ఆవిర్భవించాడు. చతుర్భుజుడైన ధన్వంతరి నాలుగు చేతులలో శంఖం, చక్రం, జలౌకం (జలగ) అమృత తుల్యమైన పునరుజ్జీవన తేనె భాండం దర్శనమిస్తాయి.











ధన్వంతరిని సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అవతారంగా పూజిస్తున్నప్పటికీ, ధన్వంతరికి అంకితం చేయబడిన దేవాలయాలు భారతదేశంలో చాలా తక్కువ. ఆ ఉన్న కొద్ది ఆలయాలు కూడా దక్షిణ భారతదేశంలోనే దర్శనమిస్తాయి ఉత్తర భారతాన న్యూఢిల్లీలోని కేంద్ర ఆయుర్వేద పరిశోధన సంస్థ ప్రాంగణంలో ఒక విగ్రహం, హరిద్వార్‌లోని ఒక ఆశ్రమంలో మరొక విగ్రహం తప్ప ఉత్తర భారతాన ధన్వంతరికి ఆలయాలంటూ అసలేం లేవనే చెప్పాల్సి ఉంటుంది.

రంగనాథస్వామి ఆలయం వద్ద ధన్వంతరి ఆలయం

తమిళనాడులో శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ధన్వంతరి మందిరం ఉంది. శ్రీ రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో 12వ శతాబ్దానికి చెందిన పురాతన మందిరం ఉంది. ఇక్కడ స్వామికి ప్రతిరోజూ పూజలు నిర్వహిస్తారు. ఆరోగ్యాభిలాషులైన భక్తులకు 'ప్రసాదం'గా మూలికలను అందిస్తారు.

కోయంబత్తూరు శ్రీ ధన్వంతరి ఆలయం

కోయంబత్తూరులోని శ్రీ ధన్వంతరి ఆలయం తమిళనాడులోని మరొక ప్రసిద్ధ ధన్వంతరి ఆలయం. కోయంబత్తూరు నగర నడిబొడ్డున ఆర్య వైద్య చికిత్సాలయం, పరిశోధనా సంస్థలో ఉన్న శ్రీ ధన్వంతరి మందిరం, జీవానికి, వైద్యానికి దేవుడు, ధన్వంతరిని ప్రధాన దేవతగా ప్రతిష్టించింది.

నెల్లువాయ భగవాన్ ధన్వంతరి ఆలయం

గురువాయూర్, త్రిసూర్ నుండి 20 కి.మీ దూరంలో ఉన్న నెల్లువాయ వద్ద ఉన్న లార్డ్ ధన్వంతరి ఆలయం కేరళలోని ముఖ్యమైన ధన్వంతరి ఆలయాలలో ఒకటి. ఆయుర్వేద వైద్యులు వైద్యం ప్రారంభించే ముందు ఈ ఆలయాన్ని సందర్శించడం శుభప్రదంగా భావిస్తారు.

మలప్పురంలో రుద్ర ధన్వంతరి ఆలయం

మలప్పురంలోని పులమంథోల్ మధ్యలో ఉన్న శ్రీ రుద్ర ధన్వంతరి ఆలయం కేరళలోని మరొక ప్రసిద్ధ ధన్వంతరి ఆలయం. ఈ ఆలయం ప్రసిద్ధ అష్టవైద్య పులమంథోల్ మూస్ కుటుంబానికి చెందినది, అయితే అన్ని వర్గాలకు చెందిన హిందువులు ఆలయంలో పూజలు చేసుకోవడానికి అనుమతి ఉంది.

శ్రీ ధన్వంతరి ఆలయం, పెరింగవు

కేరళలోని త్రిస్సూర్ పట్టణ శివార్లలో ఉన్న మరొక పురాతన ధన్వంతరి ఆలయం పెరింగావులోని శ్రీ ధన్వంతరి ఆలయం. ఈ ఆలయ గర్భగుడి రెండు అంతస్తులతో గుండ్రని ఆకారంలో నిర్మించబడింది, ఇది ఇతర కేరళ శైలి నిర్మాణ శైలికి భిన్నంగా అరుదైన డిజైన్. గణపతి, లక్ష్మీదేవి, అయ్యప్పన్ ఈ ఆలయంలో ప్రతిష్ఠించబడిన ఇతర దేవతలు.

వడక్కంచెరి ధన్వంతరి ఆలయం

వడక్కంచెరి ఆయుర్వేద ప్రభువుకు అంకితం చేయబడిన మరొక ప్రసిద్ధ ఆలయం. ఈ ఆలయం కేరళలోని త్రిస్సూర్‌కు ఉత్తరాన 18 కి.మీ దూరంలో వడక్కంచెరి నుండి 8 కి.మీ దూరంలో కున్నంకుళం – వడక్కంచెరి రహదారిపై ఉంది.


(అక్టోబర్ 18, శనివారం ధన్వంతరి జయంతి)

● సువార్త

అంతఃకరణ శుద్ధీకరణ పునర్జన్మ

రెండు వేల సంవత్సరాలనాటి క్రైస్తవ సంస్కారాలలో లేక సంప్రదాయాలలో ఒకటి పరిశుద్ధ బాప్తిస్మం దివ్యస్నానం, సమభక్త సంస్కారంలో రెండింటిలో బాప్తిస్మము– అంటే గ్రీకు భాషలో బాతోమ్ అనే పదం నుండి వచ్చింది. అంటే కడుక్కోవడం లేక కడగబటం అని అర్థం. వీటిని గూర్చి తెలుసుకోవటానికి ఆధ్యాత్మిక పునీతులు జ్ఞానోపదేశం చేశారు. క్రీ.పూ. నాలుగువేల సంవత్సరాల క్రితం మోషే ప్రవక్త ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి విడుదల పరచేటప్పుడు వారు బయలుదేరి ప్రయాణిస్తున్నప్పుడు ఎర్ర సముద్రం అడ్డు వచ్చింది. కానీ దేవుని అనుగ్రహం వల్ల ఎర్ర సముద్రం రెండు పాయలుగా చీల్చబడి, రెండువైపులా నీరు అడ్డుగోడలుగా నిలబడటంలో ఇశ్రాయేలీయులు పొడి నేలను నడిచివెళ్ళారు.

కానీ ఫరో తన సైన్యంతో వచ్చి నీటిలో మునిగిపోయారు. కానీ ఇశ్రాయేలీయులకు నీటిలోనుండి నడిచివెళ్ళటం ఆధ్యాత్మికమైన స్నానం మొట్టమొదటిది. అయితే ఫరో, ఆయన సైన్యానికి ఆధ్యాత్మిక శక్తి లేదు. ఒక విధంగా ఇశ్రాయేలీయులకు మొట్టమొదటి శరీరశుద్ధినే బాప్తిస్మము–కడుక్కోవటం లేక కడగబడ్డారు (క్లెన్సింగ్) అని భావించవచ్చు.



ప్రవక్తయైన మోషే మందనము దగ్గరకు వెళ్ళేటప్పుడు ప్రత్యక్షపు గుడారం బయట గంగాళంలో వున్న నీళ్ళలో అహరో ఆయన సంతానం దేవుని సేవలు చేయటానికి, యెహోవాకు హోమధూపం నిర్వర్తించుటకు అంటే సేవకులు మరణించకుండా వుండటానికి కాళ్ళూ చేతులు కడుక్కొని ప్రత్యక్ష గుడారంలో ప్రవేశించాలని వారికి సెలవిచ్చాడు. (నిర్గమ 30 అధ్యాయం). ఇది మతపరమైనది కాకుండా ఆధ్యాత్మికమైన హెబ్రీయుల సంస్కారంగా చూస్తాం. మోషే అహరోతో చెప్పినదేమిటంటే గుడారంలోపలికి వెళ్ళేముందు కాళ్ళూ చేతులు కడుక్కోమన్నాడు. మన దేశంలో నదుల దగ్గర లేక చెరువుల దగ్గర దేవాలయాలు ఎందుకు కడుతున్నారు అంటే దేవాలయంలోకి వెళ్ళేముందు స్నానం చేసి శుద్ధీకరణ చేసుకొని ప్రవేశించడం కోసమేనని అర్థం చేసుకోవాలి.

యోహాను (భక్తుడు) సేవను మొదలుపెట్టేటప్పుడు యొర్దాను నదీ ప్రాంతం నుండి ఒక నీళ్ళ కుండను నెత్తి మీద పెట్టుకొని, ఆ కుండకు చిల్లి పెట్టి ఆ నీళ్ళు చిల్లిలోంచి కారుతుంటే శుద్ధీకరణ చేసుకున్నాడు. ఇది ఒక ప్రక్షాళన. బాప్తిస్మము అంటే ఆధ్యాత్మిక పునర్జన్మ.

ఇందులో నీళ్ళ ద్వారా బాహ్య శుద్ధీకరణ కాకుండా ఆత్మ కూడా శుద్ధీకరణ లేక ప్రక్షాళన పొందాలి. ఉదా : ఏ స్త్రీనైనా మోహపు చూపుతో చూస్తే ఆ స్త్రీతో వ్యభిచరించినట్లే అని బైబిల్ గ్రంథం చెప్తుంది. అంటే మన ఆత్మను అంత జాగ్రత్తగా, నిష్టగా, కఠోర దీక్షతో వుంచాలి. (కొరంథీ 5 : 17).

ఈ సందర్భంలో ఒక మీమాంస రావచ్చు. ఎందుకు ఏసుప్రభువుల వారు దేవుని కుమారుడై వుండి యోహాను ప్రవక్త బాప్తిస్మము ఇచ్చేటప్పుడు సాధారణ పౌరుడిగా వరుసలో నిలబడ్డాడు అని ప్రశ్నిస్తారు. కానీ ఒకటి దేవుని రాజ్యం సమీపించబడుతోంది, మారు మనస్సు పొందండని చెప్పడం కోసమూ, ఆయన ఈ లోకంలో శరీరధారిగా జన్మించడం వల్లనే బాహ్యస్నానం, ఆత్మ ప్రక్షాళన– ఒకటి నీటి ద్వారా, రెండు ఆత్మమూలంగా పొందారు.

ఒకసారి యూదుల అధికారమైన నీకొదేము ఎవరైనా చూస్తే ఏం అనుకుంటారో అని రాత్రిపూట ఆయన (యేసుప్రభువు) దగ్గరకు వచ్చి దేవుని రాజ్యంలో ప్రవేశించటానికి రక్షణ ఎలా పొందాలి, ఏం చెయ్యాలనే మీమాంసతో అడిగాడు. అందుకు ప్రభువు అతనితో ఒకడు కొత్తగా (పై నుండి) జన్మిస్తేనే కానీ దేవుని రాజ్యం చూడలేరని ఆయనతో నిస్సందేహంగా చెప్పాడు. (పరి యోహాను 3:1–8).

యేసు ప్రభువుల వారు ప్రవక్త యోహాను దగ్గర బాప్తిస్మము తీసుకునేటప్పుడు ఆకాశం తెరవబడి పరిశుద్ధాత్మ ఆయన (యేసు) మీదకు వచ్చి –ఈయన నా ప్రియకుమారుడు ఈయనయందు నేనానందించుచున్నానని ఆకాశం నుండి శబ్దం వచ్చింది. ఇదే విషయాన్ని పరి లూకా కూడా ఈ క్రిందివిధంగా నిర్ధారించాడు. ప్రజలందరూ బాప్తిస్మము పొందినప్పుడు యేసు కూడా బాప్తిస్మము పొంది ప్రార్థన చేస్తున్నప్పుడు ఆకాశం తెరవబడి పరిశుద్ధాత్మ శరీరంతో పావురంలా ఆయన(యేసు) మీదకు ప్రవేశించిందని వాక్యం సెలవిస్తుంది. (లూకా 3: 21–22).

కావున శరీర నీళ్ళస్నానం, ఆత్మ పైనుండి వచ్చినదే ప్రక్షాళన. అటువంటి వారిదే పరలోకరాజ్యం అని గ్రహించుదురు గాక.

– కోట బిపిన్ చంద్రపాల్

● కథాశిల్పం

కామితార్థ ప్రదాయిని కామాక్షీదేవి



కంచి అనగానే మనకు కామాక్షిదేవి పేరే గుర్తుకు వస్తుంది. ఆ నగరాన్ని స్మరిస్తేనే మోక్షం లభిస్తుంది. అందరూ దర్శించే కామాక్షీదేవి ఆలయానికి వెనుకవైపు ఒక ఆలయం ఉంది. అదే ఆదికామాక్షీదేవి ఆలయం. ఈ ఆలయాన్ని కాళీకొట్టమ్ (కాళీ కోష్టమ్) అనే పేరుతో కూడా పిలుస్తారు. ఒకానొక సమయంలో పార్వతీదేవి ఇక్కడ కాళీరూపంలో వెలసిందట. నాటినుండీ ఆమెకు ఆ పేరు ప్రసిద్ధమైంది.

కంచి కామాక్షిదేవి ఆలయం కంటే ఇది ప్రాచీనమైనదని చెబుతారు. కామాక్షీదేవికి ముందు భాగంలో శక్తి లింగం ఒకటుంది. అమ్మవారి ముఖం లింగంపై ఉంటుంది. ఇది అర్ధనారీశ్వరలింగంగా పూజలందుకుంటోంది. కల్యాణం కాని వారు ఈ శక్తి లింగాన్ని పూజిస్తే తప్పక కల్యాణం జరుగుతుంది. ఈ ఆలయంలో ఆదిశంకరులు శ్రీచక్ర ప్రతిష్ఠ చేసి అమ్మవారి ఉగ్రత్వాన్ని శాంతింపచేశారట.

గర్భగుడిలో ఆదికామాక్షీదేవి పద్మాసనంలో కూర్చుని అభయముద్రను, పానపాత్రను, పాశాంకుశాలనూ నాలుగు చేతులతో ధరించి దర్శనమిస్తుంది. అమ్మవారి పీఠానికి కింది భాగంలో మూడు శిరస్సులు దర్శనమిస్తాయి. వాటి వెనుక ఒక పౌరాణిక గాథ ఉంది.

శిల్పకుశలురైన ధర్మపాలుడు, ఇంద్రసేనుడు, భద్రసేనుడు అనే ముగ్గురు కాంచీపురంలో తమ శిల్పాలను ప్రదర్శించడానికి వస్తారు. వారి శిల్పకళకు అచ్చెరువొందిన కంచిరాజు వారికి ఒక మాట ఇచ్చి తప్పుతాడు. దాంతో రాజుకు శిల్ప సోదరులకు యుద్ధం జరుగుతుంది. భీకరమైన ఈ యుద్ధాన్ని నివారించేందుకు కామాక్షీదేవి ప్రత్యక్షమై రాజుకు, ఆ శిల్పులకు సంధి చేస్తుంది. శిల్పులకు తన పాదసన్నిధిలో స్థానం కల్పించి అనుగ్రహిస్తుంది. ఈ కథ ధర్మపాలవిజయం పేరిట ప్రసిద్ధి పొందింది. సకలశుభాలనూ, సకల సిద్ధులనూ అనుగ్రహించే ఆదికామాక్షీదేవిని దర్శించి అభీష్టసిద్ధిని పొందండి.

– డాక్టర్ ఛాయా కామాక్షీదేవి

● ఇస్లాం వెలుగు

చరిత్ర పుటలపై చెరగని సంతకం

చేరమాన్ జుమా మస్జిద్



భారతదేశానికి నైరుతి మూలలో మలబార్ తీరాన కొలువైన రాష్ట్రం కేరళ – ప్రకృతి ఒడిలో ఊయలలూగే పచ్చని స్వర్గం. అరేబియా సముద్రం తీరాన్ని ముద్దాడుతుండగా, పశ్చిమ కనుమల వన్య సోయగాలు ఆకాశాన్ని తాకుతాయి. నదులు, జలపాతాలు, కొబ్బరి, రబ్బరు చెట్లు, తోటలు – ఇవన్నీ కలిసి కేరళను సౌందర్యం నిలయంగా మారుస్తాయి.

'కేర' అంటే కొబ్బరి చెట్టు, 'ఆళం' అంటే భూమి, ఈ రెండింటి కలయిక ద్వారా ఏర్పడిందే 'కేరళం' అంటారు కొందరు. అంటే కొబ్బరిచెట్ల భూమి అని అర్థం. అదే ఈ నేల స్వరూపం.

ఈ సుగంధ భూమిలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికి గాలిలోనూ చరిత్ర పరిమళం తాకుతుంది. ప్రకృతి సోయగం, వాణిజ్య సంపద, మతసామరస్య చరిత్ర – ఇవన్నీ కలిసిన ప్రదేశం మలబార్ తీరం. అక్కడే నిలిచి ఉంది భారతదేశపు తొలి మస్జిద్ – చేరమాన్ జుమా మస్జిద్, ఇస్లాం భారత భూమిని తొలిసారి తాకిన పవిత్ర చిహ్నం.


చరిత్ర పుటల్లో మలబార్ తీరం

అరేబియా సముద్ర తరంగాలు మలబార్ తీరాన్ని ముద్దాడుతున్న వేళ, కేరళ భూమి ఒక సజీవ చరిత్ర గ్రంథంలా కనిపిస్తుంది. నీలిరంగు సముద్రం, వెండి రంగులో మెరిసే ఇసుక తీరాలు, కొబ్బరి, రబ్బరు తోటలు, నదుల స్నేహపూర్వక సవ్వడులు.. ఇవన్నీ కలసి మలబారుకు ఒక అంతర్జాతీయ సౌందర్యాన్ని సమకూర్చి పెట్టాయి. ప్రాచీన యుగంలోనే ఈ తీరప్రాంతం ప్రపంచ వ్యాపార పటంలో వెలుగొందింది. రోమ్, యెమన్, ఈజిప్ట్, బాబిలోనియా, పర్షియా వంటి నాగరికతల నౌకలు ఇక్కడి తీరాలకు చేరేవి. కొడుంగల్లూరు, బేపూర్, మలప్పురం, పూకొట్టు వంటి ప్రాంతాలు ప్రధాన వాణిజ్య కేంద్రాలుగా ఉండేవి. ముఖ్యంగా మురిసిస్ (ముజిరిస్) – నేటి కొడుంగల్లూరు సమీపంలోని ప్రాచీన పోర్ట్ – అప్పట్లో దక్షిణ భారతదేశానికి ప్రధాన అంతర్జాతీయ నౌకాశ్రయం. గ్రీక్ , రోమన్ చరిత్రల్లో కూడా 'మురిసిస్ పోర్ట్' గురించి స్పష్టమైన ప్రస్తావనలు ఉన్నాయి. అక్కడినుండే ప్రపంచ దేశాలకు మిరియాలు, ఏలకులు, దాల్చిన చెక్క, గంధపు చెక్క, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, ముత్యాలు తరలి వెళ్ళేవి. అందుకే అరబ్బు వ్యాపారులు ఈ తీరాన్ని 'మలబార్' అని పిలిచారు – అంటే, సుగంధాలు పండే కొండల భూమి అని అర్థం. అయితే ఈ వ్యాపార మార్గాల ద్వారా కేవలం వస్తువులు మాత్రమే కాదు, ఆలోచనలు, మతాలు, సంస్కృతులు, భాషలు, కళలు కూడా ప్రయాణించాయి. వాటిలో భారతదేశ ఆధ్యాత్మిక చరిత్రను తిరగ రాసిన ఇస్లాం ధర్మం కూడా ఒకటి.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● ధర్మ సందేహం

అన్నదానం, వస్త్రదానం వంటివి చేసినవారు మోక్షం పొందుతారా? సకామంగా కాకుండా, నిష్కామంగా చేసినా మోక్షం రాదా?



దాన ధర్మాదికాలు చేయడం ఉత్తమ సంస్కారం? ఇవి పాపనాశనాన్ని చేస్తాయి?. అభీష్టసిద్ధినీ ఇస్తాయి. కానీ నేరుగా మోక్షాన్నీయలేవు. నిష్కామంగా దానకార్యాలు, ధర్మకర్మలు చేయడం వలన క్రమంగా పాపరహితులై, చిత్తశుద్ధిని పొందగలరు.

ఈ చిత్తశుద్ధి క్రమంగా శ్రద్ధనీ, భగవద్భక్తినీ, జ్ఞానాన్నీ కలిగించి ముక్తినిస్తుంది. ఈ జన్మలో చిత్తశుద్ధి, జ్ఞానం కలగని పక్షంలో... నిష్కామ కర్మాచరణ – తరువాత జన్మలో యోగంతో కూడిన పుట్టుక నిచ్చి, అప్పుడు జ్ఞానమార్గం వైపు మళ్ళిస్తుంది.

(బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి 'సమాధానమ్' నుంచి)

● బౌద్ధవాణి

పునరుత్తేజం కలిగించాలి



ఒక పని చేయడంలో ఒక వ్యక్తికి నిరాశ కలిగి ఆ పనిని మధ్యలో ఆపేస్తే... అతనికి మనం ఆ పనిని చేసి పెట్టడం కంటే, అతనిలోనే తిరిగి ఉత్తేజాన్ని కలిగించాలి. ఆ పని అతనితోనే పూర్తి చేయించాలి అంటాడు బుద్ధుడు. ఇలా నిరాశపడిన రమణీయుడు అనే భిక్షువు గురించి చెప్పిన ఉదంతం ఇది.

ఒక వ్యాపారి బండినిండా వడ్లబస్తాలు వేసుకుని బయలుదేరాడు. ఆ బండికి కట్టిన ఎడ్లు మంచి బలమైనవి. మార్గమధ్యంలో బురదనేల ఎదురైంది. బండి చక్రాలు బురదలో కూరుకుపోయాయి. ఎద్దులు బండిని లాగలేకపోయాయి. ''ఇక్కడికి దగ్గరలో వేరే ఎద్దులు ఉంటాయేమో చూద్దాం. వాటితో లాగిద్దాం'' అన్నాడు అతని పక్కనే ఉన్న మరో వ్యక్తి. ''లేదు. అలా చేస్తే ఇవి కాలక్రమంలో మందగించి పోతాయి. తమ శక్తిని తాము వినియోగించడమే మరచిపోతాయి. ఇవి ఉదయం నుండి బండి లాగడం వల్ల అలసిపోయాయి. వీటికి తగినంత విశ్రాంతినిద్దాం. మంచి దాణా పెడదాం. శరీరాల్ని మర్దన చేద్దాం. ఆ తర్వాత అవే బండిని లాగుతాయి''అన్నాడు వ్యాపారి. అలానే చేశారు. ఎద్దులను ఉత్సాహపరిచారు. ఈసారి అవలీలగా బండిని లాగాయి. తగిన విశ్రాంతి, తగిన ఆహారం అందిస్తే మనిషి ఉత్సాహంగా పని చేయగలడు. అదే పనిగా తోమితే విద్యార్థులైనా, పని చేసేవారైనా– ఆ పని పట్ల విరక్తి చెందుతారని తెలుసుకున్నా. గురువులైన భిక్షువులు తమ కింది చదువుకునే శ్రమణకులతో అదేపనిగా వల్లె వేయించడం మానారు. ఆ విధంగా చేయడం వల్ల రమణీయుడు తిరిగి శ్రద్ధతో జ్ఞానార్జన చేసి గొప్ప భిక్షువుగా రాణించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

● నిర్మల వాణి

మూడు గ్రంథులు

మన అస్తిత్వంలో ప్రధానంగా ఉన్న మూల పదార్థం ఏమిటి? మనం ఎలా జీవిస్తున్నాము? మన సూక్ష్మ వ్యవస్థ ఎలాంటిది? మన గమ్యం ఏమిటి? మనం సాధించాల్సిందేమిటి? ఇటువంటి ప్రశ్నలన్నీ మనలో ఉంటాయి. అప్పుడు వాటి సమాధానం గురించి వెతకటం ప్రారంభిస్తాం. ఈ అన్వేషణ మొదలుపెట్టక ముందు మనకున్న ప్రాముఖ్యతలన్నీ కూడా అసత్యమైనవి. ఎందుచేతనంటే మనకు సత్యమేమిటో తెలియదు కాబట్టి.

మీ ఆత్మ ఒక సంపూర్ణ బంధ రాహిత్యం. అది దేనివలన కూడ కలుషితం కావించబడటం లేదు. అది తనంతట తానే పూర్తిగ సంపూర్ణమైనది. అది ఆనందదాయకమైనది. అది సత్యము. వస్తు సంపద మన జీవితంలో అంతిమమైన విషయం కాదని, మరియు అది మనకు ఆనందం ఇవ్వదని మనం అర్థం చేసుకోవాలి.

ఈ ప్రపంచంలో ఎంత పేదరికం ఉంది! ఎన్ని ఈతి బాధలు ఉన్నాయి! ప్రజలు ఎన్ని బాధలతో ఉన్నారు! అలాంటప్పుడు భగవంతుడనేవాడు ఉంటే ఇవన్నీ ఎలా జరగనిస్తాడు? అసలు ప్రజలు ఇలా అసంతృప్తిగా, అసంతోషంగా ఎందుకని ఉన్నారు? అటువంటప్పుడు మీరెలా పరమాత్మ గురించి మాట్లాడగలరు?

శారీరిక పరంగా చూస్తే మన సూక్ష్మ శరీర వ్యవస్థలో ఇంచుమించు అన్ని చక్రాలకు, లేక శక్తి కేంద్రాలకు ఏదో ఒక గ్రంధి అనుసంధానించబడివుంది. వీటినే శాస్త్రీయంగా ఎండోక్రిన్ గ్లాండ్స్ అంటారు. ఇవన్నీ మన సమతుల్య జీవనానికి ఎంతో మేలు చేసేవే. ఉదాహరణకు మూలాధార



చక్రం ప్రోస్టేట్ గ్రంధిని నియంత్రిస్తుంది. ఆజ్ఞాచక్రం పిట్యుటరీ, పీనియల్ గ్రంధులను నియంత్రిస్తుంది. ఇక బ్రహ్మ గ్రంధి, విష్ణు గ్రంధి, రుద్ర గ్రంధి, ఇవి ఏ ఏ నాడులకు అనుసంధానం చేయబడ్డాయి,అవి వేటిని నియంత్రిస్తున్నాయి అనేది తెలుసుకుందాం.



ఇందులో మొదటిది బ్రహ్మ గ్రంధి

ఈ గ్రంధి ఇడా నాడికి అనుసంధానింపబడి వుంటుంది. ఈ నాడి లక్షణం తమో గుణం. మరణించినది ప్రతిదీ గతించినది. అది గతించిన పదార్థం కావచ్చు, లేక ఆలోచన కావచ్చు (గతం గతః). గతాన్ని పట్టుకుని వేళ్ళాడటం వలన ఏమీ ప్రయోజనం లేదు.

ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత మీ చిత్తాన్ని మీ ఆత్మపై ఉంచినట్లయితే మీలోని పాత అలవాట్లన్నీ నెమ్మది నెమ్మదిగా వాటంతట అవే తొలగిపోతాయి.

మీ చిత్తం మీ ఆత్మ వైపు మరలినప్పుడు మీలోని ఆధ్యాత్మిక ఉన్నతి ద్వారా మీరు పొందగలిగేది బంధ రాహిత్యం. ఆ సామ్రాజ్యంలో మీరు సర్వవ్యాపకశక్తిని ఆస్వాదిస్తారు. మీ బంధ రాహిత్యం తనంతట తానే పని చేస్తుంది.

ఆత్మ వ్యక్తీకరించబడటం అంటే మీలోని చిత్తం పూర్తిగా ఆత్మతో ఒకటిగా అవడం. అలా చిత్తం, ఆత్మ ఒకటిగా మారినప్పుడు చైతన్యతరంగాలు వ్యక్తీకరింపబడతాయి. మీ అరచేతులలో చల్లని వాయు తరంగాల అనుభూతి ఆరంభం అవుతుంది. అందుచేత ఆదిశంకరాచార్యులు గతానికి సంబంధించిన చిక్కు సమస్యలను 'బ్రహ్మ గ్రంధి' అని పిలిచారు. ఎందుకని బ్రహ్మగ్రంధి అని అన్నారంటే బ్రహ్మ అనగా చైతన్య శక్తి. ఆ బ్రహ్మ 'ఓం'. అనగా చైతన్యశక్తి.

– డాక్టర్ పి. రాకేష్

(పరమ పూజ్య శ్రీ మాతాజీ ప్రవచనాల ఆధారంగా)

జీసీసీల్లో హైరింగ్ జోరు

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 7 శాతం అప్
- ఏఐ, క్లౌడ్ నిపుణులకు డిమాండ్
- క్వెస్ కార్ప్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) నియామకాలు గణనీయంగా పెరుగుతున్నాయి. సీక్వెన్షియల్‌గా జూన్ త్రైమాసికంతో పోలిస్తే సెప్టెంబర్ క్వార్టర్‌లో హైరింగ్ 5–7 శాతం పెరగడం దీనికి నిదర్శనం. ఏఐ–డేటా, ప్లాట్‌ఫాం ఇంజినీరింగ్, క్లౌడ్, ఫిన్‌ఆప్స్, సైబర్‌సెక్యూరిటీ నిపుణులకు డిమాండ్ నెలకొంది. క్వెస్ కార్ప్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), తయారీ, ఆటోమోటివ్, ఎనర్జీ, టెక్నాలజీ, హార్డ్‌వేర్ మొదలైన రంగాలు జీసీసీల వృద్ధికి కీలకంగా ఉంటున్నాయి. భారత్‌లో జీసీసీల పరిణామక్రమం ప్రస్తుతం అత్యంత వ్యూహాత్మక దశలోకి ప్రవేశిస్తోందని క్వెస్ కార్ప్ సీఈవో (ఐటీ స్టాఫింగ్) కపిల్ జోషి తెలిపారు. నియామకాలకు కేటాయించే బడ్జెట్లు ప్రధానంగా ఆదాయార్జన, సవాళ్లను దీటుగా ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టే విధంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో సుమారు 1,850 జీసీసీలు కార్యకలాపాలు సాగిస్తుండగా, 20 లక్షల మంది పైగా ప్రొఫెషనల్స్ ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 25 లక్షలకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి.

నివేదికలో మరిన్ని విశేషాలు ..

- ఏఐ, డేటా సైన్స్ ఉద్యోగాలకు సంబంధించి నియామకాలు ఎనిమిది శాతం పెరగ్గా, ఫిన్‌ఆప్స్ ఆధారిత క్లౌడ్ సేవల విభాగంలో హైరింగ్ 6 శాతం పెరిగింది.
- హైదరాబాద్, బెంగళూరులాంటి ప్రథమ శ్రేణి మెట్రో నగరాలు ఏఐ, క్లౌడ్ ఉద్యోగాలకు కీలకంగా నిలుస్తున్నాయి. ఇక కోయంబత్తూరు, కొచ్చి, అహ్మదాబాద్‌లాంటి ద్వితీయ శ్రేణి హబ్‌లలో త్రైమాసికాలవారీగా నియామకాలు 8–9 శాతం పెరిగాయి. తక్కువ వ్యయాలతో సర్వీసులను అందించేందుకు తోడ్పడే కేంద్రాలుగా ఇలాంటి నగరాలు ఎదుగుతున్నాయి.
- ఏఐ–డేటాలో అత్యధికంగా 41 శాతం స్థాయిలో నిపుణుల కొరత ఉంది. ప్లాట్‌ఫాం ఇంజినీరింగ్ (39 శాతం), క్లౌడ్–ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (25 శాతం), సైబర్‌సెక్యూరిటీ (18 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. దీనితో, హైరింగ్ ప్రక్రియలో, ముఖ్యంగా ప్రథమ శ్రేణి నగరాల వెలుపల, మిడ్–సీనియర్ హోదాల్లో నియామకాల్లో జాప్యం జరుగుతోంది.
- జూలై–సెప్టెంబర్ వ్యవధిలో జీసీసీల్లో నియామకాలకు సంబంధించి దక్షిణాది మెట్రో నగరాలు ముందు వరుసలో ఉన్నాయి. 26 శాతం వాటాతో బెంగళూరు అగ్రస్థానంలో నిల్చింది. తర్వాత స్థానాల్లో హైదరాబాద్ (22 శాతం), పుణె (15 శాతం), చెన్నై (12 శాతం) ఉన్నాయి.
- బెంగళూరులో ఎక్కువగా అడ్వాన్స్‌డ్ ఏఐ, ఫిన్‌ఆప్స్ ఉద్యోగాలకు, హైదరాబాద్‌లో మల్టీ–క్లౌడ్ ఇంటిగ్రేషన్ సంబంధ కొలువులకు డిమాండ్ నెలకొంది. పుణె, చెన్నైలో ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ప్లాట్‌ఫాం ఇంటిగ్రేషన్ మొదలైన విభాగాల్లో నిపుణులకు డిమాండ్ ఉంది.

గ్లోబల్ అగ్జిలరేట్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

వ్యవసాయ ఆవిష్కర్తలకు అంతర్జాతీయ అనుసంధానత

న్యూఢిల్లీ: దేశీ వ్యవసాయ ఆవిష్కర్తలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించే లక్ష్యంతో సీమాంతర అగ్రి ప్లాట్‌ఫామ్ 'గ్లోబల్ అగ్జిలరేట్' ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ ఆవిష్కరణల్లో భారత్‌ను కీలక స్థానంలో నిలబెట్టే ఉద్దేశ్యంతో దీన్ని తీసుకొచ్చారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్స్ రిలేషన్స్ (ఐసీఆర్ఐఈఆర్), ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ సహకారంతో అగ్‌వయ, బయోఎస్‌టీఎల్ సంస్థలు ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశాయి.



యూఎస్, బ్రెజిల్, యూకే, నెదర్లాండ్స్, ఇజ్రాయెల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియాలోని స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లు, పెట్టుబడిదారులతో ఈ ప్లాట్‌ఫామ్‌ను అనుసంధానించనున్నారు. ''ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ ఆవిష్కరణలు చోటుచేసుకుంటున్నాయి. కానీ, వాణిజ్య అవకాశాలు, విస్తరణ అన్నది పరిమితంగా ఉండిపోయాయి''అని బయోఎస్‌టీఎల్ సీఈవో డాన్ రుబిన్ పేర్కొన్నారు. అగ్జిలరేట్ ద్వారా భారత వ్యవసాయ ఎకోసిస్టమ్‌ను బయోఎస్‌టీఎల్‌తో అనుసంధానించడం ద్వారా ఆవిష్కర్తలు, ఇన్వెస్టర్లు, రైతుల మధ్యనున్న అంతరాన్ని భర్తీ చేయనున్నట్టు చెప్పారు.

బిజినెస్ రీల్

ఎయిర్‌టెల్, ఐబీఎం జట్టు

ఎయిర్‌టెల్ క్లౌడ్ కోసం రెండు మల్టీజోన్ రీజియన్ల ఏర్పాటు



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్, అమెరికన్ ఐటీ దిగ్గజం ఐబీఎం చేతులు కలిపాయి. ముంబై, చెన్నైలో ఎయిర్‌టెల్ క్లౌడ్ కోసం రెండు మల్టీజోన్ రీజియన్లను (ఎంజీఆర్) నెలకొల్పేందుకు వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. క్లౌడ్ సర్వీసుల కోసం పెద్ద సంఖ్యలో డేటా సెంటర్లను ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని ఎంజీఆర్‌గా వ్యవహరిస్తారు. దేశీయంగా ఎయిర్‌టెల్ క్లౌడ్ లభించే జోన్ల సంఖ్యను ప్రస్తుత నాలుగు నుంచి పదికి పెంచుకోనున్నట్లు భారతి ఎయిర్‌టెల్ వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ తెలిపారు. ఐబీఎం క్లౌడ్ సొల్యూషన్స్‌ను ఎయిర్‌టెల్ క్లౌడ్ కస్టమర్లు పోర్ట్‌ఫోలియో యాజ్ ఏ సర్వీస్ కింద ఉపయోగించుకునేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుంది. ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు టెక్నాలజీ విషయంలో స్వతంత్రతను కోరుకుంటున్న నేపథ్యంలో తమ సంస్థకు వ్యాపార అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని ఐబీఎం ఆసియా పసిఫిక్ జనరల్ మేనేజర్ హాన్స్ డెకర్స్ తెలిపారు.

హైదరాబాద్‌లో 'టై' ఎంట్రప్రెన్యూర్‌షిప్ సదస్సు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సదస్సు (హెచ్ఈఎస్ 2025)ని నిర్వహిస్తున్నట్లు ది ఇండస్ ఎంట్రప్రెన్యూర్స్ (టై) హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజేశ్ పగడాల తెలిపారు. అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో నిర్వహించే ఈ సదస్సులో 20 పైగా అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఏఐ–డీప్ టెక్, తయారీ–ఇంజినీరింగ్, లైఫ్ సైన్సెస్, హెల్త్‌టెక్ మొదలైనవి వీటిలో ఉంటాయని రాజేశ్ పేర్కొన్నారు. 100 మంది పైగా వక్తలు, 1,500 మంది పైచిలుకు ఇన్వెస్టర్లు, పరిశ్రమ దిగ్గజాలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఇందులో పాల్గొనున్నట్లు వివరించారు. ఇన్వెస్టర్లు, ఇన్నోవేటర్లు, కార్పొరేట్ల వ్యవస్థకు సంబంధించి 80 స్టాల్స్‌తో స్టార్టప్ ఎక్స్‌పో ఉంటుంది. అలాగే, కొత్త ఆవిష్కరణలపై కృషి చేసిన వారికి ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు రాజేశ్ వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

16-10-2025

విశాఖ	535–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	1,060.65	4.07
NESTLEIND	1,222.30	3.98
BAJAJFINSV	2,082.90	3.14
TRENT	4,739.00	2.64
ASIANPAINT	2,377.00	2.54

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,474.40	-1.04
BAJAJ-AUTO	9,015.00	-0.96
TATAMOTORS	391.9	-0.9
TECHM	1,455.00	-0.89
TATACONSUM	1,112.20	-0.6

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,699
ఎన్ఎస్ఈ	1,00,716
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,50,537
ఎఫ్ఐఐ	+ 68
డీఐఐ	+ 4,650

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	58.37 (రాత్రి 11.30కు)	\$ 58.07 (క్రితం ముగింపు)
బ్రెంట్	61.99 (రాత్రి 11.30కు)	\$ 62.39 (క్రితం ముగింపు)

లింక్డిన్ ఇండియా స్టార్టప్స్‌లో టాప్ 'జెప్టో'

ఏడో ర్యాంకులో హైదరాబాద్ అంకుర సంస్థ భాంజు



న్యూఢిల్లీ: లింక్డిన్ టాప్ స్టార్టప్స్ ఇండియా 2025 జాబితాలో క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాం జెప్టో అగ్రస్థానంలో నిల్చింది. జెప్టో నంబర్ వన్ స్థానంలో నిలవడం వరుసగా ఇది మూడో ఏడాది. తర్వాత స్థానంలో ఎంటర్‌ప్రైజ్ స్టోరేజ్ సంస్థ లూసిడిటీ, 10 మినిట్స్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం స్విష్ మూడో స్థానంలో నిల్చాయి. హైదరాబాదీ స్టార్టప్ సంస్థ భాంజూ ఏడో ర్యాంకు దక్కించుకుంది. ఉద్యోగుల వృద్ధి, ఉద్యోగంపై ఆసక్తి, ప్రతిభావంతులను ఆకర్షించగలిగే సామర్థ్యం తదితర అంశాల ప్రాతిపదికన లింక్డిన్ ఈ జాబితాను రూపొందించింది. ప్రారంభించి అయిదేళ్లు మించకుండా, భారత్‌లో ప్రధాన కార్యాలయం, కనీసం 30 మంది ఉద్యోగులు కలిగి ఉండి, ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉన్న సంస్థలను దీని కోసం పరిగణనలోకి తీసుకున్నారు. 2024 జూలై 2 నుంచి 2025 జూన్ 30 వరకు డేటా ఆధారంగా ర్యాంకులు ఇచ్చారు. వివిధ కేటగిరీలలో కార్యకలాపాలు సాగిస్తున్న టాప్ మూడు సంస్థలు వేగంగా వృద్ధి చెందుతూ, కొత్త మార్కెట్లలోకి విస్తరిస్తున్నాయని లింక్డిన్ తెలిపింది. దేశీయంగా స్టార్టప్ వ్యవస్థకు క్విక్ కామర్స్, ఏఐ–నేటివ్ ప్లాట్‌ఫాంలు, స్పెషలైజ్డ్ ఫిన్‌టెక్ సంస్థలు కీలక చోదకాలుగా నిలుస్తున్న తీరు జాబితాతో వెల్లడైంది.

లిస్టు ప్రకారం...

- పీక్‌డే (4వ ర్యాంకు), కాన్విన్ (6), లైమ్‌చాట్ (19) తదితర ఏఐ స్టార్టప్‌లు, జార్ (5వ స్థానం), కార్డ్91 (18), డెజర్వ్ (16) ఫిన్‌టెక్ సంస్థలు టాప్ 20 జాబితాలో నిల్చాయి.
- టాప్ 20లో తొమ్మిది స్టార్టప్‌లకు కేంద్రంగా నిలుస్తూ అంకురాల రాజధానిగా బెంగళూరు అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. జెప్టో, స్విష్, లూసిడిటిలాంటి సంస్థలు నగరం నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాయి.
- ఢిల్లీ, ముంబై నుంచి రెండు చొప్పున లిస్టులో చోటు దక్కించుకున్నాయి. పుణెకి చెందిన ఈమోటోర్యాడ్ 9వ ర్యాంకులో నిల్చింది.

ఎంజీ నుంచి విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్

ధర రూ. 9.99 లక్షల నుంచి ప్రారంభం

హైదరాబాద్: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్స్ ఇండియా తాజాగా విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్ కార్లను ప్రవేశపెట్టింది. లిమిటెడ్ ఎడిషన్ కింద 300 యూనిట్లను మాత్రమే కంపెనీ విక్రయిస్తున్నట్లు సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వినయ్ రైనా తెలిపారు. హైదరాబాద్‌లోని పీపీఎస్ మోటార్స్‌లో తొలి కారును కస్టమరుకు అందజేశారు. దీని రేటు రూ. 9.99 లక్షల నుంచి (బ్యాటరీ యాజ్ ఎ సర్వీస్ కింద కి.మీ.కి రూ. 3.9 ధర) ప్రారంభమవుతుంది. ఏడాది కన్నా తక్కువ వ్యవధిలోనే విండ్సర్ ఎలక్ట్రిక్ వాహనాలు 40 వేల అమ్మకాల మైలురాయి సాధించిన సందర్భంగా కంపెనీ దీన్ని ప్రవేశపెట్టింది.



యువతకు ఉద్యోగ నైపుణ్యాల్లో శిక్షణ

ఫ్లిప్‌కార్ట్ ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యువతకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు ఫ్లిప్‌కార్ట్ ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ జట్టు కట్టాయి. హైదరాబాద్, బెంగళూరులోని యువతకు ఉద్యోగ నైపుణ్యాల శిక్షణనివ్వడంతో పాటు అవకాశాలను కూడా దక్కించుకోవడంలో తోడ్పాటు అందించనున్నాయి. ఈ ప్రోగ్రాం కింద 540 మందికి ట్రైనింగ్ కల్పించనుండగా, వీరిలో కనీసం 70 శాతం మంది మహిళలు ఉంటారు. సుమారు 380 మంది ట్రైనీలకు బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) రంగంలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా. ఇందులో పాల్గొన్న వారి కుటుంబాలతో పాటు సుమారు 2,700 మందికి ఈ ప్రోగ్రాం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం చేకూరనుంది. బీఎఫ్ఎస్ఐ కంటెంట్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లీష్‌లో మాట్లాడటం మొదలైన అంశాల్లో శిక్షణనిస్తారు.



నెల రోజులు 4జీ సేవలు ఉచితం..

కొత్త కస్టమర్లకు బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక ఆఫర్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్ కొత్త కస్టమర్లను ఆకర్షించేందుకు నెల రోజుల పాటు దివాలీ బొనాంజా ప్లాన్ పేరిట ఉచిత 4జీ సర్వీసుల ఆఫర్ ప్రకటించింది. ఇందుకోసం నామమాత్రంగా రూ. 1 మాత్రమే చార్జీ ఉంటుంది. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు నెల రోజులపాటు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. దీని కింద బీఎస్ఎన్ఎల్ కొత్త కస్టమర్లకు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, ఉచిత సిమ్ లభిస్తాయి. తమ సర్వీసుల నాణ్యత, కవరేజీని కస్టమర్లు స్వయంగా పరీక్షించి, తెలుసుకునేందుకు ఇది తోడ్పడుతుందని బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఎ. రాబర్ట్ జె రవి తెలిపారు. ఆగస్టులో కూడా బీఎస్ఎన్ఎల్ ఇదే తరహా ఆఫర్‌ను ప్రకటించింది.

క్యూ2 ఫలితాలు

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 1:1 బోనస్

క్యూ2 నికర లాభం రూ. 718 కోట్లు



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) బోర్డు వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయనుంది. ఇందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో వాటాదారుల వద్దగల ప్రతీ షేరుకీ మరో షేరుని ఉచితంగా జారీ చేయనుంది. ఇందుకు నవంబర్ 26 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికం(జూలై–సెప్టెంబర్)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం ఎగసి రూ. 718 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 577 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 6 శాతం పుంజుకుని రూ. 1,124 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 1,058 కోట్ల టర్నోవర్ అందుకుంది. కంపెనీ నిర్వహణలోని సగటు ఆస్తులు(ఏఏయూఎం) రూ. 7.58 లక్షల కోట్ల నుంచి రూ. 8.81 లక్షల కోట్లకు బలపడ్డాయి.

బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ షేరు 3 శాతం లాభపడి రూ. 5,757 వద్ద ముగిసింది.

లాభాల్లోకి నువొకో విస్టాస్

క్యూ2లో రూ. 36 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నువొకో విస్టాస్ కార్ప్ టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో రూ. 36 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 85 కోట్లకుపైగా నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం 8 శాతంపైగా బలపడి రూ. 2,458 కోట్లకు చేరింది. గతేడాది క్యూ2లో రూ. 2,269 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు రూ. 2,410 కోట్లుగా నమోదయ్యాయి. ఈ కాలంలో కన్సాలిడేటెడ్ సిమెంట్ విక్రయాలు 4.3 మిలియన్ మెట్రిక్ టన్నులు(ఎంఎంటీ)కు చేరాయి. ఆదాయంలో సిమెంట్ వాటా 8 శాతం ఎగసి రూ. 2,218 కోట్లను తాకింది. రెడీ మిక్స్ కాంక్రీట్ నుంచి 9 శాతం అధికంగా రూ. 258 కోట్లు లభించింది. 2027కల్లా సిమెంట్ సామర్థ్యాన్ని వార్షికంగా 35 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ)కు చేర్చుకునే బాటలో కంపెనీ సాగుతోంది.

బీఎస్ఈలో కంపెనీ షేరు 5.5 శాతం క్షీణించి రూ. 404 వద్ద ముగిసింది.

టాటా కామ్ లాభం క్షీణత

క్యూ2లో రూ. 183 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో టాటా కమ్యూనికేషన్స్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 27 శాతం క్షీణించి రూ. 183 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 251 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 6 శాతంపైగా బలపడి రూ. 6,100 కోట్లకు చేరింది. గతేడాది క్యూ2లో రూ. 5,728 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఆదాయంలో డేటా విభాగం వాటా 7 శాతం ఎగసి రూ. 5,179 కోట్లకు చేరింది. గత క్యూ2లో ఇది రూ. 4,826 కోట్లుగా నమోదైంది. వాయిస్ సొల్యూషన్ల ఆదాయం దాదాపు 5% నీరసించి రూ. 406 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 425 కోట్ల ఆదాయం సాధించింది.

ఎన్ఎస్ఈలో టాటా కమ్యూనికేషన్స్ షేరు 3.5 శాతం జంప్‌చేసి రూ. 1,938 వద్ద ముగిసింది.

ఆల్గోరిథమ్ ఆధారిత నిర్ణయాలతో రిస్క్

- వాటిపై సరైన నియంత్రణ అవసరం
- ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్



న్యూఢిల్లీ: ఆల్గోరిథమ్ ఆధారితంగా (సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్) నిర్ణయాలు తీసుకోవడం, సేవలు కొన్ని వేదికలపైనే కేంద్రీకృతం కావడాన్ని సరిగ్గా నియంత్రించకపోతే.. ఇవి సంప్రదాయ రిస్కులు కానందున మొత్తం ఆర్థిక వ్యవస్థపైనే ప్రభావం పడుతుందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జే అభిప్రాయపడ్డారు. డిజిటల్ ఆవిష్కరణలు అన్నవి నేడు కేవలం చెల్లింపులకే పరిమితం కావడం లేదన్నారు. డిజిటల్ వేదికలపై సూక్ష్మ బీమా, పింఛను ఉత్పత్తుల పంపిణీ వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ తరహా డిజిటల్ ఆవిష్కరణలు తక్కువ ఆదాయ వర్గాలకు సాయపడుతున్నట్టు చెప్పారు. యూపీఐని ఇతర దేశాలకూ విస్తరించడం వల్ల సీమాంతర చెల్లింపులు వేగాన్ని సంతరించుకున్నట్టు పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా అభివృద్ధి చెందగల వాతావరణాన్ని.. సురక్షితమైన, సుస్థిరమైన, కస్టమర్ కేంద్రంగా ఉండే కొత్త ఆవిష్కరణలు, పరిష్కారాల అభివృద్ధిని ఆర్‌బీఐ ప్రోత్సహిస్తుందని చెప్పారు. ''పాలన, రిస్క్ నిర్వహణ, కస్టమర్ రక్షణకు ప్రాధాన్యం ఇస్తాం. సాంకేతిక పరమైన పురోగతి అన్నది ఆర్థిక వ్యవస్థ విశ్వసనీయతతో సరిపోలాలి''అని స్వామినాథన్ పేర్కొన్నారు. ఫిన్‌టెక్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వేగంగా వృద్ధి చెందుతుండడంతో ఆర్థిక వ్యవస్థ సరిహద్దులు విస్తరిస్తున్నాయంటూ, ఇది సరికొత్త రిస్కులను తెచ్చిపెడుతున్నట్టు చెప్పారు. వీటిని సరిగ్గా చెక్ పెట్టకపోతే అప్పుడు విడిగా సంస్థల నుంచి మొత్తం ఆర్థిక వ్యవస్థకు రిస్కులు విస్తరిస్తాయని అభిప్రాయపడ్డారు. దేశంలో బలమైన డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు ఆర్థిక సేవల విస్తృతికి మద్దతుగా నిలుస్తున్నట్టు చెప్పారు.

రాణించిన ఎగుమతులు

- సెప్టెంబర్‌లో 7 శాతం వృద్ధి
- 3.20 లక్షల కోట్లుగా నమోదు
- రూ.2.74 లక్షల కోట్లకు వాణిజ్యలోటు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితుల్లోనూ దేశ ఎగుమతుల రంగం పనిష్ట పనితీరు చూపించింది. సెప్టెంబర్‌లో ఎగుమతులు బలంగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 6.74 శాతం అధికంగా 36.38 బిలియన్ డాలర్ల (3.20 లక్షల కోట్లు) విలువ మేర ఎగుమతులు జరిగాయి. దిగుమతులు సైతం 16.6 శాతం పెరిగి 68.53 బిలియన్ డాలర్లు(రూ.6.03 లక్షల కోట్లు)గా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు సెప్టెంబర్ నెలకు మరింత విస్తరించి 31.15 బిలియన్ డాలర్లు(రూ.2.74 లక్షల కోట్లు)గా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో దిగుమతులు 58.74 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. కేంద్ర వాణిజ్య శాఖ ఈ వివరాలను విడుదల చేసింది. ప్రధానంగా బంగారం, వెండి, ఎరువుల దిగుమతులు పెరిగిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు) ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 3 శాతం పెరిగి 220 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే కాలంలో దిగుమతులు 4.53 శాతం పెరిగి 375.11 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వాణిజ్య లోటు 155 బిలియన్ డాలర్లకు విస్తరించింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న తరుణంలోనూ భారత వస్తు, సేవల ఎగుమతులు మంచి పనితీరు చూపించినట్టు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు. మెరుగైన పనితీరుకు కారణం ఏంటన్న మీడియా ప్రశ్నకు దేశీ పరిశ్రమ బలంగా ఉందంటూ.. తమ సరఫరా వ్యవస్థలను, వ్యాపార సంబంధాలను మెరుగ్గా కొనసాగించినట్టు చెప్పారు. అమెరికా 50 శాతం టారిఫ్‌ల ప్రభావంపై ఎదురైన ప్రశ్నకు స్పందిస్తూ.. దీన్ని తెలుసుకునేందుకు కమోడిటీ వారీగా డేటాను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అమెరికాకు మొత్తం ఎగుమతుల్లో 45 శాతానికి టారిఫ్‌ల నుంచి మినహాయింపు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు.

ఇషాన్ కిషన్ అజేయ సెంచరీ

జార్ఖండ్ 307/6 ● తమిళనాడుతో మ్యాచ్ ● రంజీ ట్రోఫీ టోర్నీ ప్రారంభం



ఇషాన్ కిషన్

కోయంబత్తూర్: టీమిండియా ప్లేయర్ ఇషాన్ కిషన్ (183 బంతుల్లో 125 బ్యాటింగ్; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. ఫలితంగా తమిళనాడుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం ప్రారంభమైన పోరులో టాస్ గెలిచి ముదట బ్యాటింగ్‌కు దిగిన ఇషాన్ కిషన్ సారథ్యంలోని జార్ఖండ్ జట్టు... తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. గత సీజన్‌లో దేశవాళీ మ్యాచ్‌లు ఆడకుండా బీసీసీఐ ఆగ్రహానికి గురైన ఈ యువ ఆటగాడు... ఈసారి మెరుగైన ప్రదర్శనతో సీజన్‌ను ఆరంభించాడు. ఇషాన్ అజేయ శతకంతో ఆకట్టుకోగా... సాహిల్ రాజ్ (105 బంతుల్లో 64 బ్యాటింగ్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో కెప్టెన్‌కు అండగా నిలిచాడు. శరణ్‌దీప్ సింగ్ (102 బంతుల్లో 48; 6 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. మిగిలిన వాళ్లు విఫలమవడంతో ఒక దశలో జార్ఖండ్ జట్టు 157 పరుగులకు 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సాహిల్‌తో కలిసి ఇషాన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. తమిళనాడు బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఈ జోడీ... క్రీజులో కుదురుకున్న తర్వాత చక్కటి షాట్‌లతో ఆకట్టుకుంది. ఈ జంట అబేధ్యమైన ఏడో వికెట్‌కు 150 పరుగులు జోడించడంతో జార్ఖండ్ కోలుకుంది. తమిళనాడు బౌలర్లలో గుర్‌జప్‌నీత్ సింగ్ 3 వికెట్లు పడగొట్టగా... చంద్రశేఖర్ 2 వికెట్లు తీశాడు.

అమన్ భారీ సెంచరీ

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ విదర్భ జట్టు మెరుగైన ప్రదర్శన చేస్తోంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా బెంగళూరు వేదికగా నాగాలాండ్‌తో ప్రారంభమైన ఈ పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన విదర్భ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 3 వికెట్లకు 302 పరుగులు చేసింది. అమన్ మోఖడే (261 బంతుల్లో 148 బ్యాటింగ్; 16 ఫోర్లు) భారీ సెంచరీతో కదంతొక్కగా... ధ్రువ్ షోరే (92 బంతుల్లో 64; 8 ఫోర్లు), యశ్ రాథోడ్ (104 బంతుల్లో 66 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీలతో రాణించారు. ఇటీవల ఇరానీ కప్ కైవసం చేసుకున్న విదర్భ జట్టు... అదే జోరు ఇక్కడా కొనసాగించింది. నాగాలాండ్ బౌలర్ల అనుభవ రాహిత్యాన్ని సొమ్ము చేసుకున్న విదర్భ బ్యాటర్లు ఆడుతూ పాడుతూ పరుగులు రాబట్టారు. సౌరవ్ కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు.

షమీకి 3 వికెట్లు

టీమిండియా పేసర్ మొహమ్మద్ షమీ రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో 3 వికెట్లతో మెరిశాడు. చాంపియన్స్ ట్రోఫీ అనంతరం భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న ఈ సీనియర్ పేసర్... ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో బెంగాల్ తరఫున ఆకట్టుకున్నాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 72.5 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. భుపెన్ లాల్వాని (128 బంతుల్లో 71; 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... బెంగాల్ బౌలర్లలో షమీ 37 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఇషాన్ పోరెల్ 3, సూరజ్ సింధు జైస్వాల్ 4 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన బెంగాల్ బుధవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 8 పరుగులు చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (0) అవుటయ్యాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న బెంగాల్ జట్టు... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 205 పరుగులు వెనుకబడి ఉంది.



షమీ

పడిక్కల్ సెంచరీ మిస్

రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి'లో భాగంగా రాజ్‌కోట్‌లో సౌరాష్ట్రతో జరుగుతున్న మ్యాచ్‌లో కర్ణాటక మిడిలార్డర్ ఆకట్టుకుంది. ఫలితంగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్ (141 బంతుల్లో 96; 11 ఫోర్లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... కరుణ్ నాయర్ (126 బంతుల్లో 73; 9 ఫోర్లు), రవిచంద్రన్ స్మరణ్ (120 బంతుల్లో 66 బ్యాటింగ్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (2), నికిన్ జోస్ (12), కృష్ణన్ శ్రీజిత్ (5) విఫలమయ్యారు. గత సీజన్‌లో విదర్భ జట్టు రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన కరుణ్ నాయర్... ఈ సీజన్‌లో సొంత జట్టు కర్ణాటక తరఫున తొలి మ్యాచ్‌లో హాఫ్‌సెంచరీతో ఆకట్టుకున్నాడు. స్మరణ్‌తో పాటు శ్రేయస్ గోపాల్ (38 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నాడు. సౌరాష్ట్ర బౌలర్లలో ధర్మేంద్రసింగ్ జడేజా 4 వికెట్లు పడగొట్టాడు.

ముంబై 336/5

42 సార్లు రంజీ ట్రోఫీ దక్కించుకున్న ముంబై జట్టు... ఈ సీజన్ తొలి పోరులో శుభారంభం చేసింది. శ్రీనగర్ వేదికగా జమ్ముకశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 336 పరుగులు చేసింది. సిద్ధేశ్ లాడ్ (156 బంతుల్లో 116; 17 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో సత్తాచాటగా... షమ్స్ ములానీ (125 బంతుల్లో 79 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీ బాదాడు. టీమిండియా ప్లేయర్లు అజింక్యా రహానే (27), సర్ఫరాజ్ ఖాన్ (42) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు.

- బిహార్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తొలి మ్యాచ్‌లో ఆకట్టుకోలేకపోయాడు. అరుణాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో వైభవ్ 5 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో 14 పరుగులే చేసి వెనుదిరిగాడు.
- ఈ సీజన్‌లో ముంబై నుంచి మహారాష్ట్ర జట్టుకు మారిన టీమిండియా ప్లేయర్ పృథ్వీ షా (0) తొలి మ్యాచ్‌లో డకౌటయ్యాడు. కేరళతో పోరులో పృథ్వీతో పాటు అర్షిన్ కులకర్ణి (0), సిద్ధేశ్ వీర్ (0) కూడా విఫలమవడంతో... మహారాష్ట్ర జట్టు స్కోరు బోర్డుపై పరుగుల ఖాతా తెరవకముందే 3 వికెట్లు కోల్పోయింది.



కుల్దీప్ యాదవ్

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో కుల్దీప్ యాదవ్

దుబాయ్: వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌లో తన బౌలింగ్‌తో ఆకట్టుకున్న టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరాడు. న్యూఢిల్లీ వేదికగా విండీస్‌తో జరిగిన రెండో టెస్టులో 8 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న లెఫ్టార్మ్ స్పిన్నర్ కుల్దీప్ (683 పాయింట్లు) 7 స్థానాలు ఎగబాకి 14వ ర్యాంక్‌కు చేరాడు. టీమిండియా స్టార్ పేసర్ బుమ్రా (882 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... హైదరాబాదీ పేసర్ సిరాజ్ (726 పాయింట్లు) 12వ 'ప్లేస్'లో ఉన్నాడు. బ్యాటింగ్‌లో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ (753 పాయింట్లు) రెండు స్థానాలు మెరుగు పరుచుకొని భారత్ తరఫున అత్యుత్తమంగా ఐదో ర్యాంక్ కు చేరుకున్నాడు. పంత్ (753 పాయింట్లు) 8వ స్థానంలో ఉన్నాడు. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అఫ్గానిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తిరిగి అగ్రస్థానానికి చేరాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో 11 వికెట్లతో సత్తా చాటిన రషీద్ ఖాన్ ఐదు స్థానాలు ఎగబాకి 710 పాయింట్లతో 'టాప్' ర్యాంక్ అందుకున్నాడు. టీమిండియా కెప్టెన్ గిల్ (784 పాయింట్లు) 'టాప్'లోనే ఉన్నాడు.




రోహిత్

భారత్‌కు తొలి ఓటమి

జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఆస్ట్రేలియా జట్టుతో బుధవారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో రోహిత్ సారథ్యంలోని భారత జట్టు 2-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. టీమిండియా తరఫున కెప్టెన్ రోహిత్ (22వ నిమిషంలో), అర్ష్‌దీప్ సింగ్ (60వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున ఆండ్రూ ప్యాట్రిక్ (40వ నిమిషంలో), కెప్టెన్ డైలాన్ డానీ (51వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... ఆస్కార్ స్ప్రాలీ (39వ, 42వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించాడు. భారత్, ఆస్ట్రేలియా జట్లకు ఐదు పెనాల్టీ కార్నర్‌ల చొప్పున లభించాయి. భారత్ ఒక దానిని, ఆస్ట్రేలియా రెండింటిని సద్వినియోగం చేసుకుంది. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో ప్రస్తుతం ఆస్ట్రేలియా పది పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. భారత్ ఏడు పాయింట్లతో రెండో స్థానంలో, బ్రిటన్ ఆరు పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాయి. శుక్రవారం జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో భారత్; న్యూజిలాండ్‌తో బ్రిటన్; పాకిస్తాన్‌తో ఆస్ట్రేలియా తలపడతాయి. రౌండ్ రాబిన్ లీగ్ దశ ముగిశాక టాప్-2లో నిలిచిన జట్లు టైటిల్ కోసం పోటీపడతాయి.

తొలి రౌండ్‌లోనే యూకీ జోడీ అవుట్

స్టాక్‌హోమ్ (స్వీడన్): నోర్డిక్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో కొత్త భాగస్వాములతో బరిలోకి దిగిన భారత డబుల్స్ స్టార్స్ యూకీ బాంబ్రీ, రోహన్ బోపన్నలకు నిరాశ ఎదురైంది. యూకీ బాంబ్రీ (భారత్)-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జోడీ... రోహన్ బోపన్న (భారత్)-టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్) జంట తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాయి. యూకీ-పీర్స్ 5-7, 3-6తో అలెగ్జాండర్ ఎర్లెర్ (ఆస్ట్రియా)-రాబర్ట్ గాలోవే (అమెరికా) చేతిలో... బోపన్న-గ్రీక్‌స్పూర్ 4-6, 6-7 (4/7)తో మియోమిర్ కెచ్‌మానోవిచ్ (సెర్బియా)-అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమి పాలయ్యారు. మరోవైపు కజకిస్తాన్‌లో జరుగుతున్న అల్మాటీ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో శ్రీరామ్ బాలాజీ-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ కూడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. బాలాజీ-ప్రశాంత్ 4-6, 6-3, 9-11తో థియో అరిబెజ్-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు.



యూకీ

తెలుగు టైటాన్స్ పరాజయం



ఢిల్లీ: హోరాహోరీ పోరులో తెలుగు టైటాన్స్ 'టైబ్రేక్'లో పరాజయం పాలైంది. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో భాగంగా బుధవారం జరిగిన పోరులో టైటాన్స్ 5-7 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడింది. మొదట నిర్ణీత సమయంలో ఇరు జట్లు 45-45 పాయింట్లతో సమంగా నిలిచాయి. టైటాన్స్ తరఫున భరత్ 16 పాయింట్లతో సత్తా చాటగా... కెప్టెన్ విజయ్ మలిక్ 6 పాయింట్లు సాధించాడు. బెంగాల్ వారియర్స్ సారథి దేవాంక్ 18 పాయింట్లతో అదరగొట్టాడు. మన్‌జీత్ 7 పాయింట్లతో అతడికి అండగా నిలిచాడు. దీంతో ఫలితం తేల్చేందుకు 'టైబ్రేక్' నిర్వహించగా... బెంగాల్ వారియర్స్ మెరిపించింది. తాజా సీజన్‌లో 14 మ్యాచ్‌లాడిన తెలుగు టైటాన్స్ 8 విజయాలు, 6 పరాజయాలతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని మూడో స్థానంలో ఉంది. బెంగాల్ వారియర్స్ 14 మ్యాచ్‌ల్లో 5 గెలిచి 9 ఓడి 10 పాయింట్లతో పట్టిక 11వ స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 57-33 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది. పల్టన్ తరఫున పంకజ్ 9, గౌరవ్ ఖత్రి 7 పాయంట్లు సాధించగా... వైభవ్, అస్లమ్ చెరో ఆరు పాయింట్లు సాధించారు. జైపూర్ తరఫున అలీ సమదీ 14 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన పల్టన్ 16 మ్యాచ్‌ల్లో 13 విజయాలు, 3 పరాజయాలతో 26 పాయింట్లు ఖాతాలో వేసుకొని అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది. ఇంకో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 42-35 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. గుజరాత్ జెయింట్స్ తరఫున హిమాన్షు 13 పాయింట్లు సాధించగా... అంకిత్ దహియా, మొహమ్మద్ రెజా చెరో 6 పాయింట్లు సాధించారు. తలైవాస్ తరఫున అర్జున్ దేశ్వాల్ 12 పాయింట్లతో పోరాడాడు. లీగ్‌లో భాగంగా గురువారం మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. బెంగళూరు బుల్స్‌తో పట్నా పైరేట్స్, తెలుగు టైటాన్స్‌తో యు ముంబా, యూపీ యోధాస్‌తో హరియాణా స్టీలర్స్ తలపడనున్నాయి.

16 ఏళ్ల తర్వాత...

ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి దక్షిణాఫ్రికా అర్హత



జొహానెస్‌బర్గ్: ఆతిథ్య దేశం హోదాలో చివరిసారి 2010లో ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఆడిన దక్షిణాఫ్రికా జట్టు... ఆ తర్వాత వరుసగా మూడు ప్రపంచకప్ టోర్నీలకు అర్హత పొందడంలో విఫలమైంది. 16 ఏళ్ల విరామం తర్వాత దక్షిణాఫ్రికా మళ్లీ ప్రపంచకప్ టోర్నీలో ఆడే అవకాశాన్ని సంపాదించింది. ఆఫ్రికా జోన్ క్వాలిఫయింగ్‌లో భాగంగా గ్రూప్ 'సి'లో దక్షిణాఫ్రికా అగ్రస్థానాన్ని దక్కించుకొని వచ్చే ఏడాది అమెరికా, కెనడా, మెక్సికోలలో జరిగే వరల్డ్‌కప్ టోర్నీ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఆరు జట్లను గ్రూప్ 'సి'లో దక్షిణాఫ్రికా పది మ్యాచ్‌లు ఆడి 18 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. రువాండాతో జరిగిన చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 3-0 గోల్స్ తేడాతో గెలిచింది. 1998, 2002 ప్రపంచకప్ టోర్నీల్లో ఆడిన దక్షిణాఫ్రికా 2010లో ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చింది. అయితే మూడు పర్యాయాలు దక్షిణాఫ్రికా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. ఆఫ్రికా జోన్ నుంచి సెనెగల్, ఐవరీకోస్ట్ జట్లు కూడా 2026 ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించాయి. గ్రూప్ 'బి'లో సెనెగల్, గ్రూప్ 'ఎఫ్'లో ఐవరీకోస్ట్ జట్లు అగ్రస్థానంలో నిలిచాయి. 2026 ప్రపంచకప్‌లో మొత్తం 48 జట్లు పాల్గొంటాయి. ఆఫ్రికాకు 9 బెర్త్‌లు కేటాయించగా... తొమ్మిదీ ఖరారయ్యాయి. గతంలోనే ఆఫ్రికా నుంచి అల్జీరియా, ఈజిప్ట్, ట్యునీషియా, మొరాకో, ఘనా, కేప్ వెర్డె ప్రపంచకప్‌కు అర్హత పొందాయి.

ఖతర్, సౌదీ అరేబియా కూడా...

ప్రపంచకప్‌లో ఆసియా దేశాలకు కేటాయించిన 8 బెర్త్‌లు కూడా ఖరారయ్యాయి. ఆసియా క్వాలిఫయింగ్ నాలుగో రౌండ్ గ్రూప్ విజేతల హోదాలో ఖతర్, సౌదీ అరేబియా జట్లు ప్రపంచకప్‌కు అర్హత పొందాయి. నాలుగో రౌండ్ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో ఖతర్ 2-1తో యూఏఈ జట్టును ఓడించగా... ఇరాక్‌తో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌ను సౌదీ అరేబియా 0-0తో 'డ్రా' చేసుకొని తమ గ్రూప్‌లలో అగ్రస్థానంలో నిలిచాయి. ఆసియా నుంచి గతంలో జపాన్, ఇరాన్, ఆస్ట్రేలియా, ఉజ్బెకిస్తాన్, జోర్డాన్, దక్షిణ కొరియా జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి.



యూరప్ నుంచి ఇంగ్లండ్



ఆఫ్రికా, ఆసియా కోటాలు పూర్తి కాగా... యూరప్ నుంచి 2026 ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందిన తొలి జట్టుగా ఇంగ్లండ్ నిలిచింది. ఐదు జట్లున్న గ్రూప్ 'కె'లో ఇంగ్లండ్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 18 పాయింట్లతో వరల్డ్‌కప్ బెర్త్‌ను దక్కించుకుంది. 17వసారి ప్రపంచకప్‌లో ఆడనున్న ఇంగ్లండ్ 1966లో ఏకైక సారి ప్రపంచకప్ విజేతగా నిలిచింది. యూరప్ నుంచి మరో 15 జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించాల్సి ఉంది.

తిప్పేసిన నోమాన్ అలీ



నోమాన్ అలీ

- పాకిస్తాన్ ఘనవిజయం
- టెస్టుల్లో పది విజయాల తర్వాత దక్షిణాఫ్రికా జట్టుకు తొలి ఓటమి

లాహోర్: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పాకిస్తాన్ జట్టు... దక్షిణాఫ్రికా వరుస విజయాల జోరుకు బ్రేక్ వేసింది. 10 మ్యాచ్‌ల్లో పరాజయం ఎరుగకుండా పాకిస్తాన్‌లో అడుగుపెట్టిన ప్రపంచ టెస్టు చాంపియన్ సఫారీ జట్టు 2025-27 డబ్ల్యూటీసీ సర్కిల్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే పరాజయం పాలైంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో పాకిస్తాన్ 93 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. 277 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 51/2తో బుధవారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీ జట్టు... 60.5 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌటైంది. బ్రేవిస్ (54 బంతుల్లో 54; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే అర్ధశతకంతో పోరాడగా... మిగిలినవాళ్లు విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో టోనీ డీ జార్జి (16), స్టబ్స్ (2), కైల్ వెరీన్ (19) ఆకట్టుకోలేకపోయారు. రికెల్టన్ (145 బంతుల్లో 45; 4 ఫోర్లు) క్రీజులో పాతుకుపోయినా... అవతలి ఎండ్ నుంచి అతడికి సరైన సహకారం దక్కలేదు. పాకిస్తాన్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నోమాన్ అలీ, స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిది చెరో 4 వికెట్లు పడగొట్టారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ నోమాన్ టాపార్డర్‌ను బుట్టలో వేసుకోగా... షాహీన్ లోయర్ ఆర్డర్ పనిపట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన నోమాన్ ఈ ప్రదర్శన ద్వారా మొత్తం 10 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. సొంతగడ్డపై ఆడిన గత ఐదు టెస్టుల్లో నోమాన్ అలీ 46 వికెట్లు పడగొట్టడం విశేషం. గత డబ్ల్యూటీసీ సర్కిల్‌లో చివరి స్థానంలో నిలిచిన పాకిస్తాన్... ఈసారి తొలి మ్యాచ్‌లో విజయంతో శుభారంభం చేసింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 20 నుంచి రావల్పిండిలో రెండో టెస్టు ప్రారంభం కానుంది.

టి20 ప్రపంచకప్ టోర్నీకి నేపాల్, ఒమన్ అర్హత



దుబాయ్: వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 ప్రపంచకప్‌నకు ఒమన్, నేపాల్ జట్లు అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయర్స్ 'సూపర్ సిక్స్'లో ఆడిన మూడేసి మ్యాచ్‌ల్లో నెగ్గిన ఈ రెండు జట్లు వరల్డ్‌కప్‌లో పాల్గొననున్నాయి. బుధవారం సమోవాతో జరిగిన మ్యాచ్‌లో యూఏఈ జట్టు 77 పరుగుల తేడాతో విజయం సాధించడంతోనే... ఒమన్, నేపాల్ ముందంజ వేశాయి. వరల్డ్‌కప్‌లో మొత్తం 20 జట్లు పాల్గొననుండగా... నేపాల్, ఒమన్‌తో ఆ సంఖ్య 19కి చేరింది. ఈ టోర్నీ నుంచి మరొక్క జట్టు మాత్రమే అర్హత సాధించాల్సి ఉంది. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న యూఏఈ జట్టుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. ఆతిథ్య హోదాలో భారత్, శ్రీలంక ప్రపంచకప్ ఆడనుండగా... 2024 వరల్డ్ కప్ ప్రదర్శన ఆధారంగా అఫ్గానిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, అమెరికా, వెస్టిండీస్ ముందంజ వేశాయి. ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్ జట్లు ర్యాంకింగ్స్ ఆధారంగా మెగా టోర్నీకి అర్హత సాధించాయి. అమెరికా క్వాలిఫయర్స్ ద్వారా కెనడా జట్టు... యూరప్ క్వాలిఫయర్స్ ద్వారా ఇటలీ, నెదర్లాండ్స్ వరల్డ్‌కప్ బెర్త్‌లు దక్కించుకున్నాయి. ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుంచి నమీబియా, జింబాబ్వే ముందంజ వేయగా... ఆసియా క్వాలిఫయర్స్ నుంచి తాజాగా నేపాల్, ఒమన్ వరల్డ్ కప్‌నకు అర్హత సాధించాయి. మరో జట్టు కూడా బెర్త్ దక్కించుకుంటే... ప్రపంచ కప్‌లో పోటీ పడే జట్ల సంఖ్య పూర్తి కానుంది.


అమెరికాలోని షికాగో ఈస్ట్ సైడ్ ప్రాంతంలో ఆందోళనకు దిగిన నిరసనకారుడిపైకి తుపాకీ గురిపెట్టిన ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు


జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగర శివారులో ఇరువైపులా పసుపువర్ణ శోభిత వృక్షాలతో అలరారుతున్న రహదారి మీదుగా దూసుకుపోతున్న వాహనాలు


దీర్ఘకాలిక వ్యాధులపై పరిశోధనకు నిధులివ్వకుంటే మరిన్ని మరణాలు తప్పవంటూ బెర్లిన్ సిటీలో శవాల బ్యాగులతో నిరసన తెలుపుతున్న మహిళ

‘తెర’ వెనుక తెగిపోయిన కల

సరదాగా ఉరి చిత్రీకరిస్తుండగా ప్రమాదం

కుర్చీపైనుంచి కాలుజారి బిగిసిన ఉరి

పద్నాలుగేళ్ల బాలునికి నూరేళ్లు

న్యూఢిల్లీ: అది ఢిల్లీలోని శాంతి నగర్, ఆ రోజు అక్టోబర్ 12. ఆ మధ్య తరగతి కుటుంబంలో ఎప్పుడూ ఉండే ఆనందం, నవ్వులు.. ఆరోజు భయంకరమైన నిశ్శబ్దంలో కొట్టుకుపోయాయి. తండ్రి ఒక రియల్ ఎస్టేట్ డీలర్, తల్లి గృహిణి, 12వ తరగతి చదువుతున్న కుమార్తె, తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు.. ఇంతే ఆ కుటుంబం. పద్నాలుగేళ్ల ఆ బాలునికి ఈ తరం పిల్లల్లాగే సోషల్ మీడియాపై ఆసక్తి ఉంది. తన గదిలోనే ఏదో కొత్త వీడియో తీయాలనే ఉత్సాహంతో ఉన్నాడు. అప్పుడు తెలియదు, ఆ ఉత్సాహమే తన జీవితంలో చివరి క్షణం అవుతుందని.. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని వేళ, తన గదిని ఓ చిన్న స్టూడియోలా మార్చుకున్నాడు. మొబైల్ ఫోన్‌ను ఒక చోట పెట్టి, ‘ఆత్మహత్యను అనుకరించే’ దృశ్యాన్ని రికార్డు చేయడం మొదలు పెట్టాడు. తెరపై చూపించే ఉత్కంఠను తానూ అనుభూతి చెందాలనుకున్నాడు. కానీ, ఆ ప్రయత్నంలో, బాలుడు నిల్చున్న కుర్చీపై నుంచి కాలు జారింది. అంతే.. క్షణాల వ్యవధిలో అంతా మారిపోయింది. బాలుడికి ఊపిరి అందలేదు. కొద్దిసేపటి తరువాత, తల్లిదండ్రులు గదిలోకి వచ్చి చూడగానే.. వారి గుండెలు బద్దలయ్యాయి. ఆందోళనతో వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లినా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బాలుడు చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. ఒక సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ.. ‘ఈ సంఘటనలో ఎలాంటి కుట్ర లేదు. ఆ బాలుడు వీడియో షూట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపోయి ఉండవచ్చు. వీడియో ఫుటేజీలోని బాలుని హావభావాలు చూస్తే అతను ఆత్మహత్యకు ప్రయత్నించడం లేదని తెలుస్తోంది’.. అని పేర్కొన్నారు. బీజేఆర్ఎం ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి బాలుని మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనగా కేసు నమోదు చేశారు.

పేరాయణం!

ఈ పెద్దమనిషి పేరు చెప్పాలంటే 20 నిమిషాలు కావాలి. అంటే, ఓ సినిమా ఇంటర్వెల్ అయ్యేంత సేపు! అదండీ విషయం! మామూలుగా అయితే ఎవరినైనా పరిచయం చేసుకుంటే ‘హాయ్, నా పేరు ఫలానా’ అని సెకన్లలో చెప్పేస్తాం. కానీ, లారెన్స్ వాట్కిన్స్ అనే న్యూజిలాండ్ మాజీ సెక్యూరిటీ గార్డ్‌కి మాత్రం ఆ విధానం అస్సలు నచ్చలేదు!

పేరు కాదది.. అష్టాదశ పురాణం!

ఆయన పేరంటే పేరు కాదు, అదొక అష్టాదశ పురాణం! మొత్తం 2,253 పదాలు ఉంటాయిట! గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కూడా ‘ప్రపంచంలోనే అతి పొడవైన వ్యక్తిగత పేరు’.. అని అధికారికంగా ప్రకటించింది. అంటే.. ఆయన తన పూర్తి పేరు చెప్పడం మొదలుపెడితే.. మీరు ఒక కాఫీ తాగి రావచ్చు. ఓ రెండు చిన్న కవితలు రాసి ముగించవచ్చు. పక్కన ఉన్న స్నేహితుడితో ఓ దేశ రాజకీయాల గురించి చర్చ మొదలెట్టి ముగించవచ్చు కూడాను.. మీరు టిఫిన్ చేయడం పూర్తయ్యేలోపు కూడా ఆయన పేరు సగం కూడా పూర్తి కాదు మరి!

పెళ్లి మండపంలోనూ అదే హంగామా!

1991లో లారెన్స్ వాట్కిన్స్ మొదటి పెళ్లప్పుడు జరిగింది మరింత కామెడీ. ఆ పెళ్లి తంతు జరిపించే వ్యక్తి తెలివైన వాడు. రిస్క్ తీసుకోకుండా, లారెన్స్ గారి ఆ 2,253 పేర్ల లిస్ట్‌ను ముందుగానే రికార్డ్ చేశాడట!. మండపంలో మంగళవాయిద్యాల బదులు ఆ రికార్డింగ్ అర్ధగంట పాటు మోగుతూనే ఉందట!. అక్కడికి వచ్చిన అతిథులు షాంపైన్ తాగుతూ, ఆ అనంతమైన నామస్మరణను వింటూ హాయిగా తిరిగారట!. ఎట్టకేలకు 20 నిమిషాల తర్వాత, నామకరణ ఘట్టం ముగిశాక, ‘ఐ డూ’ అనే ముఖ్యమైన మాట చెప్పడానికి లారెన్స్ గారికి అవకాశం దొరికింది! ఆయన చిన్నప్పుడు ‘రిప్లీస్ బిలీవ్ ఇట్ ఆర్ నాట్’ షో చూసి, గిన్నిస్ రికార్డ్స్ పుస్తకాలు చదివి, ‘నాలాంటి సాధారణ మనిషికి ఏ ప్రత్యేక ప్రతిభ లేదు’ అని బాధపడిపోయాడట. అప్పుడు, తనకున్న ఏకైక అవకాశం.. ప్రపంచంలోనే అతి పొడవైన పేరు పెట్టుకోవడమే అని డిసైడ్ అయ్యారు!



ఇదే లారెన్స్ గారి పూర్తి పేరు

లారెన్స్ అలోన్ అలాయిస్ అలోయిసియస్ ఆల్బ్రెజ్ అలున్ అలురెడ్ ఆల్విన్ అల్యాసాండిర్ ఆంబీ ఆంబ్రోస్ ఆంబ్రోసియస్ అమియాస్ అమియోట్ అమియాస్ అండర్స్ ఆండ్రీ ఆండ్రియా ఆండ్రియాస్ ఆండ్రూ ఆండీ అన్వెరిన్ ఆంగ్విష్ అన్లైయిఫర్ ఆంథిన్... (ఓస్.. ఇంతేనా అనుకున్నారు కదూ.. అయిపోలేదు.. ఇంకా ఉంది..)

సంతకం సంగతేంటి?

రోజువారీ అవసరాల కోసం, ఆయన తన పేరును కేవలం ‘లారెన్స్ అలోన్ అలోయ్ వాట్కిన్స్’ అని కుదించుకుని, సంతకాన్ని వాట్కిన్స్–5 (అయిదో తరం) అని పెడతారట. ఆయన పూర్తి పేరుతో ఉన్న పాత పాస్‌పోర్ట్‌కి ఏకంగా ఆరు అదనపు పేజీలు అవసరమయ్యాయట!

– సాక్షి, నేషనల్ డెస్క్

యూఎన్ హెచ్‌ఆర్‌సీకి ఏడోసారి ఎంపికైన భారత్

న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి(యూఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి భారత్ ఏడోసారి ఎన్నికైంది. 2026 నుంచి 2028 వరకు యూఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్య దేశంగా భారత్ కొనసాగనున్నది. ఇందుకు సంబంధించిన ఎన్నికల ఫలితాలను మంగళవారం ప్రకటించారు. భారత్‌కు చెందిన మూడేళ్ల కాలపరిమితి 2026 జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు యూఎన్‌హెచ్‌ఆర్‌సీ తన సోషల్ మీడియా పోస్టులో తెలియజేసింది. ‘‘భారత్‌కు మద్దతు ఇచ్చిన వారందరికీ ధన్యవాదాలు. ఏడోసారి మానవ హక్కుల మండలికి ఎన్నికయ్యాయి. తమ పదవీ కాలంలో మానవ హక్కుల పరిరక్షణ కోసం పాటుపడుతాము’’ అంటూ ఐక్యరాజ్య సమితి భారత ప్రతినిధి పర్వతనేని హరీశ్ తన సోషల్ మీడియా అకౌంటు ద్వారా స్పందించారు. భారత్ 2024 వరకు రెండుసార్లు యూఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఎన్నికైంది. మూడోసారి అనుమతి లేకపోవడంతో 2025 విరామం తీసుకుంది. తిరిగి 2026–28 కాలానికి గానూ మళ్లీ పోటీ చేసి..., ఎన్నికల్లో విజయం సాధించింది. యూఎస్ మానవ హక్కుల మండలిలో మొత్తం 47 సభ్యదేశాలు ఉన్నాయి.

మరమరాల దుకాణానికి వెళ్లి మృత్యువాత

యజమాని దాడిలో ఒకరి మృతి

అమేథీ: మరమరాలు (బొరుగులు) (పఫ్డ్ రైస్) విషయంలో జరిగిన వాగ్వాదంలో ఒక దుకాణ యజమాని.. 25 ఏళ్ల యువకుడిని హత్య చేశాడు. ఈ సంఘటనలో మృతుని స్నేహితునికి కూడా గాయాలయ్యాయి. అమేథీ – కాళీఖాన్ ఖుర్దియా మలుపు దగ్గర ఉన్న భౌసింగ్‌పూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం, అమేథీలోని కొహ్రా మహ్మద్‌పూర్ నివాసి చందన్ విశ్వకర్మ తన స్నేహితుడు రాహుల్ యాదవ్ (25)తో కలిసి భౌసింగ్‌పూర్‌లోని తన తాత ఇంటికి వచ్చాడు. రాహుల్ పథ్రీ పహాడ్‌గంజ్ ప్రాంత వాసి. మంగళవారం సాయంత్రం, వారిద్దరూ స్థానిక మద్యం దుకాణం సమీపంలో వసుదేవ్ కశ్యప్ కుమారుడు అశోక్ కుమార్ కశ్యప్ నడుపుతున్న మరమరాలు దుకాణానికి వెళ్లారు. అక్కడ దుకాణ యజమాని అశోక్‌కి, రాహుల్ మధ్య వాగ్వాదం మొదలై, తీవ్రరూపం దాల్చింది. దుకాణ యజమాని మరమరాలు వేయించడానికి ఉపయోగించే పదునైన పారతో వారిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రాహుల్ మృతి చెందగా..చందన్‌కు గాయాలయ్యాయి. అమేథీ ఎస్పీ అపర్ణా రజత్ కౌశిక్ మాట్లాడుతూ, నిందితుడి కోసం పోలీసు బృందాలను రంగంలోకి దించామని వివరించారు.

ఐపీఎస్ పూరన్‌కుమార్ అంత్యక్రియలు పూర్తి

చండీగఢ్: ఆత్మహత్య చేసుకున్న హర్యానా ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ పార్థివదేహానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. కులం పేరుతో ఉన్నతాధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఈ నెల 7న పూరన్‌కుమార్ తన రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. నిందితులను అరెస్టు చేసేవరకు పూరన్‌కుమార్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు ఒప్పుకోనని ఆయన సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి అమ్నీత్ పీ కుమార్ స్పష్టం చేయటంతో వారం రోజులుగా వివాదం నెలకొంది. ఎట్టకేలకు బుధవారం చండీగఢ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్)లో పోస్ట్‌మార్టం నిర్వహించి, మృతదేహాన్ని అమ్నీత్‌కు అప్పగించారు. దీంతో సెక్టార్ 25లోని శ్మశానవాటికలో పోలీస్ గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు రాష్ట్ర తాత్కాలిక డీజీపీ ఓపీ సింగ్, సీనియర్ అధికారులు, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. అంతకుముందు భర్త మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు అంగీకరించిన అమ్నీత్ మాట్లాడుతూ.. తన భర్త మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వీలైనంత త్వరగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భారత పర్యటనకు శ్రీలంక ప్రధాని

న్యూఢిల్లీ: శ్రీలంక ప్రధాన మంత్రి హరిణి అమరసూర్యన్ భారత పర్యటనకు రానున్నారు. నేటి(అక్టోబర్ 16) నుంచి 18 వరకు మూడురోజుల పాటు దేశంలో పర్యటించనున్నారు. ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ‘‘ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతానికి అమరసూర్యన్ దేశంలోని అగ్రస్థాయి రాజకీయ నాయకులతో చర్చిస్తారు. ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో అతిథి ప్రసంగం ఇవ్వనున్నారు’’ అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) తెలిపింది. దేశ ప్రధాని మోదీ మార్చిలో ప్రకటించిన ‘మహాసాగర్ విజన్’, ‘నైబర్‌హుడ్ ఫస్ట్’ విధానాలను అమరసూర్యన్ భారత పర్యటన మరింత బలపరుస్తుందని (ఎంఈఏ) పేర్కొంది.

ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్‌కు ఓకే

- విక్రయాలు, వినియోగానికి సుప్రీంకోర్టు అనుమతి
- కొన్ని షరతులు విధించిన న్యాయస్థానం

న్యూఢిల్లీ: దీపావళి పండుగ ఉత్సాహాన్ని పెంచే తీర్పును సుప్రీంకోర్టు బుధవారం వెలువరించింది. దేశ రాజధాని ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్ విక్రయాలు, వినియోగానికి అనుమతి జారీ చేసింది. పర్యావరణానికి హాని కలిగించని బాణాసంచాను విక్రయించుకోవచ్చని, వినియోగించుకోవచ్చని పేర్కొంది. అయితే, ఇందుకు కొన్ని షరతులు విధించింది. దేశ రాజధానిలో గ్రీన్ క్రాకర్స్‌ను ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మాత్రమే విక్రయించాలని స్పష్టంచేసింది. దీపావళికి ముందు రోజు, పండుగ రోజు మాత్రమే గ్రీన్ క్రాకర్స్ కాల్చాలని పేర్కొంది. రెండు రోజులపాటు కేవలం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల దాకా, రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు ఈ బాణాసంచా కాల్చుకోవచ్చని తేల్చిచెప్పింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించింది. ఢిల్లీలో తీవ్ర కాలుష్యం నేపథ్యంలో బాణాసంచాపై ప్రభుత్వం 2024లో పూర్తిస్థాయిలో నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిషేధం విషయంలో కొన్ని సడలింపులు ఇవ్వాలని కోరుతూ బాణాసంచా తయారీదారులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కొన్ని షరతులతో గ్రీన్ క్రాకర్స్‌కు తాత్కాలికంగా అనుమతి ఇస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు 21 పేజీల ఉత్తర్వు జారీ చేసింది.

పర్యావరణం, ఆరోగ్య సంరక్షణే ముఖ్యం

పర్యావరణ కాలుష్యం వల్ల మనుషుల్లో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తుచేసింది. అదేసమయంలో బాణాసంచా తయారీ రంగంలో ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని వెల్లడించింది. క్రాకర్స్ కాల్చడం అనేది పండుగ స్ఫూర్తిని వ్యక్తీకరించినట్లు అవుతుందని తెలిపింది. మతపరమైన వేడుకలు లేదా ప్రత్యేక సందర్భాల్లో బాణాసంచా కాల్చడం భారతీయ సంస్కృతిలో భాగమని స్పష్టంచేసింది. కానీ, దీనివల్ల బాణాసంచా వల్ల అనారోగ్యం పాలయ్యే పరిస్థితి ఉండకూడదని అభిప్రాయపడింది. పండుగల స్ఫూర్తి కంటే పర్యావరణం, ఆరోగ్య సంరక్షణకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. అందుకే ఈసారి గ్రీన్ క్రాకర్స్‌కు మాత్రమే కాల్చుకోవాలని తేల్చిచెప్పింది. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేసిన గ్రీన్ క్రాకర్స్‌ను ప్రభుత్వ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే విక్రయించాలని దుకాణదారులను ఆదేశించింది. ఈ నెల 14 నుంచి 25వ తేదీ దాకా దేశ రాజధానిలో నిత్యం వాయు నాణ్యత వివరాలు సేకరించి, తమకు సమర్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

బ్రెయిలీ లిపిలో ఓటర్ స్లిప్, బ్యాలెట్ పేపర్

న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న అంధులు, దివ్యాంగులకు అనువుగా ఈసారి బ్రెయిలీ లిపిలో ముద్రించిన డమ్మీ బ్యాలెట్ పేపర్లు, ఓటర్ స్లిప్‌లను అందించనున్నామని కేంద్ర ఎన్నికల సంఘం బుధవాం ప్రకటించింది. అంధ, దివ్యాంగ ఓటర్లు ఓటు వినియోగించుకునేవేళ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లపైనా అభ్యర్థిని సులువుగా గుర్తించేందుకు వీలుగా బ్రెయిలీలో ముద్రించిన బ్యాలెట్ పేపర్‌ను ఈవీఎంపై అతికిస్తామని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. దృష్టిలోపాలున్న ఓటర్లకు సాధారణ ఓటర్ స్లిప్‌తోపాటు బ్రెయిలీలో ముద్రించిన ఓటర్ సమాచార స్లిప్‌ను అందిస్తామని ఈసీ వెల్లడించింది. ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌పై సమాచారం బ్రెయిలీ లిపిలోనూ అందుబాటులో ఉన్న నేపథ్యంలో అంధ, దివ్యాంగ ఓటర్లు సహాయకుల సాయం లేకుండా సొంతంగానే ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఈసీ అభిప్రాయపడింది. బ్రెయిలీలో బ్యాలెట్ పేపర్లను అందించడం ఇదే తొలిసారి కాదు ఎన్నికల నిబంధనలు,1961లోని 49ఎన్ నిబంధన ప్రకారం దృష్టిసమస్యలున్న ఓటర్లు ఓటేసేటప్పుడు తమ వెంట ఒక సహాయకుడిని తీసుకురావొచ్చు. ఈసీఐఎన్‌ఈటీ మాడ్యూల్ అయిన దివ్యాంగ్(సాక్ష్యం)లో తమ పేరును నమోదుచేసుకోవడం ద్వారా దివ్యాంగులు తమ ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి వీల్‌చైర్ లేదా రవాణా సదుపాయాన్ని అభ్యర్థించవచ్చు. బిహార్‌లోని మొత్తం 90,712 పోలింగ్ కేంద్రాల్లోనూ ఇలాంటి రవాణా సదుపాయాలు కల్పిస్తామని ఈసీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్‌డీఏ జాబితా పర్వం

- బిహార్‌లో స్వీయ జాబితాలు ప్రకటించిన బీజేపీ, జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ పార్టీలు
- అలీనగర్ నుంచి రాజకీయ అరంగేట్రం చేస్తున్న గాయని మైథిలీ ఠాకూర్

న్యూఢిల్లీ/పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికల్లో శరవేగంగా సీట్ల సర్దుబాటు పర్వాన్ని ముగించుకున్న అధికార ఎన్‌డీఏ కూటమి పార్టీలు అంతే వేగంగా పలు నియోజకవర్గాలకు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తున్నాయి. బుధవారం సీఎం నితీశ్ కుమార్ సారథ్యంలోని జనతాదళ్(యునైటెడ్) 57 మంది పేర్లతో తొలి జాబితాను, 12 మంది పేర్లతో బీజేపీ రెండో జాబితాను, 14 మంది అభ్యర్థుల పేర్లతో లోక్ జనశక్తి(రాంవిలాస్) తమ తొలి జాబితాను విడుదలచేశాయి. సోమవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్న ప్రముఖ జానపద యువ గాయకురాలు మైథిలీ ఠాకూర్‌ను అలీనగర్ నియోజకవర్గం నుంచి పోటీకి నిలబెడుతున్నట్లు ఈ జాబితా ద్వారా బీజేపీ ప్రకటించింది. మాజీ ఐపీఎస్ అధికారి ఆనంద్ మిశ్రా బక్సర్ నియోజకవర్గం నుంచి పోటీపడనున్నారు. మాజీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన సురాజ్‌పార్టీ నుంచి ఆనంద్ మిశ్రా ఇటీవల బయటికొచ్చి బీజేపీ కండువా కప్పుకున్న విషయం తెల్సిందే. హయాఘాట్ నుంచి రామచంద్ర ప్రసాద్, ఛాప్రా నుంచి ఛోటీ కుమారీ, షాపూర్ నుంచి రాకేశ్ ఓఝా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ముజఫర్‌పూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే సురేశ్ శర్మను పక్కనబెట్టి పార్టీ ఈసారి టికెట్‌ను రంజన్ కుమార్‌కు ఇచ్చింది. ఇక అఘియాన్ నియోజకవర్గం నుంచి మహేశ్ పాశ్వాన్, రోసెరా నుంచి బీరేంద్ర కుమార్, గోపాల్‌గంజ్ నుంచి సుభాష్ సింగ్ రంగంలోకి దూకుతున్నారు. వీళ్లతో కలిపి బీజేపీ ఇప్పటిదాకా 83 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటించింది.

జేడీయూ తరఫున మంత్రులు

నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ) పార్టీ తరఫున రాష్ట్ర మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, శర్వాన్ కుమార్, మదన్ సాహ్నీ, రత్నేశ్ సదా, మహేశ్వర్ హజారీలు పోటీచేయనున్నారు. గత ఏడాది ఆర్జేడీకి గుడ్‌బై చెప్పి జేడీయూ గూటికి చేరిన శ్యామ్ రజక్ సైతం పోటీచేస్తున్నారు. మహ్నార్ నియోజకవర్గం నుంచి జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ కుష్వాహా బరిలో దిగనున్నారు. బుధవారం జేడీయూ మొత్తంగా 57 మందితో తొలి జాబితాను విడుదల చేసింది.

14 మందితో జాబితా ప్రకటించిన చిరాగ్

బిహార్‌లో అధికార ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామి అయిన చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని లోక్ జనశక్తి(రామ్‌విలాస్) పార్టీ బుధవారం 14 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థుల పేర్లతో జాబితా విడుదలచేసింది. సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ పార్టీకి 29 సీట్లు దక్కిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో చిరాగ్ పాశ్వాన్ తొలి జాబితా విడుదల చేశారు. ఎల్‌జేపీ పార్టీ బిహార్ విభాగ చీఫ్ రాజు తివారీ ఈసారి తూర్పు చంపారన్ జిల్లాలోని గోవింద్‌గంజ్ నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నారు. బ్రహ్మపూర్ నుంచి హులాస్ పాండే, సిమ్రి భక్తియార్‌పూర్ నుంచి సంజయ్ సింగ్, దరౌలీ నుంచి విష్ణుదేవ్ పాశ్వాన్, నాథ్‌నగర్ నుంచి మిథున్‌కుమార్ పోటీ చేయనున్నారు. తమ మిగతా 15 మంది అభ్యర్థుల జాబితాను త్వరలో విడుదలచేస్తామని ఎల్‌జేపీ పేర్కొంది.


మనుషుల్లేని పాడబడ్డ పట్టణంలో రాత్రివేళ వేటకు బయల్దేరిన అత్యంత అరుదైన గోధుమరంగు హైనా ఫొటో ఇది. నమీబియాలోని కోల్‌మాన్‌స్కోప్ పట్టణంలో దక్షిణాఫ్రికా ఫొటోగ్రాఫర్ విమ్‌వాన్‌డీన్ హీవర్ తీసిన ఈ ఫొటో ఈ ఏడాదికి ‘వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్’ అవార్డ్‌ను గెల్చుకుంది. మొత్తం 60,636 ఎంట్రీలు రాగా పట్టణప్రాంత వన్యప్రాణి విభాగంలో ఈ అవార్డ్ దక్కింది.

బక్సా జైలు వద్ద ఉద్రిక్తత

గువాహటి: అస్సామీ గాయకుడు జుబీన్ గార్గ్ సింగపూర్‌లో సముద్రంలో ఈత కొడుతూ అనుమానాస్పదంగా మరణించిన ఉదంతంలో అరెస్ట్ అయిన ఐదుగురు నిందితులను బక్సా జిల్లా జైలులోకి తరలించేటప్పుడు అభిమానులు ఆందోళనకు దిగారు. పోలీసు వాహనాలపై రాళ్లు రువ్వి ఒక పోలీసు వాహనాన్ని ధ్వంసంచేసి నిప్పుపెట్టారు. ఇతరుల వాహనాలనూ తగలబెట్టారు. దీంతో జైలు బయట ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు జైలు బయట ఆందోళనకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినాసరే ఆందోళనలు తగ్గకపోవడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ ఉదంతాన్ని కవర్ చేసేందుకు వచ్చిన మీడియా ప్రతినిధులు సైతం ఈ ఘర్షణల్లో గాయపడ్డారు. ఆందోళనకారుల రాళ్ల దాడిలో పోలీసులకు సైతం గాయాలయ్యాయి. రాళ్ల ధాటికి జైలు మార్గంలో నిలిపి ఉన్న సాధారణ ప్రజల వాహనాల అద్దాలన్నీ బద్దలయ్యాయి. ఈ కేసులో నిందితులైన నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ నిర్వాహకుడు శ్యాంకను మహంతా, జుబీన్ మేనేజర్ సిద్ధార్థ శర్మ, గార్గ్ బంధువుసాందీపన్ గార్గ్, వ్యక్తిగత భద్రతా అధికారులు నందీశ్వర్ బోరా, ప్రవీణ్ బైశ్యలను పోలీస్ కస్టడీ ముగియడంతో జైలుకు తరలించారు.

గోవా మాజీ సీఎం రవి నాయక్ కన్నుమూత


పణజి: రెండు సార్లు గోవా ముఖ్యమంత్రిగా సేవలందించిన సీనియర్ నేత రవి నాయక్ తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం గోవా కేబినెట్‌లో వ్యవసాయ శాఖ మంత్రిగా కొనసాగుతున్న రవికి బుధవారం గుండెపోటు కన్నుమూశారని ఆయన కుటుంబసభ్యులు వెల్లడించారు. ఆయన వయసు 79 సంవత్సరాలు. మరణవార్త తెల్సి ఆయనకు కడసారి చూసేందుకు పోండా నగరంలోని ఖడ్పాబంధ్ ప్రాంతంలోని ఆయన నివాసానికి వేలాదిగా పార్టీ కార్యకర్తలు, ఆయన అభిమానులు తరలివచ్చి ఘన నివాళులర్పించారు. అద్భుత నాయకత్వం, మానవత్వం, ప్రజాసంక్షేమ కార్యక్రమాలతో రవి నాయక్ గోవా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావత్ అన్నారు. ఎంజీపీ టికెట్‌తో 1984లో తొలిసారిగా పోండా నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధించి గోవా శాసనసభలో అడుగుపెట్టారు. ఐదేళ్ల తర్వాత మార్కేమ్ నియోజవర్గం నుంచి పోటీచేసి మరోసారి గెలిచారు. పోండా నుంచి 1999, 2002, 2007, 2017లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 2022లో బీజేపీ టికెట్‌పైనా విజయపతాక ఎగరేశారు. 1991 జనవరి నుంచి 1993 మే దాకా తొలిసారిగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1994లో ఏప్రిల్ రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీదాకా కేవలం ఆరు రోజులే సీఎంగా కొనసాగారు. 1998లో సార్వత్రిక ఎన్నికల్లో నార్త్‌గోవా నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. రవి నాయక్ మృతిపట్ల ఆమ్ ఆద్మీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, సీనియర్ నాయకురాలు అతిషీ సంతాపం వ్యక్తం చేశారు. రవి నాయక్ నాలుగు దశాబ్దాలుగా పాటు ప్రజాసేవకు తన జీవితం అకింతం చేశారని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ గోవా అధ్యక్షుడు అమిత్ పలేకర్ నాయక్ నివాసానికి చేరుకొని నివాళి అర్పించారు.

నలంద బౌద్ధ విహారాన్ని నిర్మించిన విదేశీ రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



తొలి మధ్యయుగం

పాలవంశం

దేవపాల: ఇతడిని పాలరాజులందరిలోకి గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు ఒరిస్సా, అస్సాంలను జయించడమే కాకుండా ప్రతీహార మిహిరభోజుడి దాడులను విజయవంతంగా తిప్పి కొట్టాడు. దేవపాలుడు నలందలో ఇండోనేషియా రాజు బలపుత్ర దేవుడు నిర్మించిన బౌద్ధ విహారానికి ఐదు గ్రామాలను దానంగా ఇచ్చాడు. ఇతడి ఆస్థాన బౌద్ధ పండితుడు వజ్రదత్తుడు లోకేశ్వర శతకం అనే గ్రంథాన్ని రచించాడు. ఈ కాలంలో భారతదేశాన్ని సందర్శించిన అరబ్ యాత్రికుడు సులేమాన్ పాల రాజ్యాన్ని రూహ్మి అని పేర్కొన్నాడు.

నారాయణపాల: దేవపాలుడి తర్వాత రాజ్యానికి వచ్చిన రాజుల్లో ఇతడు ముఖ్యమైనవాడు. ఇతడిని రాష్ట్రకూట రాజు అమోఘ వర్షుడు ఓడించాడు. నారాయణ పాలుడు మాంఘీర్ ప్రాంతంలో ఒక గ్రామాన్ని శైవాలయానికి దానంగా ఇచ్చాడు.

మహీపాల 1: నారాయణపాలుడి అనంతరం పాలించిన పాలరాజుల్లో ముఖ్యమైనవాడు మొదటి మహీపాలుడు. చోళరాజు మొదటి రాజేంద్రుడు ఇతడి కాలంలోనే ఉత్తర భారతదేశంపై దండెత్తి మహీపాలుడిని ఓడించి గంగై కొండ అనే బిరుదును పొందాడు.

మదనపాల: ఇతడు పాలవంశంలో చివరిరాజు. ఇతడి తర్వాత పాల రాజ్యాన్ని సేన వంశ రాజులు ఆక్రమించి సేన వంశ రాజ్యాన్ని స్థాపించారు.

సేన వంశం:

తొలి మధ్యయుగంలో తూర్పు భారతదేశాన్ని పాలించిన రెండు రాజవంశాల్లో ముఖ్యమైనది సేన వంశం. పాలవంశం పతనమైన తర్వాత సేన వంశ రాజులు బెంగాల్, బీహార్ ప్రాంతాలను పాలించారు. లక్నోతిని రాజధానిగా చేసుకొని వీరు దాదాపు 100 సంవత్సరాలపాటు పాలించారు. వీరు తాము కర్ణాటక బ్రాహ్మణులమని పేర్కొన్నారు.

సామంత సేన: సేన వంశస్థాపకుడు. ఇతడు బ్రహ్మక్షత్రియుడిగా పేరుగాంచాడు.

విజయ సేన: మొత్తం బెంగాల్‌ను జయించడం ద్వారా ఇతడు సేన రాజ్య వాస్తవ స్థాపకునిగా ఖ్యాతిగాంచాడు. ఇతడు అస్సాం, నేపాల్ మొదలైన ప్రాంతాలను జయించాడు. విజయసేనుడు తన విజయాలను గురించి తెలియజేస్తూ దేవపార ప్రశస్తిని జారీ చేశాడు. ఈ శాసనాన్ని రచించిన కవి ధోయి. విజయసేనుడు విజయపురి, విక్రమపుర అనే రెండు రాజధానులను నిర్మించి అక్కడి నుంచి పరిపాలించాడు. గహద్వాల జయచంద్రుడి ఆస్థాన కవి శ్రీహర్షుడు విజయసేనుడి గొప్పతనాన్ని, విజయాలను గురించి తెలుపుతూ విజయ ప్రశస్తి అనే గ్రంథాన్ని రచించాడు.

బల్లాల సేన: ఇతడు స్వయంగా నాలుగు గ్రంథాలను రచించాడు. ఇతడి గ్రంథాల్లో ముఖ్యమైనవి దాన సాగర, అద్భుత సాగర.

లక్ష్మణ సేన: ఇతడు 60 ఏళ్ల వయస్సులో రాజ్యానికి వచ్చాడు. ఇతడి పాలనకు రాజకీయ ప్రాధాన్యత లేకపోయినప్పటికీ సాహిత్యపరంగా ఇతడి పాలనా కాలం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఇతడి ఆస్థానంలో ప్రముఖ వైష్ణవ కవి జయదేవుడు గీతగోవిందం అనే గ్రంథాన్ని రచించాడు. మరో కవి ధోయి పవన దూతం అనే గ్రంథాన్ని రాశాడు. గోవర్ధనుడు అనే కవి ఆర్య సప్తశతి అనే గ్రంథాన్ని రచించాడు. లక్ష్మణ సేనుడు తన తండ్రి బల్లాల సేనుడు ప్రారంభించిన అద్భుతసాగర గ్రంథాన్ని తానే స్వయంగా పూర్తి చేశాడు. లక్ష్మణ సేనుడి కాలంలో ఘోరీ మహ్మద్ సేనాని భక్తియార్ ఖిల్జీ బెంగాల్‌పై దాడి చేయగా, ఇతడు యుద్ధం చేయకుండా పారిపోయాడు. దీంతో సేన రాజ్యం ముస్లింల వశమైంది. ఈ సంఘటన గురించి మినహాజుద్దీన్ సిరాజ్ తన తబాకత్-ఇ-నాసిరి అనే గ్రంథంలో వివరించాడు. భక్తియార్ ఖిల్జీ కేవలం 18 మంది అశ్వికుల ద్వారా ఈ విజయం సాధించాడని తెలిపాడు.

రాష్ట్రకూటులు:

ఉత్తరాన వింధ్య పర్వతాలు, నర్మద నది నుంచి దక్షిణాన కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న ప్రాంతాన్ని సాధారణంగా దక్కన్ ప్రాంతంగా వ్యవహరిస్తారు. తొలి మధ్య యుగంలో ఈ ప్రాంతాన్ని రెండు రాజవంశాలు ప్రముఖంగా పాలించాయి. అందులో ఒకరు రాష్ట్రకూటులు. మొదట వీరు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉంటూ (రాష్ట్ర పాలకులుగా) పరిస్థితులు అనుకూలించిన వెంటనే స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. వీరి రాజధానులు ఎల్లోరా, మాన్యఖేట్. రాష్ట్రకూటులు సమకాలీన దక్షిణ భారతదేశ రాజులతో,ఉత్తర భారతదేశ పాలకులతో తరచూ యుద్ధాల్లో పాల్గొంటూ తమ రాజ్యాన్ని ఒక బలమైన రాజ్యంగా రూపొందించారు. ఉత్తర భారతదేశంలో ప్రతీహారులు,పాల రాజులు, దక్షిణ భారతదేశంలో వేంగీ చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు వీరి సమకాలీన రాజులు.

దంతి దుర్గుడు: చివరి బాదామి చాళుక్యరాజు రెండో కీర్తివర్మను క్రీ.శ.753లో తొలగించి ఇతడు స్వతంత్ర్య రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. తన రాజ్యానికి ఇరువైపులా ఉన్న అనేక ప్రాంతాలను ఆక్రమించాడు. ఇందుకు గుర్తుగా హిరణ్య గర్భ దాన యజ్ఞాన్ని నిర్వహించాడు. తన రాజధాని ఎల్లోరాలో దశావతార ఆలయాన్ని నిర్మించాడు.

మొదటి కృష్ణుడు: బాదామి చాళుక్యులను అంతం చేసి పశ్చిమ గాంగులను తన సామంతులుగా చేసుకున్నాడు. ఇతడి కాలంలో వేంగీ చాళుక్యులపై తొలి దాడి యువరాజు గోవిందుడి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఇతడు రాజధాని ఎల్లోరాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయాన్ని నిర్మించాడు.

ధ్రువుడు: తన సోదరుడు రెండో గోవిందుడిని తొలగించి ఇతడు సింహాసనాన్ని ఆక్రమించాడు. కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో తలదూర్చిన మొదటి రాష్ట్రకూట రాజు ఇతడే. ప్రతీహార వత్సరాజును, పాలరాజు ధర్మపాలుడిని ఓడించాడు. వేంగీ, మైసూర్, కంచి రాజ్యాలపై దాడులు చేసి విజయం సాధించాడు.

మూడో గోవిందుడు: ఇతడు కూడా పాలరాజు ధర్మపాలుడిని, ప్రతీహార రెండో నాగభటుడిని ఓడించాడు. దక్షిణ రాజ్యాల కూటమిపై కూడా విజయం సాధించాడు.

మొదటి అమోఘవర్ష: ఇతడు 64 సంవత్సరాల సుదీర్ఘకాలంపాటు... క్రీ.శ. 814-878 వరకు పరిపాలించాడు. ఇతడి కాలంలో రాష్ట్ర కూటులు వేంగీని ఆక్రమించి 12 సంవత్సరాలపాటు దీన్ని పరిపాలించారు. అమోఘవర్షుడు యుద్ధాల కంటే లలిత కళలకు అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ఇతడు స్వయంగా కవి. కవిరాజ అనే బిరుదును పొందాడు. కన్నడ భాషలో తొలి గ్రంథమైన కవిరాజ మార్గను రచించాడు. ఇతడి ఆస్థానంలో ఉన్న పలువురు కవులు పలు గ్రంథాలను రచించారు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవులు... జనసేనుడు, మహావీరాచార్యుడు, శాక్తాయణుడు. రాష్ట్రకూట రాజుల్లో ఎక్కువ మంది శైవ, వైష్ణవ మతాలను ఆదరిస్తే ఇతడు జైన మతాన్ని ఆదరించాడు.

రెండో కృష్ణుడు: ఇతడు కూడా తనతండ్రిలాగే జైన మతాన్ని ఆదరించాడు.

మూడో ఇంద్రుడు: ఇతడి కాలంలోనే అరబ్ యాత్రికుడు అల్ మసూదీ భారతదేశాన్ని సందర్శించాడు. మూడో ఇంద్రుడిని భారతదేశంలోనే గొప్ప రాజుగా వర్ణించాడు. మూడో ఇంద్రుడు ప్రతీహార మహీపాలుడిని ఓడించి కనౌజ్‌ను ధ్వంసం చేశాడు.

నాలుగో గోవిందుడు: ఇతడి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా నాయకులు, ప్రజలు తిరుగుబాటు చేయడంతో అధికారాన్ని కోల్పోయాడు.

మూడో కృష్ణుడు: ఇతడు ఉత్తర, దక్షిణ భారతదేశంపై విజయవంతంగా దాడులను నిర్వహించాడు. ఇతడు చోళరాజ్యంపై దాడిచేసి కంచి, తంజావూర్‌లను ఆక్రమించాడు. క్రీ.శ.949లో తక్కోలం యుద్ధంలో మొదటి పరాంతక చోళుడిని ఓడించి తంజావూర్ కొండ అనే బిరుదు పొందాడు. చేర, పాండ్య రాజులను ఓడించాడు. ఈ విజయాలన్నింటికీ గుర్తుగా రామేశ్వరంలో విజయ స్తంభాన్ని వేయించాడు. అక్కడ కృష్ణేశ్వర, గండమార్తాండతీయ అనే దేవాలయాలను నిర్మించాడు. మూడో కృష్ణుడి నిరంతర యుద్ధాల వల్ల సమకాలీన పొరుగు రాజ్యాలన్నింటితో శత్రుత్వం ఏర్పడింది. ఇతడి కాలంలోనే హలాయుధుడు కవి రహస్యం అనే గ్రంథాన్ని రచించాడు.

ఖొట్టిగ: ఇతడి కాలంలో పరమార రాజులు మాన్యఖేట్‌పై దాడిచేసి విధ్వంసం సృష్టించారు.

రెండో కర్క: ఇతని పాలనాకాలంలో రాష్ట్రకూట సామంతుడు రెండో తైలపుడు క్రీ.శ.974-75లో ఇతడిని తొలగించి స్వతంత్ర కల్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు.

కల్యాణి చాళుక్యులు:

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో రాష్ట్రకూటుల తర్వాత దక్కన్‌ను పాలించిన మరో రాజవంశం కల్యాణి చాళుక్యులు. కర్ణాటకలోని కల్యాణి రాజధానిగా వీరు పాలించారు. కాబట్టి వీరిని కల్యాణి చాళుక్యులని, చాళుక్యుల తర్వాత పాలించారు కాబట్టి కడపటి చాళుక్యులు అని పిలుస్తారు.

రెండో తైలపుడు: ఇతడు కల్యాణి చాళుక్య వంశ స్థాపకుడు. రాష్ట్రకూట మూడో కృష్ణుడికి సామంతుడిగా ఉంటూ చివరి రాష్ట్ర కూటరాజు రెండో కర్కను తొలగించి తన రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు మాన్యఖేట్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించాడు. చోళరాజు ఉత్తమ చోళుడిపై దాడి చేయడం ద్వారా చోళ-చాళుక్య శత్రుత్వానికి నాంది పలికాడు. ఇతడి వారసుల కాలంలో చాళుక్యులు చోళులతో అనేక యుద్ధాలు చేయాల్సి వచ్చింది.

సత్యాశ్రయ: ఇతడి మరొక పేరు సాల్లిగ. ఇతడి కాలంలో మాన్యఖేట్‌పై రాజేంద్రచోళుడు దాడి చేశాడు.

రెండో జయసింహ: వేంగీ వారసత్వ యుద్ధాల్లో తలదూర్చి ఇతడు ఏడో విజయాదిత్యుడికి మద్దతుగా తన సైన్యాన్ని పంపాడు. కానీ రాజేంద్రచోళుడి సహాయంతో వేంగీలో రాజరాజనరేంద్రుడు రాజ్యానికి వచ్చాడు.

మొదటి సోమేశ్వరుడు: ఇతడు తన రాజధానిని మాన్యఖేట్ నుంచి కల్యాణికి మార్చాడు. కొప్పం యుద్ధంలో చోళ రాజాధిరాజును వధించాడు. పరమార భోజుడిని ఓడించి తన సామంతుడిగా చేసుకున్నాడు.

ఆరో విక్రమాదిత్యుడు: తన సోదరుడు రెండో సోమేశ్వరుడిని వధించి ఇతడు క్రీ.శ.1076లో రాజ్యానికి వచ్చాడు. తాను రాజ్యానికి వచ్చిన సంవత్సరాన్ని పురస్కరించుకుని చాళుక్య విక్రమ శకాన్ని ప్రారంభించాడు. కల్యాణి చాళుక్య రాజులందరిలోకి ఇతడు అత్యంత గొప్పవాడు. ఇతడి రాజ్యం నర్మద నుంచి రాయలసీమ వరకు విస్తరించింది. ఆరో విక్రమాదిత్యుడు తన సామంతులైన హోయసలలు, కాకతీయులు, యాదవులు, కాదంబులతో నిరంతరం యుద్ధాలు చేసి వారిని అణచివేశాడు. ఇతడి ఆస్థానంలోని ఇద్దరు ప్రముఖ కవులు బిల్హణుడు విక్రమాంక దేవచరితం, విజ్ఞానేశ్వరుడు మితాక్షర అనే గ్రంథాలను రచించారు.

మూడో సోమేశ్వరుడు: ఇతడి కాలంలో ద్వారసముద్ర సామంతుడు విష్ణువర్ధనుడు స్వతంత్ర హోయసల రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. సోమేశ్వరుడు పరిపాలన కంటే సాహిత్యంపై ఎక్కువ మక్కువ చూపాడు. ఇతడికి సర్వజ్ఞ అనే బిరుదు ఉంది. ఈ బిరుదుకు కారణం ఇతడు రచించిన అభిలషితార్థ చింతామణి అనే గ్రంథం.

నాలుగో సోమేశ్వరుడు: మూడో సోమేశ్వరుడి తర్వాత జగదేక మల్ల, మూడో తైలప అనే రాజులు పాలించారు. ఈ వంశంలో చివరివాడు నాలుగో సోమేశ్వరుడు. ఇతడి కాలంలో దేవగిరిని పాలిస్తున్న సామంత రాజు యాదవ బిల్లముడు ఇతడిని ఓడించి కల్యాణి చాళుక్య రాజ్యాన్ని అంతం చేశాడు. స్వతంత్ర యాదవ రాజ్యాన్ని స్థాపించాడు.

మాదిరి ప్రశ్నలు

1. ప్రయాగ వద్ద త్రివేణి సంగమంలో మునిగి ఆత్మత్యాగం చేసిన చందేల రాజు?
   1) హర్ష 2) విద్యాధర
   3) ధంగ 4) యశోవర్మన్
2. భారతదేశంలో బౌద్ధ మతాన్ని ఆదరించిన చివరి రాజవంశం?
   1) పుష్యభూతి వంశం 2) కుషాణులు
   3) పాల వంశం 4) సేన వంశం
3. ప్రజల ద్వారా ఎన్నికైన రాజు?
   1) ధర్మపాల 2) గోపాల
   3) హర్షవర్ధన 4) నన్నుక
4. ఓదంతపురి బౌద్ధ విహారాన్ని నిర్మించింది?
   1) అశోకుడు 2) అమోఘవర్షుడు
   3) గోపాలుడు 4) కనిష్కుడు
5. బౌద్ధ పండితుడు హరిభద్రుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
   1) ధర్మపాలుడు 2) మొదటి నాగభటుడు
   3) గోపాలుడు 4) దేవపాలుడు
6. పాలరాజుల కాలంలో టిబెట్‌లో బౌద్ధమత ప్రచారం చేసిన బౌద్ధ భిక్షువులు?
   1) అతిష దీపాంకర, సంతరక్షిత
   2) ఆచార్య నాగార్జున 3) శ్రీవర, శ్రీజ్ఞాన
   4) పద్మసాంభవ, పూజ్యపాద
7. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయ నిర్మాత?
   1) నందివర్మ 2) నరసింహవర్మ
   3) మొదటి కృష్ణుడు 4) మూడో గోవిందుడు
8. రాజ్య వ్యవహారాల్లో స్త్రీలు ప్రముఖ పాత్ర పోషించిన ఉత్తరభారతదేశ రాజవంశం?
   1) గహద్వాలులు 2) కాశ్మీర్ ఉత్పల వంశం
   3) చౌహాన్‌లు 4) చందేలులు
9. నలంద బౌద్ధ విహారాన్ని నిర్మించిన విదేశీ రాజు?
   1) సంగ్రామ విజయోత్తుంగ వర్మన్
   2) విజయబాహు 3) బలపుత్రదేవ
   4) మహేంద్రవర్మన్
10. శివుడికి 1000 ఆలయాలను నిర్మించిన రాజు?
    1) నారాయణ పాలుడు 2) విగ్రహ పాలుడు
    3) గౌడ శశాంకుడు 4) హర్షుడు
11. చోళరాజు మొదటి రాజేంద్రుడి చేతిలో ఓడిపోయిన పాలరాజు?
    1) మహేంద్రపాలుడు 2) మదనపాలుడు
    3) మొదటి మహీపాలుడు
    4) ధర్మపాలుడు
12. గీతగోవిందం గ్రంథకర్త జయదేవుడు ఎవరి ఆస్థాన కవి?
    1) బల్లాల సేన 2) లక్ష్మణ సేన
    3) విజయ సేన 4) సంగ్రామ సేన
13. సేన రాజ్యాన్ని అంతం చేసినవారు?
    1) కుతుబుద్దీన్ ఐబక్ 2) ఇల్‌టుల్‌మిష్
    3) భక్తియార్ ఖిల్జీ 4) అల్లావుద్దీన్ ఖిల్జీ
14. రాష్ట్రకూటుల రాజధాని?
    1) ఎల్లోరా 2) మాన్యఖేట్
    3) 1,2 4) వాతాపి
15. దంతిదుర్గుడు నిర్మించిన ఆలయం?
    1) ఎల్లోరా-దశావతారాలయం
    2) ఎల్లోరా- కైలాసనాథాలయం
    3) కంచి- కైలాసనాథాలయం
    4) మహాబలిపురం-తీర దేవాలయం

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 3	5) 1
6) 1	7) 3	8) 2	9) 3	10) 1
11) 3	12) 2	13) 3	14) 3	15) 1

సూర్యగ్రహణం సంభవించడానికి కారణం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

మన విశ్వం

- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్ర రాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధ గోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటి వరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.
- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను,రుతువులను, పంచాంగాలను గణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి..
  1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పని చేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957 అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్-1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961 ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 నిమిషాల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్-6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969 జూలై 21న అమెరికాకు చెందిన అపోలో -11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలు మోపారు.
- 1984 ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్-టి-11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర-1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ - 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్‌వీ - డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్‌ల నక్షత్రాలు ఉన్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములు ఉన్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమికి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.
- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు.
  $1AU = 1.496\times10^{11}$మీ.
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యంలో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- ఒక కాంతి సంవత్సరం = 9.3×10^{15} మీ. = 6.33×10^{4} AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది.ఇది 3.26కాంతి సంవత్సరాలకు సమానం.
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం - 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సంవత్సరాలు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం-గురుడు (బృహస్పతి).
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం - బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ఠ దూరంలో బుధుడు, గరిష్ఠ దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం-శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు - బుధుడు, శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు నివసించడానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత 25^{0} సెంటీగ్రేడ్ నుంచి 40^{0} సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం- ప్రాక్సిమాసెంటౌరి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం - హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
   1) ఆర్యభట్ట 2) భాస్కర-1
   3) ఇన్‌శాట్-1బి 4) భాస్కర-2
2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
   1) శని 2) భూమి
   3) శుక్రుడు 4) బుధుడు
3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
   1) భూ పరిభ్రమణం 2) భూ భ్రమణం
   3) ఉల్కాపాతం 4) ఏదీకాదు
4. చంద్ర గ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
   1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
   4) అన్నీ
5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
   1) సెరస్ 2) ఇంకారస్
   3) హైడ్రా 4) హేలీ
6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
   1) తుంబా 2) శ్రీహరికోట
   3) ఢిల్లీ 4) 1, 2
7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
   1) శని 2) బృహస్పతి
   3) బుధుడు 4) శుక్రుడు
8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతి పెద్దది?
   1) సెరస్ 2) ఎప్సిలాన్ ఆరిగ
   3) హైడ్రా 4) ఇంకారస్
9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
   1) అపోలో 2) స్పుత్నిక్
   3) కొలంబియా 4) వస్తోక్
10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
    1) రష్యా 2) అమెరికా
    3) ఇండియా 4) సింగపూర్

సమాధానాలు

1) 1	2) 3	3) 2	4) 1
5) 3	6) 4	7) 1	8) 2
9) 3	10) 2		

గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ-2000)
   1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
   3) 92 1/2 రోజులు 4) 29 రోజులు
2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ - 2000)
   1) గెలాక్సీ 2) గాలి
   3) దిక్కు 4) వాతావరణం
3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)? (డీఎస్సీ-2001)
   1) $3\times10^{4}\times60\times60\times24\times365.25$
   2) $3\times10^{2}\times60\times60\times24\times365.25$
   3) $3\times10^{5}\times60\times60\times24\times365.25$
   4) $3\times10^{3}\times60\times60\times24\times365.25$
4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లాలంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ-2002)
   1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
   3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక? (డీఎస్సీ-2002)
   1) ఇన్‌శాట్-1బి 2) పీఎస్ఎల్‌వీడీ-2
   3) భాస్కర-2 4) ఆర్యభట్ట
6. సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
   1) 149,000,000 కి.మీ.
   2) 149,598,500 కి.మీ.
   3) 149,593,300 కి.మీ
   4) 149,895,500 కి.మీ.
7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు? (డీఎస్సీ-2003)
   1) స్కాటర్న్ - 5, స్కాటర్న్ - 6
   2) అపోలో - 11, సోయూజ్-టీ-11
   3) వైకింగ్-1, వైకింగ్-2
   4) సోయూజ్ -టీ-11, శాల్యూట్
8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం? (డీఎస్సీ-2006)
   1) 88 రోజులు 2) 248 రోజులు
   3) 365 రోజులు 4) 243 రోజులు
9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ-2006)
   1) 3-6-1984 2) 3-4-1984
   3) 3-4-1985 4) 3-6-1985
10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ - 2008)
    1) 12,576 2) 12,657
    3) 12,756 4) 12,765
11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ - 2008)
    1) బృహస్పతి, భూమి
    2) బుధుడు, అంగారకుడు
    3) శని, శుక్రుడు
    4) నెప్ట్యూన్, యురేనస్
12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
    1) పయనీర్ 2) ఆర్యభట్ట
    3) భాస్కర - 2 4) అట్లాంటిస్
13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ-2012)
    1) కుజుడు 2) బుధుడు
    3) బృహస్పతి 4) యురేనస్
14. సూర్యగ్రహణం సంభవించడానికి కారణం? (ఏపీ టెట్ - 2017)
    1) చంద్రుడి నీడ భూమిపై పడటం వల్ల
    2) సూర్యుడి నీడ భూమిపై పడటం వల్ల
    3) చంద్రుడి నీడ సూర్యుడిపై పడటం వల్ల
    4) సూర్యుడి నీడ చంద్రుడిపై పడటం వల్ల
15. సాధారణంగా పిలిచే 'తెగిపడిన చుక్కలు' ఏమిటి? (ఏపీ టెట్ - 2017)
    1) ఆస్టరాయిడ్లు 2) తోక చుక్కలు
    3) ఉల్కలు 4) ఉపగ్రహాలు
16. తన కక్ష్యలో తాను దొర్లుతున్నట్లు కనిపించే గ్రహం? (ఏపీ టెట్ - 2017)
    1) నెప్ట్యూన్ 2) బృహస్పతి/ గురుడు
    3) బుధుడు 4) యురెనస్
17. సూర్య, చంద్రులకు ఆకాశంలో ఒక పూర్తి భ్రమణానికి పట్టే కాలంలో తేడా? (ఏపీ టెట్ - 2017)
    1) 2 నిమిషాలు 2) 50 నిమిషాలు
    3) 24 నిమిషాలు 4) 10 నిమిషాలు
18. 'హేలీ తోక చుక్క' కనిపించనున్న సంవత్సరం? (ఏపీ టెట్ - 2017)
    1) 2061 2) 2062
    3) 2063 4) 2064
19. ధృవ నక్షత్రానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది? (ఏపీ టెట్ - 2017)
    1) ఇది భూమికి దగ్గరగా ఉన్న నక్షత్రం
    2) ఇది భూభ్రమణం అక్షానికి సూటిగా పై వైపున ఉంటుంది
    3) ఇది నిలకడగా ఉన్నట్లు కనిపిస్తుంది
    4) దీని స్థానాన్ని సప్తర్షి మండల రాశి ద్వారా కనుగొనవచ్చు
20. 'అరుణగ్రహం' అని కూడా పిలిచే గ్రహం? (ఏపీ టెట్ - 2018)
    1) సూర్యుడు 2) శుక్రుడు
    3) కుజుడు 4) బృహస్పతి

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 4	5) 2
6) 2	7) 3	8) 1	9) 2	10) 3
11) 3	12) 1	13) 1	14) 1	15) 3
16) 4	17) 2	18) 1	19) 1	20) 3

'సైనిక శాసనం'కు సంబంధించి సరికాని అంశం ఏది?

మాదిరి ప్రశ్నలు

1. వ్యక్తి స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు ఎవరు విధించవచ్చు?
 1) కేబినేట్ 2) పార్లమెంట్
 3) భారత రాష్ట్రపతి 4) సుప్రీంకోర్టు
2. సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛపై కింది వాటిలో పరిమితి కానిది ఏది?
 1) శాంతి భద్రతల దృష్ట్యా
 2) భారతదేశ సార్వభౌమాధికారం దృష్ట్యా
 3) భారతదేశ సమగ్రతా దృష్ట్యా
 4) వ్యక్తి స్వేచ్ఛ దృష్ట్యా
3. కింది వాటిలో సరికానిది ఏది?
 1) చట్టాన్ని ధిక్కరించి నేరం చేసిన సందర్భంలో మాత్రమే నేరస్తుణ్ని శిక్షించాలి
 2) నేరం జరిగినప్పుడు ఆ చట్టం అమల్లో ఉండాలి
 3) చట్టంలో నిర్దేశించిన దానికంటే ఎక్కువ శిక్ష విధించకూడదు
 4) నేరం జరిగినప్పుడు చట్టం అమల్లో ఉండనవసరం లేదు
4. ఎమ్మెల్యే, ఎంపీలకు ఏదైనా ఒక కేసులో ఎంతకాలం శిక్ష పడితే తమ పదవులకు అనర్హులవుతారు?
 1) రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
 2) మూడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
 3) ఆరేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
 4) నాలుగేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
5. బలవంతంగా నేరాన్ని అంగీకరించడం ఏ అధికరణకు వ్యతిరేకం?
 1) 20(2) 2) 20(3)
 3) 20(1) 4) 20(4)
6. భారత పౌరులు కాని వారికి కూడా లభించే హక్కు?
 1) ఉద్యోగాల్లో సమాన హక్కు
 2) విద్యా సాంస్కృతిక హక్కు
 3) స్వేచ్ఛగా సమావేశమయ్యే హక్కు
 4) వ్యక్తిగత స్వేచ్ఛ
7. స్త్రీలు, బాలికల అవినీతి వ్యాపార నిరోధక చట్టం ఎప్పుడు చేశారు?
 1) 1976 2) 1956
 3) 1978 4) 1965
8. పార్లమెంటు ప్రధాన కర్తవ్యం?
 1) చట్టాలు అమలు చేయడం
 2) చట్టాలు రూపొందించడం
 3) చట్టాలపై అవగాహన కలిగించడం
 4) దేశాన్ని పరిపాలించడం
9. ఆదేశిక సూత్రాలకు సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
 1) సమసమాజ స్థాపన వాటి లక్ష్యం
 2) ఆర్థిక వన రుల లభ్యత మేరకు అమలు చేస్తారు
 3) న్యాయస్థానాల రక్షణ ఉంది
 4) దేశ పాలనకు ప్రధానమైన సూత్రాలు
10. కింది వాటిలో రాష్ట్రపతి పదవికి ఉండాల్సిన అర్హత కానిది ఏది?
 1) స్పీకర్‌గా ఎన్నిక కావాలి
 2) 35 ఏళ్ల వయస్సు ఉండాలి
 3) భారతదేశ పౌరుడై ఉండాలి
 4) లాభసాటి పదవుల్లో ఉండరాదు
11. ఉప రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పేర్కొన్నారు?



 1) 5వ భాగం 2) 4వ భాగం
 3) 6వ భాగం 4) 7వ భాగం
12. సాధారణంగా ఉపరాష్ట్రపతి పదవీకాలం?
 1) 5 ఏళ్లు 2) 6 ఏళ్లు
 3) రాజ్యాంగం నిర్ధారించలేదు
 4) పైవేవీ కావు
13. ప్రధానమంత్రి పదవీ కాలం ఎంత?
 1) 5 సంవత్సరాలు
 2) ఎన్నికలు జరిగే వరకు
 3) రాజ్యాంగం నిర్ణయించలేదు
 4) రాష్ట్రపతి సంతృప్తి మేరకు
14. కింది వారిలో ఎవరిని జాతి నాయకుడు అంటారు?
 1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
 3) లోక్‌సభ స్పీకర్ 4) ఉప రాష్ట్రపతి
15. 'సమష్టి బాధ్యత' అనేది ఏ ప్రభుత్వ ప్రధాన లక్షణం?
 1) అధ్యక్ష తరహా ప్రభుత్వం
 2) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
 3) రాచరిక ప్రభుత్వం
 4) గణతంత్ర ప్రభుత్వం
16. రాజ్యాంగాన్ని ప్రజల తరఫున ఎవరు ఆమోదించారు?
 1) బ్రిటిష్ ప్రభుత్వం
 2) కేంద్ర ప్రభుత్వం 3) రాజ్యాంగ పరిషత్
 4) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
17. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత మొదటగా రాజ్యాంగంలో చేర్చిన షెడ్యూలు ఏది?
 1) 10 2) 11 3) 9 4) 12
18. 'రాజ్యాంగం వైఫల్యం చెందితే రాజ్యాంగాన్ని నిందించరాదు. అమలుపరిచే వారిని నిందించాలి' అని వ్యాఖ్యానించింది ఎవరు?
 1) గ్రాన్‌విల్లే ఆస్టిన్ 2) బి.ఆర్. అంబేద్కర్
 3) హెచ్.వి. కామత్ 4) ఐవర్ జెన్నింగ్స్
19. కింది వాటిలో ఏకకేంద్ర లక్షణం కానిదేది?
 1) లిఖిత రాజ్యాంగం
 2) అదృఢ రాజ్యాంగం
 3) సమగ్ర న్యాయ వ్యవస్థ
 4) ఏక పౌరసత్వం
20. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు రాజ్యాంగంలో చేర్చని అంశమేది?
 1) ఆదేశ సూత్రాలు
 2) ప్రాథమిక విధులు
 3) ప్రాథమిక హక్కులు
 4) అత్యవసర పరిస్థితులు
21. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
 1) 1988 2) 1986
 3) 1980 4) 1989
22. స్థానిక ప్రభుత్వాలు అనే పదం ఆధునికంగా ఏ దేశంలో తొలిసారి ఉపయోగించారు?
 1) బ్రిటన్ 2) న్యూజిలాండ్
 3) ఫ్రాన్స్ 4) స్వీడన్
23. భారతదేశంలో మండలాలను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఏది?
 1) కర్ణాటక 2) ఆంధ్రప్రదేశ్
 3) పశ్చిమ బెంగాల్ 4) ఉత్తర ప్రదేశ్
24. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తింపజేయాలంటే ఎవరి అనుమతి తీసుకోవాలి?
 1) కేంద్ర ప్రభుత్వం 2) లెఫ్టినెంట్ గవర్నర్
 3) రాష్ట్రపతి 4) కేబినెట్
25. అశోక్ మెహతా కమిటీ సిఫారసులకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
 a) జిల్లాస్థాయిలో ఆడిట్ జరగాలి
 b) ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రకారం సీట్లు రిజర్వ్ చేయాలి
 c) న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి
 d) పంచాయతీరాజ్ సంస్థలకు ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి
 1) a, b, c 2) a, b, c, d
 3) c, d 4) b, c, d
26. రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం?
 1) ఐదేళ్లు 2) ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వరకు
 3) ఆరేళ్లు 4) మూడేళ్లు
27. కింది వాటిలో సరైంది ఏది?
 1) వన్య ప్రాణుల సంరక్షణ చట్టం- 1970
 2) పర్యావరణ పరిరక్షణ చట్టం- 1984
 3) అటవీ సంరక్షణ చట్టం- 1980
 4) జాతీయ అటవీ విధానం- 1989
28. ఏ కేసులో సుప్రీంకోర్టు నిర్బంధంలో ఉన్న వ్యక్తులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని ప్రకటించింది?
 1) కిశోర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ (1981)
 2) డి.కె. బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్- (1997)
 3) లోకేంద్రసింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ (1996)
 4) కమలాదేవి వర్సెస్ ముంబాయి (1984)
29. నిర్దేశిక నియమాలైన 39(బి), 39(సి) అధికరణలు, ప్రాథమిక హక్కులైన 14, 19, 31పై ఆధిక్యత కలిగి ఉంటాయని ఏ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది?
 1) మినర్వామిల్స్ వర్సెస్ మద్రాస్ ప్రభుత్వం - 1980
 2) కేశవానంద భారతి కేసు - 1973
 3) గోలక్‌నాథ్ కేసు - 1967
 4) బెల్లా బెనర్జీ కేసు - 1954

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

30. మొదటి రాజ్యాంగ సవరణ చట్టం - 1951 ద్వారా చేర్చిన అంశాలు ఏవి?
 1) 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు
 2) 15(4) అధికరణ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యావిషయాల్లో కొన్ని సీట్ల రిజర్వేషన్ కల్పించడం
 3) 31(ఎ) అధికరణను కొత్తగా చేర్చారు
 4) పైవన్నీ
31. 368వ అధికరణ ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగంలోని అన్ని అంశాలను మార్చే అధికారం ఉందని ఏ సవరణ ద్వారా నిర్ణయించారు?
 1) 24వ రాజ్యాంగ సవరణ చట్టం
 2) 42వ రాజ్యాంగ సవరణ చట్టం
 3) 25వ రాజ్యాంగ సవరణ చట్టం
 4) 44వ రాజ్యాంగ సవరణ చట్టం
32. ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టులకు న్యాయసమీక్షను తగ్గించారు?
 1) 42వ 2) 24వ
 3) 44వ 4) 25వ
33. 'మాండమస్' రిట్ వర్తించని వారు?
 1) రాష్ట్రపతి, గవర్నర్
 2) వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగినప్పుడు
 3) ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు
 4) పైవన్నీ సరైనవే
34. 'హెబియస్ కార్పస్' రిట్ ద్వారా పౌరులను మాత్రమే కాకుండా భారత భూభాగంలో నివసించే వారందరినీ రక్షించాలని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
 1) వినీత్ నారాయణ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1998)
 2) ఉమ్మ సబీనా వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (2011)
 3) కిశోర్ సామ్రారైట్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (2013)
 4) విశ్వాస్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం(1983)
35. కింది వాటిలో ఏ అధికరణ సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పిస్తుంది?
 1) 326 2) 336
 3) 316 4) 324
36. 'సైనిక శాసనం'కు సంబంధించి సరికాని అంశం ఏది?
 1) శాంతి భద్రతలకు భంగం కలిగితే విధిస్తారు
 2) ఇది ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపుతుంది
 3) దేశం మొత్తం లేదా దేశంలోని కొంత భాగంలో విధిస్తారు
 4) దేశంలో ఒక నిర్దిష్ట ప్రాంతంలో దీనిని విధిస్తారు
37. 'ఆదేశిక సూత్రాల అంతిమ లక్ష్యం అజ్ఞానం, దౌర్జన్యాల నుంచి భారత ప్రజల్ని విముక్తి చేయడం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
 1) గజేంద్ర గడ్కర్ 2) బి.ఆర్. అంబేద్కర్
 3) బి.ఎన్. రావు 4) కె.సి. వేర్
38. కింది వాటిలో హెబియస్ కార్పస్ రిట్‌కు సంబంధించి సరికానిది ఏది?
 1) ఇది అత్యంత పురాతనమైన రిట్
 2) ఈ రిట్‌ను 1679లో ఇంగ్లండ్ గుర్తించింది
 3) 'యు మే హావ్ ది బాడీ' అని అర్థాన్నిస్తుంది
 4) నివారక నిర్బంధం కింద అరెస్ట్ అయితే రక్షణ కల్పిస్తుంది
39. బలవంతపు మతమార్పిడిలను నిషేధిస్తూ చట్టం చేసిన తొలి రాష్ట్రం?
 1) ఒడిశా 2) మధ్యప్రదేశ్
 3) తమిళనాడు 4) కేరళ
40. రాజ్యానికి అధికార మతం ఉండరాదని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పు ఇచ్చింది?
 1) ఎస్.ఆర్. బొమ్మై కేసు (1994)
 2) బాల్‌పాటిల్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (2005)
 3) డి.ఎస్. నకారా వర్సెస్ కేంద్రప్రభుత్వం (1982)
 4) కేశవానంద భారతి కేసు(1973)
41. కింది వాటిలో ఉమ్మడి జాబితాలో లేని అంశం ఏది?
 1) జనాభా నియంత్రణ 2) వార్తాపత్రికలు
 3) కార్మిక సంక్షేమం 4) ప్రజారోగ్యం
42. హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపులో రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని తీసుకోవాలని ఏ కమిటీ సిఫార్సు చేసింది?
 1) రాజమన్నార్ కమిటీ
 2) సర్కారియా కమిషన్
 3) పూంఛీ కమిషన్ 4) ఏదీ కాదు
43. యూపీఎస్సీ చైర్మన్, సభ్యుల పదవీకాలం ఎంత?
 1) ఐదేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
 2) ఆరేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
 3) ఆరేళ్లు 4) ఐదేళ్లు
44. యూపీఎస్సీ సభ్యుల సంఖ్యను ఎవరు నిర్ణయిస్తారు?
 1) పార్లమెంటు 2) రాష్ట్రపతి
 3) కేబినెట్ 4) ప్రధానమంత్రి
45. జాయింట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏ విధంగా ఏర్పడుతుంది?
 1) పార్లమెంటు చట్టం ద్వారా
 2) భారత రాష్ట్రపతి నిర్ణయం మేరకు
 3) కేబినెట్ నిర్ణయం మేరకు
 4) యూపీఎస్సీ నిర్ణయం మేరకు
46. 'అభిశంసన తీర్మానానికి' సంబంధించి సరికాని అంశాన్ని గుర్తించండి.
 1) అభిశంసనకు కారణం చెప్పాలి
 2) మంత్రి మీద కానీ, మంత్రుల మీద కాని పెట్టవచ్చు
 3) ఆమోదిస్తే మంత్రి మండలి రాజీనామా చేయాలి
 4) విధానాలను విమర్శించడం దీని ఉద్దేశం
47. 'కార్పెట్ క్రాసింగ్' అంటే ఏమిటి?
 1) ప్రతిపక్షం నుంచి అధికారపక్షంలోకి మారడం
 2) అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి మారడం
 3) ఒక రాజకీయ పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడం
 4) ఏదీకాదు
48. కేబినెట్ లిఖిత పూర్వక ఉత్తర్వుల మేరకు మాత్రమే విధించవలసిన అత్యవసర పరిస్థితి ఏమిటి?
 1) జాతీయ అత్యవసర పరిస్థితి
 2) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
 3) ఆర్థిక అత్యవసర పరిస్థితి
 4) సైనిక అత్యవసర పరిస్థితి
49. ఉపరాష్ట్రపతి పదవికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
 1) 35 ఏళ్లు నిండి ఉండాలి
 2) పార్లమెంటుకు ఎన్నికవరాదు
 3) రాజ్యసభకు ఎన్నిక కావడానికి అర్హతలు ఉండాలి
 4) భారతీయ పౌరుడై ఉండాలి
50. కింది వారిలో ఉపరాష్ట్రపతి కాకుండా నేరుగా రాష్ట్రపతి అయినవారు ఎవరు?
 1) రాజేంద్ర ప్రసాద్
 2) అబ్దుల్ కలాం
 3) నీలం సంజీవరెడ్డి
 4) పై వారందరూ
51. మంత్రి మండలి గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణలు తెలియజేస్తాయి?
 1) 74, 75 2) 76, 77
 3) 80, 81 4) 90, 91
52. రాష్ట్రపతి వీటో చేయడానికి అవకాశం లేని బిల్లులు?
 1) ద్రవ్య బిల్లులు
 2) రాజ్యాంగ సవరణ బిల్లులు
 3) రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ బిల్లులు
 4) పైవన్నీ
53. భారతదేశంలో రాష్ట్రపతికి ఉన్న ఆర్డినెన్స్ జారీ చేసే అధికార మూలాలు ఏ చట్టంలో ఉండేవి?
 1) కౌన్సిల్ చట్టం - 1861
 2) భారత ప్రభుత్వ చట్టం -1935
 3) భారత ప్రభుత్వ చట్టం - 1919
 4) రెగ్యులేటింగ్ చట్టం - 1773
54. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతభత్యా లకు సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
 1) వీరి జీతభత్యాల గురించి రెండో షెడ్యూల్‌లో పేర్కొన్నారు
 2) ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో వారి జీత భత్యాలు తగ్గించవచ్చు
 3) వీరి జీతభత్యాలను రాష్ట్రపతి నిర్ణయి స్తాడు
 4) వీరి జీత భత్యాలను కేంద్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 1	5) 2
6) 4	7) 2	8) 2	9) 3	10) 1
11) 1	12) 1	13) 4	14) 2	15) 2
16) 3	17) 3	18) 2	19) 1	20) 2
21) 2	22) 1	23) 1	24) 3	25) 2
26) 2	27) 3	28) 1	29) 2	30) 4
31) 2	32) 1	33) 4	34) 2	35) 1
36) 3	37) 1	38) 4	39) 1	40) 2
41) 4	42) 1	43) 2	44) 2	45) 1
46) 3	47) 2	48) 1	49) 2	50) 4
51) 1	52) 4	53) 1	54) 3	

How many even numbers are there?

Model Questions

Directions: (Q.No.1-5) Study the following information carefully and answer the questions given below.

8 persons Amit, Prasad, Suman, Firoz, Gopi, Seenu, Magbul and Khaleel have different weights and different heights

Amit is taller than 2 persons and heavier than 4 persons. Suman is heavier than Amit but not heaviest. Number of persons heavier than Suman is same as the number of persons shorter than Suman. Prasad is not the tallest. Three persons are taller than Firoz but shorter than Prasad. Number of persons taller than Khaleel is same as the number of persons heavier than Khaleel and at least one person is taller than Khaleel. Number of persons shorter than Magbul is same as the number of persons lighter than Magbul and at least one person is lighter than Magbul. Khaleel is taller than Amit but not heavier than Amit. The lightest person is tallest. Gopi is lighter than Seenu, who is heavier than Firoz. Seenu is not heaviest

1. Who is the heaviest person?
 a) Amit b) Prasad c) Firoz
 d) Seenu e) Suman
2. Gopi is ______.
 a) Tallest b) Lightest
 c) Heaviest
 d) Both option (a) and option (b)
 e) Both option (b) and option (c)
3. How many people are there who are taller than Amit and also lighter in weight than Magbul?
 a) 2 b) 3 c) 4
 d) 5 e) More than 5
4. Who among the followings is/are heavier as well as shorter than Khaleel?
 a) Amit b) Firoz c) Suman
 d) Both option (a) and option (c)
 e) More than persons mentioned above
5. Amit is ______
 a) 3rd tallest and 5th heaviest
 b) 6th tallest and 4th heaviest
 c) Heavier than at - least 6 persons
 d) Lighter than 6 persons
 e) None of these

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

L1, L2, L3, L4, L5, L6, L7, L8, L9, L10, L11 and L12 were seated around a square table facing the centre. There were 2 persons along each side and one person on each of the corner.

L7 was 2nd to the left of L12 who was seated at one of the sides. L6 was next to L12 and was seated opposite to L11. L11 was 2nd to the left of L2 who faced L10. L8 was to the immediate left of L5 who faced the L4's neighbor. L1 was 2nd to the left of L9. L9 and L12 were seated at a gap of 3 persons. L3 was not next to L1.

6. Four of the following bear a similar relationship and hence form a group, who among the following is not a part of that group?
 a) L3 b) L8 c) L7
 d) L11 e) L6
7. What was the position of L3 with respect to L6?
 a) Immediate right
 b) Immediate left c) Opposite
 d) Second to the right
 e) Second to the left
8. Who among the following was seated opposite to L8?
 a) L9 b) L4 c) L7 d) L1
 e) Cannot be determined
9. In which of the following groups was the 1st person seated next to the 2nd and 3rd persons?
 a) L11, L1, L5 b) L5, L8, L1
 c) L8, L10, L3 d) L4, L12, L3
 e) L2, L4, L7
10. ____ was 2nd to the right of ____
 a) L2, L4 b) L9, L2
 c) L8, L10 d) L6, L1
 e) L5, L6

22	24	26	28	30
32	34	36	38	40
42	44	46	48	50
52	54	56	58	60
62	64	66	68	70
72	74	76	78	80

BANK EXAMS

REASONING

Directions (Q.No.11-15): In the following question assuming the given statements to be true, find which of the conclusion among given conclusions is/are definitely true and then give your answer accordingly.

11. *Statements:*
 A > D = B; C ³ B > M;
 L = N; M > N > O
 Conclusions:
 I. D > C II. D > M
 III. B > L IV. A ³ C
 a) Only III is true.
 b) Only I is true.
 c) Only II and III are true.
 d) Only I and III are true.
 e) Only IV is true.
12. *Statements:*
 C < P > M; O £ L < B;
 A = C; B < D £ N
 Conclusions:
 I. D > M II. O < D
 III. C > M IV. O = C
 a) Only II is true.
 b) Only IV is true c) All are true
 d) I, III and IV are true
 e) None is true
13. *Statements:*
 J > I ³ O > L; I < S < J £ T;
 K = O; L > N < M
 Conclusions:
 I. S < M II. I £ K
 III. M > L IV. T < J
 a) Only III is true
 b) Only IV is true
 c) Only I and IV are true
 d) None is true e) Only I is true
14. *Statements:*
 E < H = I > P; P > E > D;
 E < K < H; G ³ I
 Conclusions:
 I. K > P II. E < P
 III. D £ P IV. G > H
 a) II, III, IV are true
 b) I, II, III are true
 c) Only II is true d) All are true
 e) Only III is true
15. *Statements:*
 H < A £ D = G; B < F < C;
 C = A; G > E > C
 Conclusions:
 I. A ³ F II. A £ E
 III. H < C IV. B < D
 a) Only III and IV are true.
 b) Only I and II are true.
 c) All are true.
 d) II, III, and IV are true.
 e) None is true.

Directions (Q.No.16-20): Study the following series of sets of numbers. Carefully answer the question given below.

5340, 2468, 8369, 9622, 5370, 7494

16. If in each number second and fourth digits are interchanged, then how many even numbers are there?
 a) 2 b) 3 c) 4 d) 5 e) 1
17. If the digits in each number are arranged in descending order, which of the following will be the lowest?
 a) 8642 b) 9863 c) 9622
 d) 7530 e) 5340
18. What will be the number obtained if third digit of the smallest number is multiplied with second digit of the largest number?
 a) 20 b) 21 c) 14
 d) 36 e) None of these.
19. If in the above set of numbers 1 is added to the second digit and 2 is subtracted from first digit, then which number will be third if arranged in descending order?
 a) 5340 b) 9622 c) 2468
 d) 7494 e) None of these.
20. If 525 is subtracted from each number, then what is the multiplication of 1st digit of the lowest and last digit of the largest number?
 a) 7 b) 6 c) 5
 d) 2 e) None of these

Key with Solutions


(1-5):

Height:
Gopi > Seenu > Magbul > Prasad > Khaleel > Amit > Suman > Firoz

Weight:
Prasad > Suman > Magbul > Amit > Khaleel > Seenu > Firoz > Gopi

1) b; 2) d; 3) d
4) d; 5) b

(6-10):



6) a; 7) d 8) c;
9) b 10) c

11) c;
 (I) D = B £ C (5)
 (II) D = B > M (4)
 (III) B > M > N = L (4)
 (IV) A > D = B £ C (5)

12) a;
 (I) No relation
 (II) O £ L < B < D (4)
 (III) C < P > M (5)
 (IV) No relation

13) d;
 (I) S < J > I ³ O > L > N < M (5)
 (II) I ³ O = K (5)
 (III) L > N < M (5)
 (IV) J £ T (5)

14) c;
 (I) P > E < K (5)
 (II) P > E (4)
 (III) P > E >D (5)
 (IV) G ³ I = H (5)

15) a;
 (I) F < C = A (5)
 (II) E > C = A (5)
 (III) H < A = C (4)
 (IV) B < F < C = A £ D (4)

16) b;
 5340, 2468, 8369, 9622, 5370, 7494
 5043, **2864**, 8963, **9226**, 5073, **7494**

17) e;
 5340, 2468, 8369, 9622, 5370, 7494
 5430, 8642, 9863, 9622, 7530, 9744

18) d;
 5340, 24**6**8, 83**6**9, 9622, 5370, 7494 Þ 6 ´ 6 = 36

19) d;
 5340, 2468, 8369, 9622, 5370, 7494
 3440, 0568, 6469, 7722, 3470, **5594**

20) a;
 5340 - 525, 2468- 525, 8369- 525, 9622- 525, 5370- 525, 7494 - 525
 4815, 1968, 7844, 9097, 4845, 6969 Þ 1 ´ 7 = 7